
'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 355

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చిగురిస్తున్న 'డాలర్' కల

భారత్‌పట్ల ట్రంప్ కాస్త సానుకూల దృక్పథంతో ఉండటంతో భారతీయుల అమెరికా కలలు మళ్లీ చిగురిస్తున్నాయి.

వివరాలు 3లో ▸



నేటి నుంచి రైసినా డైలాగ్

భారత్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ సదస్సు 'రైసినా డైలాగ్' 10వ ఎడిషన్ సోమవారం ఢిల్లీలో మొదలవనుంది.

వివరాలు 6లో ▸

కేసీఆర్ పాపాల చిట్టా విప్పుతా



19, 20 తేదీల్లో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బట్టబయలు చేస్తా

బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పాపాలు చెబుతా

ఇప్పటివరకు చెప్పింది ఇంటర్వెల్ వరకే.. అసలు సినిమా ముందుంది

శివునిపల్లి ప్రజాపాలన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ధనిక రాష్ట్రాన్ని అప్పుజెప్తే పదేళ్లలో రూ.8.29 లక్షల కోట్ల అప్పులు చేశారు
- ఇప్పుడు ప్రతినెలా వడ్డీ రూ.6,500 కోట్లు కట్టాల్సిన దుస్థితి వచ్చింది
- రూ.1.02 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరంగా మారింది
- రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామన్న సీఎం
- ప్రాజెక్టులు, పథకాలపై చర్చకు రావాలంటూ సవాల్.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.800 కోట్ల విలువైన పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

2లో



శాంతికి యత్నించినప్పుడల్లా...

నమ్మకద్రోహమే

పాకిస్తాన్‌పై ప్రధాని మోదీ ధ్వజం

- దాయాది దేశానికి విశ్వసనీయత లేదంటూ మండిపాటు.. రష్యా, ఉక్రెయిన్ చర్చించుకోవాలని సూచన
- ఏదో సాధించేందుకే పైవాడు తనను పంపాడని.. 140 కోట్ల మంది భారతీయులే తన బలమని వెల్లడి
- మానవుని ఊహను ఏఐ ఎప్పటికీ అందుకోలేదని జోస్యం

6లో

అమెరికా ఏఐ పరిశోధకుడు లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్‌తో 3 గంటలపాటు పాడ్‌కాస్ట్‌లో అంతరంగం ఆవిష్కరణ

డీసీసీలు ఇక పవర్‌ఫుల్!

పార్టీ జిల్లా అధ్యక్షులకు ప్రాధాన్యత

- నామినేటెడ్ పదవులు, టికెట్ల కేటాయింపు ప్రక్రియలో భాగస్వామ్యం
- మీనాక్షి నటరాజన్ ప్రతిపాదనలకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్
- మారనున్న డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ
- జిల్లాకు ముగ్గురి పేర్లతో ప్యానెల్.. స్థానిక నేతల మొగ్గు ఉన్న వారికే పదవి

12లో

గోల్డ్ బాండ్లు కొన్నవారికి 193 శాతం లాభం

8 ఏళ్ల క్రితం పెట్టుబడి గ్రాముకు రూ.2,943

ఇప్పుడు చేతికొచ్చేది రూ.8,600 పైమాటే

2016-17 సిరీస్-4 బాండ్ల ఉపసంహరణ ధర రూ.8,624గా ఖరారు చేసిన ఆర్బీఐ

కేంద్ర ప్రభుత్వంపై ఊహించని ఆర్థిక భారం



బంగారం పంట పండింది



పెట్టుబడి దాదాపు రూ.3 వేలు. చేతికి వస్తున్నది మాత్రమే రూ.8,600 పైమాటే. మీరు చదువుతున్నది అక్షరాలా నిజం. సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్జీబీ) 2016-17 సిరీస్-4 కొనుగోలు చేసిన పెట్టుబడిదారులకు ఇప్పుడు 'బంగారం'పంట పండింది. ఈ నెల 17నాటికి ఎనిమిదేళ్ల గడువు ముగిసే సావరిన్ గోల్డ్ బాండ్లకు ఒక్కో గ్రాముకు రిడెమ్షన్ (ఉపసంహరణ) ధర రూ.8,624గా నిర్ణయించినట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించింది. ఒక్కో గ్రాముకు రూ.2,943 చొప్పున ఎస్జీబీ సిరీస్-4ను 2017 మార్చి 17న జారీ చేశారు. అంటే ఇన్వెస్టర్లు 193 శాతం లాభం అందుకుంటున్నారన్న మాట. దీనికి వడ్డీ అదనం. - సాక్షి, స్పెషల్ డెస్క్

భారంగా మారిన బాండ్లు

ఎస్జీబీ పథకం కథ పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయింది. భారత్లో పెరుగుతున్న బంగారం దిగుమతులను తగ్గించాలన్న లక్ష్యంతో పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. ఆశించిన ప్రయోజనం అటుంచితే పెరుగుతున్న బంగారం ధరలతో ఖజానాపై ఊహించని ఆర్థిక భారం పడింది. దీంతో ప్రభుత్వం చివరకు ఈ పథకాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. గోల్డ్ బాండ్స్లో ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.85,000 కోట్లను తాకనుందని 2024 జూలై మధ్యంతర బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం వెల్లడించింది. ఈ విలువ 2019-20తో పోలిస్తే దాదాపు తొమ్మిది రెట్లు అదనం. 2016-17 సిరీస్-1 ఉపసంహరణతో ఇన్వెస్టర్లు 122 శాతం ప్రీమియం అందుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ ధర తొలిసారిగా 3,000 డాలర్లు దాటిన సంగతి తెలిసిందే. బంగారం పరుగుతో ప్రభుత్వంపై 'పసిడి బాండ్ల'భారం తీవ్రమైంది.

నాలుగు సిరీస్లు ఇలా..

సిరీస్	జారీ ధర	ఉపసంహరణ ధర (ధర గ్రాముకు రూపాయల్లో)
1	3,119	6,938
2	3,150	7,517
3	3,007	7,788
4	2,943	8,624

ఎస్జీబీ పథకం ఇలా..

ప్రారంభం	: 2015 నవంబర్లో
బాండ్స్	: 67 విడతలుగా జారీ
మొత్తం బంగారం	: 146.96 టన్నులు
విలువ	: రూ.72,274 కోట్లు
చెల్లింపులు	: 6 విడతలకు
పెండింగ్	: 61 విడతలు
తుది చెల్లింపు	: 2032 ఫిబ్రవరి

ఏమిటీ ఎస్జీబీలు..?

ఇవి భారత ప్రభుత్వం తరఫున రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జారీ చేసిన ప్రభుత్వ సెక్యూరిటీలు. నిజమైన (భౌతిక) బంగారానికి ఇవి ప్రత్యామ్నాయ రూపం. పెట్టుబడిదారులు భౌతికంగా బంగారం కలిగి ఉండాల్సిన అవసరం లేకుండా దానిపై పెట్టుబడి పెట్టడానికి ఈ బాండ్లు వీలు కల్పించాయి. పెట్టుబడిదారులు ఇష్యూ ధరను నగదు రూపంలో చెల్లించాలి. బాండ్ల గడువు ముగిసిన తర్వాత పెట్టుబడిదారులకు నగదు రూపంలోనే తిరిగి చెల్లిస్తారు. బంగారం దిగుమతులను నిరుత్సాహపరచడం ద్వారా విదేశీ మారకం నిల్వలను కాపాడుకోవచ్చన్న భావనతో కేంద్రం ఈ బాండ్ల జారీని ప్రారంభించింది.

మొత్తం 146 టన్నులు..

సావరిన్ గోల్డ్ బాండ్ పథకం 2015 నవంబర్లో ప్రారంభం అయింది. ఈ పథకంలో భాగంగా మొత్తం 67 విడతలుగా 146.96 టన్నుల గోల్డ్ బాండ్స్ జారీ అయ్యాయి. వీటి విలువ రూ.72,274 కోట్లు. 2023-24లో ఇన్వెస్టర్లు రూ.27,031 కోట్ల విలువైన 44.34 టన్నుల గోల్డ్ బాండ్స్ కొనుగోలు చేశారు. 2017-2020 మధ్య జారీ అయిన ఎస్జీబీలకు ముందస్తు ఉపసంహరణను 2024 జూలై నుండి ఆర్బీఐ ప్రకటించింది. ప్రభుత్వం 2024 జూలై నుండి ఆరు విడతల ఎస్జీబీ మొత్తాలను తిరిగి చెల్లించింది. 61 విడతలు మిగిలి ఉన్నాయి. తుది చెల్లింపు 2032 ఫిబ్రవరిలో జరగనుంది.

సిరీస్ల వారీగా ఇలా..

గ్రాముకు రూ.3,119 ధరతో 2016 ఆగస్టు 5న జారీ చేసిన ఎస్జీబీ 2016-17 సిరీస్-1 గత ఏడాది 2024 ఆగస్టు తొలి వారంలో రూ.6,938 చొప్పున రిడీమ్ అయ్యాయి. గ్రాముకు రూ.3,150 చొప్పున 2016 సెప్టెంబర్ 30న జారీ అయిన 2016-17 సిరీస్-2 గత ఏడాది సెప్టెంబర్ 30న రూ.7,517 ధరతో ఉపసంహరించారు. రూ.3,007 ధరతో 2016 నవంబర్ 17న జారీ అయిన 2016-17 మూడవ సిరీస్ రూ.7,788 చొప్పున 2024 నవంబర్ 16న రిడీమ్ అయ్యాయి. ఇక గ్రాముకు రూ.2,943 ధరతో జారీ చేసిన నాల్గవ విడత సావరిన్ గోల్డ్ బాండ్స్ ఒక్కో గ్రాముకు రూ.8,624 చొప్పున రిడెమ్షన్ కానుంది.

రిడెమ్షన్ ధర నిర్ణయం ఇలా..

999 స్వచ్ఛత కలిగిన బంగారానికి ఇండియన్ బులియన్ అండ్ జువెల్లర్స్ అసోసియేషన్ ప్రకటించిన ధరల ప్రకారం.. రిడెమ్షన్ తేదీ నుంచి గడిచిన మూడు పని దినాల్లో సగటు బంగారం ధరను ఎస్జీబీ తుది ఉపసంహరణ ధరగా నిర్ణయిస్తారు.

ఇదీ పథకం..

- కనీస పెట్టుబడి 1 గ్రాము.
- ఈ బాండ్లు దేశంలో బంగారం ధరతో ముడిపడి ఉంటాయి.
- వీటికి 8 సంవత్సరాల కాలపరిమితిని పెట్టారు.
- 5 ఏళ్ల తర్వాత ఎప్పుడైనా ఉపసంహరించుకునే అవకాశం ఉంది.
- ఇన్వెస్టర్లకు తమ పెట్టుబడిపై సంవత్సరానికి 2.5% వడ్డీ కూడా అదనంగా పొందవచ్చు.
- వడ్డీపై పన్ను విధించబడుతుంది. కానీ మూలధన లాభాల పన్ను లేదు.

కేసీఆర్ అంటే రేవంత్కు భయం: కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ప్రశాంత్రెడ్డి, జీవన్రెడ్డి తదితరులు

నిజామాబాద్ అర్బన్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటే సీఎం రేవంత్రెడ్డి భయపడుతున్నారని, నిద్రలో కూడా కేసీఆర్.. కేసీఆర్ అంటున్నారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆదివారం నిజామాబాద్లోని పార్టీ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ తాను స్టేట్ ఫ్యూచర్ అని రేవంత్రెడ్డి చెప్పుకుంటున్నారని.. అయితే తెలంగాణ హిస్టరీ, ఫ్యూచర్ కూడా కేసీఆరే అని పేర్కొన్నారు. కేసీఆర్కు ఏ రకంగానూ ఆయన సరితూగరన్నారు. రైతుబంధు ఇవ్వనని, రుణమాఫీ చేయనని, సాగునీరు ఇవ్వనని సీఎం రుబాబుగా మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ మాట్లాడితే ప్రజలు టీవీలకు అతుక్కుని చూస్తారని, రేవంత్రెడ్డి మాట్లాడితే టీవీలను మ్యూట్ చేసే పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో అబద్ధాలు చెప్పి పాపాన్ని మూట కట్టుకోవద్దని సూచించారు. రంజాన్ తోఫాలు ఎందుకు నిలిపివేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూతు పురాణానికి పేటెంట్ కేసీఆర్దే: చామల



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ మాట్లాడితే నీతులు, రేవంత్ మాట్లాడితే బూతులు అవుతాయా? అని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్రెడ్డి బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్రావును ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి బూతులు మాట్లాడారని హరీశ్రావు అనడం హాస్యాస్పదంగా ఉందని, దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కేసీఆర్ ఎన్ని బూతులు మాట్లాడారో ప్రజలకు తెలుసునని, ఆయన మాట్లాడిన మాటలతో ఒక బూతు పుస్తకమే రాసి ఉండవచ్చని, బూతు పురాణానికి కేసీఆర్దే పేటెంట్ అని వ్యాఖ్యానించారు. నాడు కేసీఆర్ మాట్లాడిన మాటలు హరీశ్రావుకు గుర్తు లేకపోతే తాను వీడియోలు పంపిస్తానని, చూసుకోవాలని చెప్పారు. అగ్గిపెట్టెరావు ఇప్పటికైనా సీఎం రేవంత్రెడ్డికి సవాళ్లు విసరడం మానుకోవాలని ఎంపీ చామల హితవు పలికారు.





జనగామ జిల్లా శివునిపల్లిలో మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు ● సభకు హాజరైన మహిళలు

కేసీఆర్ పాపాల చిట్టా విప్పుతా

19, 20 తేదీల్లో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బట్టబయలు చేస్తా

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పాపాలు చెబుతా..
- శివునిపల్లి ప్రజాపాలన సభలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి
- స్టేషన్ఘన్పూర్లో రూ.800 కోట్ల విలువైన పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

సాక్షిప్రతినిధి, వరంగల్: 'అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్, ఆయన ప్రభుత్వంలో జరిగిన పాపాల చిట్టా విప్పుతా..19, 20 తేదీల్లో బట్టబయలు చేస్తా. ఇప్పటివరకు చెప్పింది ఇంటర్వెల్ వరకే...అసలు సినిమా ముందుంది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ధనిక రాష్ట్రంగా చేతుల బెడితే పదేళ్లలో రూ.8.29 లక్షల కోట్ల అప్పులు చేశారు. అవినీతికి పాల్పడ్డారు. రూ.లక్ష కోట్లు వెనకేసుకున్నారు. అప్పులకు అసలు, మిత్తీ కలిపి ఏడాదిలో రూ.1.53 లక్షల కోట్లు మా ప్రభుత్వం కట్టింది. ఆ డబ్బే ఉంటే రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యేవి..' అని సీఎం రేవంత్రెడ్డి చెప్పారు. ఆదివారం జనగామ జిల్లా స్టేషన్ఘన్పూర్ శివారు శివునిపల్లిలో జరిగిన 'ప్రజాపాలన ప్రగతి బాట' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుమారు రూ.800 కోట్ల విలువైన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు.

అప్పుల్లోనే పథకాల అమలు

'కేసీఆర్ పాలించిన ఆ పదేళ్లలో ధనిక రాష్ట్రం అప్పుల కుప్పయ్యింది. దివాళా తీసిన రాష్ట్రాన్ని మాకు అప్పజెప్పారు. ఆనాడు నెలకు అసలు, వడ్డీ కలిపి రూ.500 కోట్ల అప్పు ఉంటే ఈనాడు ప్రతినెలా వడ్డీ రూ.6,500 కోట్లు కట్టాల్సిన దుస్థితి వచ్చింది. కేసీఆర్ పాలనలో రూ.8.29 లక్షల కోట్లు అప్పు తేలింది. అయినా అధికారంలోకి వచ్చిన రెండురోజుల్లోనే ఎన్నికల్లో హామీ ఇచ్చిన 'ఆడబిడ్డలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం' అమలు చేశాం. ఈ మహాలక్ష్మి పథకంతో నేటికి 150 కోట్ల మంది ఆడబిడ్డలకు గాను రూ.5,005 కోట్లు ఖర్చు చేశాం. 50 లక్షల పేదల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత కరెంటుతో పాటు వ్యవసాయానికి ఉచిత కరెంటు అందిస్తున్నాం. అప్పుల పాలైన రాష్ట్రంలోనే రూ.500కే గ్యాస్ సిలిండర్, 25.35 లక్షల మంది రైతులకు రూ.20,617 కోట్ల పంట రుణమాఫీకి శ్రీకారం చుట్టాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్రాజెక్టులు, పథకాలపై చర్చకు రావాలి

'కృష్ణా, గోదావరి జలాల ప్రాజెక్టులపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు పెడితే.. అందులో రూ.1.02 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయి కూలేశ్వరంగా మారింది. తాటిచెట్టులా పెరిగిండ్రు కానీ ఆవకాయ అంత కూడా ఆయన మెదడులో తెలివి లేదు.. నేను హరీశ్రావుకు సవాల్ విసురుతున్నా. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులపై చర్చకు రావాలి. 300 టీఎంసీలతో శ్రీరాంసాగర్, 200 టీఎంసీల నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులతో పాటు జూరాల, నెట్టెంపాడు, దేవాదుల, రాజీవ్, ఇందిరాసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి వంటి పక్కా శాశ్వత ప్రాతిపదికన నిర్మించిన ప్రాజెక్టులు కాంగ్రెస్ పారదర్శక పాలనకు అద్దం పడతాయి. కాంగ్రెస్ ప్రాజెక్టులతోనే తెలంగాణ సస్యశ్యామలమవుతోంది. కేసీఆర్ కట్టిన కాళేశ్వరంతో సాగునీరు రాకున్నా కోటి 56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చేలా తోడ్పాటు అందించాం. కొనుగోలు చేసిన ప్రతి క్వింటాల్కు రూ.500 బోనస్ ఇచ్చి అన్నదాతలను ఆదుకున్నాం. ఈ విషయాలపై విమర్శలు చేస్తున్న హరీశ్రావు, కేటీఆర్ పిల్లకాకులు. కేసీఆర్ను రమ్మన్నా..ఏ ప్రాజెక్టు వద్ద మాట్లాడుదాం రమ్మంటున్నా..' అని రేవంత్ అన్నారు.

ఫామ్హౌస్లో పడుకొని ఉసిగొల్పుతుండు..

'అధికారం పోతే ప్రతిపక్ష పాత్ర పోషించకుండా కేసీఆర్ ఫామ్హౌస్లో పడుకొని ఉసిగొల్పుతుండు. అందుకే ఫామ్హౌస్లో నుంచి లేచి రమ్మన్నా. రూ.58 లక్షల ప్రజాధనం జీతభత్యాల కింద తీసుకున్నారు. ఏ రంగంలో జీతగాళ్లకైనా పని చేయకుంటే జీతం ఇస్తారా? అపార రాజకీయ అనుభవజ్ఞుడైన కేసీఆర్ అధికారం ఉంటే వస్తరు.. లేకుంటే అలిగి పంటరా? మీరైతే లక్షల కోట్లు సంపాదించి ఫామ్హౌస్లు, టీవీలు, పేపర్లు పెట్టుకున్నరు. నువ్వు గజ్వేల్, నీ కొడుకు జన్వాడ, నీ అల్లుడు మొయినాబాద్, నీ బిడ్డ శంకర్పల్లిలో ఫామ్హౌస్లు కట్టుకున్నరు. కానీ తెలంగాణ రైతులు ఉన్న భూములు అమ్ముకొని ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మీరు క్యాప్సికమ్ పండించి కోట్లు సంపాదించిన తీరు వారికి, నిరుద్యోగ యువతకు చెప్పరా? అధికారం పోగానే దివిసీమ తుపాను బాధితుల కంటే ఎక్కువ ఆందోళనలో కేసీఆర్ కుటుంబం ఉంది. కేసీఆర్ను తెలంగాణ జాతిపిత అని హరీశ్రావు అంటున్నడు. జాతిపితకు, కేసీఆర్కు ఏమైనా పోలిక ఉందా? అసలైన జాతిపితకు మందు వాసన తెలుసా? అసలైన జాతిపిత దళిత వాడల్లో జీవితం గడిపితే.. హరీశ్రావు చెప్పే జాతిపిత ఫామ్హౌస్లో పడుకుంటున్నారు. తెలంగాణ జాతిపితలంటే కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొ.జయశంకర్..' అని సీఎం పేర్కొన్నారు.

మా మీద ప్రజలకు కోపం ఎందుకుంటుంది...

'ఎన్ని కష్టాలున్నా రాష్ట్రాన్ని పురోగతిలోకి తీసుకెళ్లే పయనంలో మహిళల అభ్యున్నతికి పాటు పడుతుంటే మాపై ప్రజలకు కోపం ఉందని చెబుతున్నారు. మాపై కోపం ఎందుకు ఉంటుంది? 65 లక్షల మందికి సారెచీర ఇచ్చినందుకా? వెయ్యి సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు ఇచ్చినందుకా? 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ తయారీతో శ్రీమంతులు చేసినందుకా? రూ.20,617 కోట్ల పంట రుణమాఫీ చేసినందుకా? రూ.500 బోనస్ ఇస్తూ రైతు భరోసా రూ.12 వేలకు పెంచినందుకా? మీడియా మిత్రులకు ఇళ్లపట్టాలు ఇచ్చినందుకా?..' అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న దొంగలకు ఉప్పు పాతర వేస్తా అన్నందుకు దోపిడీ వర్గాలకు నాపై కోపం ఉంటుంది తప్ప ప్రజలకు ఉండదన్నారు.

దోచుకున్న డబ్బుతో ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారు: పొంగులేటి

'గత బీఆర్ఎస్ పాలకులు రూ.లక్ష కోట్లు దోచుకున్నారు. దోచుకున్న డబ్బులతో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్లో ఉన్నారని అసత్యాలు ప్రచారం చేస్తున్నారు..' అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి ఆరోపించారు. ప్రజలు రెండు సార్లు కర్రు కాల్చి వాత పెట్టినా బుద్ధి రావట్లేదన్నారు. సభలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్కుమార్రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్రెడ్డి, రామచంద్రునాయక్, యశస్విని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలాగే రేవంత్ పాలన

- అప్పులు, అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఒకటే
- ఎన్నికల్లో లబ్ధికోసమే హిందీపై డీఎంకే రాద్ధాంతం
- కేంద్ర మంత్రి జి.కిషన్రెడ్డి విమర్శలు



సాక్షి, హైదరాబాద్: అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం గత కేసీఆర్ ప్రభుత్వంతో పోటీ పడుతోందని కేంద్ర మంత్రి జి.కిషన్రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక వ్యాపారం, లిక్కర్ దోపిడీ, అక్రమ భూముల వ్యవహారం, భూముల అమ్మకాలు, అప్పులు చేయడం, అహంకారపూరిత వ్యవహారశైలి గత బీఆర్ఎస్ పాలన తరహాలోనే ఇప్పుడూ ఉందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలుచేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదిహేను నెలల్లో రూ.152 లక్షల కోట్లు అప్పు చేసిందని గుర్తు చేశారు. గతంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టేందుకు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పులు చేయటంలో గత బీఆర్ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్కు తేడా లేదని విమర్శించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీతో పాటు, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనపై డీఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరి వారి దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రధాని మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని, హిందీ భాషను, డీలిమిటేషన్ను బూచిగా చూపించి తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

డీకే అరుణ ఇంట్లోకి ఆగంతకుడు

గంటన్నరపాటు ఇంట్లోనే తిరిగిన దుండగుడు


- ఆదివారం తెల్లవారుజామున ఘటన



డీకే అరుణ ఇంట్లో ఆగంతకుడు

సాక్షి, హైదరాబాద్/ బంజారాహిల్స్/పాలమూరు: బీజేపీ మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ నివాసంలోకి ఆదివారం తెల్లవారుజామున ఆగంతకుడు చొరబడిన ఘటన కలకలం సృష్టించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-56లోని డీకే అరుణ ఇంట్లోకి తెల్లవారుజామున 3.50 గంటల సమయంలో కిచెన్ వైపు ఉన్న కిటికీ గ్రిల్స్ తొలగించి దుండగుడు లోపలికి ప్రవేశించాడు. చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కు వేసుకుని లోపలికి వెళ్లగానే హాల్లో ఉన్న సీసీ కెమెరాల వైర్ను కట్ చేశాడు. అరుణ బెడ్రూమ్ వరకు వెళ్లి అక్కడ కూడా సీసీ కెమెరా వైర్ను కట్ చేశాడు. గంటన్నర పాటు ఇల్లంతా కలియదిరిగాడు. ఆ సమయంలో డీకే అరుణ మహబూబ్నగర్లో ఉన్నారు. ఇంట్లో ఆమె కూతురుతో పాటు పని మనుషులు మాత్రమే ఉన్నారు. దుండగుడు ఓ బెడ్రూమ్లోకి ప్రవేశించి కొన్ని సామాన్లు కూడా మూటగట్టాడు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఈ ఘటనపై డీకే అరుణ డ్రైవర్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గతంలో డీకే అరుణ ఇంట్లో పనిచేసి మానేసిన వ్యక్తిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో వస్తువులేమీ పోలేదని డ్రైవర్ లక్ష్మణ్ తన ఫిర్యాదులో తెలిపాడు. ఈ ఘటనపై డీకే అరుణ ఆందోళన వ్యక్తంచేశారు. మహబూబ్నగర్లోని తన నివాసంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ..జాతీయ రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న తన ఇంట్లోనే ఆగంతకుడు చొరబడితే.. రాష్ట్రంలో భద్రత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. దీనిపై సీఎం రేవంత్రెడ్డి సీరియస్గా దృష్టిసారించి సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి బండి సంజయ్ డీకే అరుణకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉగాదికి నా సినిమా ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సినిమా తీస్తున్నారు. 'సినిమా తీసేందుకు టైం ఇస్తారా? అని రామానుజం అనే దర్శకుడు నన్ను అడిగారు. ఇవ్వలేనేమో అని అనుకుంటుండగానే నా ఫొటో ఒకటి చూపించారు. 2013 నుంచి నాలాంటి వ్యక్తి కోసం వెతుకుతున్నానని మూడు నెలల క్రితం డైరెక్టర్ చెప్పినప్పుడు కన్విన్స్ కాలేదు. అయితే ఆయన ఫొటో చూపించినప్పుడు మాత్రం కన్విన్స్ అయ్యా' అని చెప్పారు. ఆదివారం జగ్గారెడ్డి మీడియాతో చిట్చాట్ చేస్తూ.. ఉగాదికి తన సినిమా ప్రారంభం అవుతుందని, తాను తీయబోయే సినిమా లవ్, ఫ్యాక్షన్ , ఎమోషన్, పొలిటికల్ అంశాలతో ఉంటుందని చెప్పారు. అయితే తన పాత్రకు లవ్కు సంబంధం ఉండదని, తాను ఓ విద్యార్థి నాయకుడిగా, కౌన్సిలర్గా కనిపిస్తానని, తాను మున్సిపల్ చైర్మన్ ఎలా అయ్యానో కూడా సినిమాలో ఉంటుందని వివరించారు. సినిమా కారణంగా సంగారెడ్డి అభివృద్ధికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. రాష్ట్ర పార్టీలో ఇప్పుడు తన అవసరం లేనట్టు ఉందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

రేవంత్రెడ్డి బూతుపిత

కేసీఆర్ చావును కోరుకుంటావా?

- కృష్ణా జలాల్లో చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహారం
- నిన్ను గద్దె దింపే వరకు కేటీఆర్, నేను పోటీపడి పనిచేస్తం
- సీఎంపై మాజీమంత్రి హరీశ్రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి శాసనసభను అబద్ధాలకు వేదికగా మార్చుకున్నారని..అసెంబ్లీలో ఆయన చేసిన వ్యాఖ్యలు అనుచితమని మాజీమంత్రి హరీశ్రావు ధ్వజమెత్తారు. రేవంత్ అసెంబ్లీలో మాట్లాడిన భాష ఒక బూతు సినిమా స్క్రిప్టులా ఉందని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణ జాతిపితగా పేరు తెచ్చుకుంటే, రేవంత్రెడ్డి బూతుపితగా పేరు తెచ్చుకున్నారని వ్యాఖ్యానించారు. ఆదివారం తెలంగాణభవన్లో మీడియాతో మాట్లాడుతూ రేవంత్రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వివరాలు హరీశ్రావు మాటల్లోనే..

'రేవంత్రెడ్డి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ చావును కోరుకుంటావా.. నీకు సంస్కారం ఉందా? కేసీఆర్ గురించి తప్పుగా మాట్లాడి, ఆ మాటను మళ్లీ మార్చి సమర్థించుకుంటున్నావ్. పదేళ్లు తెలంగాణను అభివృద్ధిపథంలో నడిపించి దేశానికి దిక్సూచిగా నిలిపిండు కేసీఆర్. అలాంటి నాయకున్ని పట్టుకొని మార్చురీకి పంపాలని మాట్లాడతావా. నీకేమైనా విజ్ఞత ఉందా ? నిజాయితీ ఉంటే కేసీఆర్పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పు. జానారెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వారిని ఎంతో మర్యాదతో 'పెద్దలు జానారెడ్డి గారు'అని సంబోధించే వాళ్లం. తెలంగాణ ప్రేమ ఆప్యాయతలకు చిరునామా. అసెంబ్లీలో బట్టలు ఊడదీసి కొడతా అన్న నీ మాటలకు అసెంబ్లీలో ఏం చర్యలు తీసుకోవాలి? సీఎం హోదాలో ఉండి ఈ విధంగా మాట్లాడవచ్చా?

అలా మాట్లాడటం అవాస్తవం

తెలంగాణకు కృష్ణాజలాల పరంగా అన్యాయం జరిగినట్టు రేవంత్రెడ్డి మాట్లాడటం అవాస్తవం. రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా జలాల హక్కును కేసీఆర్ పోరాడి సాధించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యతిరేకించి, స్టే తెచ్చింది. పాలమూరు ఎత్తిపోతలను జూరాల వద్ద కట్టమని చెబుతాడు. కనీస అవగాహన లేకుండా రేవంత్ మాట్లాడుతున్నాడు. కృష్ణా జలాలు ఏపీకి తరలిపోవాలనేది నీ ఉద్దేశం. నీ ఆంధ్రా సలహాదారుడు ఈ సలహా ఇచ్చాడా? 102 టీఎంసీల కృష్ణా నీళ్ల నిల్వ చేసేలా రిజర్వాయర్లు కట్టిండు కేసీఆర్. నీ దత్తత గురువు చంద్రబాబు పాలమూరుకు మంచినీరు కూడా ఇవ్వలేదు, కానీ కేసీఆర్ పది లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిండు.

నిన్ను దించేవరకు పోటీపడి పనిచేస్తం

ప్రతిపక్ష లీడర్ పోస్ట్ కోసం నేను కేటీఆర్ పోటీ పడుతున్నామని అబద్ధపు ప్రచారం చేశాడు. ఉద్యమకారులం మేము. నేను, కేటీఆర్ పదవుల కోసం పోటీపడం. రుణమాఫీ పూర్తి చేసే వరకు నీ వెంట పడతాం. మాకు పోటీ లేదు.. దింపుడు కళ్లెం ఆశలు పెట్టుకోకు రేవంత్రెడ్డి..శనేశ్వరం లాంటి నిన్ను దించే దాకా, కేసీఆర్ను సీఎం చేసేదాకా పోటీ పడి పనిచేస్తం.

రుణమాఫీ ఎక్కడ జరిగింది..?

రేవంత్రెడ్డి నీకు సవాల్ విసురుతున్నా.. మధిరకు పోదామా? కొడంగల్ పోదామా? సిద్దిపేట పోదామా? ఏ ఊరుకు పోదాం. సంపూర్ణ రుణమాఫీ జరిగింది అంటే ముక్కు నేలకు రాస్తా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్పై మాటతప్పి ప్రజలపై భారం మోపింది. ఉస్మానియాలో నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు లేదా? వందేళ్ల ఓయూలో ఇలాంటి ఆంక్షలు ఎన్నడూ లేవు. ఇందిరమ్మ రాజ్యమా, ఎమర్జెన్సీ పాలనా'అని హరీశ్రావు వ్యాఖ్యానించారు.

ఇదండీ సంగతి



చిగురిస్తున్న డాలర్ కల..





భారతీయుల అమెరికా కలలు మళ్లీ చిగురిస్తున్నాయి. విద్య, పర్యాటక వీసాల విషయంలో భారత్‌పై అగ్రరాజ్యం కాస్త సానుకూల దృక్పథంతో ఉండటం కలిసొచ్చే అంశం. ట్రంప్ అమెరికా అధ్యక్షుడైన తర్వాత వివిధ దేశాలపై కఠిన ఆంక్షలు మొదలయ్యాయి. అక్రమ వలసల పేరుతో వేట కొనసాగుతోంది. తాజాగా 41 దేశాలపై ఉక్కుపాదం మోపేందుకు అమెరికా సిద్ధమైంది. ఈ దేశాలను మూడు కేటగిరీలుగా విభజించి పర్యాటక వీసాలపై ఆంక్షలు పెట్టాలని నిర్ణయించినట్టు అమెరికన్ మీడియా పేర్కొంది. ఈ మూడు జాబితాల్లోనూ భారత్ ప్రస్తావన లేకపోవడంతో మనవాళ్లు ఊపిరి పీల్చుకుంటున్నారు. పాత రోజులు మళ్లీ రాబోతున్నాయని కన్సల్టెన్సీ సంస్థలు భావిస్తున్నాయి. ఉన్నత విద్య కోసం వెళ్లే భారతీయ విద్యార్థుల్లోనూ ఆశలు పెరుగుతున్నాయి. మరికొన్ని రోజుల్లో తాత్కాలిక ఉద్యోగాలపై కూడా భారతీయులకు ఊరట లభిస్తుందని ప్రవాస భారతీయులూ అంచనా వేస్తున్నారు.

- సాక్షి, హైదరాబాద్



భారతీయ విద్యార్థులపై అమెరికా సానుకూలత

41 దేశాలపై ఆంక్షల కొరడా.. భారత్‌కు మాత్రం ఊరట


- ప్రస్తుతానికి పార్ట్‌టైం ఉద్యోగాలపై వీడని పీటముడి
- భవిష్యత్‌లో ఈ నిబంధనల సడలింపునకు అవకాశం
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆశలు

41 దేశాలు... మూడు కేటగిరీలు

41 దేశాల నుంచి వచ్చే పర్యాటక, విద్యాపరమైన వీసాలపై ఆంక్షలు విధించాలని అమెరికా నిర్ణయించింది. ఈ దేశాలను రెడ్, ఆరెంజ్, ఎల్లో కేటగిరీలుగా విభజించారు. రెడ్ కేటగిరీలో అమెరికాకు అత్యంత ప్రమాదకరంగా భావిస్తున్న 11 దేశాలను చేర్చారు. వాణిజ్య మైత్రి కొనసాగుతున్న ఉగ్రవాద ప్రేరేపిత, ఆర్థిక ఆంక్షలున్న దేశాలను ఆరెంజ్ కేటగిరీలో పెట్టారు. ఈ కేటగిరీలో పాకిస్తాన్, రష్యా సహా 10 దేశాలున్నాయి. వీటిపై కొంత సమయం తీసుకుని ఆంక్షలు విధిస్తారు. వైరిపక్ష దేశాలతో సంబంధాలున్నప్పటికీ, హెచ్చరికలు, చర్చల ద్వారా దారికొచ్చే 22 దేశాలను ఎల్లో కేటగిరీలో చేర్చారు. వీటిపై దశల వారీగా ఆంక్షలు విధించాలని భావిస్తున్నారు.

మనవాళ్ల అవసరం ఉండబట్టే..

అమెరికాలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 11.26 లక్షలు. వారిలో 29% భారతీయులే. సాఫ్ట్‌వేర్ రంగంలో కీలకమైన ఉద్యోగాల్లోనూ భారతీయుల పాత్ర కీలకం. అమెరికాలో గతంలో చైనా విద్యార్థులు ఎక్కువగా ఉండేవాళ్లు. ఈ స్థానాన్ని భారత్ అధిగమించింది. ఈ కారణంగానే ఈ రెండు దేశాల విద్యార్థుల వీసాలపై ఆంక్షలు విధించే సాహసం అమెరికా చేయడం లేదనేది కన్సల్టెన్సీల అభిప్రాయం. అమెరికాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ రూపొందించిన ఓపెన్ డోర్స్ రిపోర్టులోనూ ఇదే వెల్లడైంది. పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లే భారతీయుల సంఖ్య గత ఏడాది 10% పెరిగి 1,96,567కు చేరింది. అండర్ గ్రాడ్యుయేట్ల సంఖ్య 13% పెరిగి 36,053కు చేరింది. అమెరికాలోనే ఉపాధి పొందాలని భావిస్తూ.. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) తీసుకుంటున్న భారతీయుల సంఖ్య 97,556 (2024లో 41% ఎక్కువ)కు చేరింది. ఇతర దేశాలపై ఆంక్షలు పెట్టిన నేపథ్యంలో ఐటీ సెక్టార్‌లో పనిచేసే సామర్థ్యం భారతీయులకే ఉందని ఓపెన్ డోర్స్ రిపోర్టు పేర్కొంది. దీంతో భవిష్యత్‌లోనూ భారతీయ వీసాలపై పెద్దగా ఆంక్షలు ఉండవనే సంకేతాలు వస్తున్నాయని ప్రవాసులు అంటున్నారు.



శుభ సంకేతాలే

ఆంక్షల విషయంలో భారత్‌ను కొంత సానుకూలంగా చూడటం శుభ పరిణామం. అయితే, తాత్కాలిక ఉద్యోగాల విషయంలో ఇంకా ఇబ్బందులు తొలగలేదు. నిబంధనలకు విరుద్ధంగా చదువుకుంటూ పార్ట్‌టైం ఉద్యోగం చేయాలనే ఆలోచనలో విద్యార్థులు ఉండొద్దు. ఇప్పటికీ అమెరికాలో ఇలాంటి వారిని గుర్తించేందుకు ట్రంప్ సర్కార్ ప్రయత్నిస్తోంది. అయితే, వాణిజ్యపరంగా చూస్తే, ఆంక్షల వల్ల మానవవనరుల కొరత ఉంది. కాబట్టి ఎక్కువ కాలం ఆంక్షలు ఉండకపోవచ్చు. కొన్ని దేశాల నుంచి వచ్చిన అక్రమ వలసదారులను ఏరేసిన తర్వాత భారతీయులకు కొంత స్వేచ్ఛ ఉండే వీలుంది.

-వి.నరేష్, అమెరికాలో గ్రీన్ కార్డ్ ఉన్న భారతీయుడు

కొంత ఊరట లభించినట్టే

మూడు కేటగిరీల్లో భారత్ లేకపోవడం ఆశాజనకం. అమెరికాలో విద్యకు వెళ్లే ప్రతీ విద్యార్థి అక్కడ తాత్కాలిక ఉపాధి కోసం యత్నిస్తారు. మనవాళ్లకు కష్టపడి పనిచేసే స్వభావం ఉంది. అమెరికన్ కంపెనీలు ఈ విషయాన్ని గుర్తిస్తాయి. కాబట్టి ఇప్పుడున్న భయాలు భవిష్యత్‌లో తొలగిపోతాయని భావిస్తున్నాం.

- ఈవీఎల్ఎన్ మూర్తి (కన్సల్టెంట్ సంస్థ ఎండీ, హైదరాబాద్)

వీసాలపై అమెరికా ఆంక్షలు విధించే 3 కేటగిరీ దేశాలు

రెడ్ జోన్: అఫ్గానిస్తాన్, భూటాన్, క్యూబా, ఇరాన్, లిబియా, ఉత్తరకొరియా, సోమాలియా, సూడాన్, సిరియా, వెనెజువెలా, యెమన్

ఆరెంజ్ జోన్: బెలారస్, ఎరిత్రియా, హైతీ, లావోస్, మయన్మార్, పాకిస్తాన్, రష్యా, సియెరాలియోన్, సౌత్ సూడాన్, తుర్క్‌మెనిస్తాన్

ఎల్లో జోన్: అంగోలా, ఆంటిగ్వా అండ్ బార్బుడా, బెనిన్, బుర్కినా ఫాసో, కంబోడియా, కామెరాన్, కేప్‌వెర్డ్, చాడ్, కాంగో, డీఆర్ కాంగో, డొమినీసియా, గునియా, గాంబియా, లైబీరియా, మాలావి, మాలి, మారింటానియా, సెయింట్ కిట్స్ అండ్ నెవీస్, లూసియా, సావో టామ్ అండ్ ప్రిన్సిప్, వనువాటు, జింబాబ్వే

అమెరికాలో ఎక్కువ మంది భారతీయులున్న విశ్వవిద్యాలయాలు

వర్సిటీ	రాష్ట్రం	విద్యార్థులు
న్యూయార్క్ వర్సిటీ	న్యూయార్క్	27,247
నార్త్ ఈస్టర్న్ వర్సిటీ	బోస్టన్	21,023
కొలంబియా వర్సిటీ	న్యూయార్క్	20,321
అరిజోనా స్టేట్ వర్సిటీ	టెంపె	18,430
యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా	లాస్ ఏంజెలిస్	17,469

అమెరికాలో ప్రధాన దేశాల విద్యార్థుల సంఖ్య	సంవత్సరం	భారత్	చైనా	దక్షిణ కొరియా	కెనడా
	2022-23	2,68,923	2,89,526	43,847	27,876
	2023-24	3,31,602	2,77,398	3,149	23,157

నేడు అసెంబ్లీలో కీలక బిల్లులు

- వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టనున్న సీఎం రేవంత్
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన బిల్లును ప్రవేశపెట్టనున్న మంత్రి పొన్నం
- బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం మరో బిల్లు కూడా..

సాక్షి, హైదరాబాద్: మూడు కీలక బిల్లులు సోమవారం శాసనసభ ముందుకు రానున్నాయి. అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు ఆదివారం రాత్రి విడుదల చేసిన ఎజెండా ప్రకారం ఎస్సీల వర్గీకరణ బిల్లును సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడతారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించే బిల్లుతో పాటు బీసీలకు ప్రత్యేకంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రతిపాదించనున్నారు. బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించిన అనంతరం.. దేశవ్యాప్తంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. దేవాదాయ మంత్రి కొండా సురేఖ మరో బిల్లును ప్రవేశపెడతారు. తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థల బిల్లుకు ఆమె సవరణలు ప్రతిపాదించనున్నారు. కాగా బుధవారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదించనుంది.

నేడు ఉభయ సభల్లో ప్రశ్నోత్తరాలు

సోమవారం శాసనసభ, శాసనమండలి ప్రశ్నోత్తరాలను చేపట్టనున్నాయి. విదేశీ విద్యానిధి పథకంతో పాటు ప్రభుత్వ జీవోలను అందుబాటులో ఉంచడం, సంక్షేమ హాస్టళ్లలో డైట్ చార్జీల పెంపు, హెచ్‌ఎండీఏ భూముల తాకట్టు తదితర అంశాలపై సభ్యులు అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. ఇక మండలిలో కూడా సోమవారం కీలక ప్రశ్నలు రానున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, కల్యాణమస్తు, ఇందిరమ్మ ఇళ్లు, సీతారామ ప్రాజెక్టు, ఫార్మాసిటీ తదితర అంశాలపై ప్రశ్నలకు ప్రభుత్వం జవాబివ్వనుంది.

నేడు బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బ్రేక్‌ఫాస్ట్: చరిత్రాత్మకమైన బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ కానున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు మంత్రి చాంబర్‌లో వారి కోసం బ్రేక్‌ఫాస్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

నిరుద్యోగుల కోసం రాజీవ్ 'యువ వికాసం'

- నేడు పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం రేవంత్
- ఏప్రిల్ 5 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం
- ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష



మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో పొన్నం తదితరులు

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి బాట పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. పదేళ్లుగా అటకెక్కిన స్వయం ఉపాధి పథకాలను తిరిగి అమలు చేసేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. గతంలో ఆర్థిక సహకార కార్పొరేషన్లకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినప్పటికీ.. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో స్వయం ఉపాధి పథకాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో తాజాగా రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తుల స్వీకరణకు సంక్షేమ శాఖలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీవ్ యువ వికాసం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత ఔత్సాహికులకు ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియకు అవకాశం కల్పించనున్నారు. సోమవారం నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. తర్వాత క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రగతిభవన్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కల్పించుకోవడానికి ఈ పథకం దోహదపడుతుందని ఉపముఖ్యమంత్రి భట్టి అభిప్రాయపడ్డారు.

ఓయూలో ఆంక్షలు ఎత్తివేయాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఓయూ క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనలపై నిషేధం విధించటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆరు గ్యారంటీలను అటకెక్కించిన కాంగ్రెస్ సర్కారు.. ఏడో గ్యారంటీకి కూడా ఏడాదిన్నరలోనే ఘోరీ కట్టిందని అన్నారు. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అందిస్తానన్న సీఎం.. ప్రజా నిరసనలపై ఉక్కుపాదం మోపడం దుర్మార్గమని ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలోని ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేస్తోందని దుయ్యబట్టారు. విద్యార్థులు తినే భోజనంలో ఇటీవల పురుగులతోపాటు ఏకంగా బ్లేడ్లు కూడా రావటం సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాల్సింది పోయి విద్యార్థులను అణచివేయాలని చూడటం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పొత్తు కుదుతున్నయ్..

- వచ్చే స్థానిక ఎన్నికల్లో జరిగేది ఇదే
- కేంద్ర మంత్రి బండి సంజయ్



సిరిసిల్లటౌన్/కరీంనగర్‌టౌన్: స్వార్థ రాజకీయాలు, కుటుంబ పాలనకు ప్రాధాన్యమిచ్చే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ.. ఒక్కటయ్యాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ పార్టీలు ఢిల్లీలో చీకటి పొత్తు ఒప్పందాలు కుదుర్చుకున్నాయని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగేది ఇదేనని ఆయన పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన బీజేపీ జిల్లాస్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడంతో రానున్న రోజుల్లో తాము ఉనికి కోల్పోతామని ఆ రెండు పార్టీలు కుట్రపూరిత రాజకీయాలకు తెరలేపాయని మండిపడ్డారు. బీజేపీ గెలుపును అడ్డుకోవడానికే స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తు బాటలో ఉన్నాయని విమర్శించారు. వివిధ స్కాముల్లో కేసీఆర్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరిపైన కూడా రేవంత్‌రెడ్డి సర్కారు కేసులు పెట్టకపోవడం ఎందుకో ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు, సంక్షేమ పథకాలకు నిధుల్లేవంటూనే వివిధ కాంట్రాక్టు పనులకు వేలాది కోట్ల రూపాయలు అందిస్తోందన్నారు. పలువురు కాంట్రాక్టర్లు కాంగ్రెస్ మంత్రుల బినామీలు కావడమే ఇందుకు కారణమని ఆరోపించారు.

తెలుగు వర్సిటీ పేరు మార్పుపై ఆగ్రహం

పొట్టి శ్రీరాములు పేరిట ఉన్న తెలుగు విశ్వవిద్యాలయానికి ఆ పేరును తొలగిస్తూ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పొట్టి శ్రీరాముల జయంతిని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీపీఐ నాయకులు చెపితే, సీఎం రేవంత్‌రెడ్డి తన కులాభిమానంతోనే పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రతిపాదించారని మండిపడ్డారు. సురవరం ప్రతాపరెడ్డి అంటే తమకు గౌరవముందని, కానీ పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సరికాదని పేర్కొన్నారు.

రూ. 3,300 కోట్లు రికవరీ చేస్తారా..లేదా ?

- సొమ్ము లేదు.. ధాన్యం లేదని చేతులెత్తేసిన 314 మంది మిల్లర్లు
- మిగతా మిల్లర్లకు మరో మూడు నెలల గడువు ఇస్తూ ఉత్తర్వులు జారీ




సాక్షి, హైదరాబాద్: మిల్లర్ల నుంచి బకాయిల వసూలులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే..పౌరసరఫరాలశాఖ రూ.3,300 కోట్లపైన ఆశలు వదులుకున్నట్టే కనిపిస్తోంది. 2022–23 యాసంగిలో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా సేకరించింది. ఇందులో సెంట్రల్ పూల్‌కు ఇచ్చే పారాబాయిల్డ్ బియ్యం, రాష్ట్ర అవసరాలకు బియ్యం కోసం దాదాపు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు మరాడించారు. మిగతా 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల వద్దే ఉండిపోయింది. ఈ ధాన్యం విలువ రూ.7వేల కోట్లు. అయితే అప్పటికే కొంతమంది మిల్లర్లు తాము ధాన్యాన్ని మిల్లింగ్ చేయలేమని చేతులెత్తేసి.. తమ వద్ద ఉన్న ధాన్యాన్ని అక్రమంగా విక్రయించడం, మిల్లింగ్ చేసి బియ్యాన్ని సరిహద్దులు దాటించేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మిల్లర్ల వద్ద ఉన్న వేల కోట్ల రూపాయల విలువైన ధాన్యంపై దృష్టి పెట్టారు. రికవరీ చేయాల్సిందేనని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ధాన్యం రికవరీకి జాతీయస్థాయిలో వేలానికి టెండర్లు ఆహ్వానించగా, నాలుగు సంస్థలు ముందుకొచ్చాయి. రికవరీ చేయాల్సిన ధాన్యానికి బదులు అప్పటి ధాన్యం విలువకు అదనంగా రూ. 200కు పైగా చేర్చి వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలా మొత్తానికి 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విలువను ప్రభుత్వం రాబట్టింది. మరో 15 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మిల్లర్ల వద్దే ఉండిపోయింది. దీన్ని 'వేలం ధాన్యం'గా పేర్కొంటున్న మిల్లర్లు..ధాన్యం బకాయి పడడాన్ని అత్యంత సాధారణ విషయంగా చెబుతున్నారు. మిల్లర్ల సంఘం ముఖ్య నాయకుడిగా చెప్పుకుంటున్న ఓ మిల్లరే దాదాపు రూ.400 కోట్ల విలువైన టెండర్ ధాన్యం బకాయి పడ్డట్టు సమాచారం. నాయకులుగా చెప్పుకునేవారు రూ.వందల కోట్ల బకాయిలు ఉన్నా, వ్యాపారం కొనసాగిస్తుండడం పలు సందేహాలకు తావిస్తోంది.

తూతూమంత్రంగా రెవెన్యూ రికవరీ యాక్ట్, క్రిమినల్ కేసులు

ధాన్యం బకాయిలు చెల్లించని మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, భవిష్యత్‌లో ధాన్యం మిల్లింగ్‌కు ఇవ్వబోమని, రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద యజమాని పేరిట ఉన్న భూములను వేలం వేస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. దీంతో మిల్లర్లు తాము విక్రయించిన ధాన్యం నుంచి కొంతమేర రికవరీ చూపించి తాత్కాలికంగా తప్పించుకున్నారు. 314 మంది మిల్లర్లు పూర్తిగా చేతులెత్తేశారు. తమ దగ్గర ధాన్యం లేదు.. దానికి సమానమైన సొమ్ము కూడా లేదన్నారు. వీరి నుంచి రావాల్సిన సుమారు రూ. 1,000 కోట్లు.. రాని బకాయిల కింద ప్రభుత్వం జమకట్టింది. దీంతో వారిపై చర్యలకు ఉపక్రమించింది. నర్సాపూర్‌లోని ఓ మిల్లర్‌కు చెందిన 1.31 ఎకరాల భూమిని రూ. 2.12 కోట్లకు వేలం వేసింది. ప్రతి జిల్లాలో కొందరిపై కేసులు కూడా నమోదు చేశారు. అయితే ఏమైందో ఏమో గానీ మిల్లర్లపై చర్యలు నిలిచిపోవడంతోపాటు ధాన్యం కేటాయింపులో కూడా షరతులతో కూడిన సడలింపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో మిల్లర్ల వద్ద నుంచి రావాల్సిన రూ.3,300 కోట్ల బకాయిలు ఇప్పట్లో రికవరీ అయ్యే అవకాశం కనిపించడం లేదు.

తాజాగా మరో మూడు నెలల గడువు

మిల్లర్ల నుంచి బకాయి ధాన్యం వసూలుకు మరో మూడు నెలల గడువు ఇస్తూ ఈ నెల 11న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్ల క్రితం ధాన్యం ఎలాగూ ఉండదు కాబట్టి..దానికి సమానమైన నగదు వసూలు చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే 314 మంది మిల్లర్లు ఇప్పటికే మొండికేయగా, మూడు నెలల కాలంలో ఎంత మంది చెల్లిస్తారో తెలియని పరిస్థితి. కఠిన చట్టాలను ప్రయోగిస్తే మిల్లర్లు తిన్న సొమ్ము కక్కేందుకు అవకాశం ఉన్నా, ఆ దిశగా ప్రభుత్వం కదలడం లేదు.



అన్ని గొప్ప ఆలోచనలూ... నడుస్తున్నప్పుడు పురుడు పోసుకుంటాయి.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 17 మార్చి 2025

త్రిభాషా వివాదం

విశ్వంలో ప్రతిదీ అద్భుతమే. మన పుట్టుక, పరిణామం, మెదడు, మాటతో సహా అన్నీ అద్భుతాలే. అద్భుతాల మధ్య జీవించడం అలవాటుగా మారి, వాటిని చటుక్కున గుర్తించం. అలాంటి అద్భుతాలలో మాట్లాడగలగడం ఒకటి. జీవపరిణామక్రమంలో, డెబ్బై వేల సంవత్సరాల క్రితం మనిషిలో మాట జన్యువు అభివృద్ధి చెంది, మాట్లాడడం నేర్చాడని శాస్త్రవేత్తలు అంటారు. మాటలన్నీ భాషగా మారి, ఆ భాష క్రమంగా అనేక భాషలుగా విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజున వేల సంఖ్యలో భాషలున్నాయి. ఒక్క మనదేశంలోనే భాషలు, యాసలు కలసి రెండువేలకు పైగా లెక్కకొచ్చాయి. వాటిలో లిపిలేనివీ ఉన్నాయి. తెలుగుతో సహా, కేవలం 22 భాషలనే రాజ్యాంగం గుర్తించింది. ఆ విధంగా భాషల మధ్య స్వాభావికంగానే ఆధిపత్యం, అసమానతలు ఉన్నాయన్నమాట.

బ్రిటిష్ పాలనతో ఇంగ్లీషు వచ్చి చేరింది. స్వతంత్రులమయ్యాక దానిని పక్కన పెట్టి దేశీయమైన ఒక భాషను జాతీయభాషగా చేసుకోవాలన్న ఆలోచన వచ్చి, హిందీ అందుకు అనువుగా కనిపించింది. ఇంగ్లీషును వెంటనే పక్కన పెట్టలేని స్థితిలో పాఠశాల, కళాశాలల స్థాయిలో ఇంగ్లీషు, మాతృభాష, హిందీ అనే త్రిభాషా సూత్రాన్ని కేంద్రం అమలులోకి తెచ్చింది. హిందీని వ్యతిరేకిస్తూ తమిళులు ఉద్యమించడంతో కేంద్రం మెట్టుదిగి ఇంగ్లీషు, తమిళం అనే ద్విభాషాసూత్రాన్ని వారు అమలు చేసుకోడానికి అవకాశమిచ్చింది. ఇప్పుడు మళ్ళీ కేంద్రం త్రిభాషా సూత్రం అమలు దిశగా వివిధ మార్గాలలో తమిళనాడుపై ఒత్తిడి తేవడం ప్రారంభించింది. అది చినికి చినికి పెద్ద రాజకీయ వివాదంగా పరిణమించడం చూస్తున్నాం.

ఇదంతా విద్యాలయాల స్థాయిలో మూడు భాషలను నేర్పడం గురించి! నిజానికి భాష, లేదా భాషలు నేర్చుకోవడమనేది ఆసక్తీ, అభిరుచులతోనూ; అంతకన్నా అత్యవసరంగా ఉపాధితోనూ, అందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాలకూ, విదేశాలకూ వెళ్లగలగడంతోనూ ముడిపడినది. జాతీయ సమైక్యత కోసమే అయినా అన్యభాషా బోధనను సిలబస్‌లో భాగం చేసినప్పుడు, అందులో విద్యార్థి ఆసక్తి, అభిరుచులకు బదులు నిర్బంధానిదే పై చేయి అవుతుందనీ, అలాంటి ఏ మొక్కుబడి భాషాభ్యసనమైనా విద్యార్థి దశతోనే ముగిసిపోయి నిరుపయోగమవుతుందనీ, చివరికి తమ అభిరుచికి తగిన, ఉపాధికి సాయపడే భాషకే పరిమితమవుతారనే అభిప్రాయాన్ని తోసి పుచ్చలేం.

భాషలే కాదు; ఏది నేర్చుకోవడానికైనా ఆసక్తి, అవసరాలే కీలకాలు. భాషాప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడకముందు అధికసంఖ్యాక భాషాజనమూ, సరిహద్దుల్లోని అల్పసంఖ్యాక భాషాజనమూ కూడా మాతృభాషతోపాటు మరికొన్ని భాషలు మాట్లాడే అవకాశం ఉండేది. అది ఆ భాషలపై ఆసక్తికీ, వాటిలో ప్రావీణ్యానికీ దారితీయించి పలువురికి బహుభాషావేత్తలుగా గుర్తింపునిచ్చింది. వెనకటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు తెలుగు, సంస్కృతాలతోపాటు హిందీ, కన్నడం, మరాఠీ, ఉర్దూ, పారశీక భాషల్లో అభినివేశమూ, రచన చేయగలిగిన పాండిత్యమూ ఉండేవి. భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు పదిహేడు దేశ, విదేశభాషలు తెలిసిన పండితుడిగా, రచయితగా ప్రఖ్యాతులు. ఆయన తెలుగు సాహిత్యం గురించి మాట్లాడినంత అనర్గళంగా, మరాఠీ, ఒరియా తదితర భాషా సాహిత్యాల గురించి కూడా మాట్లాడేవారు. వెనకటి పండితులలో వేలూరి శివరామశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు తదితరులు కూడా బహుభాషావేత్తలుగా ప్రసిద్ధులు. భారతీయభాషలే కాక; అనేక యూరోపియన్ భాషలు కూడా తెలిసిన పుట్టపర్తివారు గ్రీకు విషాదాంతనాటకాల నమూనాలో, సుయోధనుడు నాయకుడుగా, ఎలిజబెతెన్ ఆంగ్లంలో 'ది హీరో' అనే రచన చేశారు. విశ్వనాథవారి 'ఏకవీర'ను మలయాళంలోకి అనువదించి, కేరళ ప్రభుత్వ ఆహ్వానంపై మలయాళ పద వ్యుత్పత్తి నిఘంటు సంపాదక వర్గంలో సభ్యులుగా చేరారు. వీరందరినీ బహుభాషావేత్తలను చేసింది అభిరుచి, ఆసక్తులే తప్ప ఇతరేతర నిర్బంధాలు కావు.

అవసరమూ, ఆసక్తీ బహుభాషానైపుణ్యాలవైపు నడిపించిన ప్రముఖులలో 19వ శతాబ్దికి చెందిన హైన్రిశ్ ష్లీమన్ ఒకడు. అంతర్జాతీయ వ్యాపారవేత్తే కాక; ట్రాయ్, మైసీనియాలలో తవ్వకాలు జరిపి, తొలితరం పురాతత్వవేత్తలలో ఒకడుగా పేరొందిన ష్లీమన్ –తన మాతృభాష జర్మన్‌కు అదనంగా, గ్రీకు సహా అనేక యూరోపియన్ భాషలను నేర్చుకున్న తీరూ, చూపిన పట్టుదలా స్ఫూర్తిదాయకాలు. రైల్లో ప్రయాణిస్తున్నా, నడుస్తున్నా, ఏ పని చేస్తున్నా అతని పరభాషాభ్యాసం సమాంతరంగా సాగేది; తనున్న లాడ్జిలో, ఆ భాషకు చెందిన శ్రోతకు డబ్బిచ్చి మరీ ఎదురుగా ఉంచుకుని ఆ భాషలో ఉపన్యసించేవాడు; అది ఇతరులకు నిద్రాభంగం కలిగించేది కనుక అతను లాడ్జీలు మారవలసివచ్చేది.

ప్రేమకు భాషాభేదాలు లేకపోయినా, ప్రేమికుల మధ్య సంభాషణకు భాష తప్పనిసరి. ఆ ఇతివృత్తంతో జైలు గువో అనే రచయిత్రి చైనీస్–ఇంగ్లీష్ నిఘంటువు పేరుతో ప్రేమికుల కోసం నవల రాసింది. అందులో చ్వాంగ్ అనే చైనా అమ్మాయి లండన్ వెళ్ళి ఓ బ్రిటిష్ యువకుడితో ప్రేమలో పడుతుంది. రోజూ కొన్ని ఇంగ్లీష్ మాటలను, వాటి అర్థాలను డైరీలో రాసుకుంటూ, ప్రియుడితో సంభాషించే మేరకు క్రమంగా ఆ భాషలో నేర్పు సాధిస్తుంది. కనుక, పరభాషాభ్యసనానికి అవసరమూ, ఆసక్తీ తోడ్పడినంతగా నిర్బంధం తోడ్పడదు. దేశీయమైన ఒక ఉమ్మడి భాషను నేర్చుకోవడానికి ఇతరేతర మార్గాలు చూడాలి; అందులోనూ భాషా ప్రజాస్వామ్యానికి పెద్దపీట వేయాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.తదియ సా.4.56 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** చిత్త ప.12.41 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.6.53 నుండి 8.38 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృత ఘడియలు:** తె.5.31 నుండి 7.16 వరకు (తెల్లవారితే మంగళవారం), సంకటహర చతుర్థి.

సూర్యోదయం : 6.12
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

తగ్గేదేలే!

అభిప్రాయం



రాధికా రామశేషన్

మతం, కులం, భూమి... ఇండియాలో ఇవి ఉద్రిక్తమైన అంశాలు. భాష కూడా ఇలాంటిదే. కేవలం రాజకీయ ప్రసంగాలకు చర్చలకు పరిమితమై ఉండినట్లయితే, పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు. కానీ అది స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాత కూడా ఉద్యమాలను లేవదీసింది. భౌగోళిక సరిహద్దులను మార్చేసింది. ప్రాంతీయ అధినేతల తలరాతలు మార్చేసింది. ఉదాహరణకు సి రాజగోపాలాచారిని మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రధాన మంత్రి పీఠం నుంచి పడదోసింది.

భాషతో ఆడుకునే ఉన్మాదులకు తమిళనాడు పురిటిగడ్డగా మారింది. ఒకప్పుడు వేర్పాటువాదానికి ఊపిరిపోసింది. ఇప్పుడు అధికారం కాపాడుకోవడానికి సాధనంగా మార్చుకుంటున్నారు. ఈ రాష్ట్రంలో వచ్చే ఏడాదే ఎన్నికలు జరగబోతున్నాయి. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్... మోదీ ప్రభుత్వ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ–2020)ని తెర మీదకు తెచ్చారు. కేంద్రం నుంచి సమగ్ర శిక్షా స్కీము కింద వచ్చే రూ 2,152 కోట్ల నిధులను వదులుకోడానికి సిద్ధపడి మరీ ఆయన ఎన్‌ఈపీని తిరస్కరించారు. రాష్ట్రంలోని 14,500 మోడల్ స్కూళ్లను అప్ గ్రేడ్ చేయడం... ఈ కేంద్ర ప్రాయోజిత పథకం ఉద్దేశం.

కేంద్రం ఎన్‌ఈపీని శిలాశాసనంలా రూపుదిద్దింది. పథకంలో గొప్పగా పొందుపరచిన 'ఆశయాలు' డీఎంకేకి మోసపూరితాలుగా కనబడుతున్నాయి. 1968 ఎన్‌ఈపీలోని త్రిభాషా సూత్రాన్నే ఎన్‌ఈపీ–2020 ద్వారా తిరిగి ప్రవేశపెడుతున్నామని ఢిల్లీ పెద్దలు చెబుతున్నారు. అయితే, హిందీని రాష్ట్రాలపై రుద్దే దురుద్దేశపూర్వక ప్రయత్నంగా డీఎంకే దాన్ని పరిగణిస్తోంది. నిజానికి ఎన్‌ఈపీ– 2020 పాతదానితో పోల్చితే చాలా వరకు వెసులు బాటు కల్పిస్తోంది. ఏ రాష్ట్రం మీదా ఏ భాషనూ రుద్దే ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. పిల్లలు నేర్చుకోవలసిన మూడు భాషలు ఏవన్నదీ ఆ యా రాష్ట్రాల, ప్రాంతాల, పిల్లల ఇష్టానికే విడిచి పెట్టింది. కాకుంటే, ఈ మూడింటిలో రెండు మాత్రం దేశంలోని 'నేటివ్' భాషలు అయ్యుండాలి. అంటే రాష్ట్ర భాషకు అదనంగా మరొక భారతీయ భాషను నేర్వవలసి ఉంటుంది. అది హిందీయే కానవసరం లేదు.

రాజకీయ పెనం మీద హిందీ

నిజానికి డీఎంకే, కేంద్రం మధ్య ఘర్షణకు మూలం ఇది కాదు. తమిళనాడు రాజకీయ పెనం మీద హిందీ ఎప్పుడూ చిటపటలాడుతూనే ఉంటుంది. అయినా, స్టాలిన్ సహజంగానే ఎన్‌ఈపీని తోసిపుచ్చినప్పుడు కేంద్రం ఆయనతో చర్చలు జరిపి ఉండాలి. అలా కాకుండా రెచ్చగొట్టే విధానం అవలంబించడమే ప్రస్తుత పరిస్థితికి దారి తీసింది. కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వయంగా ముందు నిలిచి కయ్యానికి కాలు దువ్వారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాషా ప్రాతిపదికగా రాష్ట్రాల పునర్ విభజన జరగాలన్న ఉద్యమాన్ని ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఆయన స్వరాష్ట్రం ఒడిశా ముందుండి నడిపిన విషయం ఆయనకు గుర్తు లేకపోవడం విందార్హం.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

> గతంలోకీ ఇప్పటికీ తమిళుల స్పందనలో మార్పు కనబడుతోంది. అప్పట్లో హిందీ – తమిళ్ జగడం తమిళ ఓటర్లను భావోద్వేగంతో కదిలించేది. నేడు మరొక కోణం తెర మీదకు వచ్చింది. అది ఆర్థికం.

ఏ రాష్ట్రం కూడా రాజ్యాంగం కంటే ఎక్కువ కాదని హెచ్చరిస్తూ, డీఎంకే ప్రభుత్వం రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలని హితవు పలికారు. ఇది జరిగి నెల గడవక ముందే, మార్చి 11న పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయంలో 'నిజాయితీ లేని', 'మోసకారి' పార్టీ అని డీఎంకేని నిందించారు. దీనికి స్పందనగా, మంత్రి 'పొగరుబోతు' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ప్రధాన్ ఆ తర్వాత తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకున్నారు. అయినా ఫలితం లేదు. అప్పటికే ఇరు పక్షాలూ బరిలోకి దిగాయి. తమిళనాడు ప్రతిపక్ష నేత పళనిస్వామి ఈ పోరులో డీఎంకేకు మద్దతు పలికారు.

ఎప్పుడో 1937 లోనే అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రధాన మంత్రి రాజగోపాలాచారి (రాజాజీ) సెకండరీ స్కూళ్లలో హిందీని తప్పనిసరి చేయడంతో జస్టిస్ పార్టీ మండిపడింది. తలముత్తు, నటరాజన్ అనే ఇద్దరు యువ ఉద్యమకారులు పోలీసుల ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయారు. భాష కోసం ప్రాణాలొడ్డిన అమరులుగా వారు నివాళులు అందుకున్నారు. తర్వాత రాజాజీ రాజీనామా చేశారు. బ్రిటిష్ పాలకులు నాటి హిందీ నిర్బంధం ఉత్తర్వును ఉపసంహరించారు.

1965కి వద్దాం. హిందీని అధికార భాషగా అమలు చేసేందుకు కేంద్రం పెట్టిన డెడ్ లైన్ దగ్గర పడింది. మరోసారి తమిళనాడు భగ్గుమంది. రాష్ట్రం అంతటా హింస చెలరేగింది. 70 మంది అసువులు బాశారు. 1967లో అధికార భాషల (సవరణ) చట్టాన్ని, 1968లో అధికార భాషల తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించిన సందర్భంలోనూ ఉద్యమం తిరిగి ప్రాణం పోసుకుంది. హిందీకి అదనంగా ఇంగ్లీష్‌ను కూడా కమ్యూనికేషన్ భాషగా కొనసాగించేందుకు, హిందీ ఒక్కటే అధికారిక లింకు భాషగా ప్రకటించిన తొలి విధానాన్ని వాయిదా వేసేందుకు ఈ చట్టం వీలు కల్పించింది.

మూడు భాషల ఫార్ములాను తిరస్కరిస్తూ అప్పటి డీఎంకే ముఖ్యమంత్రి అన్నాదురై నాయకత్వంలో 1968 జనవరి 26న రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. తమిళాన్ని, ఇతర భాషలను అధికార భాషలుగా క్లాసిఫై చేసేవరకు ఇంగ్లీషు ఒక్కటే ఏకైక అధికార భాషగా కొనసాగితీరాలని, ఆ మేరకు రాజ్యాంగ సవరణ చేయాలని నాటి రాష్ట్ర ప్రభుత్వం తెగేసి చెప్పింది.

అయితే ఒక మాట. గతంలోకీ ఇప్పటికీ తమిళుల స్పందనలో మార్పు కనబడుతోంది. అప్పట్లో హిందీ–తమిళ్ జగడం తమిళ ఓటర్లను భావోద్వేగంతో కదిలించేది. నేడు మరొక కోణం తెర మీదకు వచ్చింది. అది ఆర్థికం. తమిళనాడు ఆర్థిక సంస్కరణల నుంచి పూర్తి ప్రయోజనం పొందింది. ప్రముఖ ఉత్పత్తి కేంద్రంగా ఆవిర్భవించింది. రాజకీయ పోరాటాలు స్థానికులు, వలసదారుల మధ్య సామాజిక సంబంధాలను ప్రభావితం చేయలేక పోవడం ఒక సానుకూల పరిణామం. 'మరాఠీ మనూస్' (మరాఠీ మాట్లాడే మనుషుల) తరహా యుద్ధోన్మాదం లేదు. అయినప్పటికీ, భాష ఒక సెన్సిటివ్ ఇష్యూనే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

నెగ్గేదెలా?

అభిప్రాయం



యామినీ అయ్యర్

లోక్‌సభలో ఐదు దక్షిణాది రాష్ట్రాల దామాషా ప్రాతినిధ్యానికి ముప్పు వాటిల్లబోతోంది. వాటి మెడపై డీలిమిటేషన్ కత్తి వేలాడుతోంది. ఈ ఉపద్రవం తప్పాలంటే కేంద్రం మెడ వంచాలి. దీనికోసం దక్షిణాది తరఫున తమిళనాడు ముందుండి కేంద్రంపై పోరాటం చేస్తోంది. భారత సమాఖ్య పట్ల ఏకీభావం ప్రతిష్టంభనలో పడింది.

ఈ నేపథ్యంలో, డీలిమిటేషన్ మరో 30 ఏళ్ల వాయిదా వేయాలని తమిళనాడు అఖిల పక్ష సమావేశం డిమాండ్ చేసింది. డబుల్ ఇంజిన్ సర్కార్, 'వన్ నేషనిజం' అంటూ బీజేపీ సమస్యను జటిలం చేస్తోంది. భాషావివాదం మీద పార్లమెంటులో మాట్లాడుతూ, తమిళనాడుకు నిజాయితీ లేదని, అనాగరిక రాష్ట్రమని నిందిస్తూ ఆ రాష్ట్రానికి విద్యానిధులు తొక్కిపట్టింది.

సమాఖ్య విషయంలో కేంద్ర ప్రభుత్వ విశ్వసనీయత కొరవడింది. కాబట్టే బీజేపీ కూటమి యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు తమిళనాడు నేతృత్వంలో కేంద్రంపై ధ్వజమెత్తుతున్నాయి. డీలిమిటేషన్ చిక్కుముడికి పరిష్కారాలు లేకపోలేదు. రాజ్యసభ స్వరూపం మార్చడం వీటిలో ఒకటి. రాష్ట్రాల సరైన ప్రాతినిధ్యానికి వేదికగా దాన్ని రూపొందించాలి. అలాగే సంఖ్యాపరంగా లోక్‌సభ సైజు పెంచడం ద్వారా, పెద్ద రాష్ట్రాలు అదనపు స్థానాలు పొందినా, ఇతరత్రా ఏ రాష్ట్రం నష్టపోకుండా చూడవచ్చు. అధిక జనాభా ఉన్న యూపీ, బిహార్ వంటి రాష్ట్రాల సరిహద్దులు మార్చడం మరో మార్గం. ఆర్థిక వృద్ధి అనివార్యతలు, రాష్ట్రాల నడుమ నెలకొన్న సామాజిక ఆర్థిక అంతరాలు సమాఖ్య స్ఫూర్తి పునాదులను బలహీన పరుస్తున్నాయి. రాష్ట్రాల పునర్ విభజన చట్టంతో భాషా సమస్య పరిష్కారమైన పిదప, సమాఖ్య ఏకీభావతకు ఎదురవుతున్న తొలి సవాలు ఇదే. దీన్ని ఎదుర్కొనేందుకు ఇప్పుడు కావల్సింది సమాఖ్య సూత్రానికి అన్ని వైపుల నుంచీ బలమైన మద్దతు.

విశ్వాసం కల్పించాల్సింది కేంద్రమే!

చరిత్ర చూసినట్లయితే, పాలనలోనూ, నిధుల పరంగానూ కేంద్రీకృత విధానాలే ఉన్నాయి. సంకీర్ణ రాజకీయాలు రాజ్యమేలుతున్న రోజుల్లో సైతం ప్రాంతీయ పార్టీలు పాత వ్యవస్థను సవాలు చేయలేదు. దీంతో సమాఖ్య సూత్రం గట్టిగా వేళ్ళూన లేదు. ద్రవ్యపరంగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణ తగ్గలేదు. పన్నుల్లో 50 శాతం రాష్ట్రాలకు పంచాలని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ రాష్ట్రాల తరఫున కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అయితే ఇది రాజకీయ పటాటోపంగానే మిగిలి పోయింది. ఆ రోజుల్లో యథాతథ స్థితిని అనుసరించడమే రాజకీయ సంస్కృతిగా ఉండేది. పేద రాష్ట్రాలకు జాతీయ పన్నుల్లో అధిక వాటా లభించడం తరహా సమన్యాయ సూత్రానికి రాష్ట్రాలన్నీ ఇష్టపూర్వకంగానే తలలూపాయి. ప్రాతినిధ్య అసమానతను అంగీకరించాయి.

> నియోజకవర్గాల పునర్విభజన చిక్కుముడికి పరిష్కారాలు లేకపోలేదు. రాజ్యసభ స్వరూపం మార్చడం వీటిలో ఒకటి. రాష్ట్రాల సరైన ప్రాతినిధ్యానికి వేదికగా దాన్ని రూపొందించాలి.

సమాఖ్య ఏకాభిప్రాయం మీద ఆర్థిక వృద్ధి ప్రభావం పడుతోంది. పన్నుల హేతుబద్ధీకరణ, నియంత్రిత మార్కెట్లు, రాష్ట్రాల సరిహద్దులు దాటి విస్తరించే సేవలు వంటి అవసరాలకు కేంద్రీకృత వ్యవస్థ ఎన్నో రకాలుగా ఉపయుక్తం అవుతుంది. ఇలా జరగడం వల్ల రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కూడా అంతే స్థాయిలో తగ్గుతుంది. నిధుల పంపిణీ పరంగా కొత్త వివాదాలు ఉత్పన్నమవుతాయి. ఈ వివాదాలను విశ్వసనీయంగా పరిష్కరించే శక్తి కేంద్రానికి మునుపటి కంటే ఎక్కువ అవసరమవుతుంది.

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానం లోకి మారడం వల్ల ఉత్పన్నమైన వివాదాలు ఇందుకు నిదర్శనం. రాష్ట్రాలు తమ పన్ను విధింపు హక్కును వదులుకోవడంతో, పన్ను ఆదాయంలో తమ వాటా ఎంత అన్నది ప్రధానంగా మారింది. రాష్ట్రాల నడుమ ఆర్థిక అంతరం హెచ్చింది. ఆర్థికంగా బలమైన దక్షిణాది రాష్ట్రాలు సమన్యాయాన్ని సవాలు చేయసాగాయి. 16వ ఫైనాన్స్ కమిషన్ ఎదుట కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య లేవనెత్తిన అంశం ప్రస్తావనార్హం: 'కర్ణాటక సమకూర్చే ప్రతి రూపాయిలో ప్రస్తుత ఫార్ములా ప్రకారం తిరిగి వెనక్కు వచ్చేది కేవలం 15 పైసలు' అని ఆయన వాపోయారు. తమిళనాడు కూడా ఇదే వాదన చేసింది. డీలిమిటేషన్ మీద ఆందోళనలు సైతం అదే మాదిరివి.

భిన్న ప్రాంతాల నడుమ ఆర్థిక అసమానతలు పెరిగిపోవడమే లక్షణంగా మారిన ఈ దేశంలో ఈ సమదృష్టి సూత్రం ఎంతవరకు ఆచరణ సాధ్యం? కానప్పుడు, పన్ను ఆదాయాల పంపిణీ ఫార్ములాను సంతులన పరచుకుంటూ అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలకూ కలిపి ఒక ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేయడం వంటి వేరే మార్గాలు కేంద్రానికి లేవా? అలాగే సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి ఉన్నామన్న విశ్వసనీయ సంకేతం ఇవ్వాల్సిన, కొత్త ఏకాభిప్రాయాన్ని తీసుకురావల్సిన బాధ్యత కేంద్రం మీదే ఉంటుంది.


సమాఖ్య విధానం పట్ల బీజేపీ ఒంటబట్టించుకున్న అసహనం సమస్య పరిష్కారాన్ని జటిలం చేస్తోంది. స్వయంప్రతిపత్తి గల జమ్ము – కశ్మీర్, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు గుంజుకుని, వాటిని కేంద్రం పెత్తనం కిందకు తెచ్చుకోవడం వల్ల ఏర్పడిన పరిణామాలు, రాష్ట్రాలకు పన్నుల్లో దక్కాల్సిన వాటాను తనకు మాత్రమే దఖలు పడే సెస్సులు, సర్ చార్జీల విధింపు ద్వారా కుదించివేయడం, అలాగే కేంద్రం సేవలో ఉండేలా కొత్త పాలనా సంస్కృతిని ప్రోత్సహించడం... ఇవన్నీ సమాఖ్య పట్ల కేంద్ర అసహనానికి నిదర్శనాలు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాలు కేంద్రంపై రాజకీయంగా ధ్వజమెత్తడం, రాజీలేని వైఖరి ప్రదర్శించడం మినహా మరేం చేయగలవు? సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలు తమ హక్కుల కోసం బేరసారాలు జరిపే హక్కు ఎన్ని పరిమితులకు లోబడి ఉందో ప్రస్తుత డీలిమిటేషన్ చిక్కుముడి వెల్లడిస్తోంది. డీలిమిటేషన్‌ను ఎంతకాలం వీలైతే అంతకాలం వాయిదా పడేలా చేయాలన్న స్టాలిన్ ఆలోచన ఫలితమే ప్రస్తుత ప్రతిష్టంభన! ఎంతో కష్టపడి సాధించుకున్న అమూల్యమైన భారత సమాఖ్య ఈ క్రమంలోమరింత బలహీన పడుతుంది.

వ్యాసకర్త బ్రౌన్ యూనివర్సిటీలో విజిటింగ్ సీనియర్ ఫెలో
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఇన్ బాక్స్

తొలితరం దళిత కవి

అంటరానితనంపై పోరు సలిపిన తొలి తరం దళిత కవి కుసుమ ధర్మన్న. సంఘసంస్కరణ అభిలాష కలిగిన ఆయన అంబేడ్కర్ నుంచి స్ఫూర్తి పొందారు. అలాగే కందుకూరి వీరేశలింగం ద్వారానూ ప్రభావితమయ్యారు. 'మాకొద్దీ నల్ల దొరతనం' అంటూ నినదించిన ఆయన జాతిని మేల్కొల్పే దిశగా ఎన్నో రచనలు చేశారు. 'నిమ్న జాతి ముక్తి తరంగిణి', 'నల్ల దొరతనం', 'హరిజన శతకం' వంటివి ఆయన కలం నుంచి జాలువారినవే!



కుసుమ ధర్మన్న

రాజమహేంద్రవరంలో 1900 మార్చి 17న జన్మించారు ధర్మన్న. సంస్కృతం, తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూలలో పాండిత్యం కలిగిన వ్యక్తి. బహుముఖీనమైన ధర్మన్న ప్రతిభ ప్రధానంగా వైద్యరంగం, సాహిత్య సృజన, కళారంగం, పత్రిక నిర్వహణ, వాక్పృత్వం రూపంలో విస్తరించింది. వైద్య విద్వాన్ పరీక్ష ఉత్తీర్ణుడు అయిన ధర్మన్న తన వైద్యాన్ని గ్రామీణులకు, పేద దళితులకు అందించిన ప్రజా వైద్యుడు. ఆయన ఆధునిక ప్రజా వాగ్గేయకారుడు. ధర్మన్న తొలి రోజుల్లో గాంధీ సిద్ధాంతాల వైపు చూసినా... దళిత విముక్తికి అంబేడ్కర్ శరణ్యమని నమ్మి అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. 'జయభేరి' పత్రికను స్థాపించి తొలి దళిత పత్రిక సంపాదకులయ్యారు. 1925 నుండి ఆంధ్ర దేశంలో అనేక ప్రాంతాల్లో జరిగిన అఖిలాంధ్ర మహాసభల్లో ధర్మన్న ఆలోచనాత్మకమైన, ఉద్వేగభరితమైన ప్రసంగాలు ఎన్నో చేశారు.

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో కవిగా, రచయితగా కుసుమ ధర్మన్న స్థానం అద్వితీయమైనది. వారి ఆశయాలను, ఆలోచనలను, ఉద్యమ స్ఫూర్తిని, సామాజిక సేవను, సమతా వాదాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది.

– దేవులపల్లి రమేశ్, సిద్దిపేట జిల్లా
(నేడు కుసుమ ధర్మన్న జయంతి)

జన్యు నిధుల అనుసంధానం కీలకం!

అభిప్రాయం



బలిజేపల్లి శరత్ బాబు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025–26 ఫిబ్రవరి ఒకటిన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రెండవ 'నేషనల్ జీన్ బ్యాంక్' ఏర్పాటును ప్రకటించారు. ఇది ఒక మిలియన్ జన్యు పదార్థాల శ్రేణులతో నిండి, భవిష్యత్తులో ఆహారం– పోషకాల భద్రత కోసం ఏర్పాటు చేయబోయే నిర్మాణంగా చెప్పుకొచ్చారు. జన్యు వైవిధ్యంపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని అధ్యయనం చేయడానికీ, వైవిధ్యాన్ని పరిరక్షించే లక్ష్యం కోసం... పబ్లిక్, ప్రైవేట్ రంగాలూ, కమ్యూనిటీలూ (వ్యక్తుల సమూహాలు, సంఘాలు, సంప్రదాయ జాతులు) కలిసికట్టుగా ప్రయత్నించవలసిన అవసరం ఉంది. అందువల్ల నిపుణులు ఈ నిర్ణయాన్ని పెద్ద ఎత్తున స్వాగతిస్తున్నారు. నూతనంగా ఏర్పడ నున్న రెండవ జీన్ బ్యాంకుతో కమ్యూనిటీ విత్తన బ్యాంకుల అనుసంధానం ద్వారా పారిశ్రామిక రంగంతో సహా సంబంధిత వ్యక్తులు, సంస్థలు (షేర్ హోల్డర్లు) అందరూ అంతర్జాతీయ ఒప్పందం (కన్వెన్షన్ ఆన్ బయోలాజికల్ డైవర్సిటీ–సీబీడీ 1993), జాతీయ జీవ వైవిధ్య చట్టం–2002 (ఎన్‌బీఏ–2002)లో పొందుపరిచిన మూడు సూత్రాలకు (పరిరక్షణ, స్థిరమైన వినియోగం, న్యాయమైన – సమానమైన లాభాల పంపిణీ) కట్టుబడి ఉండగలరన్న ఆశాభావం వ్యక్తం అవుతోంది.

జాతీయ జన్యు బ్యాంక్ అనేది భవిష్యత్ తరాలకు వివిధ పంటలు, అడవి జాతులు, అనేక రకాల చెట్ల జన్యువులను నిల్వచేసే సదుపాయం. కమ్యూనిటీ విత్తన బ్యాంకులు పంటల అభివృద్ధి, ఆహార భద్రత, స్థిరమైన సమాజ అభివృద్ధికి బిల్డింగ్ బ్లాక్‌లుగా ఉపయోగపడే స్థానిక ప్రత్యామ్నాయ జన్యు వనరులుగా గుర్తించబడ్డాయి. జన్యు వనరుల సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవి దశాబ్దాల నుండి అనధికార వ్యవస్థలుగా కొనసాగుతూనే ప్రాంతీయ కమ్యూనిటీ



లకు సంప్రదాయ విత్తన కోశాగారాలుగా పని చేస్తున్నాయి. అందులో ఉన్న వైవిధ్యభరిత జన్యు పదార్థాలను ఒక వ్యవస్థలో ఏకీకృతం చేయగలిగే కమ్యూనిటీ నిధులుగా ప్రస్తుతం సంఘటిత పడుతూ, అక్కడి వెనుకబడిన ఆదివాసీ కమ్యూనిటీ వర్గాలకు సేవలు అందిస్తున్నాయి.

ఈ కమ్యూనిటీ విత్తన బ్యాంకులు స్థానికంగా నిర్వహించబడే సంస్థలు. ఇవి విత్తనాలను సేకరించడం, నిల్వ చేయడం, కమ్యూనిటీ విత్తన అవసరాలను తీర్చడం వంటి సేవలు అందిస్తున్నాయి. అవి దేశంలోని అనేక ప్రాంతాల్లో పెద్ద–చిన్న పంటలు, ఔషధ మొక్కలు, అలాగే నిర్లక్ష్యం చేయబడి తక్కువ ఉపయోగంలో ఉన్న మొక్కల జాతులను తమ పరిధిలో అంతరించి పోకుండా రక్షణ కలిగిస్తూ ఉంటాయి. అయితే ప్రస్తుతం ఇవి సరైన నిల్వ, మౌలిక సదుపాయాలు, విత్తన శుద్ధి పరికరాలు, నిర్వహణ సిబ్బందికి శిక్షణ లేమి, ఆర్థిక మద్దతు లోటుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించవలసి ఉంది.

భారత్ తన మొదటి జాతీయ జన్యు నిధిని 1996లో జాతీయ జాతీయ జన్యు వనరుల బ్యూరో న్యూ ఢిల్లీలో ఏర్పాటు చే సింది. మొట్ట మొదటి జన్యు నిధికి ఉన్న 0.47 మిలియన్ల నమూనాల పరిరక్షణ సామర్థ్యాన్ని అధిగమించి, రెండో జాతీయ జన్యు నిధికి నిల్వ సామర్థ్యాన్ని ఒక మిలియన్ దాకా పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అయితే, దేశంలోని అధిక జీవవైవిధ్య సాంద్రత ఉన్న ప్రాంతాలలోని స్థానిక పరిరక్షకుల సంఘాలతో కమ్యూనిటీ విత్తన నిధులను జాతీయ జీన్ బ్యాంకుతో అనుసంధాన పరచడం ఒక ప్రగతిశీల ఆచరణయోగ్య కార్యక్రమం. భారతదేశంలో పశ్చిమ కనుమలు, తూర్పు కనుమలు, ఈశాన్య, అండమాన్–నికోబార్ దీవులు వంటి అనేక జీవవైవిధ్య సాంద్రత కలిగిన ప్రాంతాలు ఉన్నాయి. కనుక, ప్రస్తుత, భావితరాల ఆహార మరియు పోషకాల భద్రతా లక్ష్యాలను సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం యొక్క ఈ రెండవ జాతీయ జన్యు బ్యాంకు ఏర్పాటు చొరవలో స్థానిక పరిరక్షకులు తప్పనిసరిగా భాగస్వాములు కావాలి.

వ్యాసకర్త భారత వ్యవసాయ మండలి విశ్రాంత శాస్త్రవేత్త

ఏది శాశ్వతం?

ఒక మహారాజు ప్రపంచంలో ఎవరూ కట్టించని అద్భుతమైన భవనాన్ని నిర్మింపజేయాలనుకున్నాడు. లెక్కలేనంత ధనాన్ని ఖర్చు చేసి, దేశం నలుమూలల నుంచి గొప్ప గొప్ప శిల్పులను పిలిపించి కొన్ని సంవత్సరాలు తదేక దీక్షతో పనిచేయించి గొప్ప భవనాన్ని నిర్మింపజేశాడు. ఆ భవనం విశాలమైన గదులు, ధగ ధగ మెరుస్తున్న కాంతులతో, బంగారు తాపడాల గోడలతో, మంచి శిల్ప నైపుణ్యంతో దేవేంద్ర వైభవాన్ని తలపిస్తూ ఉంది.



జ్యోతిర్మయం

ఒక రోజు రాజు గృహ ప్రవేశ కార్యక్రమానికి ఘనంగా ఏర్పాటు చేసి, దేశం లోని రాజ ప్రముఖులను, విద్వాంసులను, వ్యాపారవేత్తలను, వాస్తు శాస్త్రజ్ఞులను ఆహ్వానించాడు. గృహ ప్రవేశం అయ్యాక, రాజు సభ ఏర్పాటు చేసి, వారితో... 'ఈ గొప్ప భవనాన్ని ఎంతో ఖర్చు చేసి కట్టించాను. ప్రపంచంలో ఇంత సర్వాంగ సుందరమైన భవనం ఇంకోటి ఉండకూడదు. అందుకని, మీలో ఎందరో ప్రతిభావంతులు ఉన్నారు. మీరు ఈ భవనాన్ని సమగ్రంగా పరిశీలించి, ఇందులో లోపాలు, దోషాలు ఏమైనా ఉంటే చెప్పండి. సవరణలు చేయిస్తాను. ఇప్పుడే తెలపండి' అన్నాడు.

రాజు మాటలు విని అక్కడ ఉన్న వారంతా ఆశ్చర్య పోయారు. ఇంత అందమైన కట్టడంలో లోపాలా? అనుకున్నారు. అయినా, రాజు మాట కాదనలేక, వారిలో శిల్పులు, వాస్తు శాస్త్రజ్ఞులు భవనమంతా చూసి ఏ లోపం లేదని నిర్ధరించారు. రాజు చాలా సంతోషించాడు. అంతలో, సభాసదులలో నుంచి ఒక సాధువు లేచి నిల్చున్నాడు. 'రాజా! ఈ భవనంలో రెండు దోషాలున్నాయి' అన్నాడు. రాజు వినయంగా అవేమిటో తెలపమన్నాడు. అప్పుడా సాధువు, 'ఈ భవనాన్ని కట్టించినవారు ఎప్పటికైనా చనిపోతారు. ఇది ఒక దోషం. ఈ భవనం కాలగర్భంలో ఎప్పటికైనా కలిసిపోతుంది. ఇది ఇంకో దోషం' అన్నాడు. అప్పుడు రాజుకు వివేకం ఉదయించింది. 'ఈ లోకంలో ప్రతిదీ నశించి పోయేదే. నశ్వరమైన భౌతిక సంపదల కోసం, తక్షణ ఆనందం కోసం ఇంత ఖర్చు చేసి ఇన్ని సంవత్సరాల సమయం వృథా చేశాను కదా. శాశ్వతమైనది దైవం ఒక్కడే! ఆ దైవం ముందు ఇవన్నీ నశ్వరాలే' అని తెలుసుకున్నాడు. రాజుతో పాటు అందరం తెలుసుకోవలసింది ఇదే! దైవ అనుగ్రహానికే మనిషి పాటుపడాల్సింది.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

● మండుటెండ... చెట్టు నీడే అండ



ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఉదయం 11 గంటలైతే చాలు జనాలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మనుషులే కాదు మూగజీవాలు సైతం ఎండకు అల్లాడిపోతున్నాయి. జైనథ్ మండలం పెండల్వాడ గ్రామ సమీపంలోని ఓ చింత చెట్టు కింద గొర్రెలు సేదతీరుతుండటమే జిల్లాలోని ఎండల తీవ్రతకు అద్దం పడుతోంది.
–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



● బిందెడు నీటికి బావిలోకి

గాంధారి (ఎల్లారెడ్డి): వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు మండుతుండటంతో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. పంచాయతీ బోరు బావులు ఎత్తిపోతుండడం, మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొంది. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సోమ్లానాయక్ తండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో.. తండావాసులు గ్రామ శివారులోని బావి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మహిళలే బావిలోకి దిగి, బిందెలలో నీటిని నింపుకొని తీసుకువెళ్తున్నారు. ట్యాంకరుతో నీటిని సరఫరా చేయాలని కోరితే. ట్రాక్టర్‌లో డీజిల్ నింపేందుకు పంచాయతీలో డబ్బులు లేవని కార్యదర్శి చెబుతున్నారని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

● మండుతున్న ఎండలు... బోసిపోయిన రోడ్లు



రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఎండల తీవ్రత కారణంగా ప్రజలు రోడ్లపైకి రావడం తగ్గించారు. ఎండ వేడిమికి తోడు వడగాలులు కూడా వీస్తుండటంతో ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో సచివాలయం వద్ద రోడ్లు ఇలా బోసిపోయి కనిపించాయి. – సాక్షి, హైదరాబాద్

క్లుప్తంగా...

హెచ్‌సీయూ భూముల రక్షణకు పోరాటం చేస్తాం

● ఏబీవీపీ నేతలు అనిల్, ఆయుష్



భూ పరిక్రమయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

రాయదుర్గం: హెచ్‌సీయూ భూములను వేలం వేసి విద్యార్థుల భవిష్యత్, పరిశోధన, పర్యావరణాన్ని ధ్వంసం చేయాలనే కుట్రలను తిప్పికొడతామని, భూముల పరిరక్షణకు పోరాటం చేస్తామని ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆయుష్‌కుమార్ అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏబీవీపీ–హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ భూపరిక్రమయాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరి స్వలాభం కోసం భూములు అమ్మేయాలనుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిపాలనకు నిదర్శనమన్నారు. క్యాంపస్‌లోని కార్గిల్ చౌక్‌లో నుంచి మొదలైన యాత్ర మష్రూమ్ రాక్ వరకు కొనసాగింది.

సారూ.. రక్షణ కల్పించండి

● కుమారుడి కర్కశత్వంపై ఠాణా మెట్లెక్కిన తల్లి



మాణెమ్మ

ధారూరు: కన్న కొడుకే వేధించడాన్ని ఆ వృద్ధురాలైన తల్లి తట్టుకోలేకపోయింది. నిత్యం భౌతిక దాడులతో పాటు మానసిక గాయాలను భరించలేకపోయింది. చివరకు ధైర్యం తెచ్చుకొని తనకు రక్షణ కల్పించాలని పోలీస్‌స్టేషన్ మెట్లెక్కింది. ఈ ఫొటోలో కనిపించే వృద్ధురాలి పేరు రాది మాణెమ్మ(70). వికారాబాద్ జిల్లా ధారూరు మండలం ధర్మాపూర్ గ్రామంలో నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరు కొడుకులు, నలుగురు కూతుళ్లు సంతానం. వీరిలో ఓ కొడుకు ఇదివరకే మృతి చెందాడు. మాణెమ్మ భర్త సైతం మృతి చెందగా.. ప్రస్తుతం ఉన్న ఒక్క కొడుకు బందెయ్యనే ఆమెకు ఆధారం. వృద్ధాప్యంలో కొడుకు ఆదుకుంటాడని భావించిన ఆ తల్లికి భంగపాటు తప్పలేదు. వ్యసనాలకు బానిసైన బందెయ్య నిత్యం మద్యం మత్తులో ఆమెను చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తల్లిని కర్రతో ఎక్కడ పడితే అక్కడ చితకబాదాడు. దీంతో దెబ్బలకు తాళలేక ఆదివారం ఉదయం మాణెమ్మ ధారూరు పోలీసులను ఆశ్రయించింది. తన కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని వేడుకుంది. బందెయ్యను పిలిపించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అనిత తెలిపారు.

యూఏఈకి ఉచిత వీసాలు

● నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు చెక్!
● యూఏఈ ప్రభుత్వరంగ సంస్థ సేవలు
● ఈనెల 21, 22 తేదీలలో ప్రత్యేక శిబిరాలు

మోర్తాడ్: నకిలీ ఏజెంట్లకు అడ్డుకట్ట వేసేందుకు యూఏఈ ప్రభుత్వరంగ సంస్థ ఏడీఎస్‌హెచ్ ఉచిత వీసాలను జారీ చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు ఇంటర్వ్యూలు నిర్వహించి అనేక మంది నిరుద్యోగులకు యూఏఈలో ఉపాధి అవకాశాలు కల్పించింది. ఆ సంస్థకు చెందిన లైసెన్స్‌డ్ ఏజెన్సీ జీటీఎం ఆధ్వర్యంలో మరోసారి వీసాల జారీ కార్యక్రమం చేపట్టింది. ఈ నెల 21, 22 తేదీలలో జగిత్యాల, నిజామాబాద్‌లలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. కేటరింగ్, సపోర్టింగ్ సర్వీసెస్ రంగంలో వలస కార్మికులకు ఉచిత వీసాలను జారీ చేయనున్నట్లు పేర్కొంది. ఈసీఎన్‌ఆర్ పాస్‌పోర్టు కలిగి, బేసిక్ ఇంగ్లిష్ మాట్లాడేవారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని జీటీఎం సంస్థ చైర్మన్ సతీశ్‌రావు కోరారు. 250 మందికి వీసాలు జారీ చేసే అవకాశం ఉందన్నారు. భారతీయ కరెన్సీలో రూ.23 వేల వేతనం, ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. వీసాల కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వీసాల జారీతో పాటు యూఏఈకి వెళ్లడానికి విమాన టికెట్‌ను సంస్థే ఉచితంగా సమకూరుస్తుందని వెల్లడించారు. ఆసక్తిగలవారు 86868 60999 (నిజామాబాద్), 83320 62299 (ఆర్మూర్), 83320 42299 (జగిత్యాల), 93476 61522 (సిరిసిల్ల) నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకుని టోకెన్లు పొందాలని సూచించారు.

పరిహారం తేల్చకుండానే ... వరుస నోటిఫికేషన్లు!

● రూ. కోట్ల విలువైన భూములకు రూ.25 లక్షలలోపే ఇస్తారా ?
● ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
● ఇటీవల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు 1004.22 ఎకరాల భూమి సేకరణ
● మొన్న తిమ్మాపూర్‌లో 567 ఎకరాలు, నాగిరెడ్డిపల్లిలో 195.05 ఎకరాలు
● నిన్న కొంగరకుర్దులో 277.06.. తిమ్మాపూర్‌లో 366.04 ఎకరాలు
● తాజాగా మొండిగౌరెల్లిలో 821.11 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్



మొండిగౌరెల్లి గ్రామంలో ఎకరాకు రూ. కోటి వరకు ధర పలుకుతున్న పట్టా భూములు ఇవే

సాక్షి, రంగారెడ్డిజిల్లా/యాచారం : ఫ్యూచర్ సిటీ రాకతో తమ దశ తిరిగిపోతుందని భావించిన రైతుల్లో ఇప్పుడు రంది మొదలైంది. రూ. కోట్లు పలికే భూములకు పరిహారం ఎంతో తేల్చకుండా..వరుసగా వస్తున్న భూసేకరణ నోటిఫికేషన్లు రంగారెడ్డి జిల్లా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రాత్రికిరాత్రే నోటిఫికేషన్లు జారీ చేస్తూ బలవంతంగా భూములు లాగేసుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ హంగులతో ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఫార్మాసిటీ పేరుతో గత ప్రభుత్వం సేకరించిన 13,973 ఎకరాలుసహా మొత్తం 30 వేల ఎకరాల్లో ఈ ఫోర్త్‌సిటీని నిర్మించాలని ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే 56 రెవెన్యూగ్రామాలతో ఎఫ్‌సీడీఏ ఏర్పాటు చేసి, ప్రత్యేక పాలక మండలిని కూడా ప్రకటించింది. అయితే ఫోర్త్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు, ఐటీ, ఇండస్ట్రియల్ పార్కుల పేరుతో ప్రభుత్వం మరికొంత భూమిని సేకరిస్తోంది.

● గత డిసెంబర్‌లో కందుకూరు మండలం తిమ్మాపూర్ సర్వే నంబర్ 38లో 350 ఎకరాలు, సర్వే నంబర్ 162లో 217 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది.
● ఫిబ్రవరి మొదటివారంలో మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లిలో ఇండస్ట్రియల్, ఐటీపార్కు స్థాపనకు 198.21 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వం భావించి, 195.05 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది.
● మార్చి 13న కందుకూరు మండలం తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 9లోని 439 మంది రైతుల నుంచి 366.04 ఎకరాలు సహా మహేశ్వరం మండలం కొంగరకుర్దు సర్వే నంబర్ 289లోని 94 మంది రైతుల నుంచి 277.06 ఎకరాల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది.
● రవాణా కోసం ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 13 నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు 41.05 కిలోమీటర్లు...330 ఫీట్ల రోడ్డు నిర్మించనున్నట్టు ప్రకటించి, ఆ మేరకు ఇటీవల 4,725 మంది రైతుల నుంచి 1004.22 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసి, ఇప్పటికే ఆయా భూముల్లో హద్దురాళ్లను కూడా నాటే పని చేపట్టింది. తమకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా హద్దురాళ్లు నాటడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.
● తాజాగా యాచారం మండలంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం 638 మంది రైతుల నుంచి 821.11 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. మొండిగౌరెల్లి రైతులు ఇదే అంశంపై ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.2 కోట్లకుపైగా పలుకుతుండగా, ప్రభుత్వం రూ.25 లక్షల లోపే నష్ట పరిహారం చెల్లించే పరిస్థితి ఉండటంతో రైతులు తమ భూములను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు.

భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసిన భూముల్లో ఎలాంటి క్రయ విక్రయాలు చేయరాదని, బోరుబావులు తవ్వరాదని, నిర్మాణాలు చేపట్టకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో మహేశ్వరం, యాచారం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మంచాల, కడ్తాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.కోటి ఇస్తామన్నారు



మొండిగౌరెల్లి రెవెన్యూ పరిధిలోని మా కుటుంబ సభ్యుల పేర్ల మీద 9 ఎకరాల పట్టా భూమి ఉంది. ఫ్యూచర్‌సిటీ ప్రచారంతో రెండు నెలల కింద ఎకరా భూమిని రూ. కోటికి అడిగారు. మరింత ధరలు పెరుగుతాయనే ఆశతో భూమిని అమ్ముకోలేదు. ఆ భూమికి సైతం భూసేకరణ నోటిఫికేషన్ వచ్చింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.
– మర్పల్లి అంజయ్య యాదవ్, రైతు మొండిగౌరెల్లి

పైలెట్ ప్రాజెక్టు అన్నారు



మా ఊర్లో రైతులు ఎక్కువగా పూదీనాతోపాటు పలు రకాల ఆకు కూరలు పండిస్తారు. దీంతో ఈ గ్రామాన్ని రైతు సంక్షేమ కమిషన్ తాజాగా రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఇవే భూములను పారిశ్రామిక అవసరాల కోసం సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు.
– మేకల యాదగిరి రెడ్డి, రైతు మొండిగౌరెల్లి

వెంచర్ చేసిన భూమినీ వదలలేదు



మొండిగౌరెల్లిలో సర్వేనంబరు 76,77, 78లలో దాదాపు 20 ఎకరాలకు పైగా పట్టా భూమిని కొనుగోలు చేసి టీడీసీపీ వెంచర్ చేశాను. కొన్ని ప్లాట్లు విక్రయించాను. నేడు ఆ సర్వే నంబర్లు మొత్తం భూమిని సేకరణకుగాను నోటిఫికేషన్ ప్రకటించడంతో గుండె పగిలినట్టయ్యింది. ఏం చేయాలో తోచడం లేదు.
– బ్రహ్మచారి, రియల్ వ్యాపారి కొహెడ

వచ్చే మూడు రోజులూ అధిక ఉష్ణోగ్రతలే

● చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీల కంటే అధికం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో సాధారణంకంటే 2 నుంచి 4 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజులు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ సూచించింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో వడగాడ్పులు వీచే అవకాశముందని హెచ్చరించింది. ఆదివారం రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 40.3 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 19.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఆదిలాబాద్‌లో సాధారణం కంటే 3.4 డిగ్రీ సెల్సియస్ అధికంగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, భద్రాచలం, హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లో 3 డిగ్రీల చొప్పున అధికంగా ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం చాలా ప్రాంతాల్లో 1 నుంచి 3 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి.

ఆదివారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు ఇలా(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	40.3	24.7
భద్రాచలం	40.0	24.0
దుండిగల్	39.1	22.7
హకీంపేట్	39.1	22.8
హనుమకొండ	38.0	21.5
హైదరాబాద్	39.2	22.7
ఖమ్మం	38.6	22.6
మహబూబ్‌నగర్	40.0	23.1
మెదక్	39.4	19.2
నల్లగొండ	37.0	21.4
నిజామాబాద్	40.1	23.2
రామగుండం	38.4	20.6

కానరాని కార్మికుల జాడ

● ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో 23 రోజులుగా సహాయక చర్యలు
● అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ప్లాట్‌ఫారాల తొలగింపు
● పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని రోబోల సేవలు



ప్రమాద స్థలంలో సింగరేణి రెస్క్యూ బృందాలు ఏర్పాటు చేసిన టైగర్ సేఫ్టీ కాగ్స్

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల ఆచూకీ కోసం చేపట్టిన సహాయక చర్యలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. అయితే, ఆదివారం నాటికి ప్రమాదం జరిగి 23 రోజులు గడిచినా కార్మికుల జాడ మాత్రం చిక్కలేదు. కడావర్ డాగ్స్ గుర్తించిన డీ2 పాయింట్ వద్ద కార్మికుల ఆచూకీ లభించకపోవటంతో డీ1 వద్ద తవ్వకాలు జరుపుతున్నారు. ఇక్కడ టీబీఎంకు సంబంధించిన భారీ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డుగా ఉండటంతో దాని భాగాలను తొలగించే ప్రక్రియ చేపట్టారు. సోమవారం సాయంత్రం వరకు డీ1 పాయింట్ వద్ద అడుగు మేర తవ్వకాలు పూర్తయ్యే అవకాశం ఉంది. సుమారు 9 మీటర్ల మేర పేరుకున్న బురద, మట్టి, శిథిలాలను పూర్తిగా తొలగిస్తే కార్మికుల ఆచూకీ బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

రోబోటిక్ మెషీన్లతో..

ప్రమాద స్థలంలో చివరి 40 మీటర్ల స్థలంలో రోబోటిక్ మెషీన్లతో సహాయక చర్యలు చేపట్టారు. ఈ మెషీన్లకు అనుసంధానంగా పనిచేసే 30 హెచ్‌పీ మోటార్లు, వ్యాక్యూమ్ ట్యాంకర్లను వినియోగంలోకి తెచ్చేందుకు నిపుణులు ప్రయత్నిస్తున్నారు. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తేనే మట్టి, బురద తొలగింపు వేగవంతం అవుతుందని చెబుతున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం సహాయక బృందాలకు కల్పించిన వసతి, భవనాలను సందర్శించిన కలెక్టర్.. ఏర్పాట్లు, భోజన వసతులపై ఆరా తీశారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

● పురుగు మందు తాగి బలవన్మరణం ● అనాథలైన నలుగురు చిన్నారులు ● సిద్దిపేటలో ఘటన



నాగరాజు దంపతులు (ఫైల్)

సిద్దిపేట కమాన్/తొగుట(దుబ్బాక): భార్య ఆత్మహత్యకు పాల్పడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త కూడా పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇద్దరూ ఒకే రోజు మృతి చెందడంతో వీరి నలుగురు పిల్లలు అనాథలయ్యారు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేటకు చెందిన కెమ్మసారం నాగరాజు (35), భాగ్య (32) దంపతులు. కూలి పనులు చేసుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థిక పరిస్థితులపై కొద్ది రోజులుగా ఇంట్లో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరగ్గా, ఆవేశంతో భాగ్య పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త నాగరాజు అక్కడినుంచి వెళ్లిపోయాడు. తర్వాత తాను కూడా పురుగు మందు తాగానని బంధువులకు ఫోన్ ద్వారా తెలిపాడు. ఆందోళనకు గురైన బంధువులు చుట్టుపక్కల వెతకగా నాగరాజు ఆచూకీ తెలియరాలేదు. విషయాన్ని పోలీసులకు చెప్పడంతో వారు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు సమీపంలో చెట్ల మధ్య విగతజీవిగా పడి ఉన్నట్లు గుర్తించారు. దంపతులిద్దరూ ఒకే రోజు మృతి చెందడంతో వీరి నలుగురు పిల్లలు మీనాక్షి (9), మహేశ్ (7), లక్కీ (5), శ్రవణ్ (4) అనాథలయ్యారు. పిల్లలు, కుటుంబ సభ్యుల రోదనలు అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించాయి. పోలీసులు నాగరాజు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మోతె తహసీల్దార్ అరెస్ట్


● భూరికార్డుల తారుమారు కేసులో ఇద్దరు ఆర్‌ఐలు కూడా...

మోతె: భూరికార్డులు తారుమారు చేసి నకిలీ పాసుపుస్తకాలు సృష్టించిన కేసులో సూర్యాపేట జిల్లా మోతె తహసీల్దార్‌తోపాటు మరో ఆరుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ధరణిలో భూరికార్డులు మార్చినట్లు ఆరోపణలు రావడంతో ఫిబ్రవరిలో మోతె తహసీల్దార్ కె.సంఘమిత్రను సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా భాషపాక శ్రీకాంత్‌ను నియమించారు. మార్చి 4న కలెక్టర్ మోతె రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. పాత పహాణీ రికార్డుల్లో పేర్లు లేకున్నా ఉన్నట్లుగా సృష్టించి, ధరణిలో మిస్సింగ్ సర్వే నంబర్ల కింద 11 దరఖాస్తులు చేయించి, భూమి ఉన్నట్లుగా తప్పుడు పాసుపుస్తకాలు సృష్టించినట్లు గుర్తించారు. దీంతో ఇద్దరు ఆర్‌ఐలను కూడా కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు 21 మంది నిందితులను గుర్తించారు. వీరిలో కె.సంఘమిత్ర, ఆర్‌ఐలు ఎస్‌కే మన్సూర్ అలీ, జె.నిర్మల, జి.నాగరాజు(ధరణి ఆపరేటర్), ఎ.మల్లేష్ (మీసేవ నిర్వాహకుడు), కోట స్టాలిన్ కుమార్ రెడ్డి (జిరాక్స్ షాపు నిర్వాహకుడు), కొండల్‌రావు (దస్తావేజు రైటర్)ను మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి అరెస్ట్ చేశారు. వీరిని సూర్యాపేట కోర్టు ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అపూర్వ రవళి ముందు హాజరుపర్చారు. తర్వాత మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మిగిలిన 14 మందిని తదుపరి దర్యాప్తు అనంతరం అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

111 జీవో స్థలాలను క్రమబద్ధీకరిస్తారా?

మెయినాబాద్ మండలం ఎంకేపల్లె గ్రామంలో 600 గజాల స్థలం ఉండగా, భూ యజమాని 2020 అక్టోబర్ నెలలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. తాజాగా రేవంత్ సర్కారు ఎల్‌ఆర్‌ఎస్‌లను క్రమబద్ధీకరిస్తుండంతో అధికారులు డాక్యుమెంట్లను స్క్రూటినీ చేసి ఫీజు రూ.83,651గా నిర్ధారించారు. 25 శాతం రాయితీ రూ.20,912 పోను, మిగిలిన రూ.61,738 చెల్లించాలని ఈనెల 10న దరఖాస్తుదారునికి ఫీజు ఇంటిమేషన్ లెటర్ పంపారు. దీంతో ఆయన రుసుము చెల్లించేశాడు. ట్విస్ట్ ఏంటంటే.. సంబంధిత స్థలం 111 జీవో పరిధిలోకి వచ్చే 84 గ్రామాల్లో ఒకటి కావడమే.

● క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే ఫీజుల జారీ
● రుసుములు చెల్లిస్తున్న పలువురు స్థల యజమానులు
● తిరస్కరణకు గురైతే చెల్లించిన ఫీజులో 10 శాతం కట్



సాక్షి, హైదరాబాద్: హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాల పరిధిలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు 27 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వం 111 జీవోను తీసుకొచ్చింది. ఇప్పటికే దీని పరిధిలోని 84 గ్రామాల్లో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించకుండానే దరఖాస్తుదారులకు ఫీజు ఇంటిమేషన్ పంపిస్తున్నారు. దీంతో ఇదే అదనుగా భావిస్తున్న దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించి, ప్రొసీడింగ్స్ కోసం ఎదురుచూస్తున్నారు హెచ్‌ఎండీఏ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి మూడు లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనెల 31 లోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వర్తిస్తుండటంతో చాలామంది ముందుకొస్తున్నారు. ఇప్పటికే ఎలాంటి వివాదాలు, న్యాయపరమైన చిక్కులు లేని లేఅవుట్లలో ప్లాట్లకు ఆటోమేటిక్‌గా ఫీజు చెల్లించాలని ఆన్‌లైన్‌లో నోటీసులు అందుతున్నాయి.

రిజెక్ట్ అయితే 10 శాతం కట్..

గతంలో అన్ని డాక్యుమెంట్లు సరిగ్గా ఉంటేనే ఫీజు ఇంటిమేషన్ లెటర్‌ను అధికారులు పంపించేవారు. కానీ ఇప్పుడు డీఫాల్ట్‌గా ఫీజు ఇంటిమేషన్ లింక్‌లను పంపిస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు అన్ని రకాలుగా పరిశీలించిన తర్వాతే ఫీజు చెల్లించడానికి అవకాశం ఇవ్వాలి. కానీ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దరఖాస్తుదారుడు ఫీజు చెల్లించిన తర్వాత ఒకవేళ తిరస్కరణకు గురైతే చెల్లించిన ఫీజులో 10 శాతం ప్రాసెసింగ్ చార్జీల కింద కట్ చేసుకొని మిగిలిన మొత్తం ఇస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టింది. ఆదాయం కోసమే దరఖాస్తుదారులకు ముందు ఫీజు ఇంటిమేషన్ పంపించి, రుసుములు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

తిరస్కరణలో శాస్త్రీయత లోపం

ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లేఅవుట్లు, స్థలాలు చెరువులు, కాల్వలు, నీటి వనరులకు 200 మీటర్ల దూరంలో ఉంటే వాటిని నిషేధిత జాబితాలో చేర్చుతున్నారు. అయితే ఈ ప్రక్రియను సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్ ఆధారంగా నీటి వనరులను గుర్తిస్తుండటం శాస్త్రీయంగా సరైన పద్ధతి కాదని పీర్జాదిగూడ మాజీ మేయర్ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆయా మ్యాప్‌లు పురాతన కాలం నాటివని, పట్టణీకరణ అయ్యాక విలేజ్ మ్యాప్‌లలో పిల్ల కాల్వలు, వాగులు కనిపించవని తెలిపారు. ఈ కారణంగా ఆయా దరఖాస్తులను తిరస్కరించడం సరైంది కాదన్నారు. కొన్ని లేఅవుట్లు నీటి పరిధిలో లేకున్నా, మాస్టర్‌ప్లాన్‌లో తప్పుల కారణంగా నిషేధిత జాబితాలోకి చేరాయి. ఇలాంటి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు చర్యలు తీసుకోవాలి. సిబ్బంది కొరత, దరఖాస్తుల పరిశీలనలో సిబ్బంది తీరిక లేకుండా ఉండటంతో ఆటువైపు ఎవరూ చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులను మోసగిస్తున్న విత్తన సంస్థలు

● సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొన్ని విత్తన ఉత్పత్తి సంస్థలు రైతులను మోసగిస్తున్నాయని సీడ్ కార్పొరేషన్ ఎండీ సుంకెట అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం హాకాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో కొన్ని బహుళ జాతి సంస్థలు నకిలీ విత్తనాలు సరఫరా చేసి.. రైతులకు నష్టం కలిగిస్తున్నాయని తన పర్యటనలో వెలుగులోకి వచ్చిందన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో సింజెంట, హైటెక్, బియర్ సంస్థలు రైతులను మోసం చేశాయని ఆరోపించారు. బహుళ జాతి సంస్థలు ఆర్గనైజర్లకు ఏ ధర ఇస్తున్నారో సంస్థలు, రైతులకు తెలియదని చెప్పారు. దిగుబడి ఎంత వస్తుందో ఆర్గనైజర్లు, సంస్థలు రైతులకు ఎక్కడా చెప్పడం లేదన్నారు. ఆర్గనైజర్లు రైతులకు కావలసిన ఇతర మందులు ఇచ్చి.. వారినుంచి 5 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారని వెల్లడించారు. ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకం ఒప్పందం చేసుకొని డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్గనైజర్లు సురేశ్ బాబు, నర్సింహమూర్తి.. ఇద్దరు రైతులకు నకిలీ విత్తనాలు ఇచ్చి.. ప్రాణాంతకమైన పురుగు మందులు ఉపయోగించేలా చేస్తున్నారని తేలిందని చెప్పారు. తద్వారా ఇద్దరు రైతులు కాళ్లు, చేతులు పడిపోయి మంచాన పడ్డారని, ఒక రైతు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మందులు వాడిన మొక్కజొన్న తిన్న 20 పశువులు చనిపోయాయన్నారు.

శాంతికి యత్నించినప్పుడల్లా... నమ్మకద్రోహమే!

పాక్ తీరుపై ప్రధాని ధ్వజం

- ఇకనైనా తీరు మారాలని హితవు
- రష్యా, ఉక్రెయిన్ చర్చించుకోవాలి
- ఏదో సాధించేందుకే పైవాడు పంపాడు
- ప్రతి అడుగులోనూ నాకు తోడున్నాడు
- 140 కోట్ల భారతీయులే నా శక్తి, బలం

లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్‌లో మోదీ



న్యూఢిల్లీ: దాయాది దేశానికి విశ్వసనీయత అనేదే లేదని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. పాకిస్తాన్‌తో శాంతి కోసం ప్రయత్నించిన ప్రతిసారీ వైరం, నమ్మకద్రోహమే ఎదురయ్యాయన్నారు. ఇక పరస్పర విశ్వాసాన్ని పాదుగొల్పాల్సిన బాధ్యత పాక్‌దేనని స్పష్టం చేశారు. అమెరికా కృత్రిమ మేధ పరిశోధకుడు అలెక్సీ అలెగ్జాండ్రోవిచ్ ఫ్రిడ్‌మ్యాన్ నిర్వహించిన 'లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్' పాడ్‌కాస్ట్‌లో మోదీ పాల్గొన్నారు. తన బాల్యం, చాయ్‌వాలా రోజులు మొదలుకుని చావుపుట్టుకల దాకా పలు అంశాలపై మనోగతాన్ని పంచుకున్నారు. ''నా శక్తి నా పేరులో లేదు. నా వెనక దన్నుగా నుంచున్న 140 కోట్ల పైచిలుకు భారతీయుల్లో దాగుంది'' అని అభిప్రాయపడ్డారు. ఏదో సాధించేందుకే పైవాడు నన్నిక్కడికి పంపాడు. ఆ ప్రయత్నాల్లో నేను ఏనాడూ ఒంటరిగా లేను. నన్నిక్కడికి పంపిన ఆ శక్తే అన్నివేళలా నాకు తోడుగా నిలుస్తూ వస్తోంది'' అని అభిప్రాయపడ్డారు. ''నేను శక్తిమంతుడినని ఎన్నడూ అనుకోను. అలా చెప్పుకోను కూడా. వినయంతో కూడిన ప్రధాన సేవకున్ని మాత్రమే అని చెప్పుకుంటా'' అన్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...

శాంతిపథంలో నడుస్తారనే ఆశిస్తున్నా

పాక్‌తో భారత్ ఎన్నోసార్లు శాంతియత్నాలు చేసింది. ఆ దేశంతో దౌత్య సంబంధాల మెరుగుదలకు ఎన్నడూ లేనంతగా కృషి చేశా. నా ప్రమాణస్వీకారానికి కూడా ఆహ్వానించా. కానీ ప్రతిసారీ వారి నుంచి శత్రుత్వం, నమ్మకద్రోహమే స్వాగతం పలికాయి. పాక్‌లో అస్థిరత, అశాంతి, ఉగ్రవాదం తిష్టవేశాయి. ఇప్పటికైనా మార్పొస్తుందని, వాళ్లు శాంతిపథంలో పయనిస్తారని ఆశిస్తున్నాం. పాక్ ప్రజలు కూడా శాంతి కోసం ఎదురుచూస్తున్నారు.

చర్చలతోనే పరిష్కారం

ప్రస్తుత పరిస్థితులు ఉక్రెయిన్, రష్యా మధ్య అర్థవంతమైన చర్చలకు అవకాశం కల్పిస్తున్నాయి. ముందుగా ఆ రెండు దేశాలూ చర్చించుకోవడం అవసరం. అమెరికాతో సహా ఎన్ని దేశాలు అండగా ఉన్నా యుద్ధక్షేత్రంలో పరిష్కారాలుండవని ఉక్రెయిన్ కూడా గ్రహించాలి. చర్చలు, సంప్రదింపులే మార్గం. రెండు దేశాలతోనూ నాకు సత్సంబంధాలున్నాయి. యుద్ధం పరిష్కారం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు నేరుగా చెప్పగలను.

ట్రంప్ 2.0 మరింత సిద్ధమై వచ్చారు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, నాకు మధ్య పరస్పర నమ్మకముంది. ఇరువురం జాతి ప్రయోజనాలకు పెద్దపీట వేసేవాళ్లమే. ట్రంప్‌కు తెగువ ఎక్కువ. సొంత నిర్ణయాలు తీసుకుంటారు. రెండోసారి అధ్యక్షునిగా మరింత సన్నద్ధతతో వచ్చారాయన. క్లియర్ రోడ్‌మ్యాప్‌తో ముందుకెళ్తున్నారు'' అని మోదీ అన్నారు.

చైనాతో ఉండాల్సింది స్పర్థ మాత్రమే

భారత్, చైనా మధ్య పోటీ తత్వం ఉండాల్సిందే. అది స్పర్థగానే సాగాలి తప్ప సంఘర్షణగా మారకూడదు. విభేదాలు వివాదాలు కారాదు. వాస్తవాధీన రేఖ వెంట 2020 ఏడాదికి ముందునాటి పరిస్థితులు నెలకొల్పేందుకు ఇరుదేశాలు కృషిచేస్తున్నాయి. ప్రాచీనకాలం నుంచీ ఇరుదేశాలు పరస్పరం ఎంతో నేర్చుకున్నాయి. ఒక దశలో సగం ప్రపంచ జీడీపీని ఈ రెండు దేశాలే సమకూర్చాయి.

ఆర్ఎస్ఎస్ నుంచి జీవిత పాఠాలు

ఆర్ఎస్ఎస్ వంటి గొప్ప సంస్థ నుంచి జీవిత పాఠాలు నేర్చుకోగలగడం నా అదృష్టం. అంత పెద్ద స్వచ్ఛంద సంస్థ మరోటి లేదనుకుంటా. గుజరాత్‌లో మా ఇంటి సమీపంలో ఆర్ఎస్ఎస్ 'శాఖ' నిర్వహించేటప్పుడు వినిపించే దేశభక్తి గీతాలు నాలో దేశంపట్ల ప్రేమను విపరీతంగా పెంచాయి.

మానవుని ఊహను ఏఐ చేరలేదు

ప్రతి యుగంలోనూ మనిషి సాంకేతికతతో పోటీపడ్డాడు. కృత్రిమ మేధ ఎంత శక్తిమంతమైనదైనా మనిషి ఊహాశక్తిని అందుకోలేదు. ఏఐ విస్తరణ, అభివృద్ధిలో భారత్‌ది కీలక పాత్ర. 'ఇంజనీర్లు కావాలని అమెరికాలో ప్రకటన ఇస్తే ఒక గదికి సరిపడా దరఖాస్తులొస్తాయి. అదే భారత్‌లో అయితే ఏకంగా ఓ ఫుట్‌బాల్ స్టేడియం నిండేన్ని దరఖాస్తులు వెల్లువెత్తుతాయి' అని ఒక అమెరికా కంపెనీ ఉన్నతాధికారి నాతో అన్నారు.

గోధ్రా అల్లర్లను ఎక్కువచేసి చూపారు

2002 గోధ్రా అల్లర్లను మరీ ఎక్కువ చేసి చూపారు. అవి గుజరాత్ చరిత్రలోనే అత్యంత దారుణమైన గొడవలన్నట్టుగా ప్రత్యర్థి పార్టీలు ప్రచారం చేశాయి. నిజానికి నేను సీఎం కావడానికి చాలాకాలం ముందునుంచే గుజరాత్‌లో దాదాపు ఏటా మత కల్లోలాలు జరిగేవి. కానీ 2002 నుంచి అవి పూర్తిగా ఆగిపోయాయి.

తటస్థ ఈసీ గొప్పది

భారత ఎన్నికల సంఘం చాలా గొప్పది. స్వతంత్రంగా, తటస్థంగా వ్యవహరిస్తుంది. కోట్లాది మంది పాల్గొనే ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహించే తీరును ప్రపంచదేశాలు చూసి నేర్చుకోవాలి. విశ్వవిద్యాలయాలు కేస్ స్టడీగా అధ్యయనం ఇటీవలి ఎన్నికల్లో నిప్పులు కక్కే ఎండల్లోనూ 64.6 కోట్ల మంది ఓటేశారు. ఈ సంఖ్య ఉత్తర అమెరికా జనాభా కంటే రెట్టింపు.

భారత్, పాక్ క్రికెట్ జట్లపై...

భారత్, పాకిస్తాన్ క్రికెట్ జట్లలో ఏది మెరుగైందనే అంశంపై మోదీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ''వాటిలో ఏది మెరుగో చెప్పేందుకు నేను నిపుణుడిని కాదు. కానీ కొన్నిసార్లు ఫలితాలు వాస్తవాలు చెబుతాయి. ఇటీవలే భారత్, పాక్ జట్లు ఒక మ్యాచ్ ఆడాయి. వాటిలో ఏది మెరుగైనదో ఆ ఫలితమే చెప్పిందని అనుకుంటున్నా'' అని ఛాంపియన్స్ ట్రోఫీని ఉద్దేశించి అన్నారు. ఆ మ్యాచ్‌లో పాక్ జట్టుపై భారత్ విజయం సాధించడం తెలిసిందే.

చాక్ పాడితో బూట్ పాలిష్

బాల్యమంతా దుర్భర దారిద్ర్యమే: మోదీ

తన బాల్యం దుర్భర పేదరికం మధ్యే గడిచిందని మోదీ గుర్తు చేసుకున్నారు. ''స్కూలుకు వేసుకెళ్లడానికి బూట్లు కూడా ఉండేవి కాదు. ఒకసారి చిన్నాన్న తెల్లరంగు కాన్వాస్ షూ కానుకగా ఇచ్చాడు. వాటిని పాలిష్ చేసుకోవడానికి కూడా డబ్బులుండేవి కాదు. దాంతో క్లాస్‌రూముల్లోని చాక్‌పీస్ పొడితో పాలిష్ చేసుకునేవాన్ని. కానీ పరిస్థితులను చూసి నేనెన్నడూ డీలా పడలేదు. ప్రతి దశనూ వినమ్రంగానే స్వీకరిస్తూ ముందుకు సాగా. మా నాన్న చాయ్ దుకాణానికి వచ్చేవారిని చూసి, వారి మాటలు విని ఎంతో నేర్చుకున్నా. ఆ అనుభవాల సారాన్ని ప్రజాజీవితంలో అమలు చేస్తున్నా'' అని చెప్పుకొచ్చారు.

జీవితం క్షణభంగురం

జీవితం క్షణభంగురమని, ఎన్నాళ్లు బతికినా మరణం ఖాయమని మోదీ అన్నారు. ''కనుక చావును తలచుకుని భయపడే బదులు జీవితాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి. శక్తియుక్తులన్నింటినీ ప్రపంచమేలు కోసం ధారపోయాలి. అప్పుడు ఆనందం సొంతమవుతుంది'' అని ప్రజలకు సూచించారు.

నా జీవితాన్నే మార్చేసిన ఉపవాసం

ఉపవాసం తన జీవితాన్నే మార్చేసిందని మోదీ చెప్పారు. ''ఉపవాసం సనాతన ఆచారం. దానితో లాభాలు అన్నీ ఇన్నీ కావు. జ్ఞానేంద్రియాలను పదును పెడుతుంది. ఎరుకను పెంచుతుంది. రొటీన్‌కు భిన్నంగా, సృజనాత్మకంగా ఆలోచిస్తాం. సూక్ష్మ విషయాలను కూడా గుర్తించగలం. ఇవన్నీ నా వ్యక్తిగత అనుభవాలు'' అని వివరించారు. ఈ పాడ్‌కాస్ట్ కోసం తాను 45 గంటలుగా ఉపవాసమున్నానని, మంచినీళ్లు తప్ప మరేమీ తీసుకోలేదని ఫ్రిడ్‌మాన్ చెప్పడంతో ప్రధాని నవ్వేశారు. 'నాకిది నిజంగా గొప్ప గౌరవం' అన్నారు.



ఐఎస్ఎస్‌లో కొత్త సహచరులను ఆలింగనం చేసుకుంటున్న సునీత తదితరులు

ఐఎస్ఎస్‌లోకి స్వాగతం

స్పేస్ఎక్స్ క్రూ క్యాప్సూల్‌లో వచ్చిన వ్యోమగాములకు సునీత, విల్మోర్ వెల్‌కమ్

కేప్ కనావెరాల్: తొమ్మిది నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌ను భూమికి తీసుకొచ్చేందుకు స్పేస్ఎక్స్, నాసా సంయుక్తంగా ప్రయోగించిన క్రూ క్యాప్సూల్ ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. అందులో వెళ్లిన నలుగురు వ్యోమగాములు అన్నె మెక్‌క్లెయిన్, నికోల్ అయేర్స్ (అమెరికా), తకుయా ఒనిషీ (జపాన్), కిరిల్ పెస్కోవ్ (రష్యా) ఆదివారం ఉదయం ఐఎస్ఎస్‌లో అడుగు పెట్టారు. వారికి సునీత, విల్మోర్ సాదర స్వాగతం పలికారు. స్పేస్‌స్టేషన్ హ్యాచ్‌ను తెరచిన విల్మోర్ వ్యోమనౌక గంటను మోగించి వారిని స్వాగతించారు. వారింతా పరస్పరం హత్తుకుని, కరచాలనం చేసుకుని హర్షాతిరేకాలు చేశారు. ''ఇది అద్భుతమైన రోజు. స్నేహితుల రాక మాకెంతో ఆనందాన్నిచ్చింది'' అని మిషన్ కంట్రోల్‌తో విల్మోర్ చెప్పుకొచ్చారు. ఐఎస్ఎస్‌లో నిర్వర్తించాల్సిన విధులను వారికి సునీత, విల్మోర్ కొద్ది రోజుల పాటు విడమర్చనున్నారు. అనంతరం వాళ్లు బాధ్యతలు స్వీకరిస్తారు. వారం తర్వాత సునీత, విల్మోర్ క్రూ క్యాప్సూల్‌లో భూమికి తిరిగొస్తారు. వారితో క్యాప్సూల్ ఫ్లోరిడా తీర సమీపంలో సముద్ర జలాల్లో దిగనుంది. అప్పటిదాకా ఐఎస్ఎస్‌లో 11 మంది వ్యోమగాములు సేవలందించనున్నారు. బోయింగ్ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ తొలి మానవసహిత అంతరిక్ష ప్రయోగంలో భాగంగా గత ఏడాది జూన్‌లో సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌కు వెళ్లడం తెల్సిందే. వారు ఎనిమిది రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా స్టార్‌లైనర్ సాంకేతిక సమస్యలతో ఆలస్యమైంది.

నేటి నుంచి రైసినా డైలాగ్

3 రోజుల అంతర్జాతీయ సదస్సు • 125 దేశాల నుంచి 3,500 మంది

న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయాలు, ఆర్థికాంశాలపై భారత్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ సదస్సు 'రైసినా డైలాగ్' 10వ ఎడిషన్ సోమవారం ఢిల్లీలో ప్రారంభం కానుంది. మూడు రోజులు జరిగే ఈ సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 125 దేశాలకు చెందిన సుమారు 3,500 మంది ప్రతినిధులు కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు. వీరిలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్, అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ విభాగం డైరెక్టర్ తులసీ గబార్డ్, 20 దేశాల విదేశాంగ మంత్రులతో పాటు పలువురు ప్రభుత్వాధినేతలు, సైనిక కమాండర్లు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులున్నారు. తొలిసారిగా తైవాన్ సీనియర్ భద్రతాధికారి కూడా ఇందులో పాల్గొననున్నారు. భారత్, తైవాన్‌ల మధ్య పెరుగుతున్న సహకారానికి ఇది నిదర్శనమని పరిశీలకులు చెబుతున్నారు. న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ సోమవారం కీలకోపన్యాసం చేస్తారు. వివిధ అంశాలపై కీలక చర్చలుంటాయి. వర్తమాన అంశాల్లో ప్రపంచ దేశాల మధ్య సహకారానికి ఈ సదస్సు అవకాశాలను అన్వేషిస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఢిల్లీలో అత్యంత ముఖ్యమైన ప్రభుత్వ భవనాలు, భారత ప్రభుత్వ అధికార స్థానానికి మారుపేరుగా నిలిచిన రైసినా హిల్ నుంచి ఈ సదస్సుకు రైసినా డైలాగ్ అని నామకరణం చేశారు.

37 కిలోలు, రూ.75 కోట్లు!

కర్నాటకలో భారీగా డ్రగ్స్ పట్టివేత • ఈశాన్యాన రూ.88 కోట్ల డ్రగ్స్ స్వాధీనం



కర్నాటకలో పట్టుబడ్డ డ్రగ్స్‌తో సిబ్బంది

న్యూఢిల్లీ/బనశంకరి: కర్నాటక పోలీసులు 37 కిలోల ఎండీఎంఏ (మెథిలీన్ డయాక్సీ మెథాంఫెటమైన్) అనే సింథటిక్ డ్రగ్‌ను పట్టుకున్నారు. దీని విలువ రూ.75 కోట్లని మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ఆదివారం మీడియాకు తెలిపారు. గత సెప్టెంబర్‌లో మంగళూరులో హైదర్ అలీ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 15 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో బెంగళూరులో ఓ నైజీరియా దేశస్తున్ని పట్టుకోగా రూ.6 కోట్ల విలువైన ఎండీఎంఏ దొరికింది. ఇది అంతర్జాతీయ డ్రగ్స్ దందా అని, ఢిల్లీ, బెంగళూరు విమానాశ్రయాల ద్వారా అక్రమ రవాణా జరుగుతోందని గుర్తించారు. మంగళూరు పోలీసులు బాంబా ఫాంట్ (31), అబిగైల్ అడోనిస్(30) అనే దక్షిణాఫ్రికన్లను అరెస్ట్ చేసి ట్రాలీ బ్యాగుల్లో దాచిన 37 కిలోల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ఎండీఎంఏను మోలీ, ఎక్స్టసీ అని పలు పేర్లతో పిలుస్తారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) ఇంఫాల్, గౌహతి జోన్లలో రూ.88 కోట్ల విలువైన మెథాంఫెటమైన్ డ్రగ్ టాబ్లెట్లను పట్టుకున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఇందుకు సంబంధించి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా సభ్యులైన నలుగుర్ని అదుపులోకి తీసుకున్నారని ఆదివారం 'ఎక్స్'లో వెల్లడించారు. ''ఎన్సీబీ ఇంఫాల్ జోన్ అధికారులు ఈ నెల 13న లిలాంగ్ ప్రాంతంలో ఓ ట్రక్కులో సోదాలు జరిపి టూల్‌బాక్స్‌లో దాచిన 102.39 కిలోల మెథాంఫెటమైన్ ట్యాబ్లెట్లను పట్టుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అసోం సరిహద్దుల్లో ఓ వాహనం స్పేర్ టైర్‌లో దాచిన 7.48 కిలోల మెథాంఫెటమైన్ టాబ్లెట్లను పట్టుకున్నారు'' అని తెలిపారు.

పాక్‌లో లష్కరే టాప్ కమాండర్ హతం

న్యూఢిల్లీ: భారత్‌లో వాంటెడ్ జాబితాలో ఉన్న లష్కరే తోయిబా టాప్ కమాండర్ జియా ఉర్ రెహ్మాన్ అలియాస్ నదీమ్ అలియాస్ అబూ ఖటాల్ అలియాస్ ఖటాల్ సింధీ (43) గుర్తు తెలియని సాయుధుల కాల్పుల్లో హతమయ్యాడు. పంజాబ్‌లోని జీలం ప్రాంతంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు, ముంబై ఉగ్రదాడుల సూత్రధారి అయిన హఫీజ్ సయీద్‌కు రెహ్మాన్ అత్యంత నమ్మకస్తుడని సమాచారం. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్–రాజౌరీ ప్రాంతంలో లష్కరే ఉగ్రదాడులకు వ్యూహకర్తగా రెహ్మాన్ వ్యవహరిస్తున్నాడు. ఇతడిపై ఎన్ఐఏ ఉపా కింద కేసులు నమోదు చేసింది. 2024లో ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం నాడు రియాసిలో బస్‌పై కాల్పులతో సహా కొన్నేళ్లుగా కశ్మీర్‌లో పలు దాడులకు రెహ్మానే సూత్రధారి అని అధికారులు వివరించారు. అతడి సన్నిహితులైన రియాజ్ అహ్మద్, హంజ్లా అద్నాన్ 2023లో పాక్‌లో జరిగిన వేర్వేరు ఘటనల్లో హతమయ్యారు. గత మూడేళ్లలో లష్కరే, జైషే హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన డజనుకు పైగా టాప్ కమాండర్లు హతమయ్యారు.

బోడో ఒప్పందంతో శాంతి, అభివృద్ధి

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి



గౌహతి/కొక్రాఝర్: బోడో ఒప్పందాన్ని అమలు చేసి ఈ ప్రాంతంలో శాంతిని, అభివృద్ధిని సుసాధ్యం చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. బోడోలాండ్ టెరిటోరియల్ రీజియన్(బీటీఆర్)లోని యువత నేడు తుపాకులకు బదులుగా త్రివర్ణ పతాకాన్ని ధరించారని ఆయన తెలిపారు. 2020లో బోడో ఒప్పందం కుదరడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి ప్రకటించారు. ఆదివారం ఆయన అస్సాంలోని కొక్రాఝర్ జిల్లా దొట్మాలో ఆల్ బోడో స్టూడెంట్స్ యూనియన్(ఏబీఎస్‌యూ) 57వ వార్షిక భేటీని ఉద్దేశించి ప్రసంగించారు. ఒప్పందం విషయంలో ఏబీఎస్‌యూ చూపిన చొరవ ఫలితంగానే నేడు శాంతియుత పరిస్థితులు సాధ్యమయ్యాయని చెప్పారు. లేకుంటే, బీటీఆర్‌లో శాంతి లేదు, బోడో ఒప్పందం ఒక జోక్ అంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసి ఉండేదని ఆయన అన్నారు. ఒప్పందంలోని 82 శాతం షరతులను ఇప్పటికే అమలు చేశామని, వచ్చే రెండేళ్లలో 100 శాతం పూర్తవుతుందని చెప్పారు. ఈ ప్రాంతాన్ని సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం(ఏఎఫ్ఎస్‌పీఏ) నుంచి పూర్తిగా మినహాయించామని వివరించారు. మూడేళ్లలోనే ఎన్డీఎఫ్‌బీ సభ్యులు 4,881 మంది లొంగిపోయారని, వీరి పునరావాసానికి రూ.287 కోట్లు వెచ్చించామని ఇందులో 90 శాతం కేంద్రమే సమకూర్చిందని వివరించారు. 2020 జనవరి 27న ఏబీఎస్‌యూ, ఎన్డీఎఫ్‌బీ తదితర బోడో గ్రూపులతో కేంద్రం బోడో శాంతి ఒప్పందం కుదుర్చుకోవడం తెల్సిందే.

నేర చట్టాల అమలుపై అమిత్ షా సమీక్ష

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం కొత్తగా అమల్లోకి వచ్చిన నేర చట్టాలు బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ చట్టాలు ఈశాన్య రాష్ట్రాల్లో అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఉండటంతో ఆ రాష్ట్రం తరఫున గవర్నర్ అజయ్ భల్లా హాజరయ్యారు. ఆయా రాష్ట్రాల సీఎంలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతోపాటు డీజీపీలు హాజరయ్యారు.

కాల్పుల విరమణ జరిగితేనే...

బందీల విడుదలపై హమాస్ కుండబద్దలు

కైరో: ఇజ్రాయెల్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఎంతో ప్రత్యేకమైందని హమాస్ పేర్కొంది. ఈ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేస్తేనే తమ వద్ద బందీగా ఉన్న అమెరికన్–ఇజ్రాయెల్ సైనికుడు ఈడాన్ అలెగ్జాండర్, నలుగురు బందీల మృతదేహాలను అప్పగిస్తామని స్పష్టం చేసింది. వీరి విడుదల రోజే రెండో దశ కాల్పుల విరమణ చర్చలు మొదలు కావాలని హమాస్ సీనియర్ ప్రతినిధి ఒకరు కైరోలో ఆదివారం చెప్పారు. గాజాలో మానవీయ సాయానికి ఇజ్రాయెల్ అడ్డంకులు కల్పించరాదన్నారు. బందీల విడుదలకు బదులుగా మరింత మంది పాలస్తీనియన్లను జైళ్ల నుంచి ఇజ్రాయెల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇలా ఉండగా, గాజాలోని బెయిట్ లహియా ప్రాంతంలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 9 మంది చనిపోయారు. వీరంతా ఉగ్రవాదులేనని ఇజ్రాయెల్ అంటుండగా, వీరిలో యూకేకు చెందిన అల్ ఖైర్ ఫౌండేషన్ సిబ్బంది 8 మంది ఉన్నట్లు ఆ సంస్థ తెలిపింది.

మాసిడోనియా నైట్‌క్లబ్‌లో అగ్ని ప్రమాదం

59 మంది మృతి, 155 మందికి గాయాలు

స్కోప్‌జే: ఉత్తర మాసిడోనియాలోని కోచానీ పట్టణంలో నైట్‌క్లబ్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో 51 మంది మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. రాజధాని స్కోప్‌జేకు తూర్పున 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోకానిలోని 'పల్స్' నైట్‌క్లబ్‌లో ఆదివారం తెల్లవారుజామున 02.35 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. దేశంలో ప్రసిద్ధి చెందిన హిప్–హాప్ ద్వయం డీఎన్‌కే బ్యాండ్ ప్రదర్శనకు 1,500 మంది హాజరయ్యారు. వీరిలో ఎక్కువమంది యువకులు. కొంతమంది యువకులు పైరోటెక్నిక్‌లను ఉపయోగించడంతో పైకప్పుకు మంటలు అంటుకున్నాయి. అది ప్రమాదానికి దారి తీసుకుంది. దీంతో నైట్‌క్లబ్ యజమానిని పోలీసులు ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో సహా ఐరోపా నాయకులు సంతాపం తెలిపారు.

హౌతీలపై అమెరికా దాడులు

31 మంది మృతి



వెస్ట్ పామ్ బీచ్ (యూఎస్): అంతర్జాతీయ జలాల్లో రాకపోకలు సాగించే అమెరికా రవాణా నౌకలు, యుద్ధనౌకలే లక్ష్యంగా రాకెట్ దాడులకు తెగబడుతున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులపై ట్రంప్ సర్కారు విరుచుకుపడింది. శనివారం హౌతీ స్థావరాలపై బాంబులు, రాకెట్లు, క్షిపణి దాడులతో బెంబేలెత్తించింది. ఈ దాడుల్లో ఇప్పటిదాకా 31 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని హౌతీ రెబెల్స్ ఆదివారం ప్రకటించారు. ''మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే. 101 మందికి పైగా గాయపడ్డారు'' అని హౌతీల ఆధ్వర్యంలో నడిచే ఆరోగ్య శాఖ ఆదివారం పేర్కొంది. హౌతీలకు ఇక మూడిందని ఈ సందర్భంగా ట్రంప్ ఘాటు హెచ్చరికలు కూడా జారీ చేశారు. ''ఉగ్రవాదుల స్థావరాలు, వారి నేతలు, క్షిపణి రక్షణ వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగుతాయి. అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛగా సముద్రయానం చేయకుండా ఏ ఉగ్ర శక్తీ ఇక అమెరికాను ఆపలేదు. స్వేచ్ఛాయుత సరకు రవాణాయే మా లక్ష్యం'' అని తన సోషల్ సైట్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. హౌతీలకు ఇకనైనా మద్దతు మానుకోవాలని ఇరాన్‌ను హెచ్చరించారు. అమెరికా వైమానిక దాడుల వల్ల యెమెన్ రాజధాని సనాతో పాటు ఉత్తర ప్రావిన్స్ సాదలోనూ పేలుళ్లు సంభవించాయి. ఆదివారం తెల్లవారుజామున హొదైదా, బైదా, మరీబ్ ప్రావిన్స్‌ల్లోనూ వైమానిక దాడులు జరిగినట్లు హౌతీలు ధ్రువీకరించారు. వైమానిక దాడులు ఇక రోజూ కొనసాగవచ్చని అమెరికా ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. వీటికి బెదిరేది లేదని హౌతీలన్నారు. ''అమెరికాకు దీటుగా బదులిస్తాం. గాజాకు తోడుగా నిలుస్తాం. ఎలాంటి సవాళ్లు ఎదురైనాసరే ఒంటరిగా వదిలేయలేం'' అని హౌతీ మీడియా కార్యాలయం ఉపసారథి నస్రుద్దీన్ అమీర్ ప్రకటించారు.

రవాణాకు అడ్డంకి

ఇజ్రాయెల్‌కు బుద్ధి చెప్పేందుకు ఆ దేశ నౌకలపై మాత్రమే దాడులు చేస్తున్నామని హౌతీలు గతంలో చెప్పారు. కానీ వారి దాడులతో ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్, బాబ్ ఎల్–మ్యాన్‌డేబ్ జలసంధి, అరేబియా సముద్రాల్లో సరుకు రవాణాకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అమెరికాతో పాటు పలు దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం తెల్సిందే. వారిప్పటిదాకా 100కుపైగా రవాణా నౌకలపై దాడులకు పాల్పడ్డారు. దాడుల భయంతో నౌకలు ఆఫ్రికా చుట్టూ తిరిగి వెళ్తుండటంతో సరుకు రవాణా సమయం, వ్యయం భారీగా పెరిగిపోతున్నాయి.



డ్రైవర్ లేని బస్సు!



చూసేందుకు మామూలుగానే కనిపిస్తున్నా ఇది నిజానికి స్పెషల్ బస్సు. అంత ప్రత్యేకత ఏముందంటారా? దీనిలో డ్రైవర్ అంటూ ఎవరూ ఉండరు. ఈ డ్రైవర్‌లెస్ విద్యుత్ బస్సు స్పెయిన్‌లోని బార్సిలోనా నగర వీధుల్లో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇది గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వెళ్లగలదు. ఒక్కసారి చార్జ్ చేస్తే 120 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. బస్సు చుట్టూ 10 అత్యాధునిక కెమెరాలు, సెన్సార్లతో పని చేసే ఎనిమిది లిడార్లు అమర్చారు. దాంతో సిగ్నళ్ల వద్ద, పాదచారులు రోడ్డు దాటేటప్పుడు బుద్ధిగా ఆగుతూ, ట్రాఫిక్ నిబంధనలన్నీ పాటిస్తూ వెళ్తోంది. తొలుత ఈ మినీ బస్సును కేవలం 2.2 కిలోమీటర్ల పరిధిలోనే తిప్పుతున్నారు. మొత్తం నాలుగు స్టాపులుంటాయి. ఇందులో వారం పాటు ఉచిత ప్రయాణం కూడా కల్పించారు!

– బార్సిలోనా

సాక్షి హైదరాబాద్

సోమవారం । 17 । మార్చి । 2025



నగరవాసి.. ఏసీకేసి!

వేసవిని ఎదుర్కొనేందుకు నగరవాసులు ముందస్తు ఏర్పాట్లలో ఉన్నారు. తమ బడ్జెట్‌ను బట్టి కూలర్లు, ఏసీలను సమకూర్చుకునే పనిలోపడ్డారు. -10లో



సోలో స్లీపే.. సో బెటరూ..

నిద్రలేమికి గురవుతున్న కొందరు నగరవాసులు ఓ పరిష్కారాన్ని ఎంచుకున్నారు. దాని పేరే స్లీప్ డైవోర్స్. దూరదూరంగా నిద్రించడమే స్లీప్ డైవోర్స్ - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.0/23.0

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 38, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి.



విద్యా వాతావరణం నెలకొల్పేందుకే నిషేధాజ్ఞలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆందోళనలపై విధించిన నిషేధంపై అధికారులు ఆదివారం స్పష్టతనిచ్చారు. వర్సిటీలో విద్యా వాతావరణం కోసం ధర్నాలు, నిరసనలు, ఆందోళనలపై నిషేధం కొత్త నిర్ణయం కాదని.. 2022లోనే ఓయూ పాలక మండలి అనుమతితో అధికారులు తీసుకున్న నిర్ణయమని రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలతో అధికారుల చాంబర్లలోకి విద్యార్థులు చొచ్చుకెళ్లి పనులకు ఆటంకాలను కల్పించడం తదితర కారణాలతో ఆందోళనలపై నిషేధం విధించినట్లు ఆయన స్పష్టం చేశారు. యూనివర్సిటీలో విద్యా వాతావరణాన్ని నెలకొల్పేందుకు తిరిగి సర్క్యులర్ జారీ చేశామని తెలిపారు. ఓయూకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలకు అందరూ సహకరించాలని అధికారులు కోరారు.

నేడు ఓయూ బంద్‌కు పిలుపు



విద్యార్థి సంఘాల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆందోళనలపై అధికారులు విధించిన నిషేధం పట్ల విద్యార్థి సంఘాల నేతలు, ప్రొఫెసర్లు నిరసన వ్యక్తంచేశారు. ఆదివారం బీఆర్ఎస్వీ, ఎంఎస్ఎఫ్, దళిత, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆర్ట్స్ కాలేజీ ఎదుట సమావేశమై ఓయూ అధికారుల తీరుపై మండిపడ్డారు. యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించ లేని, పాలన చేతకాని వీసీ ప్రొ.కుమార్ విద్యార్థుల ఆందోళనలపై నిషేధం విధించడం సిగ్గుచేటన్నారు. ఆందోళనపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వీసీ ప్రొ.కుమార్ నియంతృత్వ పోకడలకు, ఆందోళనలపై నిషేధానికి వ్యతిరేకంగా సోమవారం ఓయూ బంద్‌కు ఏబీవీపీ నాయకులు పిలుపునిచ్చారు.

గ్లకోమాపై అవగాహన అవసరం

ఆర్టీసీ ఎండీ సజ్జనార్



గ్లకోమా వాక్‌లో సజ్జనార్, సెంథిల్

బంజారాహిల్స్: గ్లకోమా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. ఆదివారం ఆయన బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్లకోమా అవగాహన నడకను సినిమాటోగ్రాఫర్ సెంథిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. నేత్రాల సంరక్షణను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. డాక్టర్ సిద్ధార్థ్ దీక్షిత్ మాట్లాడుతూ.. నలభై ఏళ్లు దాటిన ప్రతి 200 మందిలో ఒకరికి, 80 ఏళ్లు పైబడిన ఎనిమిది మందిలో ఒకరు గ్లకోమా బారిన పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నుంచి సాగర్ సొసైటీ సిగ్నల్ మీదుగా కేబీఆర్ పార్కు వరకు అవగాహన నడక నిర్వహించారు.

మద్యం మత్తులో భార్యను తోసేసిన భర్త

బస్సుకు తాకడంతో మహిళకు గాయాలు



శంషాబాద్ రూరల్: సొంత గ్రామానికి బయలుదేరిన దంపతులు బస్టాప్‌లో గొడవ పడ్డారు. మద్యం మత్తులో ఉన్న భర్త.. ఆమెను తోసివేయడంతో.. అప్పుడే అటుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆమెకు తాకింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతణ్ని చితకబాది.. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. దేవరకద్ర మండలం కొకుంట్లకు చెందిన బద్దన్న, పద్మ దంపతులు మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడలో నివాసముంటున్నారు. స్వగ్రామానికి వెళ్లేందుకు వీరిద్దరూ కలిసి శంషాబాద్ బస్టాండ్‌కు వచ్చారు. షాద్‌నగర్ వైపు వెళ్లే మార్గంలో బస్సు కోసం వేచి ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరు గొడవపడ్డారు. మద్యం మత్తులో ఉన్న బద్దన్న భార్యను తోసేశాడు. ఇదే సమయంలో అఫ్జల్‌గంజ్ నుంచి శంకరాపురం వెళ్తున్న బస్సు పద్మకు తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో ఆమెను అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బద్దన్నను స్థానికులు చితకబాదారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఖాళీగా కనిపిస్తున్న బషీర్‌బాగ్ చౌరస్తా

సండే.. సూరీడు మండే!

ఎండలు మండుతున్నాయి. భానుడు భగ్గుమంటున్నాడు. మార్చి నెల రెండో వారంలోనే 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం ఎండల తీవ్రత బాగా పెరగడంతో మధ్యాహ్నం నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఎల్బీ నగర్ టు ఉప్పల్ రహదారిలో..



నిర్మానుష్యంగా బషీర్‌బాగ్ పై ఓవర్..



వాహనంపై ఇలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుని..

2 నిమిషాలకో.. మెట్రో!

వేసవి రద్దీ దృష్ట్యా త్వరలో ట్రిప్పుల పెంపు

- రష్ కారిడార్‌లపై అధికారుల కసరత్తు
- ప్రస్తుతం రోజుకు 5 లక్షల ప్రయాణికులు
- ఏప్రిల్, మే నాటికి భారీగా పెరిగే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: రోజు రోజుకూ మెట్రో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరుగుతోంది. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో నగరవాసులు మెట్రో వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ సుమారు 5.05 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తుండగా వచ్చే ఏప్రిల్, మే నెలల్లో ప్రయాణికుల రద్దీ 5.50 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో జనం కిక్కిరిసి ప్రయాణిస్తుండగా ఏప్రిల్ నాటికి పరిస్థితి మరింత ఇబ్బందిగా మారనుంది. మెట్రోల్లో కనీసం నిల్చుని ప్రయాణం చేసేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి నెలకొంది, ప్రతి మెట్రోస్టేషన్‌లో ఇప్పటికే కనీసం రెండు రైళ్లకు సరిపడా ప్రయాణికులు ప్రతి ట్రిప్పు కోసం పడిగాపులు కాస్తున్నారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసే అవకాశం లేకపోయినా అదనపు ట్రిప్పులను పెంచేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ చర్యలు చేపడుతోంది.

కొత్త కోచ్‌లు లేనట్లేనా..

- ప్రయాణికుల రద్దీ మేరకు మెట్రో సర్వీసులను ఇప్పుడున్న 3 కోచ్‌ల నుంచి 6 కోచ్‌లకు పెంచేందుకు ఏడాది క్రితమే ప్రణాళికలను రూపొందించారు. మహారాష్ట్రలోని నాగపూర్ మెట్రో నుంచి మెట్రో కోచ్‌లను తెప్పించనున్నట్లు ప్రతిపాదించారు. ఈ మేరకు ఎల్అండ్‌టీ అధికారులు సైతం కొత్త కోచ్‌లను తెప్పించనున్నట్లు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి పురోగతి లేదు. మరోవైపు ఎప్పటి వరకు వచ్చే అవకాశం ఉందనే విషయంలోనూ స్పష్టత లేకుండాపోయింది. మరోవైపు నగరంలో మెట్రోలను తీవ్రమైన నష్టాల్లో నడుపుతున్నట్లు చెబుతున్న ఎల్అండ్‌టీ కొత్త కోచ్‌లను ప్రవేశపెట్టేందుకు సంసిద్ధంగా ఉందా? అనే అంశం కూడా సందేహాస్పదమే.
- రాయదుర్గం- నాగోల్, ఎల్బీనగర్- మియాపూర్ రూట్‌లలో నడిచే రైళ్లు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ మేరకు మెట్రోలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఐటీ కారిడార్‌లలో పని చేసే ఉద్యోగులు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వారు సకాలంలో కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నారు. విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాధారణంగా రద్దీ కారణంగా ఒక రైలు ఎక్కలేకపోయిన వాళ్లు మరో ట్రైన్ కోసం ధీమాగా ఎదురు చూస్తారు. కానీ ఆ తర్వాత వచ్చే రెండు రైళ్లు కూడా కిక్కిరిసి ఉండడంతో మెట్రో ప్రయాణం ప్రయాసగా మారుతోంది. ఈ క్రమంలో కొత్త కోచ్‌లు అందుబాటులోకి రాకపోయినా కనీసం ట్రిప్పులను పెంచేందుకు చర్యలు తీసుకోవడం ప్రయాణికులకు కొంత మేరకు ఊరట కలిగించనుంది.

త్వరలో 1,500 ట్రిప్పులు..

ప్రస్తుతం ప్రతి 3 నుంచి 5 నిమిషాలకు ఒకటి చొప్పున నడుస్తుండగా.. రద్దీ వేళల్లో ప్రతి 2 నిమిషాలకు ఒక మెట్రో చొప్పున అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 1,065 ట్రిప్పులు తిరుగుతుండగా త్వరలో రోజుకు 1,500 ట్రిప్పులు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణ సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ట్రిప్పుల పెంపుపై కసరత్తు చేపట్టనున్నారు. నాగోల్- రాయదుర్గం, ఎల్బీనగర్- మియాపూర్ కారిడార్‌లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. ముఖ్యంగా సికింద్రాబాద్, తార్నాక తదితర ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌లకు రాకపోకలు సాగించే ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని షటిల్స్‌ను నడిపేందుకు సైతం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



చార్మినార్‌కు రంజాన్ శోభ!





రంజాన్ వేళ కొనుగోళ్లతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. చార్మినార్ పరిసరాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆదివారం రాత్రి ముస్లింలు పెద్ద ఎత్తున షాపింగ్ చేశారు. ముువ్వన్నెల రంగుల్లో చార్మినార్ ఇలా రంజాన్ శోభను సంతరించుకుంది.



డాక్యుమెంట్ల పేరుతో దందా!



- మీ సేవ కేంద్రాల్లో అమలులోకి క్యాష్‌లెస్ పద్ధతి
- అధిక వసూళ్ల నివారణకు ప్రభుత్వ కొత్త విధానం
- అయినా.. మరో రూపంలో కొనసాగుతున్న దోపిడీ

సాక్షి, సిటీబ్యూరో: మీ సేవ కేంద్రాల నిర్వహణలో అధిక వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టినా.. మరో రూపంలో ఈ దందా కొనసాగుతోంది. మీ సేవ కేంద్రాల నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలని.. ప్రజలు నేరుగా డబ్బు చెల్లించకుండా సర్కారు ఇటీవల క్యాష్‌లెస్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. అయితే.. మీ సేవ కేంద్రాల్లో ప్రారంభం నుంచి నేరుగా డబ్బు చెల్లింపులు కొనసాగటంతో.. కొందరు నిర్వాహకులు అధిక వసూళ్లను నిలిపివేయకుండా ఇతర డాక్యుమెంట్ల ఖర్చుల పేరుతో పాత దందాను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 1,327 కేంద్రాలు

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు జిల్లాల్లో 1,327 కేంద్రాలు కొనసాగుతున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనే 306 మీ సేవ కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని కేంద్రాల్లో క్యూఆర్ స్కాన్ కోడ్ ద్వారా 90 శాతం చెల్లింపులు జరుగుతున్నాయి. దరఖాస్తుదారు ఏ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశారో.. అందుకోసం ప్రభుత్వం కేటాయించిన ధర మేరకు ఫోన్‌కు లింక్ వస్తోంది. ఈ ప్రకారమే డబ్బు చెల్లించాల్సి ఉండగా.. ఇతర డాక్యుమెంట్లు తదితరాల పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ లేకపోవటంతో..

మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడకుండా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. కేంద్రాల నిర్వాహకులు రోజుకు 10 దరఖాస్తుల వరకు ఫోన్ ద్వారా క్యూఆర్ స్కాన్‌తో డబ్బు చెల్లించడానికి అవకాశం కల్పించారు. దరఖాస్తుదారులు ఎన్నిసార్లు అయినా స్కాన్ చేసేందుకు అవకాశం కల్పించినా.. సరైన పర్యవేక్షణ లేకపోవటంతో.. అధిక వసూళ్ల పర్వానికి పూర్తి స్థాయిలో బ్రేక్ పడటం లేదన్న విమర్శలు ఉన్నాయి.

బినామీ పేర్లతో నిర్వహణ..

నగరంతో సహా శివారుల్లో పలు చోట్ల మీ సేవ కేంద్రాలను ఒకరి పేరుతో అనుమతి పొంది.. మరొకరు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు ఎవరి పేరుతో మంజూరు ఉంటుందో వారే కేంద్రాలను కొనసాగించాలి. కానీ.. పైరవీలతో మీ సేవ కేంద్రం మంజూరు చేయించుకున్నవారు వీటిని ఇతరులకు ఇస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి నిర్వహణపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

ఇష్టారాజ్యంగా..

ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాల్లో పలువురు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు సంబంధిత అధికారులకు వస్తున్నాయి. గ్రేటర్‌తో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల్లోని పలు మీ సేవ కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాల కోసం రుసుం డబ్బులు ఎక్కువగా వసూలు చేసిన ఘటనలు కోకొల్లలు. ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా మీ సేవ కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి రావటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రజలు తమ అవసరాల నిమిత్తం అధిక రుసుము వసూలు చెల్లించాల్సి వస్తోంది. కేంద్రాల్లో సిటిజన్ చార్ట్ ఉన్నా.. వాటిని నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పకడ్బందీగా అమలు చేయాలి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేటర్‌తో సహా శివారుల్లోని మీ సేవ కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు చెల్లించాల్సిన రుసుమును వారికి తెలిసేలా క్యూఆర్ స్కాన్ అమలు చేస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నా.. క్షేత్రస్థాయిలో కనిపించటం లేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యాష్‌లెస్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

నగరంలో రద్దయిన కరెన్సీ కలకలం

- రూ.55,52,500 విలువైన నోట్లు స్వాధీనం

గన్‌ఫౌండ్రీ: రద్దయిన పాత నోట్లు నగరంలో కలకలం రేపాయి. వీటిని మార్పిడి చేసేందుకు యత్నిస్తున్న నిందితులను సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఘటన ఆదివారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ ముజమ్మిల్ హుస్సేన్ టెంట్‌హౌస్ నడుపుతూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. ఆ తర్వాత 2006లో సౌదీ అరేబియా వెళ్లి 2019లో తిరిగి వచ్చాడు. ఆ మధ్యకాలంలో అతడు ఆదాయ పన్నును ఎగవేసేందుకు పాత కరెన్సీని పెద్ద ఎత్తున దాచిపెట్టాడు. దాన్ని మార్పిడి చేసేందుకు అప్పట్లో అనేక ప్రయత్నాలు చేసినా సఫలం కాలేదు. ఇటీవలి కాలంలో మళ్లీ నోట్ల మార్పిడికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆ తర్వాత అతడి సహచరుడు అమ్జద్‌ఖాన్ మధ్యవర్తుల ద్వారా పాతనోట్ల మార్పిడికి ప్రయత్నించారు. ఇందుకోసం లంగర్‌హౌజ్‌కు చెందిన అహ్మద్‌ఖాన్, పాల్తీ భాస్కర్‌రావు, షేక్ నసీమాలతో పరిచయం చేసుకున్నారు. వీరికి 5 శాతం కమీషన్ ఇస్తామని అంగీకరించి మార్కెట్లో కస్టమర్ల కోసం వెతుకుతున్నారు. ఈ నెల 15న అబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్ వద్ద రద్దయిన కరెన్సీని మార్చేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి మొత్తం రూ.55,52,500 విలువైన పాత కరెన్సీ నోట్లు, 4 సెల్‌ఫోన్లను అబిడ్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో పాల్గొన్న సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని డీసీపీ వైవీఎస్ సుధీంద్ర అభినందించారు.



పోలీసులకు పట్టుబడిన నిందితులు

యూట్యూబర్ హర్షసాయిపై కేసు నమోదు

- సామాజిక మాధ్యమాలలో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తూ పోస్టులు
- రూ.13 లక్షలు పైనే పోగొట్టుకున్న హర్ష ఫాలోవర్
- బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక మాధ్యమాలలో ఇన్ఫ్లూయెన్సర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సైబరాబాద్ పోలీసులు సూచిస్తున్నారు. ఫాలోవర్లను ప్రభావితం చేసేలా అక్రమ వ్యాపార కార్యకలాపాలను ప్రమోట్ చేయకూడదని హెచ్చరించారు. ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాజాగా పలు సామాజిక మాధ్యమాలలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు యూట్యూబర్ హర్షసాయిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ రెస్టారెంట్‌లో హెల్పర్‌గా పనిచేసే బాధితుడు 2022 నుంచి హర్షసాయి ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ ఛానల్‌ను ఫాలో అవుతున్నాడు. ఈక్రమంలో తాజాగా హర్ష తన ఇన్‌స్టాగామ్‌లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తూ వెబ్‌సైట్ లింక్‌లను పోస్ట్ చేశాడు. రూ.20 వేలు డిపాజిట్ చేస్తే 150 శాతం బోనస్ వస్తుందని కంటెంట్ షేర్ చేశాడు. ఇది చూసిన బాధితుడు హర్ష షేర్ చేసిన లింక్‌ల ద్వారా ఏడాది కాలంలో రూ.13 లక్షలు బెట్టింగ్ యాప్స్‌లలో పెట్టుబడులు పెట్టి, నష్టపోయాడు. 'హర్షసాయి టిప్స్' పేరుతో టెలిగ్రాం గ్రూప్‌లో జాయిన్ కావాలని హర్ష సూచించాడని, అందులో బెట్టింగ్‌లలో సలహాలు ఇస్తుండేవాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. హర్షసాయి సలహా మేరకు ఏడాది కాలంలో రూ.13,67,300 డిపాజిట్లు చేశానని, ఆ మొత్తం నష్టపోయానని ఆరోపించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు హర్షసాయిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టం సెక్షన్ 318 (4), ఐటీ యాక్ట్ సెక్షన్ 66–డీ కింద కేసులు నమోదు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరి ఆత్మహత్య

మొయినాబాద్: ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ ఠాణా పరిధి చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరుకు చెందిన ముంజగళ్ల మహేశ్(29) కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో ఎలాంటి పనిచేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, రాత్రి 8.30 గంటలకు తిరిగి వచ్చాడు. అతని భార్య నవనీత బయటకు వెళ్లి తిరిగొచ్చేసరికి గది తలుపులు మూసి ఉన్నాయి. ఎంతకీ తీయకపోవడంతో.. చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూశారు. అప్పటికే చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. పరిశీలించగా మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే తన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మీర్‌పేటలో డ్రైవర్..

మీర్‌పేట: ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం కస్తూరికాలనీలో నివాసముండే లోగిట్ల మధుసూదన్(35) వృత్తిరీత్యా కారు డ్రైవర్. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మధుసూదన్ కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావ సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఇద్దర్ని బలిగొన్న రోడ్డు ప్రమాదాలు

- వాటర్ ట్యాంకర్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం
- ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడు...

కాచిగూడ: వేగంగా వచ్చిన ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం..జియాగూడ, వెంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన దుర్గేష్ కుమార్ తుకారామ్ (28) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఇతడు కాచిగూడ కబేలా నుంచి గోల్నాక వైపు బైకుపై వెళ్తుండగా అంబికా వైన్స్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో తుకారామ్ ట్యాంకర్ వెనుక టైర్ల కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. పోలీసులు వాటర్ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్ మహమ్మద్ అబ్దుల్ నహీంను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.



వాటర్ ట్యాంకర్ ఢీకొని మృతి చెందిన తుకారామ్

బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు: బాలుడి మృతి

మేడిపల్లి: క్రికెట్ బాల్ కొనుక్కోవడానికి ఆనందంగా వెళ్తున్న ఓ బాలుడిని ఆర్టీసీ బస్సు బలిగొంది. ఈ విషాదకర ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం క్రాంతిదీప్ కాలనీలో నివాసం ఉంటున్న గోపి కుమారుడు అక్షిత్(13) ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో అక్షిత్ పెద నాన్న కొడుకు అభిలాష్‌తో కలిసి స్కూటీపై క్రికెట్ బాల్ కొనుక్కోవడానికి ఇంటి నుంచి బయలుదేరాడు. వీరి వాహనం పోచమ్మగుడి సమీపంలోకి రాగానే ప్రతాప్ సింగారం వైపు వస్తున్న ఆర్టీసీ బస్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ కింద పడిపోగా...వెనకాల కూర్చున్న అక్షిత్ బస్సు ముందు టైరు కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అక్షిత్(ఫైల్)

డంపింగ్ యార్డు తొలగించాలంటూ ఆందోళన

అల్వాల్: మచ్చ బొల్లారం డంపింగ్ యార్డ్ తరలించాలంటూ కాలనీవాసులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ఆదివారం రాత్రి డంపింగ్ యార్డ్ వద్ద ఆందోళన చేస్తున్న కాలనీ సంఘాల వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో కాలనీవాసులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. పోలీసుల తీరు పట్ల మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు గత కొంతకాలంగా అన్ని విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో డంపింగ్ యార్డ్ వద్ద ఆందోళన చేపట్టారని అన్నారు. ప్రజల నిరసనను పోలీసులచే అణచివేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు.

గంజాయి గ్యాంగ్ అరెస్ట్



పోలీసులు అరెస్టు చేసిన ఐదుగురు నిందితులు

నిజాంపేట్ : గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను బాచుపల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రగతినగర్ మిథిలానగర్‌లోని ఏపీజే అబ్దుల్ కలాం జీహెచ్ఎంసీ పార్క్‌లో శనివారం కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బాచుపల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి వెళ్లగా అనుమానాస్పదంగా తారసపడిన ఐదుగురు యువకులు కంభం వేణుగోపాల్ రెడ్డి, అరవల్లి దర్గాప్రసాద్, జరపాల ప్రశాంత్ నాయక్, కసిన తనుజ్ నాగ కుమార్, కొంగర సాయిబాలాజీలను అదుపులోకి తీసుకున్నారు. వారికి పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లుగా తేలింది. వారి వద్ద మిగిలిన 60 గ్రాముల గంజాయి, స్కూటీ, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన

ట్రాఫిక్ కానిస్టేబుళ్లు



సీపీఆర్ చేస్తున్న బేగంపేట ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఆనంద్, హైదర్

సనత్‌నగర్: బేగంపేట పీఎన్‌టీ జంక్షన్ వద్ద ఓ యువకుడు అకస్మాత్తుగా పడిపోవడంతో బేగంపేట ట్రాఫిక్ కానిస్టేబుళ్లు సీపీఆర్ చేసి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. కొమురం భీం జిల్లాకు చెందిన సురేష్ (27) మిత్రుడితో కలిసి కిమ్స్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా పీఎన్‌టీ చౌరస్తా వద్దకు రాగానే సురేష్ ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న బేగంపేట ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఆనంద్, హైదర్‌లు అప్రమత్తమై ఇన్‌స్పెక్టర్ పాపయ్య పర్యవేక్షణలో సురేష్‌కు సీపీఆర్ చేసి గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత ఆస్పత్రి వైద్యులు మెరుగైన చికిత్స అందించి డిశ్చార్జి చేశారు.

ఈతకు వెళ్లి మృతి

మీర్‌పేట: స్విమ్మింగ్‌పూల్‌లో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గాయపడి, వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మీర్‌పేట ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం రాచలపల్లె గ్రామానికి చెందిన ఎండీ హసన్(60) హస్తినాపురం జెడ్పీ రోడ్డులోని స్వస్తిక్ టిఫిన్ సెంటర్లో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సరదాగా ఈత కొట్టేందుకు తనతో పనిచేసే వారితో కలిసి మధ్యాహ్నం అల్మాస్‌గూడ ఆర్కా స్కూల్ సమీపంలోని జేఎస్ఆర్ స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లాడు. హసన్ పూల్‌లోకి దూకేందుకు ప్రయత్నించగా.. సరిగ్గా డైవ్ చేయకపోవడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

హాజరు కానున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారమహోత్సవ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్ కోరారు. ప్రమాణస్వీకార మహోత్సవ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హాజరవుతారని చెప్పారు. తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి మహేశ్వరం మండల కేంద్రం వరకు కార్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అందుగుల సత్యానారాయణ, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్

నిశ్చితార్థం రద్దు చేయించి..

- పెళ్లిచేసుకుంటానని మోసం చేసిన ప్రేమికుడు
- యువకుడి ఇంటి ఎదుట ధర్నా, అట్రాసిటీ కేసు నమోదు

మీర్‌పేట: ప్రేమించానని ఏడేళ్లుగా వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, యువతి నిశ్చితార్థాన్ని సైతం రద్దు చేయించాడు. ఆపై ముఖం చాటేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధిత యువతి, మహిళా సంఘాల సహాయంతో కుటుంబ సభ్యులతో కలిసి యువకుడి ఇంటి ఎదుట ధర్నా చేశారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన ఓ యువతి(28)ని మీర్‌పేట ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీకి చెందిన పూర్ణేశ్వర్‌రెడ్డి(28) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని గతంలో ఆమె నిశ్చితార్థాన్ని రద్దు చేయించాడు. ఆమెతో చనువుగా ఉంటూ.. ఇంట్లో వారికి, బంధువులకు పరిచయం చేశాడు. కానీ ఆ తరువాత యువకుడికి గుట్టుచప్పుడు కాకుండా.. మరో యువతితో పెళ్లి చూపులు జరిగాయి. విషయం తెలుసుకున్న యువతి నిలదీయడంతో కులం వేరు కావడంతో మా ఇంట్లో ఒప్పుకోవడం లేదని సమాధానం చెప్పాడు. దీంతో సదరు యువతి న్యాయం చేయాలంటూ ఆదివారం పూర్ణేశ్వర్‌రెడ్డి ఇంటి ఎదుట బంధువులతో కలిసి ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు.. యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



పూర్ణేశ్వర్‌రెడ్డి

నీటి సంపు శుభ్రం చేస్తుండగా ఊపిరాడక బీటెక్ విద్యార్థి మృతి

మేడిపల్లి: నీటి సంపును శుభ్రం చేస్తున్న క్రమంలో ఊపిరాడక బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..పీర్జాదిగూడ మల్లికార్జున నగర్‌లో నివాసం ఉంటున్న పల్లె శ్యామల కుమారుడు గణేష్ (19)ఓ ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వారి ఇంటి యజమాని నీటి సంపును శుభ్రం చేయమని గణేష్‌ను అడిగాడు. దీంతో సంపులోకి దిగి శుభ్రం చేస్తున్న సమయంలో గణేష్‌కు ఊపిరాడక అందులోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గణేష్ (ఫైల్)

'పన్నులు తగ్గించేవరకు పోరాటం'

మీర్‌పేట: అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొనిపోయి ఇంటి పన్నులు తగ్గించేవరకు పోరాటం చేస్తామని ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓల్డ్ గాయత్రీనగర్ కమ్యూనిటీ హాల్‌లో మీర్‌పేట కార్పొరేషన్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇంటి పన్నుల తగ్గింపు కోసం ఫెడరేషన్ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని అఖిలపక్షాన్ని కోరామని, అదేవిధంగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని అన్ని పార్టీల ప్రతినిధులతో తీర్మానం చేయించామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేశ్‌గౌడ్, బీఎస్పీ ఇన్‌చార్జి ఇందుమతి, సీపీఐ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం కార్యదర్శి యాదయ్య, ప్రకాశ్‌రెడ్డి, ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రతినిధులు మల్లారెడ్డి, వెంకటయ్య, ప్రేమ్‌చందర్‌రెడ్డి, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీలు, ఫెడరేషన్ ప్రతినిధులు

ట్యాంక్‌బండ్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

కవాడిగూడ: మానసిక ఒత్తిడితో శనివారం రాత్రి 12 గంటల తరువాత లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయ సమీపంలో ఓ వ్యక్తి అప్పర్ ట్యాంక్‌బండ్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి కనకాల కట్టమైమ్మ దేవాలయ సమీపంలో అపస్మారక స్థితిలో పడిఉన్న సమాచారాన్ని స్థానికులు దోమలగూడ పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అతడి వద్ద లభించిన ఆధార్ కార్డులో ఉన్న ఫోన్ నంబర్ ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడిని రాకేష్‌గా గుర్తించారు. కాగా రాకేష్‌కు మూడు నెలల క్రితం మెడ వెనుక భాగంలో శస్త్రచికిత్స జరిగిందని, అప్పటి నుంచి మానసిక స్థితి సరిగాలేదని, మానసిక ఒత్తిడి కారణంగానే ట్యాంక్‌బండ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతని కుమార్తె ఆర్తి పోలీసులకు తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రాకేష్ (ఫైల్)

హైవేపై కూలిన మర్రిచెట్లు

తప్పిన ప్రమాదం, ట్రాఫిక్‌కు అంతరాయం



జేసీబీతో చెట్లను తొలగింపజేస్తున్న పోలీసులు

చేవెళ్ల: హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై రెండు చోట్ల ప్రమాదవశాత్తు రెండు మర్రిచెట్లు విరిగి పడ్డాయి. ఈ సంఘటనలు చేవెళ్ల మండలం ఖానాపూర్ బస్టేజీ సమీపంలో ఒకటి, ఆలూరు బస్టేజీ సమీపంలో మరొకటి చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం స్వల్ప వ్యవధిలో రెండు చోట్ల చెట్లు కూలిపోయాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహనాలు పరుగు తీయకపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మరోమార్గం లేకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్ఐ శంకరయ్య, ఏఎస్ఐ చందర్‌నాయక్‌లు సిబ్బంది, స్థానికుల సహాయంతో జేసీబీతో చెట్లను పక్కకు తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేయించారు. ఈ మర్రి చెట్లు మొదళ్లు కాలిపోయి ఉండటంతో గాలి వీచిన సమయంలో ఇలా రోడ్డుపై పడిపోతున్నాయని, వాహనదారులు చెట్ల కింద ప్రయాణం చేసే సమయంలో తగిన జాగ్రత్త తీసుకోవాలని పోలీసులు సూచించారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- పీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత
- మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

బడంగ్‌పేట్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం బడంగ్‌పేట సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు దహనం కార్యక్రమం చేపట్టినట్లు గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ సభ్యుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత మాట్లాడుతూ.. సభకు పెద్దన్నలా వ్యవహరిస్తూ చక్కదిద్దుతున్న దళిత ముద్దుబిడ్డ గడ్డం ప్రసాద్‌ను జీర్ణించుకోలేక మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అవమానకరంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సభాపతిని అధికార, ప్రతిపక్ష సభ్యులు ఎవరైనా గౌరవించాలన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ దళితుడైన సభాపతిని హేళన చేసేలా మాట్లాడిన జగదీశ్వర్‌రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అమరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, జైహింద్, నాయకులు బి.జంగయ్య, గట్టు బాలకృష్ణ, భాస్కర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కమలేష్ కుమార్, కౌసల్యా దేవ(25) దంపతులు. బతుకుదెరువు కోసం కొంతకాలం క్రితం శ్రీరాం కాలనీకి వలస వచ్చారు. ఈ నెల 15న సాయంత్రం 7 గంటలకు సరుకులు తెచ్చేందుకు బయటకు వెళ్లిన కమలేష్.. 20 నిమిషాల తరువాత ఇంటికి వచ్చి చూడగా.. భార్య కనిపించలేదు. వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో కమలేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి కవాడిపల్లి గ్రామంలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న కవాడిపల్లి ప్రీమియర్ లీగ్– 09 (కేపీఎల్) క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. ఏటా జనవరి 26న నిర్వహించే మ్యాచ్‌లో.. ఆదివారం జరిగిన తుది పోరులో డీవైజీ జట్టుపై జై శ్రీరాం జట్టు విజయం సాధించింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన బొడిగే ఆనంద్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు వీరస్వామిగౌడ్, శ్రీనివాస‌గౌడ్, సురేష్‌గౌడ్, నవీన్‌గౌడ్‌ల చేతుల మీదుగా కూడా విన్నర్, రన్నర్ జట్ల కు బహుమతులు ప్రదానం చేశారు. వీటితో పాటు కేపీఎల్ నిర్వాహకులు విజేత జట్టుకు రూ.66,666ల నగదు, రన్నర్‌కు రూ.44,444 నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దూసరి సుజాత, ఇరుగు చిత్తారి, నాయకులు బొడిగె రమేష్‌గౌడ్, కొండల్‌గౌడ్, సాయిరెడ్డి, రవియాదవ్, శ్రీకాంత్, యాదగిరి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది 4 రోజులే..

- 'పది' పరీక్షలకు విద్యార్థులు సిద్ధం
- తప్పులు లేకుంటే మార్కులు ఖాయం
- పొరపాట్లు చేయవద్దంటున్న ఉపాధ్యాయులు

నిన్న మొన్నటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలకు సిద్ధం అయ్యారు. మరో నాలుగు రోజుల్లో పదో తరగతి పరీక్షలు మొదలు కానుండటంతో పక్కా ప్లానింగ్‌తో పరీక్షలు రాసేలా ప్రిపేర్ అయ్యారు. మిగిలి ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకొని పది పరీక్షల్లో మెరవాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. ఉపాధ్యాయులు కూడా ఎంతో శ్రమించి వారిని తీర్చిదిద్దారు. పరీక్ష సమయాన్ని ఎలా వినియోగించుకోవాలి.. ప్రశ్నలను ఎలా అర్థం చేసుకోవాలి.. జవాబులను ఏ పద్ధతిలో రాయాలి..? తదితర విషయాలను విద్యార్థులు అర్థం అయ్యేలా వివరించారు.

– బంజారాహిల్స్

ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 2 ఎయిడెడ్, 4 రెసిడెన్షియల్, 4 మైనార్టీ రెసిడెన్షియల్, 4 జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకులాలు, 101 ప్రైవేటు పాఠశాలలు కలిపి 8,112 మంది విద్యార్థులు ఈ నెల 21వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సబ్జెక్టు వారీగా ముఖ్యాంశాలు సరిచూసుకోవడానికి ఈ ఐదు రోజు ఎంతో కీలకమని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పరీక్షల్లో విద్యార్థులు చేసే చిన్న పొరపాట్లతో మార్కులు కోల్పోతుంటారు. ఆ తప్పులకు తావులేకుండా జాగ్రత్త పడితే పూర్తి స్థాయిలో మార్కులు తెచ్చుకోవచ్చని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు చేసే పొరపాట్లు, పరీక్షల్లో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సబ్జెక్టు టీచర్లు కొన్ని సూచనలు చేస్తున్నారు.


వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్న టెన్త్ విద్యార్థులు

త్రిభుజాలలో నిర్మాణాలు నేర్చుకోవాలి



గణితశాస్త్రంలో సమితులు, సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత ఈ మూడు అధ్యాయాలు పూర్తిగా నేర్చుకుని బహుపదులలో గ్రాఫ్, త్రిభుజాలలో నిర్మాణాలు నేర్చుకున్నట్లయితే 35–40 మార్కులు వస్తాయి. మ్యాథ్స్, ఫిజిక్స్ పరీక్షల ముందు రోజు సెలవులు వచ్చాయి. సమయం వృథా చేసుకోకుండా బాగా చదవాలి. గణితంలో సమస్యలు చూసి భయపడొద్దు. సమితులు, త్రికోణమితి, త్రిభుజాలు, క్షేత్రమితి అంశాల్లో పటాలు గీయాలి. సమస్యల సాధన అంచెలంచెలుగా జవాబు వచ్చే వరకు రాయాలి.

– అశ్విని, గణిత ఉపాధ్యాయురాలు, రాజ్‌భవన్ హైస్కూల్

సులువైన వాటిని ఎన్నుకోవాలి



ఒక అంశానికి సంబంధించి కీలక పదాలను చాలామంది రాయడం లేదు. సమాధానంలో తప్పనిసరిగా ఉండాలి. పటాలు గీసే సమయంలో తప్పనిసరిగా భాగాలు గుర్తించాలి. సులువైన వాటిని ఎన్నుకుని సమాధానం రాయాలి. సమస్య–సాధన ప్రశ్నలు రాసేటప్పుడు ఫార్ములా రాసి అందులో వివరాలు గుర్తించాలి. భౌతిక, రసాయన శాస్త్రంలో 1, 3, 4, 5 పూర్తి పాఠాలు, ఇతర ప్రయోగశాల కృత్యాలు, చిత్రపటాలు పూర్తిగా ప్రాక్టిస్ చేస్తే విద్యార్థులకు 15–20 మార్కులు వస్తాయి.

– సురేందర్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, రాజ్‌భవన్ హైస్కూల్

ఆంగ్ల ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదవాలి

ఆంగ్ల ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని సులభమైన పదాలతో సమాధానాలు రాయాలి. వ్యాకరణ విభాగంలో ఆరు ప్రశ్నల్లో నాలుగింటికి జవాబులు రాయాల్సి ఉంటుంది. అయినా సరే అన్నింటికీ రాయాలి. ఆహ్వానం, గోడపత్రికలు వంటి పెద్ద ప్రశ్నలకు తప్పకుండా రంగు పెన్సిల్ వినియోగించాలి. ముఖాముఖిలో ఎవరినీ కించపరచకుండా సమాధానాలు సూటిగా రాయాలి. చిన్నచిన్న మెళకువలతో అధిక మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

– ఎండీ అలీ, ఇంగ్లిష్ టీచర్, లిటిల్‌స్టార్ హైస్కూల్, గాయత్రీహిల్స్

చదివి అవగాహన పెంచుకోవాలి

పేరాగ్రాఫ్ ప్రశ్నలకు సంబంధించి సాంఘిక శాస్త్రంలో సమస్యను గుర్తించి పరిష్కార మార్గాలతో రాయాలి. ముఖ్య భావనలను చదివి అవగాహన పెంచుకోవాలి. నదులు, పర్వతాలు, శిఖరాల పటాల గుర్తింపులో చిహ్నాలు ఉపయోగించాలి. కరపత్రానికి సంబంధించి హెడ్డింగ్, విన్నపం, ముగింపు పద్ధతిగా రాయాలి. గ్రాఫ్ పట్టికలో సమాచారం పెరిగిందా? తగ్గిందా? కారణాలు విశ్లేషించుకోవాలి.

– రాజేందర్, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు, లిటిల్‌స్టార్ హైస్కూల్

'కవిత చరిత్ర మరిచిపోయారు'

పంజగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర గీతానికి సంగీతం సమకూరిస్తే కల్వకుంట్ల కవిత అనైతిక వ్యాఖ్యలు చేయడం ఆమె అహంకారానికి నిదర్శనమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఆదివారం ఎర్రమంజిల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. కవిత చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని 2001 నుంచి తెలంగాణ రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ పాటను పెడతానని అందెశ్రీని మానసిక క్షోభకు గురిచేసింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రముఖ నేపథ్య గాయకుడు రామకృష్ణతో రాష్ట్ర గీతాన్ని పాడించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. కవిత చరిత్ర మరిచిపోయి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఆంధ్ర పెట్టుబడి దారులకు, కాంట్రాక్టర్లకు అనేక పనులు కట్టబెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. ఇప్పుడు ఆంధ్రా మ్యూజిక్ డైరెక్టర్లు అని మాట్లాడుతున్న కవిత తెలంగాణ బతుకమ్మ పాటకు ఏఆర్ రెహమాన్‌తో సంగీతం సమకూర్చుకోలేదా అని ప్రశ్నించారు.

జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలు అనైతికం


మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పంజగుట్ట: అసెంబ్లీ సాక్షిగా దళిత స్పీకర్‌పై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అనైతికమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం పంజగుట్ట సర్కిల్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సోమాజిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నారికెళ్ళ నరేష్, వెంకటేశ్వర డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఒక దళిత స్పీకర్‌ను అసెంబ్లీలో అవమాన కరంగా మాట్లాడడం అగ్రకుల అహంకారమేనని అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. జగదీష్‌రెడ్డి స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో దళిత స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడినందుకు జగదీష్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ శోభన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్ గౌడ్, దినేష్, సుభాష్ రాజు, పృథ్వీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల అందజేత


కానుకలు అందజేస్తున్న హబీబా సుల్తానా

రహమత్‌నగర్ : రంజాన్ మాసంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అందిస్తున్న సేవలు అమోఘమని నగర కాంగ్రెస్ నాయకురాలు, బాబా సతీమణి హబీబా సుల్తానా అన్నారు. ఆదివారం ఆబె తన నివాసం వద్ద పేదల ముస్లింలకు రం జాన్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా హబీబా సుల్తానా మాట్లాడుతూ అల్లా కృపతో తన భర్త బాబా ఫసియుద్దీన్ గత పదేళ్లుగా సహెర్ కార్యక్రమం నిర్వహించడంతో పా టు రంజాన్ కానుకలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్ కుమార్‌గౌడ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకట హర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం వినాయక ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ : టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 21, క్యాప్సికం 31, పచ్చి కాకరకాయ 45, పందిరిబీర 40, క్యాబేజీ 8, క్యారెట్ 15, దొండకాయ 40, గుండు బీన్నీస్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 21, చామగడ్డ 43, మొరంగడ్డ 23, కందగడ్డ 65, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, మామిడికాయ 40, ముల్లంగి 5–6, ఉల్లి పొరక 35 ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

దళిత ప్రజాప్రతినిధులను అవమానిస్తే సహించం


మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్‌నేతలు

ఫిలింనగర్: దళిత ప్రజాప్రతినిధులు, నేతల పట్ల అమర్యాదగా, అనుచితంగా ప్రవర్తిస్తే సహించేది లేదని జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేతలు అన్నారు. బీఆర్ఎస్ నాయకులు దళిత నాయకులు, దళిత ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా, అమర్యాదగా ప్రవర్తిస్తున్నారన్నారు. అసెంబ్లీ వేదికగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేత కాటూరి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింనగర్ విగ్రహాల చౌరస్తాలో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ దళిత ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని తెలంగాణ బిల్లు పాస్ చేసిన మీరా కుమార్ తెలంగాణకు వస్తే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం అపాయిట్‌మెంట్ కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజు, ఎండి గౌస్, నాగార్జున అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

రహమత్‌నగర్ :ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇంద్రకుమార్, జూబ్లీహిల్స్ కన్వీనర్ చంద్రశేఖర్ మా ట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 250 గజాల స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డులను అందజేయాలని మంత్రిని కోరారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులకు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. తమ విజ్ఞప్తిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కంకట సురేందర్ ,వినోద్‌కుమార్, జగన్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి పి. విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకాన్ని పేద మహిళలందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీ శంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు వీకే. ముత్తు, ప్రధాన కార్యదర్శి ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ భీమ్ రావు , ఎస్ఎల్ఎఫ్ సభ్యులు స్వప్న, రాధ, అనురాధ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాలోయింగ్ రుగ్మతలపై నిర్లక్ష్యం తగదు


వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆడియోలజిస్టులు, స్పీచ్ లాంగ్వేజ్ థెరపిస్టులు, ఈఎన్‌టీ వైద్యులు

బంజారాహిల్స్: వరల్డ్ స్వాలోయింగ్ డే (మార్చి 19)ను పురస్కరించుకుని ఏషియన్ ఈఎన్‌టీ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో బేగంపేటలో డిస్ఫాగియా డయాగ్నసిస్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం వర్క్‌షాప్, ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి 30 మంది ఆడియోలజిస్టులు స్పీచ్ లాంగ్వేజ్ థెరపిస్టులు, ఈఎన్‌టీ వైద్యులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఎన్‌టీ మహేశ్వరం మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ సుదర్శన్ ప్రారంభోత్సవ ప్రసంగం చేశారు. స్వాలోయింగ్ రుగ్మతల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ డీఎల్ నారాయణ, ఏషియన్ ఈఎన్‌టీ కేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చావా ఆంజనేయులు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రాజేంద్రకుమార్ పోరికా, డాక్టర్ ప్రేమ్‌నాథ్ బల్లా, డాక్టర్ గంగా రాను, డాక్టర్ ఆయేషా, డాక్టర్ నీలిమ, డాక్టర్ ద్వార తదితరులు పాల్గొని ప్రసంగించారు.

చిన్నారుల్లో డయాబెటిస్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ వసంత్ కుమార్

బంజారాహిల్స్: దేశంలో డయాబెటిస్ బాధపడుతున్న వారి సంఖ్య నానాటికి పెరుగుతుండటం ఆందోళనకరమని ప్రముఖ వైద్యులు వసంత్‌కుమార్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో డే సొసైటీ ఆధ్వర్యంలో చిన్న పిల్లల్లో వచ్చే డయాబెటిస్‌పై ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంత్‌కుమార్ మాట్లాడుతూ తాము గత 25 ఏళ్లుగా డయాబెటిస్‌తో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు మందులు ఇవ్వడంతో పాటు ఇన్సులిన్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. డయాబెటిస్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని 30 ఏళ్లు దాటిన వారంతా షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆహార అలవాట్లు, బరువు పెరగడంతో పాటు పలు కారణాల వల్ల ఎంతో మంది డయాబెటిస్ బారిన పడుతున్నారన్నారు. షుగర్, బీపీ కారణంగా శరీరంలోకి చాలా వ్యాధులు ప్రవేశిస్తున్నాయని ప్రాథమిక దశలోనే వాటిని గుర్తించి దానికి తగిన వైద్యం తీసుకుంటే మంచి ఫలితాలతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ చైర్మన్ పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితులు

ఖైరతాబాద్: గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి 1.18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం ఖైరతాబాద్ వీవీ స్టాచ్యూ చౌరస్తాలో ఎస్ఐ నాగరాజు నేతృత్వంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు రెండు బైక్‌లపై వెళుతున్న అరుగురు వ్యక్తులను అడ్డుకుని సోదా చేయగా వారి వద్ద ఉన్న సంచిలో 1182 గ్రాముల గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నానుబాల సురేష్, కాశీ రాహుల్, బాబుచందర్, ప్రణయ్ కుమార్, పశుల నితిన్, డేవిడ్‌లను అదుపులోకి తీసుకున్నారు. మధు అనే వ్యక్తి పరారయ్యాడు. నిందితులందరూ పాత నేరస్తులేనని పోలీసులు తెలిపారు. వీరి నుంచి రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మధు కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఓయూ పూర్వ విద్యార్థికి అరుదైన అవకాశం


డా.వెంకన్న

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి ఇంగ్లిష్ విభాగం అధ్యాపకులు డాక్టర్ కుంచం వెంకన్నకు కేంద్ర ప్రభుత్వ ఐసీఎస్ఎస్ఆర్ మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు లభించింది. పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ గురుకుల ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయన 2024–25 విద్యా సంవత్సరానికి రూ.36 లక్షల రీసెర్చ్ ప్రాజెక్టును పొందారు. ఇంగ్లిష్ భాషపై రెండు సంవత్సరాల పాటు పరిశోధన చేయనున్నారు. దేశంలో 192 మంది అధ్యాపకులకు ఈ ప్రాజెక్టు లభించగా తెలంగాణ నుంచి ఇద్దరు మాత్రమే ఎంపికైనట్లు చెప్పారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి


అగ్రసేన్ కో–ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి భట్టి విక్రమార్క

బంజారాహిల్స్: వినియోగదారులకు, విద్యార్థులకు సరళమైన పద్ధతుల్లో రుణాలు అందించేందుకు అగ్రసేన్ కో–ఆపరేటివ్ బ్యాంకు ప్రతినిధులు కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో అగ్రసేన్ కో–ఆపరేటివ్ 7వ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అగ్రసేన్ కో–ఆపరేటివ్ బ్యాంకు ప్రతినిధులు సమాజ సేవలో ముందున్నారని, వ్యాపార రంగంలోనూ వీరు మరింత మంది ఆర్థికంగా ఎదిగేందుకు గృహ, విద్యా రుణాలను సరళతరం చేయాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రసేన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు



నూతన కార్యవర్గంతో టీజీ వెంకటేష్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు

ఖైరతాబాద్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన వాసవీ హాస్పిటల్ సేవలను మరింత మెరుగుపర్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని వాసవీ హాస్పిటల్ నూతన చైర్మన్ కొత్తూరు జయప్రకాష్ రాం అన్నారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని వాసవీ హాస్పిటల్ నూతన కార్యవర్గాన్ని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రకటించారు. మూడేళ్లుగా కొనసాగుతూ వచ్చిన కార్యవర్గం పదవీ కాలం ముగియడంతో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హాస్పిటల్ నూతన చైర్మన్‌గా కొత్తూరు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా కొండ్లె మల్లికార్జున్, కోశాధికారిగా దయాకర్ గుప్తా ఎన్నికయ్యారు. టీజీ వెంకటేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన వాసవి హాస్పిటల్ సేవలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని టీజీ వెంకటేష్ సూచించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ జి.చంద్రయ్య నూతన చైర్మన్‌కు బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, వాసవి హాస్పిటల్ లైఫ్‌టైం హానరర్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, అడ్వైజర్, మాజీ టూరిజం శాఖ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పద్మశ్రీ రమేష్ గిల్లి, దిడిగె జయంత్, జయదేవ్, మీలా జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మహిళల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వివేక్ వెంకటస్వామి తదితరులు

ఖైరతాబాద్: ప్రతి ఒక్కరూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మింట్ కాంపౌండ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆయన ఉత్తమ సేవలందించిన మహిళలను జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మహిళలు పట్టుదలతో అన్ని రంగాల్లో రాణించాలని, పిల్లలను బాగా చదివించాలన్నారు. 23 డిగ్రీలు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ గడ్డం సరోజా దేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పట్టుదలతో రాణించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తమ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా విద్యను అందజేస్తున్నట్లు తెలిపారు. జై భీం మహిళా మండలి అధ్యక్షురాలు అంజలి కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్.లలితా కుమారి, కె.విజయలక్ష్మి, జి.లావణ్య, దివ్య, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

'ఇఫ్తార్' నిధులను మైనార్టీల సంక్షేమానికి కేటాయించాలి

పంజగుట్ట: రంజాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందుకు రూ.70 కోట్ల కేటాయించడంపై కాంగ్రెస్ నేత డాక్టర్ లుబ్నా సర్వత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిధులను మైనార్టీల అభివృద్ధికి, వారి పిల్లల విద్య, వైద్యానికి వినియోగించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు సంఘాల నాయకులతో కలిసి ఆమె మాట్లాడుతూ .. గతంలో ఇఫ్తార్ పేరుతో ప్రజాధనం వృథా చేశారన్నారు. ఇఫ్తార్ దావత్ పేరుతో రూ. 70 కోట్ల నిధులను దుర్వినియోగం చేయరాదని ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. అవినీతిపరమైన గత బీఆర్ఎస్ విధానాలను అనుసరించడం మానుకోవాలని ఆమె సూచించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, సీఎస్ శాంతి కుమారి, షబ్బీర్ అలీకి లేఖలు రాసినట్లు తెలిపారు. ఈ నిధులను తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్, ట్రెనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ఫర్ మైనార్టీస్‌కు కేటాయిస్తే ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. సమావేశంలో విజయ్ భాస్కర్, ఎండీ అన్వర్ పటేల్, ఎం.డీ రహీం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు రెండవ వార్డు రసూల్‌పురా సీబీఎస్‌నగర్, అర్జున్ నగర్, హనుమాన్ టెంపుల్ చర్చిరోడ్‌లో 70 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డిలతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బస్తీల్లో మౌళిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన సర్వీస్ చార్జీలను విడుదల చేయించేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, బీజేపీ నాయకులు అశోక్, మణికంఠ. కిషన్ పాల్గొన్నారు.

నగరవాసి.. ఏసీకేసి!

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..సిద్ధమవుతున్న ఏసీలు



- ప్రతి పది ఇళ్లకుగాను నాలుగు ఇళ్లలో వినియోగం
- పలు ఇళ్లలో ఒకటి కంటే ఎక్కువ వినియోగం
- అద్దె ఇళ్లలోనూ అధికమవుతున్న వాడకం
- అర్బన్ క్లాప్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: వేసవి ఆరంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. ఈసారి వేడిమి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. వేసవిని ఎదుర్కొనేందుకు నగరవాసులు ముందస్తు ఏర్పాట్లలో ఉన్నారు. తమ బడ్జెట్‌ను బట్టి కూలర్లు, ఏసీలను సమకూర్చుకునే పనిలోపడ్డారు. ఇప్పటికే ఇళ్లలో ఉన్నవాటిని మరమ్మతులు చేయిస్తున్నారు. నగరంలో ఏసీల వినియోగం ప్రతి ఏటా పెరుగుతోంది. ఏసీల వినియోగం ఏ విధంగా ఉంటుందన్న అంశంపై ఆన్ డిమాండ్ సర్వీసెస్ మార్కెట్ ప్లేస్ అర్బన్ క్లాప్ ఓ అధ్యయనం చేసింది. దాదాపు 84 శాతం మంది ప్రతి వేసవిలోనూ కనీసం ఒక్కసారైనా ఏసీ మరమ్మతు సేవలను వినియోగించుకుంటున్నారని తేలింది. దేశవ్యాప్తంగా ఏసీలను అధికంగా వినియోగిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి. అందుకే పేరొందిన బ్రాండ్లన్నీ తమ ఉత్పత్తి తొలి ఆవిష్కరణలను ఇక్కడే చేయడం గమనార్హం.

ఎయిర్ కూలర్.. ఎయిర్ కండీషన్.. ఏది బెస్ట్..

ఎయిర్ కూలర్.. ఎయిర్ కండీషన్‌లలో నగరవాసులు ఎయిర్ కండీషన్ వైపు మొగ్గు చూపుతున్నారు. దాదాపు 19 శాతం మంది ఏసీ కొనుగోలు చేస్తామంటుంటే, 5 శాతం మంది మాత్రం అద్దెకు తీసుకుంటామంటున్నారు. అయితే, ఏసీ కండీషన్‌లో ఉంటేనే కరెంట్ బిల్లు కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. దాదాపు 37 శాతం మంది రూ.1,500–3 వేల కరెంట్ బిల్లు చెల్లిస్తే, 17 శాతం మంది రూ. 3 వేల నుంచి 5 వేల బిల్లు చెల్లించారు. 10 శాతం మంది ఏకంగా రూ.5 వేలకు పైగానే బిల్లు చెల్లించామని చెబుతున్నారు.

- ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 36 శాతం మంది ఒక ఏసీ ఉందని, రెండు ఏసీలున్నాయన్న వారు 25 శాతం, మూడు ఏసీలున్నవారు 15 శాతం మంది ఉన్నారు. మూడు కన్నా ఎక్కువ ఏసీలు వాడుతున్న వారు 14 శాతం మంది. అద్దెకు ఏసీలను తీసుకునే వారు 10 శాతం వరకు ఉంటారని తేలింది. నగరంలో 40 శాతం ఇళ్లలో కనీసం ఒక్క ఏసీ అనేది కామన్‌గా మారిందని అర్బన్ క్లాప్ అధ్యయనం వెల్లడిస్తోంది.

తక్కువ కరెంట్‌కే ఓటు..

కరెంట్ వినియోగం తక్కువగా ఉండాలని, ఎక్కువ చల్లదనం అందించాలని అనుకునే వారు నగరంలో ఎక్కువే. దీంతో ఫైవ్ స్టార్ ఇన్వర్టర్ ఏసీలకు నగరంలో డిమాండ్ అధికంగా ఉంది. సంవత్సరానికి 750 యూనిట్ల విద్యుత్ దాటకూడదని కోరుకుంటున్న నగరవాసులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. దాదాపు 50 శాతం మంది కాస్త ఉక్కపోత వస్తే చాలు ఏసీ ఆన్ చేస్తున్నారని లెక్క తేలింది. 15 శాతం మంది రోజుకు 4–6 గంటలు వినియోగిస్తున్నామని చెప్పారు.

- ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్ సంస్థ అర్బన్ క్లాప్ హైదరాబాద్‌లో సర్వే చేసింది. ఆ వివరాలు...

ఏడు గంటలు ఏసీ వినియోగం

నగరంలో 29 శాతం మంది రాత్రిపూట సుమారు 7 గంటలు ఏసీ వాడుతున్నామని చెబుతున్నారు. తమ అధ్యయనంలో 31 శాతం మంది వేసవి సీజన్‌లో ఏసీ ఒకటి కన్నా ఎక్కువసార్లే బ్రేక్‌డౌన్ అయిందంటున్నారు. 82 శాతం మంది అయితే సీజన్ ప్రారంభానికి ముందే మరమ్మతులు చేయించుకుంటున్నారు. నాణ్యమైన ఏసీ సర్వీసింగ్‌కు రూ.వెయ్యి వరకు ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు. దాదాపు 26 శాతం మంది ఈ తరహాలోనే ఆలోచిస్తున్నారని ఆ అధ్యయనం వెల్లడించింది.

ఎప్పుడు వాడుతున్నారంటే?

- 50% మంది అవసరమైనప్పుడే వాడతారు
- 29 % రాత్రి మొత్తం 7 గంటల పాటు
- 15% నాలుగు నుంచి 6 గంటలు
- 6 % ఎంతసేపు వాడతామో చెప్పలేం అన్నవారు

మరమ్మతు అవసరం ఎప్పుడు?

- 50% మంది క్రమం తప్పకుండా నిర్వహణ అవసరం అన్నవారు.
- 36% మెకానికల్ సమస్యలతో మరమ్మతులు వచ్చాయని చెప్పిన వారు
- 12% ఏపీ పాడైందన్నవారు
- 2% ఇతర సమస్యలు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో సాయంత్రం 5 గంటలకు ఉగాది, రంజాన్ ఉత్సవాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రారంభించనున్నారు.
- మాదాపూర్‌లోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలు, మహిళా వ్యాపారుల ఉత్పత్తుల ప్రదర్శన భాగంగా ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ప్రజాస్వామ్యవాది కొండల్‌రావు



కొండల్‌రావు రచించిన పుస్తకాలను ఆవిష్కరించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి,ప్రొఫెసర్ హరగోపాల్

అమీర్‌పేట: తెలంగాణ సమాజానికి వెలిచాల కొండల్‌రావు అసలు సిసలైన ప్రజాస్వామ్యవాది అని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అమీర్‌పేట సిస్టర్ నివేదిత పాఠశాల ఆవరణలో జరిగిన కొండల్‌రావు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొండలరావు రచించిన 6 పుస్తకాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో మానవ సంబంధాలు మంట కలిసిపోతున్నాయని అన్నారు. ఒకరితో ఒకరికి సంబంధం లేకుండగా, ఒకరి బాధను మరొకరు పంచుకోకుండా కొత్త యుగానికి తెరతీస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ ఒకప్పుడు బంధువులు ఇంటికి వస్తే ఎంతో ఆనందపడే వారమని, ఏదో ఒక సాకుతో తిరిగి పోనిచ్చేవారం కాదని అన్నారు. నేడు చుట్టాలు ఇంటికి వస్తున్నారని తెలిస్తేనే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. సామాజిక సమస్యలపై కొండల్‌రావు రచించిన పుస్తకాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్ రామరెడ్డి, నర్సింగరావు, వంగపల్లి విశ్వనాథం, నలిమెల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి– సీబీఎస్ మార్గంలో ఆర్టీసీ బస్సు



హెచ్‌సీయూ డిపోలో కొత్తగా 222పి రూట్లో నడిచే బస్సులు ఇవే

రాయదుర్గం: హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సులను గచ్చిబౌలి నుంచి సీబీఎస్ రూట్లో సోమవారం నుంచి నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గచ్చిబౌలిలోని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయం (మున్సిపల్ ఆఫీస్) నుంచి ప్రారంభమయ్యే ఈ బస్సును 222పి నెంబర్‌గా నిర్ణయించారు. మైహోం మంగళ, బొటానికల్ గార్డెన్, కొత్తగూడ, మాదాపూర్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి, నాగార్జున సర్కిల్, పెన్షన్ ఆఫీస్, మాసబ్ ట్యాంక్, లక్డీకా పూల్, అబిడ్స్, కోఠి మీదుగా సీబీఎస్ వరకు ఈ కొత్త బస్సు అందుబాటులో ఉంటుంది. జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ నుంచి ప్రతిరోజూ ఉదయం 5.55 గంటలకు, సీబీఎస్ నుంచి ఉదయం 5.15 గంటలకు బస్సులు మొదలవుతాయని హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

21 నుంచి రెండు రోజులపాటు వర్షాలు

- మండుటెండల్లో చల్లటి కబురు

లక్డీకాపూల్: మండుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులకు వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. ఈ నెల 21 నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గత కొద్దిరోజులుగా దంచికొడుతున్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాజాగా ఆదివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటినట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. రానున్న రెండు రోజులు వడగాలులు వీచే అవకాశం ఉందని, అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు.

'అన్‌బౌండ్' పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ వైద్యుడు డాక్టర్ వీరేందర్ సంగ్వాన్ జీవిత చరిత్ర 'అన్‌బౌండ్'పుస్తకాన్ని ఆదివారం బంజారాహిల్స్ బ్రాడ్‌వేలో డాక్టర్ జీఎన్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎన్ రావు మాట్లాడుతూ ఉత్తర భారత దేశంలోని చిన్న పట్టణం నుంచి హైదరాబాద్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఎల్వీప్రసాద్ నేత్రాలయం వరకు ఈ స్టోరీ మనల్ని తీసుకెళుతుందన్నారు. కార్యక్రమంలో వీరేంద్ర సంగ్వాన్, అంజు పోద్దార్, రాజ్ రోషన్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

సాధికారత కోసం మహిళా జర్నలిస్టులు కృషి చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ఉమా సుధీర్. చిత్రంలో రాధిక, సలీమ, స్వేచ్ఛ, నాగవాణి

చిక్కడపల్లి: ఇంటి పనితోపాటు వృత్తి నిర్వహణలో నిమగ్నమవుతున్న మహిళా జర్నలిస్టులు అనునిత్యం ఒత్తిడికి గురవుతున్నారని ఎన్డీటీవీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి ఉమా సుధీర్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని గుండు హన్మంతరావు హాల్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జర్నలిజం–మహిళలు– సవాళ్లు'అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమా సుధీర్ మాట్లాడుతూ సాధికారత సాధనకు మహిళా జర్నలిస్టులు నిరంతరం శ్రమించాలన్నారు. పురుషాధిక్యం ఉన్న పాత్రికేయ వృత్తిలో మహిళలు నాయకత్వ స్థాయికి ఎదగడం సులువు కాదని చెబుతూ స్వీయ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో జర్నలిజంపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ జర్నలిస్టులకు ప్రత్యేక హక్కులంటూ ఏమీ లేవన్నారు. హద్దులు మించిన వ్యాఖ్యానాలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్నాయని, ఇవి జర్నలిజం రంగాన్ని దిగజారుస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. నైతికత లేని జర్నలిజం విశ్వసనీయత కోల్పోతుందని చెప్పారు. అనంతరం పలువురు మహిళా జర్నలిస్టులకు అవార్డులను బహూకరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉప అధ్యక్షురాలు రాధిక, సీనియర్ జర్నలిస్టులు స్వేచ్ఛ, నాగవాణి, తులసి చందు, సలీమ, పి.విజయ, మణిమాల, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి షార్ట్‌టర్మ్ కోర్సు ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్, యూజీసీ మాలవీయ మిషన్ టీచర్ ట్రెనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 'లర్నర్–సెంటర్ పెడగోజీ'అనే అంశంపై నిర్వహిస్తున్న షార్ట్‌టర్మ్ కోర్సును సోమవారం వీసీ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో రెక్టర్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ సుష్మ తదితరులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'భూభారతి'లోనూ అనేక లోపాలు

వ్యవసాయ కార్మిక సంఘం నేత సారంపల్లి మల్లారెడ్డి



తెలంగాణలో భూచట్టాలు, ధరణి– భూభారతి చట్టాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: 'ధరణి'లో అనేక లోపాలు ఉన్నాయంటూ వాటిని పరిష్కరించకుండానే రద్దు చేసి తీసుకువచ్చిన భూభారతి చట్టం కూడా లోపభూయిష్టంగా ఉందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇండియన్ లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారధి రచించిన 'తెలంగాణలో భూచట్టాలు పరిణామక్రమం– ధరణి – భూభారతి చట్టాలు'అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టంలో కాస్తు కాలమ్ పెట్టకపోవడం పెద్ద లోపమని అన్నారు. ఈ రోజు వరకు కూడా చట్టంలో ఇంకా నిబంధనలను రూపొందించలేదని అన్నారు. ధరణిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జి.విద్యాసాగర్, ఎస్.బి.ఐ. అసిస్టెంట్ జీఎం మధుసూదన్‌రావు, టీపీఎస్‌పీ కార్యదర్శి ఎం.రాధేశ్యామ్, ఐలు నగర కార్యదర్శి సి.రామచంద్రారెడ్డి, నాయకులు వి.కామేశ్‌బాబు, పీఎస్‌ఎన్ మూర్తి, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీధాత్రి పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో పద్మశ్రీ ఉమామహేశ్వరి

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారదులుగా పనిచేసే పాత్రికేయులను సత్కరించడం అభినందనీయమని పద్మశ్రీ పురస్కార గ్రహీత ఉమా మహేశ్వరి అన్నారు. శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కేవీ రమణాచారి క్యాంపు కార్యాలయంలో పలువురు పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు శ్రీ ధాత్రి పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకట్‌రెడ్డి, మానస ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి రఘుశ్రీ, శ్రీ ఆకాంక్ష చారిటబుల్ వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల వేలం తగదు: ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ: గచ్చిబౌలి, ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను విక్రయించాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెందిన ఒక ఇంచు భూమి అమ్మినా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ భూముల అమ్మకాలను నిలిపివేయాలని, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్ల నిర్వహణపట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్, గురుకుల భవనాల అద్దెలు చెల్లించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో 295 హాస్టళ్లతోపాటు 320 బీసీ గురుకులాలకు సొంత భవనాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలను ప్రజా అవసరాలకు వినియోగించాలని, వాటిని అమ్మే హక్కు ఎవరికీ లేదన్నారు. నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రధాని మోదీకి ఫిర్యాదు చేసి పార్లమెంటులో ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వేముల రామకృష్ణ, అనంతయ్య, జి.మల్లేష్‌యాదవ్, ఎస్ రవికుమార్, మణికంఠ, నిఖిల్, ఆశీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తున్న ఆర్ కృష్ణయ్య, బీసీ నేతలు

ఉచితంగా సంస్కృత పాఠాలు



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ సంప్రదాయ విద్యను అందరికీ చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఏకదంత ఫౌండర్ డైరెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సంస్కృత భాషను ఉచితంగా నేర్చుకునేందుకు ఆన్‌లైన్‌లో పాఠాలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఏకదంత ఫండమెంటల్ కోర్సు మొదటి లెవెల్‌లో 15 పాఠాలు ఉండగా, దాదాపు రెండు వేల మంది విద్యార్థులు ఏకదంత.ఇన్ (ekadantha.in) వెబ్‌సైట్‌లో అభ్యసించారని తెలిపారు. ప్రస్తుతం రెండవ లెవల్ కోర్సు పోస్టర్‌ను ఆదివారం శ్రీ తత్త్వవిదానంద సరస్వతి ఆవిష్కరించారు. ఈ లెవల్‌లో మొత్తం 31 పాఠాలు ఉంటాయని పేర్కొన్నారు. సంస్కృతాన్ని నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఏకదంత వెబ్‌సైట్లో ఉచితంగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏకదంత ప్రధాన ఆచార్య సీహెచ్ సద్గుణ, దయానంద్ షణ్ముగం, కృపానంద్ షణ్ముగం, కాశెట్టి కుమార్, ఏకదంత అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న పద్మాచారి, ఎం.రవీంద్రకుమార్ తదితరులు

కాచిగూడ: తెలంగాణ ఉద్యోగుల సంఘం(సెంట్రల్ అసోసియేషన్) రూపొందించిన 'తెలంగాణ డైరీ –2025'ను ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం గౌరవ చైర్మన్ ఎ.పద్మాచారి ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు ఎం.రవీంద్రకుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల కరువు భత్యం, పింఛన్‌దారుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. జీఓ 317ను రద్దు చేసి రాష్ట్రపతి ఉత్తర్వులను పునః సమీక్షించాలని, నిర్ణయం వెలువడే వరకు పాత పది జిల్లాలను నోడల్ జిల్లాలుగా కొనసాగించాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో క్యాడర్ స్ట్రెంత్‌ను ప్రకటించి, అందుకు అనుగుణంగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.కృష్ణమూర్తి, గంగాపురం పద్మా రాజ్‌కుమార్, సీహెచ్ హరీష్ కుమార్ రెడ్డి, డాక్టర్ వి.సురేందర్, జి.జాకబ్, టి.శ్రీకాంత్ రావు, పి.పవన్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'మంటల స్నానం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్.గోపి, సుద్దాల అశోక్ తేజ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉదయ సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి మౌనశ్రీ మల్లిక్ రచించిన 'మంటల స్నానం' పుస్తకావిష్కరణ సభను ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్.గోపి మాట్లాడుతూ.. మౌనశ్రీ మల్లిక్ రానున్న రోజుల్లో మరిన్నికవితా సంపుటిలను వెలువర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఉదయ సాహితీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ద్యాసం సేనాధిపతి, నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాస్, కవయిత్రి ఎన్.రమాదేవి, ఉదయ సాహితీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మూర్తి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

- ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలి
- 5కే రన్ ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు





5కే రన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, బండి రమేష్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆరోగ్యం కోసం నిత్యం వ్యాయామం చేయాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అవని ఆర్గనైజేషన్ చైర్మన్ శిరీష సత్తూర్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, తులసివనం వద్ద 5కే రన్ టూ హానర్ విమెన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 5కే రన్‌కు ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో యువత, మహిళలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిలు బండి రమేష్, జగదీశ్వర్‌గౌడ్, పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత జగదీష్‌గౌడ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మంజుల యాదవ్, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను రెచ్చగొడుతున్న బీఆర్‌ఎస్

టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్



ఉస్మానియా యూనివర్సిటీ: న్యాయమైన ఉద్యమాలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మద్దతుగా ఉంటుదని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఓయూను ముళ్ల కంచెలతో నిర్బంధించిన చరిత్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ నాయకులు ఓయూలో అలజడి సృష్టించి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే దురాలోచనతో విద్యార్థులను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డిని దూషిస్తూ దిష్టిబొమ్మలు దహనం చేయడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ధ్వంసమైన విద్యా వాతావరణం నేటికీ కోలుకోలేదని పేర్కొన్నారు. ఓయూ పూర్వవిద్యార్థులకు డబ్బులు ఇచ్చి ఆందోళనలు చేయించడం మానుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులకు హితవు పలికారు.

శెభాష్.. కానిస్టేబుల్ రాజేశ్!

- రోడ్డుపై పడిపోయిన డబ్బుల బ్యాగ్
- బాధితుడి చెంతకు చేర్చి నిజాయితీ చాటుకున్న వైనం




డబ్బుల బ్యాగ్‌ను బాధితుడికి అప్పగిస్తున్న ఎస్ఐ నవీన్‌కుమార్, కానిస్టేబుల్ రాజేష్

చందానగర్: రోడ్డుపై దొరికిన డబ్బుల బ్యాగ్‌ను తిరిగి బాధితుడికి అప్పగించి ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ నిజాయతీని చాటుకున్నారు. వివరాలు... మియాపూర్ ఆల్విన్ క్రాస్ రోడ్డు కూడలిలో మియాపూర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజేష్ ఆదివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నారు. 01.20 గంటల ప్రాంతంలో అక్కడే రోడ్డుపై మూడు రూ.500 నోట్ల కట్టలు (సుమారు రూ.1.50 లక్షలు) ఉన్న బ్యాగ్ రాజేశ్ కంటపడింది. వెంటనే ఆయన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలకు సమాచారం అందించారు. అయితే కూకట్‌పల్లికి చెందిన బంగారం వ్యాపారి మధుసూదన్ రావు హఫీజ్‌పేట్‌లో ఆభరణాలను విక్రయించి తిరిగి వస్తుండగా డబ్బులున్న బ్యాగు పోగొట్టుకున్నారు. ఆ తర్వాత గ్రహించిన వ్యాపారి వెంటనే ట్రాఫిక్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు అతడిని విచారించి సాయంత్రం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నవీన్ కుమార్ చేతుల మీదుగా బాధితుడికి డబ్బులను అందజేశారు. అనంతరం కానిస్టేబుల్ రాజేష్‌ను ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, ఎస్ఐ నవీన్‌కుమార్‌లు అభినందించారు.

'రాత్రి మొత్తం నా వైఫ్ బాడీ పెయిన్స్ అంటూ అటూ ఇటూ కదులుతుండటంతో పక్కనే ఉన్న నాకు కూడా నిద్ర పట్టలేదు' పొద్దున్నే ఆఫీస్‌లో తాను పడుతున్న కునికిపాట్ల కారణాన్ని కొలీగ్‌తో పంచుకున్నాడు నగరవాసి తరుణ్.. 'మా భర్త నైట్ అంతా గురకపెడతారు.. దాంతో నాకు నిద్రే ఉండటం లేదు' అంటూ ఫ్రెండ్ దగ్గర తన గోడు వెళ్లబోసుకుంది ఓ వివాహిత. ఇలాంటి సమస్యలతో నిద్రలేమికి గురవుతున్న కొందరు నగరవాసులు దీనికో పరిష్కారాన్ని ఎంచుకున్నారు. దాని పేరే స్లీప్ డివోర్స్.. పరస్పర అంగీకారంతో దూరదూరంగా నిద్రించడమే నిద్ర విడాకులు..

- సాక్షి, సిటీబ్యూరో





సోలో స్లీపే.. సో బెటరూ..




సిటీలోనూ పెరుగుతున్న స్లీప్ డివోర్స్

నాణ్యమైన రాత్రి నిద్ర కోసం దేశంలో 78% జంటలు 'నిద్ర విడాకులు'ను ఎంచుకుంటున్నాయి. మార్చి 14న ప్రపంచ నిద్ర దినోత్సవం పురస్కరించుకుని నిద్రలేమి సమస్యకు పరిష్కారాలను అందించే రెస్‌మెడ్.. నగరంతో పాటు అంతర్జాతీయంగా నిర్వహించిన స్లీప్ సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది. నిద్ర నాణ్యతను మెరుగుపరచడానికి జంటలు వేర్వేరు బెడ్‌లు/ బెడ్‌రూమ్‌లలో నిద్రించే ఈ పద్ధతి ఒకప్పుడు నిషిద్ధంగా లేదా వైవాహిక అసమ్మతికి సంకేతంగా పరిగణించేవి. అయితే ఇప్పుడు ఈ ధోరణి మెరుగైన ఆరోగ్యం, సంబంధాల సామరస్యానికి దోహదపడేదిగా గుర్తింపు పొందుతోంది.

మంచి నిద్రతోనే.. మెరుగైన జీవనం..

'మనం ఏది సాధించాలన్నా తగినంత నిద్ర ఉండాలి. అది జీవితంలోని అనేక సమస్యలను పరిష్కరిస్తుంది' అని హైటెక్ సిటీలోని కేర్ హాస్పిటల్స్‌లో కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్న డాక్టర్ సతీష్ సి రెడ్డి అంటున్నారు. 'ఒక వైద్యుడిగా, రోగుల ఆరోగ్యం, ఉత్పాదకత మాత్రమే కాదు సంబంధాలపై కూడా నిద్రలేమి చూపించే దుష్ప్రభావాలను నగరంలో పలువురిలో చూస్తున్నాను. చాలా మంది ప్రతిరాత్రి దాదాపు 7 గంటల పాటు నిద్రపోతున్నా, వారు వారానికి నాలుగు రాత్రులు మాత్రమే అధిక–నాణ్యత కలిగిన నిద్రను పొందుతున్నారు. నిద్ర ప్రాముఖ్యతను గుర్తించినా 22% మంది తమ నిద్ర సమస్యలకు సహాయం తీసుకోవాలని అనుకోరు' అని ఆయన చెప్పారు.



నిద్ర విడాకులకు కారణాలు

జంటల్లో ఇద్దరికీ ఉండే భిన్నమైన అలవాట్లు, స్క్రీన్ టైమ్, విభిన్న అవసరాలు, నిద్ర విధానాలు, గురక, గదిలోని ఉష్ణోగ్రత ప్రాధాన్యతలు, అతిగా కదిలే చంచలత్వం, నిద్ర రుగ్మతలు.. శారీరక సౌలభ్యం వంటి వివిధ కారణాలతో జంటలు ఈ విడాకులు తీసుకుంటున్నాయి. అలాగే మానసిక ఆరోగ్య సంబంధిత కారకాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు ఒక భాగస్వామి శస్త్రచికిత్స నుంచి కోలుకుంటున్నట్లయితే లేదా దీర్ఘకాలిక నొప్పితో ఉన్నట్లయితే, విడివిడిగా నిద్రపోవడం వల్ల మరొకరి విశ్రాంతికి అంతరాయం కలగకుండా సహకరించినట్లు అవుతుందనే ఆలోచన.



బలపడుతున్న బంధం..

ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ స్లీప్ మెడిసిన్ కన్సల్టెంట్, డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్, (పల్మోనాలజీ–గోల్డ్ మెడల్) మాట్లాడుతూ జంటలు వ్యక్తిగత స్థలం, వ్యక్తిగత నిద్ర అవసరాలు సంబంధాల మధ్య సమతుల్యం చేయడానికి నిద్ర విడాకులను ఎంచుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. నిద్ర నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడం వాస్తవానికి, చాలా మంది జంటలకు, తమ సాన్నిహిత్యాన్ని మెరుగుపరచే ఒక మంచి మార్గంగా ఉపయోగపడుతుందనీ ఇద్దరూ తమకు అవసరమైన విశ్రాంతిని పొందేలా సహకరిస్తుంది' అని ఆయన చెప్పారు. గతంలో భావించినట్లు నిద్ర విడాకులు ఆప్యాయత లేదా ప్రేమ లేకపోవడాన్ని సూచించడానికి బదులు, ఇది ఒకరి వ్యక్తిగత విశ్రాంతికి మరొకరు ఇస్తున్న ప్రాధాన్యతను వెల్లడిస్తుందన్నారు.

ప్రయోజనాలూ.. ప్రతికూలతలూ..

మెరుగైన నిద్ర నాణ్యత, తగ్గిన నిద్ర అంతరాయాలు, మెరుగైన సాన్నిహిత్యం, ఎక్కువ వ్యక్తిగత స్థలం, బలమైన రోగనిరోధక వ్యవస్థ, మెరుగైన మానసిక స్థితి, మెరుగైన పని తీరు, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక పరిస్థితుల ప్రమాదాన్ని తగ్గించడం వంటివి నిద్ర విడాకుల ద్వారా పొందే ప్రయోజనాలు. కాగా.. కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. 'చాలా మంది జంటలు నిద్ర విడాకుల నుంచి ప్రయోజనం పొందుతున్నప్పటికీ, ఇది కొన్నిసార్లు మానసిక, శారీరక సాన్నిహిత్యాన్ని తగ్గించే ప్రమాదం ఉంది. అలాగే దూరంగా నిద్రపోవడాన్ని ఇప్పటికీ సంబంధాల సమస్యకు సంకేతంగా చూస్తారు. కాబట్టి సామాజిక ఆక్షేపణలకు దారితీస్తుంది. 'ఏది ఏమైనా ప్రస్తుత పరిస్థితుల్లో నిద్రలేమి కారణంగా రకరకాల సమస్యలకు గురవడం కన్నా.. నిద్ర విడాకులు, ఆరోగ్యకరమైన, ఆచరణాత్మక ఎంపిక' అని డాక్టర్ బాలసుబ్రమణియన్ స్పష్టం చేశారు.

- ➜ బంధాల బలోపేతమే లక్ష్యంగా.. సోలో స్లీప్
- ➜ పరస్పర అంగీకారంతో తాత్కాలిక సర్దుబాటు
- ➜ మంచి నిద్రకు ఉపయుక్తం అంటున్న వైద్యులు
- ➜ బెడ్‌కు జై.. భాగస్వామికి బై అంటున్న కపుల్స్
- ➜ సిటీ సహా దేశంలో 78శాతం జంటల్లో స్లీప్ డివోర్స్
- ➜ రెస్‌మెడ్.. అధ్యయనంలో వెల్లడి

సిటీని 'శృతి' చేయడానికి..



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణాదిలో ప్రముఖ సినీనటి శృతిహాసన్ షాడోస్ అండ్ సిల్హోట్స్ పేరిట నగరంలో తన ప్రదర్శన ఇవ్వనున్నారు. నటిగానే కాకుండా పాప్, రాక్ గాయనిగానూ తనదైన శైలిలో రాణిస్తున్న శృతి హాసన్ నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న 'ఓడియమ్ బై ప్రిజ్మ్'లో సంగీత, సినీ అభిమానుల్ని ఉర్రూతలూగించనున్నారు. ఈ నెల 28న రాత్రి 8గంటల నుంచి ఆమె సంగీత కార్యక్రమం ఉంటుంది.

నగరాన్ని.. నవ్వించేందుకు..

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా స్టాండప్ కమెడియన్‌గా పేరొందిన ఢిల్లీవాసి గౌరవ్ కపూర్ నగరానికి వస్తున్నారు. ఈ నెల 23న నగరంలోని శిల్పకళా వేదికలో ఆయన తన హాస్య ప్రదర్శన సమర్పిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా బలమైన ముద్ర వేసిన గౌరవ్.. తన వెరైటీ కామెడీ ద్వారా లక్షల సంఖ్యలో అభిమానుల్ని సంపాదించుకున్నారు.



సప్తపర్ణిలో.. వీనుల విందుగా..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సంప్రదాయ సంగీతజ్ఞురాలు గాయని రంజని శివకుమార్ బంజారాహిల్స్‌లోని సప్తపర్ణిలో వీనుల విందు చేయనున్నారు. బర్డ్ సాంగ్ బై బర్డ్ సాంగ్ అంటూ స్వయంగా పక్షి ప్రేమికురాలైన ఆమె ఆ కిలకిలల రాగాలను సైతం పరిచయం చేస్తారు. సంప్రదాయ సంగీతాభిమానులను అలరించేందుకు ఈ నెల 22న ఈ సంగీత కార్యక్రమం రాత్రి 6.30 గంటల నుంచి ప్రారంభం కానుంది.

గానాభిమానులు.. ఉర్రూతలూగేలా..

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ సినీ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్.. తన గానాభిమానుల్ని ఉర్రూతలూగించనున్నారు. నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ఓపెన్ గ్రౌండ్స్‌లో చివాస్ కన్సర్ట్ పేరుతో తనదైన శైలిలో ఆయన సంగీత ప్రదర్శన సమర్పిస్తున్నారు. సిటీలో రాహుల్ అందిస్తున్న అతిపెద్ద మ్యూజిక్ షో అని నిర్వాహకులు పేర్కొంటున్న ఈ కార్యక్రమం ఈ నెల 29న రాత్రి 7గంటలకు ప్రారంభం కానుంది.



సలేహా షో.. మెస్మరైజ్ చేసేలా..



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ పార్టీలకు ఈవెంట్స్‌కు పేరొందిన ఉదయపూర్‌కు చెందిన గాయని సలేహా, ప్రస్తుతం నగరంలో ఉంటూ సంగీతాభిమానుల్ని, పార్టీ పీపుల్‌ని తన మ్యూజిక్ కన్సర్ట్స్‌తో అలరిస్తున్నారు. నాలెడ్జ్ సిటీలోని హార్డ్ రాక్ కేఫ్ తమ అతిథుల కోసం నిర్వహిస్తున్న అన్ ప్లగ్డ్ ట్యూజ్ డేస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25న తన లైవ్ షో సమర్పిస్తున్నారు. రొమాంటిక్ ఆంగ్ల గీతాలతో పాటు బాలీవుడ్‌నూ కలిపి ఆమె పార్టీ ప్రియుల్ని మెస్మరైజ్ చేయనున్నారు.







హైదరాబాదీ ప్యార్ కా తోఫా..

గోల్కొండ: రంజాన్ అంటే మొదట గుర్తుకు వచ్చేది ఉపవాస దీక్ష.. ఉదయం నుంచి కఠిన ఉపవాసం చేసి సాయంత్రం పూట ఇఫ్తార్ విందులో రకరకాలైన పండ్లు ఆరగించి దీక్ష విరమిస్తారు. అందులో భాగంగా మార్కెట్‌లో పెద్దఎత్తున లభించే సీజనల్ ఫ్రూట్స్‌ను అందంగా ప్యాకింగ్ చేసి స్నేహితులు, బంధువులకు అందజేయడం హైదరాబాదీల ప్రత్యేకత.. కొత్తగా బంధుత్వాలు కలిసిన వారు తమ బంధుత్వాన్ని మరింత పటిష్టం చేసుకోవడానికి వారి వారి స్థాయి మేరకు ఫ్రూట్స్ ప్యాక్స్‌ను అందజేస్తుంటారు. ఉద్యోగులు, వ్యాపారులు, స్నేహితులు ఇలా అందరూ పండ్లను అందజేసి శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ మహా నగరంలో ఫ్రూట్స్ గిఫ్ట్ ప్యాక్ అందజేసే సంస్కృతి కొనసాగుతోంది. రంజాన్ మాసంలో కొంత మంది షాపుల యజమానులు ప్యాకింగ్ చేయడంలో సిద్ధహస్తులైన వారిని నియమించుకొని ప్యాకింగ్ చేయించుకుంటారు.





క్వాలిటీ ఖర్జూరాలు ఉపయోగించి..

గిఫ్ట్ ప్యాక్‌లో పెట్టడానికి వాడే పండ్ల రకాలను బట్టి ధరలు ఉంటాయని మెహిదీపట్నం ఎస్‌ఏ రాయల్ ఫ్రూట్ మార్ట్ వ్యాపారి అబ్దుల్ అజీజ్ అంటున్నారు. మొత్తం 23 రకాల పండ్లతో సుపీరియర్ గిఫ్ట్ ప్యాక్‌లను ప్రత్యేకంగా తయారు చేస్తామని అన్నారు. ఇందులో 23 రకాల పండ్లతో మొత్తం 19 కిలోల పండ్లు ఉంటాయి. అదే డీలక్స్ ఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్‌లో 18 రకాల పండ్లు ఉండగా వీటిలో 14 కిలోల బరువు ఉంటుంది. అదేవిధంగా 11 రకాల పండ్లతో 10 కిలోల బరువు ఉండే ఫ్యాన్సీ గిఫ్ట్ ప్యాక్ కూడా అందుబాటులో ఉంది. ఏడు రకాల పండ్లు, ఆరు కిలోల గిఫ్ట్ ప్యాక్‌లు కూడా ఎక్కువగా అమ్ముడవుతాయి. నెంబర్ వన్ క్వాలిటీ ఖర్జూరా పండ్లు ఉపయోగిస్తామని ఆయన వివరించారు. వీటి ధరలు రూ.550 నుంచి రూ.18 వేల వరకు ఉంటాయని చెప్పారు.



లగ్జరీ బ్యూటీ @ పెరల్స్ సిటీ

సాక్షి, సిటీబ్యూరో: లగ్జరీ బ్యూటీ, ఎస్తెటిక్ ట్రీట్‌మెంట్‌లకు హైదరాబాద్ కేంద్రంగా నిలుస్తోందని సినీ నటి, 'బేబీ' సినిమా ఫేమ్ వైష్ణవి చైతన్య పేర్కొన్నారు. కొండాపూర్‌లో ఫెమినా ఫ్లాంట్ స్టూడియో, శిఖర క్లీనిక్స్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఫెమినా ఫ్లాంట్ స్టూడియో సెలూన్, శిఖర క్లీనిక్స్ అందిస్తున్న విలాసవంతమైన సేవలు తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. వేగంగా మారుతున్న జీవనశైలిలో సెల్ఫ్–కేర్, అత్యంత నాణ్యమైన బ్యూటీ ట్రీట్మెంట్స్ ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ ఫిలిండెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సినీ నిర్మాత దిల్‌రాజు సతీమణి వైగారెడ్డి, శిఖర క్లీనిక్స్ వ్యవస్థాపకులు కల్లెం రాఘవేంద్రరెడ్డి, ఫ్రాంచైంజి నిర్వాహకులు విజయ్‌కుమార్, కృష్ణవేణి, శ్రవంతి, రూప పాల్గొన్నారు.



తెలుగు రుచుల సమ్మేళనం

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు సంప్రదాయ ఆహార వంటకాలు అద్భుతమైన రుచితో పాటు వైవిధ్యాన్ని కలిగి ఉంటాయని ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ తెలిపారు. నగరంలోని కొంపల్లి వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన అంతేరా కిచెన్ అండ్ బార్‌ను ఆదివారం సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతేరా క్రమక్రమంగా నగరంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించడం శుభ పరిణామమన్నారు. వంటకాలను ఆస్వాదిస్తూ అభిమానులతో సందడి చేశారు. వ్యవస్థాపక భాగస్వాములు ఆశిష్‌రెడ్డి, అనురాగ్‌రెడ్డి పాల్గొన్నారు.



మల్లన్న స్వామి సల్లంగ చూడు

నెత్తిన బోనాలు.. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు. ఎటు చూసినా భక్తజనంతో ఊరంతా హోరెత్తింది. ఉత్తర తెలంగాణలోనే అతిపెద్దదైన మల్లన్న బోనాల జాతర జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. సుమారు 50 వేల మందికి పైగా ఉత్సవాల్లో స్వామివారికి బోనాలు సమర్పించారు. ఏటా కాముడి పౌర్ణమి తర్వాత.. మొదటి ఆదివారం ఈ జాతర ఉత్సవాలను నిర్వహించడం అనవాయితీ. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించారు. గొర్రె పిల్లలు, బెల్లం కానుకగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల తర్వాత రథోత్సవం నిర్వహించారు. జాతరకు జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలి వచ్చారు. - మెట్‌పల్లి రూరల్



ఠాణాకొచ్చి.. రికార్డులు పరిశీలించి..

దక్షిణ దిగ్యాత్రలో భాగంగా ఠాణాకు వెళ్లిన ధర్మపురి నృసింహుడు

జగిత్యాల జిల్లా ధర్మపురిలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహ స్వామి స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రత్యేక పూజలు అందుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన నృసింహుడి దక్షిణ దిగ్యాత్రను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి సీఐ రాజనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, పోలీసులు స్వాగతం పలికారు. అక్కడే వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం.. అక్కడ రికార్డులు పరిశీలించడం.. ప్రత్యేక పూజలందుకోవడం దేశంలోనే అరుదైన సనాతన సంప్రదాయంగా వస్తోంది. - ధర్మపురి



రాజన్నకు కల్యాణోత్సవ శోభ

వేములవాడలో ఘనంగా ప్రారంభమైన ఉత్సవాలు

శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 7.33 గంటలకు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. మేళతాళాలతో స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రదక్షిణలు నిర్వహించి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అర్చకులకు దేవస్థానం తరఫున వర్ని–దీక్షావస్త్రాలు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. నమిలకొండ ఉమేశ్‌శర్మ సారథ్యంలో కల్యాణమండపంలో భేరీ పూజ, దేవత ఆహ్వానం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. సోమవారం ఉదయం 10.50 గంటలకు పార్వతీరాజరాజేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - వేములవాడ

క్లుప్తంగా...

అసెంబ్లీలో సీఎం ఏకపాత్రాభినయం

- ప్రజలకు ముఖం చూపించలేని స్థితిలో రేవంత్ ప్రభుత్వం: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముఖం చూపించలేని పరిస్థితిలో ఉందని బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీల ఎగవేత, సమాధానాల దాటవేతతో సరిపెట్టుకుంటోందని, అసెంబ్లీలో సీఎం ఏకపాత్రాభినయం చేస్తున్నారని మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగంపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాటవేశారని విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు, అభివృద్ధి అంశాలపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. రుణమాఫీ పూర్తిచేశామని గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. నిర్మల్‌లో ఏ గ్రామంలోనైనా రుణమాఫీ పూర్తిగా అయ్యిందని నిరూపిస్తే ఎంతటి శిక్షకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. లంకె బిందెల కోసమే ఫ్యూచర్ సిటీ, కొడంగల్ డెవలప్‌మెంట్, మూసీ ప్రక్షాళన, హైడ్రా అంశాలను ఎత్తుకున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దూప్ ఫైట్ చేస్తున్నాయని విమర్శించారు. కేటీఆర్ దుబాయ్‌లో ఏం చేశాడో రికార్డులు ఉన్నాయని, వాటిని బయటపెట్టి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

హెల్త్ కమిషన్ ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో విద్యాకమిషన్‌లాగానే.. హెల్త్ కమిషన్‌ను తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం కోఠిలోని ఐఎంఏ ప్రధాన కార్యాలయంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన ప్రజారోగ్యానికి వ్యతిరేకంగా నకిలీ వైద్యం అనే అంశంపై చర్చ కార్యక్రమం జరిగింది. కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ వైద్యం ఉందన్న విషయం కాదనలేని సత్యమని, అయితే దాని నియంత్రణకు తాను సిద్ధమేనని, కానీ నిర్మూలన వెంటనే సాధ్యం కాదన్నారు.నకిలీ విత్తనాలు, నకిలీ మందులను ప్రభుత్వం ఏరివేసినట్టుగానే నకిలీ వైద్యం చేసే వారిని నిర్మూలించేలా చట్టం తీసుకురావాలని డాక్టర్లు డిమాండ్ చేశారు. ఈ చర్చ సందర్భంగా గతంలో ఆర్‌ఎంపీలకు కోదండరాం మద్దతు పలికారంటూ కొందరు వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు డాక్టర్ గోవింద్‌రెడ్డి, మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కిషన్, డాక్టర్ ప్రతిభ లక్ష్మీ, డాక్టర్ రజిత, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేలంగి వర్సెస్ సిధారెడ్డి

- జయ జయహే తెలంగాణ గేయంపై సభలో చర్చ

నాంపల్లి: తెలుగు భాష పరిరక్షణపై ఆదివారం తెలుగువర్సిటీలో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ గేయంపై చర్చ జరిగింది. దర్శకుడు రేలంగి నర్సింహారావు మాట్లాడుతూ జయ జయహే తెలంగాణ గీతాన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారన్నారు. దీనిపై తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. పాత ట్యూన్ కాకుండా, దానిని మార్చి రికార్డింగ్ చేశారని సిధారెడ్డి అన్నారు. ఓ దశలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మాటల తూటాలు తారస్థాయికి చేరుకున్నాయి. చివరకు రేలంగి నర్సింహారావు వేదిక దిగి..సభను బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు.

తల్లి భాషను పరిరక్షించుకోవాలి

తల్లి నేర్పే భాషే మాతృభాష అని, అలాంటి భాషను పరిరక్షించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమైక్యభారతి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీలోని నందమూరి తారకరామారావు కళామందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి, దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలు జరిగాయి. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు అధ్యక్షతన జరిగిన సభలో కోయి కోటేశ్వర్రావు హాజరయ్యారు.

డీసీసీలు ఇక పవర్‌ఫుల్!

పార్టీ జిల్లా అధ్యక్షులకు ప్రాధాన్యం

- నామినేటెడ్ పదవులు, టికెట్ల కేటాయింపు ప్రక్రియలో భాగస్వామ్యం
- మీనాక్షి నటరాజన్ ప్రతిపాదనలకు ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్
- మారనున్న డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ
- జిల్లాకు ముగ్గురి పేర్లతో ప్యానల్.. స్థానిక నేతల మొగ్గు ఉన్న వారికే పదవి



సాక్షి, హైదరాబాద్: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లు ఇకపై బలోపేతం కానున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షులకు అధిక ప్రాధాన్యత లభించనుంది. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ మొదలు స్థానిక సంస్థలు, అసెంబ్లీ, లోక్‌సభ టికెట్ల కేటాయింపులోనూ డీసీసీ అధ్యక్షులను భాగస్వాములను చేయాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భావిస్తున్నారు. ఈ మేరకు ఆమె చేసిన ప్రతిపాదనకు ఏఐసీసీ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. లోక్‌సభ టికెట్ల కేటాయింపు కోసం ఏఐసీసీ ఏర్పాటు చేసే సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) తరహాలోనే రాష్ట్ర స్థాయిలో టికెట్ల కేటాయింపు కోసం ఏర్పాటు చేసే కమిటీల్లో డీసీసీ అధ్యక్షులను నియమించాలని ఆమె ప్రతిపాదించినట్టు తెలుస్తోంది.

సిఫారసులు, లాబీయింగ్‌కు చెల్లుచీటీ

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో సంస్థాగతంగా భారీ మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు ప్రధాన నాయకుల సిఫారసు, లాబీయింగ్ ప్రాతిపదికన జరుగుతున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామక ప్రక్రియ ఇకపై పూర్తిగా మారిపోనుంది. మీనాక్షి నటరాజన్ మార్కు డీసీసీ అధ్యక్షుల నియామకాల్లో కనిపించనుందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. పార్టీలో జిల్లా, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులు కీలకమైనందున పీసీసీ అధ్యక్షుడి పర్యవేక్షణలో ఈ మూడు స్థాయిల్లోని పదవులను పకడ్బందీగా భర్తీ చేయాలని ఆమె యోచిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా డీసీసీ అధ్యక్షుల నియామకంలో సిఫారసులకు కాకుండా స్థానిక నాయకత్వం అభిప్రాయాలకు ప్రాధాన్యతనివ్వాలని పార్టీ ఇన్‌చార్జి భావిస్తున్నారు. అందులో భాగంగా డీసీసీ అధ్యక్ష పదవుల కోసం జిల్లాకు మూడు పేర్లతో ప్యానెల్ తయారు చేయాలని, ఆ మూడు పేర్లపై స్థానిక నాయకుల నుంచి అభిప్రాయసేకరణ జరిపి, ఎవరికి ఎక్కువ మొగ్గు కనిపిస్తే వారిని డీసీసీ అధ్యక్షులుగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుత కసరత్తు నేపథ్యంలో జిల్లా అధ్యక్షుల నియామకానికి కొంత సమయం పడుతుందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

త్వరలో టీపీసీసీ కార్యవర్గం!

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీపీసీసీ కార్యవర్గం కూడా త్వరలోనే వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతానికి పీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, 20 మంది వరకు ఉపాధ్యక్షులను నియమిస్తారని, ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యదర్శులు, అధికార ప్రతినిధులు తదితర పదవులు ఆ తర్వాత ప్రకటిస్తారని సమాచారం. వాస్తవానికి దీపాదాస్ మున్షీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడే పీసీసీ కార్యవర్గంపై కసరత్తు జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు మున్షీతో భేటీ అయి టీపీసీసీ కార్యవర్గం కోసం కొంత కసరత్తు చేశారు. అయితే మీనాక్షి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఈ జాబితాను పూర్తిగా పక్కన పెట్టారని, పార్టీలో సీనియార్టీ, గతంలో నిర్వహించిన పదవుల ప్రాతిపదికన ఆమె జిల్లాల వారీగా జాబితాను తయారు చేస్తున్నట్టు సమాచారం. నెలాఖరుకు కొత్త కార్యవర్గాన్ని ప్రకటిస్తారని తెలుస్తోంది.

మంత్రివర్గ విస్తరణకూ మోక్షం?

రాష్ట్రంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణ అంశాన్ని కూడా పరిష్కరించాలని ఏఐసీసీ నిర్ణయించింది. ఇందుకోసం పలుమార్లు రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపిన ఢిల్లీ పెద్దలు ఓ అభిప్రాయానికి వచ్చారని, సామాజిక కోణంలో ఐదు లేదా ఆరు బెర్తులు భర్తీ చేసే విధంగా త్వరలోనే గ్రీన్‌సిగ్నల్ వస్తుందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. అంతా సవ్యంగా జరిగితే నెలాఖరులోపు మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల జాబితాకు కూడా క్లియరెన్స్ ఇప్పించేందుకు మీనాక్షి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

30లోగా రేషన్‌కార్డులు

వచ్చే నెల నుంచి సన్నబియ్యం • మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



అభివాదం చేస్తున్న ఉత్తమ్, తుమ్మల, సావేల్, దామోదర్‌రెడ్డి, వీరేశం

తుంగతుర్తి: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈనెల 30వ తేదీలోగా రేషన్‌కార్డులు అందజేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వచ్చే నెల నుంచి ప్రజలకు సన్న బియ్యం అందజేస్తామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రేషన్‌కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కృతజ్ఞత సభకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన హాజరయ్యారు. పస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. రూ.160 కోట్లు ఖర్చు చేసి శాస్త్రీయంగా బీసీ కుల గణన సర్వే పూర్తి చేశామని పేర్కొన్నారు. 2026లో జనాభా గణన జరిగినప్పుడు ఎంత శాతం రిజర్వేషన్ వస్తే అంత శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామ్యేల్, వేముల వీరేశం, లక్ష్మీకాంత్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు

- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి



పూబెల్లిలో ఇంటి నిర్మాణానికి దంపతులతో భూమిపూజ చేయిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు రూరల్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా, కేంద్ర ప్రభుత్వం అరకొర సాయం చేస్తూ అనేక అడ్డంకులు సృష్టించినా రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆగదని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన పూబెల్లిలో 83 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. పేదల చిరకాల వాంఛ అయిన సొంతింటి నిర్మాణాన్ని నూరు శాతం అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ ఏడాది మొదటి విడతగా రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. పొంగులేటి వెంట ఎమ్మెల్యే కోరం కనకయ్య ఉన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ టీఎస్ (పీఆర్‌టీయూటీఎస్) రాష్ట్ర అధ్యక్షునిగా గుండు లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సంఘం ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి తెలిపారు. సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. లక్ష్మణ్ గతంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా, సంగారెడ్డి, మెదక్ జిల్లాల అధ్యక్షునిగా పనిచేశారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో ఉన్న పింగిలి శ్రీపాల్ రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికవడంతో కొత్త అధ్యక్షుని ఎన్నిక అనివార్యమైంది. సమావేశానికి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి, మహేందర్ రెడ్డి హాజరయ్యారు.

సోషల్ మీడియాను నియంత్రించాలి

- భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతులు తిట్టడం కాదు
- మొత్తం మీడియాను నియంత్రించటమూ ప్రమాదమే
- రౌండ్‌టేబుల్ సమావేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి

పంజగుట్ట: సోషల్ మీడియాను నియంత్రించాల్సిన అవసరం ఉందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. అలా అని మీడియాను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి ఇస్తే ఎంతో ప్రమాదమని పేర్కొన్నారు. జర్నలిస్టులకు మాత్రమే ఎలాంటి ప్రత్యేక స్వేచ్ఛ, హక్కులు ఉండవని.. రాజ్యాంగంలోని భావప్రకటన స్వేచ్ఛ ప్రతీ ఒక్కరికీ ఉంటుందని తెలిపారు. అయితే, ఇతరుల గురించి బూతులు మాట్లాడే స్వేచ్ఛ ఎవరికీ ఉండదని స్పష్టంచేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) ఆధ్వర్యంలో 'సోషల్ మీడియాలో వాడుతున్న భాష సమంజసమేనా?' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. టీయూజేఎస్ అధ్యక్షుడు ఎంఎం రహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలను నియంత్రించేందుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కొద్దిమంది చేస్తున్న తప్పుడు చర్యలవల్ల పూర్తిగా భావప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని, దానివల్ల ఫాసిజం వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. కోదండరామ్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడకపోతే అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. జర్నలిస్టులే స్వీయ నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న నాయకుల నోటినుంచి కూడా బూతులు రావడం బాధాకరమని అన్నారు. సమావేశంలో పీవోడబ్ల్యూ సంధ్య, జర్నలిస్టు సంఘాల నాయకులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య, వేణుగోపాల్ నాయుడు, పాశం యాదగిరి, రమణ, పి.వి.శ్రీనివాస్, ఎం.డి.రఫీ, సోగరాబేగం తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1పై అనుమానాలు నివృత్తి చేయాలి

- గ్రూప్ 2లో 13 వేలమందిని ఎందుకు అనర్హులుగా ప్రకటించారు?
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: గ్రూప్ 1 ఫలితాలపై అభ్యర్థులు లేవనెత్తుతున్న అనుమానాలను ప్రభుత్వంతో పాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నివృత్తి చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో 11 వర్సిటీలవిద్యార్థుల ప్రతినిధులు ఆదివారం కవితను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. పేపర్ల మూల్యాంకనంలో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని విద్యార్థులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్ నంబర్లు జారీచేయటంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు 13 వేల మంది గ్రూప్ 2 అభ్యర్థుల ఫలితాలు టీజీపీఎస్సీ వెల్లడించలేదని, ఏ కారణంతో వారిని ఇన్వాలిడ్‌గా ప్రకటించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కవితను కలిసిన వారిలో సత్య, గౌతమ్, దత్తాత్రేయ, లింగం, అశోక్‌యాదవ్ ఉన్నారు.

తెలంగాణ భాష మనకు గర్వకారణం: ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ భాషలో మరింత విస్తృతంగా సాహిత్యం రావాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'తెలంగాణ భాషలో కవితలు, కథల పోటీ'లకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ భాషలో కవితలు, కథలు రాసి మే 30వ తేదీలోపు haridaasaraswathiraj@gmail. comకు మెయిల్ చేయాలని, వివరాలకు 9948032705 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



వాట్సాప్ అంటే చాటింగ్ మాత్రమే అనుకుంటివా.. గన్స్ ట్రేడింగ్ కూడా..

వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇదే నిజం. భారత్‌లో వాట్సాప్ చాటింగ్ ద్వారానే తుపాకులు, ఇతర ఆయుధాల అమ్మకం జోరుగా సాగుతోంది. ఇదే విషయాన్ని ప్రముఖ సోషల్ మీడియా టూల్స్ పరిశోధక సంస్థ డిజిటల్ విట్నెస్ ల్యాబ్ బయటపెట్టింది.

చాటింగ్ ద్వారా తుపాకుల అమ్మకాలు

భారత్‌లో జోరుగా అక్రమ ఆయుధాల దందా

గత ఏడాదిలోనే 8 వేలకుపైగా అక్రమ ఆయుధాల ప్రకటనలు

450 వాట్సాప్ గ్రూపుల్లో చాటింగ్

డిజిటల్ విట్నెస్ ల్యాబ్ పరిశోధనలో వెల్లడి

సాక్షి, అమరావతి: భారత్‌లో వాట్సాప్ గ్రూపుల ద్వారానే తుపాకుల అమ్మకాలు జరుగుతున్నట్టు ప్రముఖ సోషల్ మీడియా టూల్స్ పరిశోధక సంస్థ డిజిటల్ విట్నెస్ ల్యాబ్ వెల్లడించింది. అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఈ సంస్థ పరిశోధనలో విస్మయకర విషయాలు వెలుగుచూశాయి. దేశంలోని భద్రతా చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ వాట్సాప్ గ్రూపుల్లోనే తుపాకుల విక్రయాలకు సంబంధించిన ప్రకటనలు పోస్టు చేస్తున్నారని తెలిపింది. గతంలో అక్రమ తుపాకులు కొనుగోలు చేయాలంటే ఉత్తరప్రదేశ్, బిహార్, ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆ రాష్ట్రాల్లో అక్రమ ఆయుధాల విక్రేతలను లేదా వారి ఏజెంట్లను రహస్యంగా కలిసి ఆయుధాలు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా సరే.. కేవలం వాట్సాప్ ద్వారానే తాము కోరుకున్న అక్రమ తుపాకులు కొనుగోలు చేస్తున్నారు. ఇ–కామర్స్ సంస్థల ద్వారా ఆ ఆయుధాలు డోర్ డెలివరీ అవుతున్నాయని డిజిటల్ విట్నెస్ ల్యాబ్ వెల్లడించింది.

పరిశోధనలో వెల్లడైన అంశాలివీ

- ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల కేంద్రంగా దేశవ్యాప్తంగా అక్రమ తుపాకుల వ్యాపారం జోరుగా సాగుతోంది. అక్రమ ఆయుధాల వ్యాపారులు ఏకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి మరీ తుపాకులు అమ్ముతున్నారు. తమవద్ద ఉన్న తుపాకులు, వాటి ధరలు, ఇతర వివరాలను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు.
- 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి మధ్య భారత్‌లో వాట్సాప్ చాటింగ్ ద్వారా అక్రమ తుపాకుల విక్రయాలకు సంబంధించిన 8 వేలకుపైగా ప్రకటనలు జారీ చేశారు.
- ఏకంగా 234 వాట్సాప్ గ్రూపుల్లో అక్రమ తుపాకుల విక్రయాల వివరాలను పోస్టు చేశారు. ఆ వాట్సాప్ గ్రూపులన్నీ బహిరంగంగానే అందరికీ అందుబాటులో ఉండటం గమనార్హం. ఒక్కో వాట్సాప్ గ్రూపులో వందలాది సభ్యులు ఉన్నారు.
- భారత్‌లో 40 కోట్ల మందికి పైగా వాట్సాప్ యూజర్లు ఉన్నారు. దాంతో వ్యాపార, పారిశ్రామిక సంస్థలు వాట్సాప్‌ను తమ వ్యాపార విస్తరణకు వేదికగా చేసుకుంటున్నాయి. అక్రమ ఆయుధాల వ్యాపారులు కూడా అదే రీతిలో వాట్సాప్ ద్వారానే తమ కార్యకలాపాలు సాగిస్తుండటం గమనార్హం.

నిషేధం ఉన్నా పట్టించుకోని 'మెటా'

సోషల్ మీడియా వేదికల ద్వారా ఆయుధాల వ్యాపారం భారత్‌లో నిషిద్ధం. కానీ.. ఈ విషయాన్ని మెటా సంస్థ పెద్దగా పట్టించుకోవడం లేదని నిపుణులు చెబుతున్నారు. మెటా సంస్థే నిర్వహిస్తున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ద్వారా అక్రమ ఆయుధాల అమ్మకాల ప్రకటనలు జారీ చేసిన ఓ ముఠాను 2023లో ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తరువాత కూడా మెటా సంస్థ సరైన నియంత్రణ చర్యలు చేపట్టలేదు. 2022–2024లో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల్లోలో అక్రమ ఆయుధాల విక్రయాల ప్రకటనలను మెటా సంస్థ ఆమోదించడం అప్పట్లోనే తీవ్ర అలజడి సృష్టించింది. ప్రస్తుతం భారత్‌లోనూ మెటా సంస్థ నిర్వహిస్తున్న వాట్సాప్ ద్వారా పలు ముఠాలు అక్రమ ఆయుధాల ప్రకటనలు జారీ చేస్తుండం ఆందోళన కలిగిస్తోంది.

బిజినెస్ ఖాతాల ద్వారానే..

అక్రమ ఆయుధాల ప్రకటనలు జారీ చేస్తున్న ముఠాల వాట్సాప్ ప్రొఫైల్స్‌ను డిజిటల్ విట్నెస్ ల్యాబ్ విశ్లేషించింది. ఆ ముఠాలన్నీ బిజినెస్ ఖాతాల ద్వారానే తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కస్టమర్ ఆపరేషన్స్ నిర్వహించేందుకు ఆ ఖాతాలన్నీ అదనపు ఫీచర్లు కలిగి ఉన్నాయని కూడా గుర్తించింది. కోడ్ భాషలో అక్రమ ఆయుధాలను విక్రయిస్తున్నారని పేర్కొంది.

2022లో 1.04 లక్షల అక్రమ ఆయుధాల జప్తు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2022లో దేశంలో 1.04 లక్షల అక్రమ ఆయుధాలను పోలీసులు జప్తు చేశారు. పోలీసుల దృష్టికి రాని అక్రమ ఆయుధాలు అంతకుమించి ఉంటాయని పరిశీలకులు చెబుతున్నారు. అంటే దేశంలో అక్రమ ఆయుధాల వ్యాపారం ఎంతగా విస్తరించిందన్నది ఈ ఉదంతం వెల్లడిస్తోంది. మరోవైపు వాట్సాప్ ద్వారానే తుపాకుల విక్రయాలకు ప్రకటనలు జారీ చేస్తుండటం అక్రమ ఆయుధాల ముఠాల బరితెగింపునకు నిదర్శనం.



మంచిమాట

దృష్టి.. సృష్టి

భగవంతుడి సృష్టిలో ఏ భేదం లేదు. దేనికి ఏది ఎంత కావాలో అంత చక్కగా అమరి ఉంటుంది. చీమకి తగిన ఆహారం దానికి అందే ఏర్పాటు ఉంది. ఏనుగుకి తగినంత దానికీ అందుతుంది. ఆహారం మాత్రమే కాదు, ఉండటానికి, తిరగటానికి, ఇత్యాదులన్నిటికి లోటు లేదు. కానీ, తెలివితేటలు ఉన్న మనిషి మాత్రం సమానత్వాన్ని చూడ లేక పోవటం జరుగుతోంది. ఎందుకు? అంటే చూసే దృష్టిలో ఉన్న తేడా వల్ల. భేదం దృష్టిలోనే కాని, సృష్టిలో కాదు. దీనికి మనస్తత్వ శాస్త్రంలో ఒక చిన్న ఉదాహరణ చెపుతారు. ఒక పాత్రలో సగానికి నీళ్ళు ఉంటే ఆశావాది పాత్ర సగం నిండింది అంటే, నిరాశావాది పాత్ర సగం ఖాళీ అయిపోయింది అన్నాడట. ఒకే సత్యాన్ని ఇద్దరూ చెరొక దృష్టి కోణంలోనూ చూశారు. మోడైన చెట్టు కనపడగానే ''అయ్యో! చెట్టు ఎండిపోయింది. చచ్చి పోయింది.'' అని ఒకరు వాపోతే,''రాబోయే వసంతాన్ని తనలో ఇముడ్చుకున్న గర్భవతి లాగా ఉన్నది.'' అన్నాడట మిత్రుడు. ''ఇది మంచి కొయ్య. ఎక్కడా ముడులు, వంకరలు లేవు, సింహద్వారానికి పనికి వస్తుంది దీని కలప'' అని ముచ్చట పడ్డాడు ఒక వడ్రంగి. ''ఇది మంచి జాతి. అమ్మవారి శిల్పాన్ని చెక్కటానికి తగినది.'' అని మురిసిపోయాడు ఒక దారు శిల్పి. ''కావలసినన్ని కట్టెలు కొట్టుకోవచ్చు'' అని సంబరపడ్డాడు కట్టెల దుకాణదారు. ఉన్నది ఒక్కటే ఎన్ని రకాలుగా భావించారు ఒక్కొక్కరు? అది దృష్టిలో ఉన్న భేదం. ఉన్నది ఒకటే కదా!

> ఏ భేదాలు వచ్చినా, కలతలు, కల్లోలాలు పుట్టినా అవన్నీ దృష్టి భేదం వల్ల మాత్రమే. దీనినే వేదాంతులు "ఏకం సత్. విప్రా బహుధా వదంతి" అని భగవంతుడి గురించి ఏక వాక్యంలో చెప్పారు. ఉన్న భగవత్ చైతన్యం ఒక్కటే. వేదవిదులైన పండితులు అనేక విధాలుగా చెపుతారు. సనాతన ధర్మంలో ఎంతో మంది దేవతలని పూజిస్తారు అని మాట్లాడే వారికి ఈ అసలు సంగతి తెలియదు. అదెట్లా? అంటే, ఒక కుటుంబంలో ఒకే పిల్లవాడు ఉంటే, వాడికి ఎవరికి నచ్చిన వేషం వారు వేసి, తయారు చేసి ఫోటోలు తీయించి పెడితే ఇంత మంది పిల్లలు ఉన్నారా? అని అడిగినట్టు ఉంటుంది.


ఒకే ఒక పరబ్రహ్మ తత్త్వాన్ని ఎవరికి నచ్చిన విధంగా వారు ఆరాధించుకునే వెసులుబాటు సనాతన ధర్మంలో ఉంది. దానినే ఇష్టదేవతారాధన అని అంటారు. ఒకే రూపంలో, ఒకే నామంతో ఆరాధించాలి అంటే, మిగిలిన రూపాలలో దైవప్రజ్ఞ లేనట్టేనా? మిగిలిన నామాలు దైవాన్ని సూచించవా? సర్వవ్యాపి అన్న మాట సార్థకం ఎట్లా అవుతుంది? నామరూపాతీతమైన భగవంతుణ్ణి ఏరూపంతో నైనా, ఏ నామంతో నైనా ఆరాధించ వచ్చు. శివుడి రూపం నచ్చితే ఆ రూపంలో, ఆ నామంతో, అదేవిధంగా విష్ణువు, జగదంబ, గణపతి, స్కందుడు, సూర్యుడు అనే నామ రూపాలతో ఆరాధించ వచ్చు. అంతే కాదు ఒకే దైవాన్ని భిన్న రూపాలలో కూడా పూజించ వచ్చు. ఉదాహరణకి కృష్ణుడు. బాలకృష్ణుడు – అందులో మళ్ళీ పారాడే కృష్ణుడు, వెన్నముద్ద కృష్ణుడు, గోపాల కృష్ణుడు, గోవర్ధనోద్ధారి, కాళీయ మర్దనుడు, మురళీ కృష్ణుడు ఇలా ఎన్నో! రాధాకృష్ణుడు, పార్థసారథి .. ఇంతమంది కృష్ణులు ఉన్నారా? ఒకే కృష్ణుడు ఇన్ని విధాలుగా సందర్భాన్ని పురస్కరించుకుని కనపడుతున్నాడన్నది సత్యమా? దృష్టి లోనూ, దర్శనం అనుగ్రహించటం లోనూ ఉన్న తేడా మాత్రమే అని సరిగ్గా గమనిస్తే స్పష్టంగా అర్థమవుతుంది.

సృష్టిలో ఉన్న చైతన్యం అంతా ఒకటే అయినా చూడటానికి రకరకాలుగా కనపడుతుంది పెట్టుకున్న రంగు కళ్ళజోడుని బట్టి. అంతే!

– డా.ఎన్. అనంత లక్ష్మి

ఆత్మదర్శిని

దైనందిన జీవితంలో దైవం



దైవాన్ని స్తుతించడం, క్రతువులు చేయడం, సంప్రదాయాలు పాటించడం లాంటి పనులే దైవసంబంధమైన పనులు అనుకోవద్దు. ఈ పనులు చేస్తూ ఉంటేనే ఆధ్యాత్మికంగా ఉన్నట్టు అని అనుకోవద్దు. వీటివలన దైవానికి సంతోషం కలుగదు, పైగా దైవంతో ఐక్యం కాలేవు. అసలు దైవమంటే నీకు భిన్నం కానే కాదు. నీ ఆత్మే దైవం. ఆత్మ దర్శనమే దైవదర్శనమంటే. ఆత్మదర్శనం కోసం చేసే ప్రయాణమే ఆధ్యాత్మికత. ఆత్మశోధనే ఆధ్యాత్మికత. కానీ సమాజంలో ప్రస్తుతం ఉన్న వందలకొద్దీ మతాలు ఆత్మచైతన్యం వైపు తీసుకెళ్ళడం లేదు.. మనస్సుకు సంబంధించిన విషయాలనే బోధిస్తున్నాయి. మనస్సుకు అతీతమైన ఆత్మచైతన్యాన్ని కనుగొనే దిశగా ప్రోత్సహించడం లేదు. నిజానికి వాటి ఉద్దేశ్యం శాంతి, పవిత్రత, ప్రేమ, కానీ సమాజంలో కనిపిస్తున్నది ద్వేషం, కల్మషం, యుద్ధం. నీవు నిజంగా ఆధ్యాత్మికంగా ఉన్నట్టయితే అది నీలో పరివర్తనను కల్గిస్తుంది. నీలోని ద్వేషం, కల్మషం నశించి ప్రేమ, శాంతి జనిస్తాయి. నీవే దైవమౌతావు, సత్యాన్ని తెలుసుకుంటావు. అంటే ఆధ్యాత్మికత అనేది ఒక ప్రయాణం. దైవత్వం అనేది నీ నిజతత్వం. కానీ ఇప్పుడు దైవమంటే ఒక వ్యక్తి అనే భావనే కనిపిస్తోంది సమాజంలో దైవత్వ నిజమైన భావాన్ని తెలుసుకోకుండా దైవాన్ని కూడా విషయ సంబంధంగా చూస్తున్నారు. విషయాలకు అతీతమైనదే దైవం. మహాశూన్యమే దైవం. ఈ క్షణంలో కాలానికీ, స్థలానికీ అతీతమై ఉన్నదే దైవం. అదే నీ నిజస్థితి. ఆ స్థితిలో ఆలోచనలే లేవు. ఆత్మసాక్షాత్కార స్థితిలో నమ్మకాలు, ప్రార్థనలు లాంటివి ఏవీ ఉండవు. కేవలం శుద్ధచైతన్యమే ఉంటుంది. నీవు జన్మించిన ఉద్దేశ్యమే నిన్ను నీవు తెలుసుకోవడం, నీ నిజస్థితి ఐన ఆత్మస్థితిలో ఉండడం. నీతినియమాలు, ఆదర్శాలు అనేవి నీ మనస్సు నమ్మకాల నుంచి రావడం కాదు. నీలోని ఆత్మ చైతన్యవంతమైనపుడు నీ ప్రవర్తన సహజంగానే ఆదర్శవంతంగా ఉంటుంది. ప్రేమ, క్షమ, కరుణ వంటి గుణాలు సహజంగానే నీలో ప్రవహిస్తాయి. సంపూర్ణ చైతన్యం నుండి వస్తాయి. అలా కాకుండా యాంత్రికంగా పాటించే నియమాలతో దైవత్వాన్ని చేరలేవు. ఉదాహరణకు దేవాలయం కనిపించగానే అలవాటుగా లెంపలేసుకుని నమస్కరించడంలో దైవత్వం ఉండదు. అక్కడ పనిచేసేది నీ మనస్సు, నీ నమ్మకాలు మాత్రమే. దైవత్వం మనస్సుకు అతీతం. అనుక్షణం ఆత్మ చైతన్యంతో ఉండడమే నిజమైన దైవత్వం.


దైవం బయట వెదికే విషయమే కాదు. సమాజంలోని నియమాలతో, నమ్మకాలతో పద్ధతులతో దానికి సంబంధమే లేదు. ఇప్పుడు సమాజంలో కనిపిస్తున్న ఆధ్యాత్మికత అంతా సమాజానికి చూపించుకోవడానికి, నలుగురిలో మంచి అనిపించుకోవడానికి చేసే ప్రయత్నాలు. నిజానికి ఆధ్యాత్మిక ప్రయాణం నీలోనికి నీవుచేసే ప్రయాణం. గర్భగుడిలోనికి ఒక్కరినే అనుమతించడంలోని అంతరార్థం ఇదే. సత్యాన్ని తెలుసుకోవడానికి బయటి వ్యక్తులు, మధ్యవర్తుల ప్రమేయమే అవసరం లేదు. సత్యం ఒకరు చెబితే అర్థమయ్యే విషయం కాదు. నీకు నీవుగానే సత్యాన్ని తెలుసుకోవాలి. నీ నమ్మకాల నుండి, అహం నుండి పూర్తిగా బయటపడాలి. నేను శరీరం మనస్సు కాదు. వీటికి సాక్షిగా ఉన్న దివ్య చైతన్యాన్ని అని తెలుసుకోవాలి. ఆత్మ చైతన్యవంతమవ్వడమే ధ్యానం.



– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక గురువు

తాత్త్వికథ

ఆధ్యాత్మిక బీజాలు



ఓ రాజుకు ఒక గురువు తారసపడ్డాడు. రాజ్యం సుఖసంతోషాలతో ఉండాలంటే ఏమి చేయాలని ఆ గురువును అడిగాడు రాజు.

ప్రతి గ్రామంలోనూ సత్సంగం జరుపుకోడానికి, ఆధ్యాత్మిక విషయాలు చర్చించుకోవడానికి తగిన భవన సముదాయాలు కట్టించమన్నాడు గురువు.

అలాగేనన్నాడు రాజు. అయితే రాజు మనసులో ఓ అనుమానం మొదలయ్యింది. 'నిజంగా అలాంటి ఏర్పాట్లు చేస్తే ప్రజల్లో నైతికత, భక్తి భావం నెలకొని ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారా?' అని!

'సరే, ప్రయత్నించి చూద్దాం, సాధ్యాసాధ్యాలు పరిశీలిద్దాం' అని మందీమార్బలంతో బయలుదేరాడు.

తమ రాజ్యానికి తూర్పు దిక్కున ఉన్న చిన్న గ్రామానికి వెళ్ళాడు. అక్కడ గుడి దగ్గర ప్రవచన కర్త ప్రవచనాలు చెబుతూ ఉన్నాడు. జనం దండిగా కూర్చుని ప్రవచనాలను ఆసక్తిగా వింటూ ఉన్నారు. కార్యక్రమం పూర్తి అయ్యేంత వరకు రాజు అక్కడే ఉండి ''నాలుగు మంచి మాటలు వినడానికి మీరు చూపిస్తున్న ఆసక్తి ఎంతో సంతోషకరం. ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొంటున్న మీకందరికీ నా కానుకగా ఒక్కో వెండినాణెం ఇవ్వదలిచాను. వచ్చి తీసుకోండి'' అని చెప్పాడు. ఎవ్వరూ ముందుకు రాలేదు.

ఆశ్చర్యపోయాడు రాజు. విషయం ఏమిటని ప్రవచనకర్తను అడిగాడు.

''ఇక్కడి వారికి చేయి చాపడం ఇష్టం ఉండదు. ఉచితంగా ఇస్తే ఏదీ తీసుకోరు'' అని చెప్పాడు ప్రవచనకర్త.

ఎందువల్ల వారు ఇలా చేస్తున్నారని అడిగాడు రాజు.

''ఏళ్లకొద్దీ ఈ గ్రామంలో సత్సంగం జరుగుతోంది. బతికినంత కాలం పద్ధతిగా బతకాలని అనుకుంటారు. తాము కష్టపడి సంపాదించిన దానితో తృప్తిగా జీవనం సాగిస్తారు'' అని బదులిచ్చాడు ప్రవచనకర్త.

రాజు చిన్నగా అక్కడినుంచి బయలుదేరి నదికి ఆవల ఉన్న మరో గ్రామానికి వెళ్ళాడు. అక్కడ రచ్చబండ దగ్గర చాలామంది కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు. రాజు వచ్చింది తెలుసుకుని అందరూ గుమికూడారు.

''మీ ఊర్లో సత్సంగం జరుగుతోందా?'' అని అడిగాడు రాజు. అలాంటి పదమే వినలేదని బదులిచ్చారు.

మీకందరికీ వెండి నాణేలు పంచాలని ఉందని చెప్పాడు రాజు. అంతే... జనం పరుగులు తీస్తూ వచ్చి, ఎగబడి తీసుకున్నారు. రాజులో ఆలోచనలు మొదలయ్యాయి.

'మొదటి గ్రామంలో ఇచ్చేవాడున్నా తీసుకోలేదు వారు. ఆధ్యాత్మిక బోధనల వల్ల గ్రామస్తులు ఉన్నదానితో తృప్తిగా ఉన్నారు. వారి మనస్సుల్లో ఆధ్యాత్మిక బీజాలు నాటబడ్డాయి.

రెండవ గ్రామంలో... ఎవరైనా ఇస్తే తీసుకునే వాళ్ళు ఉన్నారు. ఆ గ్రామస్తులు తీసుకోవడం పట్ల ఆసక్తి చూపిస్తున్నారంటే వారిలో 'ఇంకా... ఇంకా' కావాలన్న కోరిక బలంగా ఉంది. ఎందుకంటే ఆ గ్రామస్తుల మనస్సుల్లో ఆధ్యాత్మిక బీజాలు నాటబడ లేదు' అని గుర్తించాడు రాజు.

'ఆధ్యాత్మిక బోధనలు చేయించి మంచి చెడ్డలు తెలియజేయాల్సిన బాధ్యత నాది' అని అనుకుంటూ అక్కడినుంచి కదిలాడు రాజు. త్వరత్వరగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భవన సముదాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

వార్కి డేట్ ఫిక్స్



● ఎన్టీఆర్



● హృతిక్ రోషన్

సిల్వర్ స్క్రీన్పై వార్ చేసేందుకు రెడీ అవుతున్నారు హృతిక్ రోషన్, ఎన్టీఆర్. వైఆర్ఎఫ్ (యశ్రాజ్ ఫిల్మ్స్) స్పై యూనివర్స్లో భాగంగా రూపొందుతున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'వార్ 2'. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ పతాకంపై ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి కావొచ్చింది. హృతిక్ – ఎన్టీఆర్ల కాంబోలో ఓ సాంగ్తో పాటు కొంత ప్యాచ్ వర్క్ మాత్రమే మిగిలి ఉందట. అయితే ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన రిహార్సల్స్ అప్పుడు హృతిక్ రోషన్ కాలికి గాయమైందని సమాచారం. దీంతో చిత్రీకరణకు మరికొంత సమయం పడుతుందని, ముందుగా అనుకున్నట్లుగా 'వార్ 2' సినిమా ఆగస్టు 14న విడుదల కాకపోవచ్చనే టాక్ బాలీవుడ్లో వినిపించింది. కానీ ఈ సినిమాను ఆగస్టు 14న రిలీజ్ చేయనున్నట్లుగా 'ఎక్స్' వేదికగా యశ్రాజ్ ఫిల్మ్స్ సంస్థ స్పష్టం చేసింది.

ఏఆర్ రెహమాన్కు అస్వస్థత

– డీ హైడ్రేషన్ వల్లేనని వైద్యులు ప్రకటన



ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆదివారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ అంటూ పలు భాషా చిత్రాలకు సంగీతం అందిస్తున్న రెహమాన్ 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రానికి గాను రెండు ఆస్కార్ అవార్డులు సాధించిన విషయం తెలిసిందే. పలు జాతీయ, రాష్ట్రీయ అవార్డులనూ గెలుచుకున్నారు. కాగా ఏఆర్ రెహమాన్ రంజాన్ పర్వదినాల సందర్భంగా ఉపవాస దినాలను పాటిస్తున్నారు. శనివారం లండన్ నుంచి చెన్నై చేరుకున్నారాయన. ఆదివారం ఉదయం నిద్ర లేవగానే అస్వస్థతకు గురి కావడంతో వెంటనే ఆయన్ని కుటుంబ సభ్యులు చెన్నై గ్రీమ్స్ రోడ్లోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. వైద్యుల బృందం ఆయనకు అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించింది. శరీరంలో నీటి శాతం తక్కువ కావడంతో ఏఆర్ రెహమాన్ కాస్త అస్వస్థతకు గురయ్యారని, ఇప్పుడు ఆయన ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా వరుస ప్రయాణాల కారణంగా ఏఆర్ రెహమాన్ డీ హైడ్రేషన్కి గురయ్యారని ఆయన సోదరి ఏఆర్ రెహానా మీడియాకు తెలిపారు. అదే విధంగా తన తండ్రి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరాలని ప్రార్థన చేసిన అభిమానులకు, సినీ, రాజకీయ ప్రముఖులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు, తండ్రి ఆరోగ్యంగా ఉన్నారని ఏఆర్ రెహమాన్ కొడుకు అమీన్ పేర్కొన్నారు. కాగా ఏఆర్ రెహమాన్ సతీమణి సైరా భాను ఓ ప్రకటన విడుదల చేశారు. ''ఏఆర్ రెహమాన్ అస్వస్థతకు గురయ్యారన్న వార్త విని ఆందోళన చెందాను. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని కోరుకుంటున్నాను. ఇక నన్ను ఏఆర్ రెహమాన్ మాజీ సతీమణి అని పిలవొద్దు. మేం ఇంకా చట్టపరంగా వివాహ రద్దు పొందలేదు. మా మధ్య భార్యాభర్తల బంధం కొనసాగుతోంది'' అని సైరా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా రెహమాన్ ఆరోగ్యం గురించి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అపోలో ఆసుపత్రి వైద్యులను సంప్రదించిన అనంతరం... ఏఆర్ రెహమాన్ ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు తెలిపినట్లు, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు ఎక్స్లో పేర్కొన్నారు. ఇక ఏఆర్ రెహమాన్ వైద్య చికిత్సల అనంతరం ఇంటికి చేరుకున్నారు. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు.

– 'సాక్షి' చెన్నై, తమిళ సినిమా

తెలుగు ప్రేక్షకులు సినిమాని గెలిపించారు

– హీరో, నిర్మాత నాని



● శ్రీదేవి, రోషన్, రామ్ జగదీశ్, నాని, ప్రియదర్శి, శివాజీ, ప్రశాంతి తిపిర్నేని, దీప్తి గంటా

''స్క్రిప్ట్, ప్రేక్షకులు... నేను ఈ రోజు వరకు ఈ రెండు విషయాలనే నమ్మాను. స్క్రిప్ట్ మా టీమ్ని గెలిచింది. తెలుగు ప్రేక్షకులు సినిమాని గెలిపించారు. 'కోర్ట్' సినిమా నన్ను గెలిపించింది'' అని హీరో–నిర్మాత నాని అన్నారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో, మరో లీడ్ రోల్లో శివాజీ నటించిన చిత్రం 'కోర్ట్'. నాని సమర్పణలో రామ్ జగదీశ్ దర్శకత్వంలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రానికి దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. 'కోర్ట్' చిత్రం ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్లో 'సెలబ్రేషన్ ఆఫ్ ఆడియన్స్ వర్డిక్ట్ ' పేరిట 'కోర్ట్' యూనిట్ నిర్వహించిన ప్రెస్మీట్లో నాని మాట్లాడుతూ– ''జగదీశ్ని చూసిన వెంటనే నాకు నమ్మకం కుదిరింది. రోషన్, శ్రీదేవి బ్యూటిఫుల్గా నటించారు. ప్రియదర్శికి తనకంటూ ఓ యాక్టింగ్ స్టయిల్ ఉంది. అతను తెలుగు సినిమా నసీరుద్దీన్ షా. 'కోర్ట్' సినిమాను దీప్తి అక్క చాలా చక్కగా చూసుకున్నారు. శివాజీగారు విజృంభించి నటించిన ఈ మూవీలో నేనూ భాగం కావడం సంతోషంగా ఉంది. విజయ్ మ్యూజిక్ ఈ సినిమాకి సూపర్ స్టార్'' అన్నారు. ''బలగం' వంటి హిట్ మూవీ తర్వాత ఎలాంటి సినిమా చేయాలా? అని ఆలోచిస్తున్నప్పుడు రామ్ జగదీశ్ ఈ కథ చెప్పారు. కథ విని గొప్పగా ఫీలయ్యాను. నాని, ప్రశాంతి గార్లు, దీప్తి అక్క... చాలా బాగా సపోర్ట్ చేశారు'' అన్నారు ప్రియదర్శి. ''నానిగారు ఇండస్ట్రీకి సూపర్స్టార్ కృష్ణ. ఆయనలానే కొత్త తరహాలో దమ్మున్న సినిమాలు చేస్తున్నారు. సినిమా జిందాబాద్... ప్రొడ్యూసర్ జిందాబాద్'' అని తెలిపారు శివాజీ. ''సినిమా జీవితాన్ని మార్చగలదు. నేను నానిగారి ప్రొడక్ట్ అని చెప్పడం గర్వంగా ఉంది'' అని తెలిపారు రామ్ జగదీశ్. ''మేము అనుకున్నదాని కంటే ఎక్కువ రెస్పాన్స్ ఆడియన్స్ నుంచి వస్తుండటం చాలా సంతోషంగా ఉంది'' అని ఆనందం వ్యక్తం చేశారు దీప్తి గంటా. ఈ కార్యక్రమంలో నటులు శుభలేఖ సుధాకర్, హర్షవర్ధన్, కమల్, శ్రీనివాస్, నటీమణులు సురభి ప్రభావతి, రోహిణి, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్, లిరిక్ రైటర్ పూర్ణాచారి, నిర్మాత వెంకట్ బోయినపల్లి మాట్లాడారు.

వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తున్నాం

– చిరంజీవి సినిమా స్క్రిప్ట్కి పూజలు నిర్వహించిన అనిల్ రావిపూడి



''మెగా స్టార్ చిరంజీవి సినిమాతో 2026 సంక్రాంతికి మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం'' అని దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని ఆయన ఆదివారం దర్శించుకున్నారు. చిరంజీవి హీరోగా తాను తీయబోయే చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ని స్వామి సన్నిధిలో పెట్టి పూజలు నిర్వహించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి మీడియాతో మాట్లాడుతూ– ''వెంకటేశ్ హీరోగా ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా బిగ్గెస్ట్ హిట్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. ఇక చిరంజీవిగారితో చేయనున్న సినిమాకి సంబంధించిన కథని సిద్ధం చేసేందుకు వైజాగ్ రావడం జరిగింది. వైజాగ్ని సెంటిమెంట్గా భావిస్తాను. ఇక్కడే నా సినిమాలకు సంబంధించిన కథలు రాసుకుంటుంటాను. ఆ స్క్రిప్ట్లను శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో ఉంచి పూజలు నిర్వహించడం సెంటిమెంట్గా భావిస్తాను. చిరంజీవిగారితో తీసే సినిమా ఫ్యామిలీ ఎంటర్టైనర్గా ఉంటుంది. 'గ్యాంగ్లీడర్, రౌడీ అల్లుడు, ఘరానా మొగుడు రేంజ్లో చిరంజీవిగారిని ఈ చిత్రంలో చూస్తారు. ఒక నెలలో మొత్తం స్క్రిప్ట్ వర్క్ పూర్తవుతుంది. మే ఆఖరిలో లేదా జూన్ మొదటి వారంలో షూటింగ్ ప్రారంభిస్తాం'' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో కూడా పాల్గొన్నారు.

– 'సాక్షి', సింహాచలం

అందుకే ఈ సినిమాని మేం రిలీజ్ చేస్తున్నాం

– నిర్మాత నవీన్ ఎర్నేని



● గణేశ్ ఆచార్య, విధి, నవీన్, జాన్య, సుశాంత్

సుశాంత్, జాన్య జోషి, విధి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కిస్ కిస్ కిస్సిక్'. ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య భార్య విధి ఆచార్య (వీ2ఎస్ ప్రొడక్షన్) నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ మల్టీ లాంగ్వేజ్లలో ఈ సినిమాను విడుదల చేస్తోంది. ఈ చిత్రానికి కొరియోగ్రఫీ వహించడంతో పాటు ఓ కీలక పాత్రలో నటించిన గణేశ్ ఆచార్య ఆదివారం ప్రీ రిలీజ్ ఈవెంట్లో మాట్లాడుతూ– ''తెలుగు చిత్ర పరిశ్రమలో చిరంజీవిగారు, ఎన్టీఆర్, బన్నీ, రామ్చరణ్ లాంటి బిగ్ స్టార్స్తో వర్క్ చేసే అవకాశం నాకు లభించింది. ఇక 'కిస్ కిస్ కిస్సిక్' ఫ్యామిలీ ఫిల్మ్. మంచి కాన్సెప్ట్ కూడా ఉంది. యాక్షన్, రొమాన్స్, సాంగ్స్ అన్నీ అలరిస్తాయి. ఎలాంటి సినీ నేపథ్యం లేని కొత్త వాళ్లు ఈ సినిమాతో ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. 'పుష్ప: ది రూల్' సినిమాలోని 'కిస్ కిస్ కిస్సిక్' సాంగ్ పెద్ద హిట్. ఇదే టైటిల్తో మార్చి 21న సినిమాను రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''ఈ సినిమాను మేం విడుదల చేయడానికి ప్రధాన కారణం గణేశ్ మాస్టర్. ఆయనతో మాకు మంచి అసోసియేషన్ ఉంది. 'కిస్ కిస్ కిస్సిక్' మూవీ మంచి ఎంటర్టైనర్. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు మైత్రీ నిర్మాత నవీన్ ఎర్నేని. ''ఈ సినిమా మంచి కమర్షియల్ ప్యాకేజ్లా ఉంటుంది'' అని తెలిపారు సుశాంత్. ''ఈ సినిమా హిందీ టైటిల్ 'పింటూ కీ పప్పీ'. నేను పప్పీ రోల్ ప్లే చేశాను'' అని పేర్కొన్నారు జాన్య జోషి. ''ఈ సినిమా ద్వారా గణేశ్ మాస్టర్గారి నుంచి చాలా నేర్చుకున్నాను'' అని అన్నారు విధి.

జ్ఞాపకాల ప్రయాణం...



● 'కాలమేగా కరిగింది' పోస్టర్

వినయ్ కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'కాలమేగా కరిగింది'. శింగర మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ని రిలీజ్ చేశారు. ''ఫణి, బిందు విద్యార్థులుగా ఉన్నప్పటి నుంచి ప్రేమికులు. ప్రేమే లోకంగా జీవిస్తుంటారు ఇద్దరూ. కలహాలు లేని ఈ ప్రేమను కాలం విడదీస్తే ఆ జ్ఞాపకాలు వెతుక్కుంటూ కథానాయకుడు ఫణి ప్రయాణం సాగిస్తాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది సినిమాలో చూడాలి. ఈ అందమైన ప్రేమ కథని శింగర మోహన్ పొయెటిక్గా రూపొందించారు. గుడప్పన్ బ్యూటిఫుల్ మ్యూజిక్ ఆకట్టుకునేలా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

ప్రేమ... వినోదం



● ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి

'30 రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమాతో హీరోగా పరిచయమైన ప్రదీప్ మాచిరాజు నటించిన తాజా చిత్రం 'అక్కడ అమ్మాయి... ఇక్కడ అబ్బాయి'. ఇందులో దీపికా పిల్లి హీరోయిన్గా నటించారు. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్గా ఈ చిత్రం రూపొందింది. నితిన్ – భరత్ల దర్శకత్వంలో మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ ఈ సినిమాను నిర్మించింది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న రిలీజ్ చేయనున్నట్లు ఆదివారం చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. 'వెన్నెల' కిశోర్, సత్య, గెటప్ శ్రీను, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: రధన్.



ప్రపంచ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు పట్లోళ్ల ఇంద్రా రెడ్డి

ప్రతిష్టాత్మక ప్రపంచ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత బృందాన్ని ప్రకటించారు. అండర్–11 ఓపెన్ విభాగంలో తెలంగాణకు చెందిన పట్లోళ్ల ఇంద్రా రెడ్డి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తనయుడైన పట్లోళ్ల ఇంద్రా రెడ్డి గత జనవరిలో జరిగిన జాతీయ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్‌లో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా భారత జట్టులోకి ఎంపికయ్యాడు. అండర్–11 ఓపెన్ విభాగంలోనే భారత్ నుంచి రేయాంశ్ వెంకట్ మరో ప్లేయర్‌గా బరిలోకి దిగనున్నాడు. ప్రపంచ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు సెర్బియాలోని వ్రాన్‌జాస్కా బాంజా పట్టణంలో జరుగుతాయి. బాలికల విభాగంలో ఆరు కేటగిరీల్లో (అండర్–7, అండర్–9, అండర్–11, అండర్–13, అండర్–15, అండర్–17)... ఓపెన్ విభాగంలో ఆరు కేటగిరీల్లో (అండర్–7, అండర్–9, అండర్–11, అండర్–13, అండర్–15, అండర్–17) తొమ్మిది రౌండ్లపాటు పోటీలను నిర్వహిస్తారు. భారత్ నుంచి మొత్తం 22 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

18వ సారైనా...

పరుగుల వీరులు... వికెట్ల ధీరులు... మెరుపు ఫీల్డర్లు... అశేష అభిమానులు... విశేష ఆదరణ... ఇలా 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఒక్కసారి కూడా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయింది. లీగ్ ఆరంభం (2008) నుంచి ప్రతిసారీ 'ఈ సాలా కప్ నమ్‌దే' అంటూ బరిలోకి దిగడం... రిక్తహస్తాలతో వెనుదిరగడం పరిపాటిగా మారింది. టోర్నమెంట్ ఆరంభం నుంచి ఒకే ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కిన విరాట్ కోహ్లి... తన జెర్సీ నంబర్ 18వ సారైనా ట్రోఫీని అందిస్తాడా లేదో వేచి చూడాలి!

– సాక్షి క్రీడావిభాగం

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు రాత మారేనా!


- పాటీదార్ సారథ్యంలో బరిలోకి
- విరాట్ కోహ్లిపైనే భారం

మరో 5 రోజుల్లో ఐపీఎల్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అత్యధిక జనాదరణ ఉన్న జట్లలో ఒకటైన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మరోసారి కప్పు వేటకు సిద్ధమైంది. ఇప్పటి వరకు 17 సీజన్లు ఆడి ఒక్కసారి కూడా ట్రోఫీ నెగ్గలేకపోయిన ఆర్‌సీబీ ఈ సారైనా తమ కల నెరవేర్చుకోవాలని భావిస్తోంది. లీగ్ చరిత్రలో అత్యుత్తమంగా మూడుసార్లు (2009, 2011, 2016లో) రన్నరప్‌గా నిలిచిన ఆర్‌సీబీ... తమ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి జెర్సీ నంబర్ 18వ సీజన్‌లో ట్రోఫీ ఒడిసి పట్టాలని పట్టుదలతో ఉంది. అంతర్జాతీయ స్టార్‌లపై ఎక్కువ నమ్మకముంచే ఫ్రాంచైజీ ఈసారి దేశీ ఆటగాడు రజత్ పాటీదార్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. 2021 నుంచి ఆర్‌సీబీకు ప్రాతినిధ్యం వహిస్తున్న రజత్ జట్టు రాత మారుస్తాడని ఆశిస్తోంది. గతేడాది జరిగిన ఐపీఎల్ వేలంతోనే ఈసారి విభిన్నమైన ప్రణాళికతో బరిలోకి దిగనున్నట్లు ఆర్‌సీబీ సంకేతాలు పంపింది. వేలంలో ఒక్కో జట్టు అత్యధికంగా 25 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసుకునే అవకాశం ఉన్నా... ఆర్‌సీబీ 22 మంది ప్లేయర్లకే పరిమితమైంది. విరాట్ కోహ్లికి రూ. 21 కోట్లు ఇచ్చి అట్టిపెట్టుకున్న ఫ్రాంచైజీ... రజత్ పాటీదార్ (రూ. 11 కోట్లు), యశ్ దయాల్ (రూ. 5 కోట్లు)ను రిటైన్ చేసుకుంది. మ్యాక్స్‌వెల్, సిరాజ్ వంటి అంతర్జాతీయ స్టార్లను వదిలేసుకున్న ఆర్‌సీబీ... స్వప్నిల్ సింగ్‌ను రూ. 50 లక్షలతో 'రైట్ టు మ్యాచ్' ద్వారా తిరిగి తీసుకుంది. కేఎల్ రాహుల్, చహల్, రిషబ్ పంత్ వంటి వారిని వేలంలో చేజిక్కించుకునే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. అటు అనుభవం... ఇటు యువరక్తంతో కూడిన కొత్త బృందాన్ని కొనుగోలు చేసుకుంది. గత సీజన్‌లో తొలి ఎనిమిది మ్యాచ్‌ల్లో ఏడింట ఓడి ఆ తర్వాత వరుసగా ఆరు మ్యాచ్‌లు నెగ్గి ప్లేఆఫ్స్‌కు చేరిన బెంగళూరు... ఎలిమినేటర్‌లో రాజస్తాన్ రాయల్స్ చేతిలో ఓడి ఇంటిబాట పట్టింది.

అతడే బలం... బలహీనత

ఆర్‌సీబీ ప్రయాణాన్ని గమనిస్తే... ఆ జట్టుకు అతిపెద్ద బలం విరాట్ కోహ్లినే. అదే సమయంలో



రజత్ పాటీదార్

బలహీనత కూడా అతడే. విరాట్ రాణించిన మ్యాచ్‌ల్లో అలవోకగా విజయాలు సాధించే ఆర్‌సీబీ... అతడు విఫలమైన సమయంలో కనీస ప్రదర్శన కూడా కనబర్చలేక వెనుకబడిపోతుంది. 17 సీజన్‌లుగా ఒకే ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న విరాట్ ఐపీఎల్లో ఇప్పటి వరకు 252 మ్యాచ్‌లాడి 8004 పరుగులు చేసి ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. 8 శతకాలు, 55 అర్ధశతకాలు ఇలా లెక్కకు మిక్కిలి రికార్డులు తన పేరిట లిఖించుకున్నాడు. ఈ క్రమంలో ఐదు సీజన్లలో జట్టు తరఫున అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా నిలిచిన కోహ్లి... చాంపియన్స్ ట్రోఫీ తాజా ఫామ్‌ను ఐపీఎల్‌లోనూ కొనసాగించాలని భావిస్తున్నాడు. గతేడాది కోల్‌కతా నైట్ రైడర్స్ చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించిన ఫిల్ సాల్ట్... ఫార్మాట్‌తో సంబంధం లేకుండా రాణిస్తున్న ఇంగ్లండ్ యువ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్... హార్డ్ హిట్టర్ లివింగ్‌స్టోన్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. రూ. 11 కోట్లు పెట్టి తీసుకున్న భారత వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మ, స్పిన్ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యాపై కూడా టీమ్ మేనేజ్‌మెంట్ ఆశలు పెట్టుకుంది. ఆండీ ఫ్లవర్ ఆర్‌సీబీ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా... దినేశ్ కార్తీక్ మెంటార్‌గా వ్యవహరించనున్నాడు.



కోహ్లి

బౌలర్లపైనే భారం...

బ్యాటింగ్ విషయంలో బలంగా ఉన్న బెంగళూరు... ఈసారి మెరుగైన బౌలింగ్ దళంతో బరిలోకి దిగనుంది. ఆస్థాన బౌలర్ సిరాజ్‌ను వదిలేసుకున్న ఆర్‌సీబీ... తిరిగి తీసుకునే అవకాశం వచ్చినా పట్టించుకోలేదు. రూ. 12.50 కోట్లు పెట్టి కొనుగోలు చేసుకున్న ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ జోష్ హాజల్‌వుడ్, ఐపీఎల్‌లో అపార అనుభవం ఉన్న భువనేశ్వర్ కుమార్, గతేడాది మెరుగైన ప్రదర్శన చేసిన యశ్ దయాల్, దక్షిణాఫ్రికా పేసర్ ఇన్‌గిడి పేస్ భారాన్ని మోయనున్నారు. స్వప్నిల్ సింగ్, జాకబ్ బెథెల్, సుయశ్ శర్మ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. అంతర్జాతీయ అనుభవం ఉన్న నాణ్యమైన స్పిన్నర్ లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఐపీఎల్‌లో ఇతర స్టేడియాలతో పోల్చుకుంటే కాస్త చిన్నదైన బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఈ బౌలింగ్ బృందం ప్రదర్శనపైనే ఆర్‌సీబీ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

ఆర్‌సీబీ జట్టు: రజత్ పాటీదార్ (కెప్టెన్), కోహ్లి, సాల్ట్, జితేశ్ శర్మ, దేవదత్ పడిక్కల్, స్వస్తిక్, లివింగ్‌స్టోన్, కృనాల్ పాండ్యా, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్, మనోజ్, జాకబ్ బెథెల్, హాజల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, రసిక్, సుయశ్ శర్మ, నువాన్ తుషారా, ఇన్‌గిడి, అభినందన్ సింగ్, మోహిత్ రాఠి, యశ్ దయాల్.

అంచనా

ఇప్పటి వరకు ఐపీఎల్‌లో 9 సార్లు ప్లేఆఫ్స్‌కు చేరిన చరిత్ర ఉన్న ఆర్‌సీబీ... స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే ఈసారి కూడా ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశం ఉంది.

సన్నిహితులే సగం బలం!

- విదేశీ పర్యటనలకు కుటుంబసభ్యుల అనుమతిపై విరాట్ కోహ్లి వ్యాఖ్య
- గదిలో ఒంటరిగా కూర్చోవడం నచ్చదని వెల్లడి

బెంగళూరు: విదేశీ పర్యటనల సమయంలో కుటుంబ సభ్యుల అనుమతిని పరిమితం చేస్తూ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీసుకున్న నిర్ణయంపై స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కీలక వ్యాఖ్యలు చేశాడు. సన్నిహితులు వెంట ఉంటే ఆటగాళ్లు మానసికంగా మరింత బలంగా ఉంటారని కోహ్లి అభిప్రాయపడ్డాడు. ఆస్ట్రేలియాతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో టీమిండియా పరాజయం పాలవడంతో బీసీసీఐ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 45 రోజుల్లోపు విదేశీ పర్యటనలో ఆటగాళ్లు, సహాయ సిబ్బంది కుటుంబ సభ్యులను వారం రోజులు మాత్రమే అనుమతించనుంది. 45 రోజులకు మించిన విదేశీ పర్యటనల్లో రెండు వారాలపాటు సన్నిహితులకు అనుమతి ఉంటుంది. ఈ నేపథ్యంలో కోహ్లి మాట్లాడుతూ... 'ఒక ఆటగాడి వెనక కుంటుబ సభ్యుల ప్రాతను అందరికీ వివరించడం కష్టం. కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు వారిచ్చే మద్దతును వెలకట్టలేం. దాని మీద ప్రజలకు అవగాహన లేదని అనుకోలేం. కుటుంబ సభ్యులు పక్కన ఉంటే మైదానంలో ఆవరించిన నిరాశ, నిస్పృహ నుంచి ప్లేయర్లు త్వరగా బయటపడగలరు. అంతేకానీ మ్యాచ్ ముగిసిన తర్వాత దిగాలుగా వెళ్లి గదిలో కూర్చోవడం ఎవరికీ ఇష్టం ఉండదు. సన్నిహితుల సమక్షంలో బాధ్యత మరింత పెరుగుతుంది. ఆట అయిపోయిన తర్వాత కుటుంబంతో గడపడంలో తప్పేముంది. నా వరకైతే కుటుంబ సభ్యులతో ఉండేందుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తా. అలాంటి అవకాశాలను వదిలిపెట్టను. మైదానంలో ఏం జరుగుతుందో తెలియని వ్యక్తులు దీనిపై నియంత్రణ తేవడం నిరాశ కలిగించింది. ఏ ఆటగాడిని అడిగినా కుటుంబ సభ్యులు వెంట ఉండటానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాడు' అని కోహ్లి వివరించాడు. ఇక తన ఆరోగ్యం, ఫిట్‌నెస్ పట్ల తల్లి ఎంతో మథన పడేదని విరాట్ వెల్లడించాడు. 'ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టిన అనంతరం నేను ఇంట్లో కూడా ఆచితూచి తినేవాడిని. దీంతో మా అమ్మ బెంగ పెట్టుకునేది. ఏంతో ఇష్టంగా చేసిన 'పరోఠా' ఎందుకు తినడం లేదని అడిగేది. తక్కువ తింటే మైదానంలో బాగా ఆడలేవు... అందుకే నీరసంగా కనిపిస్తున్నావని అనేది. ప్రపంచవ్యాప్తంగా ఇతర ఆటగాళ్లంతా నా ఫిట్‌నెస్‌తో పోటీపడాలని చూస్తుంటే నువ్వేమో నేను నీరసంగా కనిపిస్తున్నానని అంటున్నావా అని ఆట పట్టించేవాడిని. నేను పౌష్టికాహారమే తీసుకుంటున్నాను అని అమ్మకు వివరించే వాడిని' అని కోహ్లి అన్నాడు.



భార్య అనుష్కతో కోహ్లి (ఫైల్)

95 నిమిషాలు పోరాడి...

ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నెగ్గిన కొరియా స్టార్ ఆన్ సె యంగ్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా)తో ఆదివారం జరిగిన ఫైనల్లో ఆన్ సె యంగ్ 13–21, 21–18, 21–18తో విజయం సాధించింది. 95 నిమిషాలపాటు ఆద్యంతం హోరాహోరీగా జరిగిన ఈ తుది సమరంలో ఆన్ సె యంగ్ కీలకదశలో పాయింట్లు గెలిచి కెరీర్‌లో రెండోసారి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 2023లో తొలిసారి ఆన్ సె యంగ్ ఈ టైటిల్‌ను సాధించింది.



పురుషుల సింగిల్స్ విభాగంలో చైనా ప్లేయర్, ప్రపంచ నంబర్‌వన్ షి యుకీ రెండోసారి ఈ టైటిల్‌ను దక్కించుకున్నాడు. తొలిసారి 2018లో విజేతగా నిలిచిన షి యుకీ ఫైనల్లో 21–17, 21–19తో లీ చియా హావో (చైనీస్ తైపీ)పై నెగ్గాడు. విజేతగా నిలిచిన ఆన్ సె యంగ్, షి యుకీలకు 1,01,500 డాలర్ల (రూ. 88 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఐసెట్–2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి.. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్– 2025 (ఏపీ ఐసెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **కోర్సులు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)/మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ).
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీఏ కోర్సుకు 3 లేదా 4 ఏళ్ల డిగ్రీ, ఎంసీఏ కోర్సుకు మూడు లేదా నాలుగేళ్ల డిగ్రీ(ఇంటర్/డిగ్రీ స్థాయిలో గణితం సబ్జెక్టు చదివి ఉండాలి) ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాసు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 29.04.2025 నుంచి 30.04.2025.
» **హాల్ టికెట్ డౌన్‌లోడ్ తేది:** 02.05.2025 నుంచి
» **ఐసెట్ పరీక్ష తేది:** 07.05.2025.
» **వెబ్‌సైట్:** ttps://cets.apsche.ap.gov.in/

బెల్, మచిలీపట్నంలో 20 డిప్యూటీ ఇంజనీర్ పోస్టులు

మచిలీపట్నంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన డిప్యూటీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ ఇంజనీర్ (ఎలక్ట్రానిక్స్)–08, డిప్యూటీ ఇంజనీర్(మెకానికల్)–12.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్/ఏఎంఐఈ/జీఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.02.2025 నాటికి జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీలకు 31 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in/

హాల్, హైదరాబాద్‌లో విజిటింగ్ డాక్టర్ పోస్టులు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) ఏవియోనిక్ డివిజన్‌లో పార్ట్‌టైం ప్రాతిపదికన విజిటింగ్ డాక్టర్, విజి టింగ్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **పోస్టుల వివరాలు:** విజిటింగ్ డాక్టర్–04, విజిటింగ్ కన్సల్టెంట్(పాథాలజిస్ట్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, డిప్లొమా పాథాలజీ, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మేనేజర్, హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్, ఏవియోనిక్స్ డివిజన్, పోస్ట్–హాల్, హైదరాబాద్–500042 చిరునామకు స్పీడ్ పోస్ట్/రిజిస్టర్/కొరియర్ ద్వారా పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.03.2025.
» **వెబ్‌సైట్:** http://hal-india.co.in/

జేఎన్ఏఆర్‌డీడీసీ, నాగ్‌పూర్‌లో సైంటిస్ట్ పోస్టులు

నాగ్‌పూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ (జేఎన్ఏఆర్‌డీడీసీ).. ఒప్పంద ప్రాతిపదికన సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్–3ఎ–02, సైంటిస్ట్–3బి–02, సైంటిస్ట్–2–03, సైంటిస్ట్–1–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, ఎంఈ, డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సైంటిస్ట్–1 పోస్టుకు 35 ఏళ్లు, సైంటిస్ట్–2 పోస్టుకు 45 ఏళ్లు, సైంటిస్ట్–3(ఏ,బి)కు 50 ఏళ్లు నిండి ఉండాలి.
» **వేతనం:** నెలకు సైంటిస్ట్–3(ఎ,బి)కు రూ.1,45,000, సైంటిస్ట్–2 పోస్టుకు రూ.1,20,000, సైంటిస్ట్–1కు రూ.1,00,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 24.03.2025.
» **వెబ్‌సైట్:** https://jnarddc.gov.in/



పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మహారాష్ట్రలో 28 ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులు

మహారాష్ట్రలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన ఫీల్డ్ సూపర్‌వైజర్(సేఫ్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, పవర్ సిస్టమ్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్, సివిల్, మెకానికల్, ఫైర్ టెక్నాలజీ అండ్ సేఫ్టీ) లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25.03.2025 నాటికి 29 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.23,000 నుంచి రూ.1,05,000.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025.
» **వెబ్‌సైట్:** https://www.powergrid.in/

సాయుధ దళాల్లో 'భద్రత'నిచ్చే కొలువు

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్).. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని దేశ అంతర్గత, సరిహద్దు భద్రత బాధ్యతలు నిర్వహించే కీలక విభాగం! ఇందులో బ్యాచిలర్ డిగ్రీతోనే అసిస్టెంట్ కమాండెంట్ కొలువు సాధించే అవకాశం స్వాగతం పలుకుతోంది. యూపీఎస్సీ తాజాగా సీఏపీఎఫ్ ఏసీ–2025 ఎగ్జామ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో..సీఏపీఎఫ్–ఏసీకి ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 357 పోస్టులతో సీఏపీఎఫ్ ఏసీ నోటిఫికేషన్ విడుదల
» డిగ్రీ అర్హతతో గ్రూప్–ఎ హోదా కొలువుకు అవకాశం

▪ **అయిదు విభాగాలు..357 పోస్టులు:** సీఏపీఎఫ్–అసిస్టెంట్ కమాండెంట్ పరీక్ష ద్వారా మొత్తం అయిదు విభాగాల్లో 357 పోస్టుల భర్తీ చేయనున్నారు. వివరాలు.. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) 24 పోస్టులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)–204 పోస్టులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)–92 పో స్టులు, ఇండో–టిబెటిన్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీ పీ)– 04 పోస్టులు, సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ)–33 పోస్టులు.

▪ **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

▪ **వయసు:** ఆగస్ట్ 1, 2025 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ట వయో పరిమితిలో ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు ఉంటుంది. వీటితో పాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.

▪ **మూడు దశల ఎంపిక ప్రక్రియ:** యూపీఎస్సీ నిర్వహించే సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడు దశల్లో జరుగుతుంది. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, పర్సనాలిటీ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ.



యూపీఎస్సీ సీఏపీఎఫ్–2025

తొలిదశ రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో మొదటి దశలో రాత పరీక్ష ఉంటుంది. ఈ రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1లో జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్ 250 ప్రశ్నలు–250 మార్కులు, పేపర్–2లో జనరల్ స్టడీస్, ఎస్సే, కాంప్రహెన్షన్ 200 ప్రశ్నలు– 200 మార్కులకు చొప్పున మొత్తం 450 మార్కులకు రాత పరీక్ష జరుగుతుంది. –పేపర్–1 కు రెండు గంటలు, పేపర్–2కు మూడు గంటల సమయం కేటాయించారు. పరీక్ష పెన్ పేపర్ విధానంలో జరుగుతుంది. పేపర్–1లో నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమలవుతుంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులను తగ్గిస్తారు.

ఆబ్జెక్టివ్ విధానంలో పేపర్–1

పేపర్–1 జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్‌లో సమకాలీన అంశాలపై అవగాహన, జనరల్ నాలెడ్జ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 125 ప్రశ్నల్లో భారత చరిత్ర, రాజ్యాంగం, ఎకానమీ, జాగ్రఫీ, సైన్స్, మ్యాథ్స్, రీజనింగ్, పర్యావరణం–జీవ వైవిధ్యం, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి.

డిస్క్రిప్టివ్ విధానంలో పేపర్–2

పేపర్–2ను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో రెండు విభాగాలు పార్ట్–ఎ(జనరల్ స్టడీ స్), పార్ట్–బి(ఎస్సే అండ్ కాంప్రహెన్షన్) ఉంటా యి. పార్ట్–ఎలో ఎస్సే కొశ్చన్స్ అడుగుతారు. ఎస్సే రైటింగ్ విభాగంలో నిర్దేశిత అంశాలపై మూడు వందల పదాలకు మించకుండా.. వ్యాసా లు రాయాల్సి ఉంటుంది. పార్ట్–ఎకు 80 మార్కు లు కేటాయించారు. పార్ట్–బిలో 120 మార్కులకు పరీక్ష నిర్వహి స్తారు. ఇందులో భాగంగా ప్రెసిస్ రైటింగ్, రిపోర్ట్ రైటింగ్, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై ప్రశ్నలు ఉంటాయి.

తదుపరి దశ పీఈటీ

పేపర్–1, 2లలో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులకు రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఈ ఫిజికల్ ఎఫిషి యన్సీ టెస్ట్ నాలుగు విభాగాల్లో(వంద మీటర్ల పరుగు పందెం, 800 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్) ఉంటుంది. వీటిని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి. ఇందులో పురుషులు, మహిళలకు వేర్వేరు సమయాలు ఉంటాయి. లాంగ్‌జంప్, షాట్‌పుట్ విభాగాల్లో గరిష్ఠంగా మూడు సార్లు పోటీ పడే అవకాశం ఉంటుంది.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లలో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దేశిత కటాఫ్‌ల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. దీనికి 150 మార్కులు కేటాయించారు. ఇంటర్వ్యూలో ప్రధానంగా అభ్యర్థిలో సాయుధ దళాల్లో విధులు నిర్వర్తించే దృక్పథాన్ని పరీక్షిస్తారు.

గ్రూప్–ఎ గెజిటెడ్ హోదాతో కొలువు

మూడు దశల ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు తాము పొందిన ర్యాంకు, సర్వీస్ ప్రిఫరెన్స్ ఆధారంగా విభాగాన్ని కేటాయిస్తారు. తర్వాత దశలో సుమారు ఏడాది పాటు ఆయా దళాల్లో శిక్షణ ఉంటుంది.

ముఖ్య సమాచారం

▪ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
▪ దరఖాస్తు చివరి తేదీ: 2025, మార్చి 25
▪ దరఖాస్తుల సవరణ అవకాశం: 2025, మార్చి 26 నుంచి ఏప్రిల్ 1 వరకు
▪ సీఏపీఎఫ్ రాత పరీక్ష తేదీ: 2025, ఆగస్ట్ 3
▪ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
▪ వెబ్‌సైట్: https://www.upsc.gov.in/

రాత పరీక్షలో రాణించేలా

▪ పేపర్–1లో మంచి మార్కులు సాధించాలంటే.. ముందుగా సిలబస్‌లో పేర్కొన్న సబ్జెక్ట్‌లకు సంబంధించి ఆరు నుంచి 12వ తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలి. దీనివల్ల అన్ని అంశాల బేసిక్స్, ఫార్ములాలపై అవగాహన ఏర్పడు తుంది.
▪ కరెంట్ అఫైర్స్ కోసం ఆర్థిక–రాజకీయ పరిణామాలపై దృష్టి సారించడం ఉపకరిస్తుంది.

వ్యక్తులపై పరిజ్ఞానం పెంచుకోవాలి

▪ ఇటీవల కాలంలో దేశ రక్షణ, భద్రత విభాగాల్లో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, కొత్త క్షిపణుల ప్రయోగాలు, దేశ రక్షణ– భద్రతకు సంబంధించి పలు దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలపై పూర్తి అవగాహన పొందడం మరింత మేలు చేస్తుంది.
▪ పేపర్–2లో రాణించాలంటే.. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు తోపాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం.
▪ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో రాణించడానికి అభ్యర్థులు రాత పరీక్ష ప్రిపరేషన్ దశ నుంచే ఆ దిశగా కృషి చేయాలి. ప్రతిరోజు రెండు గంటలు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో పేర్కొన్న అంశాలపై తర్ఫీదు పొందాలి.

60 శాతం మార్కులు

మొత్తం ఆరు వందల మార్కులకు (రాత పరీక్షకు 450 మార్కులు, ఇంటర్వ్యూకు 150 మార్కులు) జరిగే ఎంపిక ప్రక్రియలో 50 శాతం మార్కులు సాధిస్తే విజేతగా నిలిచే అవకాశం ఉంటుంది. దీంతోపాటు నిర్దేశిత ఫిజికల్ టెస్ట్‌లలో ఉత్తీర్ణత పొందితే విజేతల జాబితాలో నిలిచి సర్వీస్ సొంతం చేసుకోవచ్చు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)		
సెన్సెక్స్ ▽	201	73,829
నిఫ్టీ ▽	73	22,397

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	17,754	▲	451
డోజోన్స్	41,488	▲	675
ఎఫ్‌టీఎస్ఈ 100	8,632	▲	90
డాక్స్	22,987	▲	420
షాంఘై	3,420	▲	61
నికాయ్	37,053	▲	263

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.75	87.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	111.50	114.41
€	యూరో	ఎస్‌బీఐ	93.68	96.37
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.14	59.63
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.37	57.14
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.84	67.48
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.30	23.86
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.80	24.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.13	12.95

సంపద వెలికితీద్దాం పదండి..!

ఎప్పుడో పది, ఇరవై ఏళ్ల క్రితం బ్యాంకులో డిపాజిట్ చేసి మర్చిపోయారా..? తల్లిదండ్రులు లేదా పూర్వీకుల పేరిట స్టాక్, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు మరుగున పడి ఉన్నాయా?.. ఏమో ఎవరు చూసొచ్చారు. ఓసారి విచారిస్తేనే కదా తెలిసేది..! రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు క్లెయిమ్ లేకుండా, నిష్ప్రయోజనంగా ఉండిపోయినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో సుమారు రూ.78,200 కోట్లు బ్యాంకు డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. ఫిజికల్ షేర్ల రూపంలో ఉన్న మొత్తం సుమారు రూ.3.8 లక్షల కోట్లు. రూ.36 వేల కోట్లు మ్యూచువల్ ఫండ్స్ రూపంలో ఉంటే, క్లెయిమ్ చేయని డివిడెండ్‌లు రూ.5 వేల కోట్ల పైమాటే. ఉలుకూ, పలుకూ లేకుండా ఉండిపోయిన ఈ పెట్టుబడులకు అసలు యజమానులు ఎవరు, నిజమైన వారసులు ఎవరు?.. ఏమో అందులో మన వాటా కూడా ఉందేమో..? తెలుసుకునే ప్రయత్నం చేద్దాం...

– సాక్షి, బిజినెస్ డెస్క్



క్లెయిమ్ చేయని పెట్టుబడులు రూ.6 లక్షల కోట్లు

- బ్యాంక్‌ల్లో డిపాజిట్లు, కంపెనీల్లో వాటాలు
- మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు
- పదేళ్లపాటు యాక్టివ్‌గా లేకపోతే అంతే
- పెట్టుబడిదారు సంరక్షణ నిధికి బదిలీ
- వాటి జాడ పట్టుకుంటే సొంతం చేసుకోవచ్చు

కుటుంబ యజమాని తాను చేసిన పెట్టుబడుల వివరాలను జీవిత భాగస్వామితో పంచుకునే అలవాటు గతంలో అతి కొద్ద మందిలోనే ఉండేది. స్టాక్ మార్కెట్ ఆరంభంలో ఇన్వెస్ట్ చేసి, కాలం చేసిన వారి పేరిట పెట్టుబడుల వివరాలు కుటుంబ సభ్యులకు తెలియకపోవచ్చు కూడా. ఇంట్లో ఆధారాలుంటే తప్పించి ఆయా పెట్టుబడుల గురించి తెలిసే అవకాశం లేదు. అవేవో పత్రాలనుకుని, పక్కన పడేసిన వారు కూడా ఉండొచ్చు. లేదా భౌతిక రూపంలోని షేర్ సర్టిఫికెట్లు కనిపించకుండా పోవచ్చు. ఎక్కడో పెట్టి మర్చిపోవచ్చు. ఏళ్లకేళ్లకు క్లెయిమ్ లేకుండా ఉండిపోయిన పెట్టుబడులు 'ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ' (ఐఈపీఎఫ్ఏ/పెట్టుబడిదారుల అక్షరాస్యత, సంరక్షణ నిధి)కు బదిలీ అయిపోతాయి. ఐఈపీఎఫ్ఏ కిందకు ఇలా చేరిపోయిన లిస్టెడ్ కంపెనీల షేర్ల విలువ ఎంతన్నది అధికారిక సమాచారం లేదు. సెబీ నమోదిత 'ఫీ ఓన్లీ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ' అంచనా ప్రకారం.. ఈ మొత్తం 2024 మార్చి నాటికి సుమారు రూ.77,033 కోట్లుగా ఉంటుంది.

ఐఈపీఎఫ్ఏ కిందికి..

లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి వాటాదారులు వరుసగా ఏడు సంవత్సరాలు, అంతకుమించి డివిడెండ్ క్లెయిమ్ చేయకపోతే కంపెనీల చట్టంలోని సెక్షన్ 124 కింద ఆయా వాటాలను ఐఈపీఎఫ్ఏ కిందకు కంపెనీలు బదిలీ చేయాలి. గతంలో డివిడెండ్‌లు ఎన్‌క్యాష్ (నగదుగా మార్చుకోవడం) కాకపోవడం, చిరునామాలో మార్పులతో అవి కంపెనీకి తిరిగి వచ్చేవి. నేటి రోజుల్లో డీమ్యాట్ ఖాతాతో అనుసంధానమై ఉన్న బ్యాంక్ ఖాతా ఇనాపరేటివ్ (కార్యకలాపాల్లేని స్థితి)గా మారిన సందర్భాల్లో వాటాదారులకు డివిడెండ్ చేరదు. ఇలా పదేళ్ల పాటు కొనసాగితే, ఆయా వాటాలు ఐఈపీఎఫ్ఏ కిందకు వెళ్లిపోతాయి.

గుర్తించడం ఎలా..?

కార్పొరేట్ వ్యవహారాల శాఖ కింద ఐఈపీఎఫ్ఏ పనిచేస్తుంటుంది. అన్ క్లెయిమ్డ్ షేర్ల వివరాలను ప్రతి ఒక్కరూ తెలుసుకునేందుకు వీలుగా iepfa.gov.in/login పోర్టల్‌లో డేటాబేస్ అందుబాటులో ఉంది. ఇన్వెస్టర్లు తమ మొబైల్ నంబర్, ఈమెయిల్ వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అయి, పాన్ నంబర్ ఆధారంగా తమ పేరు, తమ తల్లిదండ్రులు, వారి పూర్వీకులలో ఎవరి పాన్ నంబర్ లేదా పేరుమీద షేర్లు ఐఈపీఎఫ్ఏ కింద ఉన్నాయేమో పరిశీలించుకోవచ్చు. ఒకవేళ ఐఈపీఎఫ్ఏకు ఇంకా బదిలీ కాకుండా, కంపెనీ వద్దే ఉండిపోయిన అన్‌క్లెయిమ్డ్ షేర్లు, డివిడెండ్‌ల వివరాలు కూడా పోర్టల్‌లో లభిస్తాయి. ఫోలియో నంబర్‌తోనూ చెక్ చేసుకోవచ్చు. దీనికంటే ముందు ఒకసారి ఇల్లంతా వెతికి ఒకవేళ భౌతిక పత్రాలుంటే, వాటిని డీమ్యాట్ చేయించుకోవడం సులభమైన పని. ఎన్ఎస్‌డీఎల్, సీడీఎస్ఎల్ సంస్థలు ఇన్వెస్టర్లకు పాన్ నంబర్ ఆధారంగా కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్ (సీఏఎస్)ను నెలవారీగా పంపిస్తుంటాయి. ఇన్వెస్టర్ ఈమెయిల్స్‌ను పరిశీలించడం ద్వారా వారి పేరిట పెట్టుబడులను తెలుసుకోవచ్చు. తమ తల్లిదండ్రులు లేదా సమీప బంధువు ఇటీవలి కాలంలో మరణించినట్టయితే, వారి పేరిట పెట్టుబడులను తెలుసుకునేందుకు మరో మార్గం ఉంది. వారి ఆదాయపన్ను రిటర్నులను పరిశీలిస్తే వివరాలు తెలియొచ్చు. ఎన్ఎస్‌డీఎల్ లేదా సీడీఎస్ఎల్‌కు లేఖ రాస్తూ, తమ వారి పేరిట ఉన్న పెట్టుబడుల సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయొచ్చు. తాము వారికి చట్టబద్ధమైన వారసులమన్న రుజువును లేఖకు జత చేయాలి.

రికవరీ ఎలా..?

ఐఈపీఎఫ్ఏ నుంచి షేర్లు, డివిడెండ్‌ను రికవరీ చేసుకోవడానికి కొంత శ్రమించక తప్పదు. 'షేర్ సమాధాన్' వంటి కొన్ని సంస్థలు ఫీజు తీసుకుని ఇందుకు సంబంధించి సేవలు అందిస్తున్నాయి. ఐఈపీఎఫ్ఏ వద్ద క్లెయిమ్ దాఖలు చేసి, షేర్లు, డివిడెండ్‌లను వెనక్కి తెప్పించుకోవడానికి చాలా సమయం పడుతుందని షేర్ సమాధాన్ చెబుతోంది. ప్రస్తుతం క్లెయిమ్ ఆమోదం/తిరస్కారానికి ఆరు నెలల నుంచి మూడేళ్ల సమయం తీసుకుంటున్నట్టు షేర్ సమాధాన్ డైరెక్టర్ శ్రేయ్ ఘోషల్ తెలిపారు. కొన్ని కంపెనీలు, ఆర్‌టీఏలు ఈ విషయంలో మెరుగ్గా స్పందిస్తుంటే.. కొన్నింటి విషయంలో ఒకటికి రెండు సార్లు సంప్రదింపులు నిర్వహించాల్సి వస్తున్నట్టు చెప్పారు. ఏదైనా కంపెనీలో వాటాలున్నట్టు గుర్తించి, అవి ఇంకా ఐఈపీఎఫ్ఏ కిందకు బదిలీ కాకపోతే.. కంపెనీ ఆర్‌టీఏను సంప్రదించాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను సమర్పించి, వాటిని క్లెయిమ్ చేసుకోవచ్చు.

డీమ్యాట్ చేసుకోవాలి..?

2019 ఏప్రిల్ నుంచి షేర్ల క్రయ, విక్రయాలకు అవి డీమ్యాట్ రూపంలో ఉండడాన్ని సెబీ తప్పనిసరి చేసింది. వాటాదారులు మరణించిన కేసుల్లో వారి వారసుల పేరిట బదిలీకి మాత్రం మినహాయింపు ఉంది. ఇప్పటికీ పత్రాల రూపంలో షేర్లు కలిగి ఉంటే, ఆయా కంపెనీల ఆర్‌టీఏలను సంప్రదించి డీమెటీరియలైజేషన్ (డీమ్యాట్) చేయించుకోవాలి. షేర్ హోల్డర్ పేరు, ఫోలియో నంబర్ వివరాలతో ఆర్‌టీఏను సంప్రదిస్తే.. ఏయే పత్రాలు సమర్పించాలన్నది తెలియజేస్తారు. నిబంధనల మేరకు దరఖాస్తును పూర్తి చేసి, కేవైసీ, ఇతర పత్రాలను జోడించి ఆర్‌టీఏకి పంపించాలి. దరఖాస్తును ఆమోదిస్తే, ధ్రువీకరణ లేఖను ఆర్‌టీఏ జారీ చేస్తుంది. అప్పుడు దీన్ని డీమ్యాట్ ఖాతా కలిగిన డిపాజిటరీ పార్టిసిపెంట్ (సీడీఎస్ఎల్/ఎన్ఎస్‌డీఎల్)కు సమర్పించిన అనంతరం షేర్లు జమ అవుతాయి. ఈ విషయంలో కొందరు బ్రోకర్లు, కన్సల్టెన్సీ సంస్థలు సేవలు అందిస్తున్నాయి. వాటి సాయం తీసుకునే ముందు ఆయా సంస్థల వాస్తవికతను నిర్ధారించుకోవడం అవసరం.

అన్‌క్లెయిమ్డ్ షేర్లు డీమ్యాట్ రూపంలో ఉంటే..?

- అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించడం ద్వారా వాటిని తమ పేరిట బదిలీ చేయించుకోవచ్చు.
- డీపీ వద్ద దరఖాస్తు దాఖలు చేయాలి.

షేర్లు పత్రాల రూపంలో ఉంటే?

- విడిగా ప్రతి కంపెనీ ఆర్‌టీఏ వద్ద డీమెటీరియలైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి.
- అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలి. అవన్నీ కచ్చితమైనవని నిర్ధారించుకున్న తర్వాత, అప్పుడు డీమ్యాట్ ఖాతాకు బదిలీ అవుతాయి.
- సర్వీస్ రిక్వెస్ట్ నంబర్ (ఎస్ఆర్ఎన్) జారీ అవుతుంది. దీని ఆధారంగా ఆయా కంపెనీల ఆర్‌టీఏ వద్ద 7–10 రోజుల్లోగా డాక్యుమెంట్లను సమర్పించాలి.

ఐఈపీఎఫ్ఏకు బదిలీ అయిపోతే..?

- వాటాలున్న ప్రతి కంపెనీ ఆర్‌టీఏ నుంచి ఎంటైటిల్‌మెంట్ లెటర్‌ను పొందాలి.
- ఐఈపీఎఫ్–5 ఈ–ఫారమ్‌ను ఐఈపీఎఫ్ఏ వద్ద దాఖలు చేయాలి.
- కంపెనీ ఆమోదం తర్వాత క్లెయిమ్‌ను ఐఈపీఎఫ్ఏ ఆమోదిస్తుంది. దాంతో షేర్లు అసలైన యజమానులు లేదా వారసులకు బదిలీ అవుతాయి.

బ్యాంక్ డిపాజిట్లు..

బ్యాంక్ ఖాతాలో రెండేళ్లకు పైగా ఎలాంటి లావాదేవీ లేకపోతే అది ఇనాపరేటివ్‌గా మారిపోతుంది. ఖాతాదారు మరణించిన సందర్భంలో ఇలా జరగొచ్చు. అటువంటప్పుడు మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు నామినీ తన కేవైసీ డాక్యుమెంట్లను బ్యాంక్ శాఖలో సమర్పించాలి. ఖాతాను మూసేసి, అందులోని బ్యాలన్స్‌ను నామినీకి బదిలీ చేస్తారు. ఒకవేళ నామినీ లేకపోయినప్పటికీ, ఇనాపరేటివ్ ఖాతాలో బ్యాలన్స్ రూ.25 వేల లోపు ఉంటే బ్యాంక్ స్థాయిలోనే పరిష్కరించుకోవచ్చు. అంతకుమించి బ్యాలన్స్ ఉంటే చట్టబద్ధమైన వారసులు (జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, పిల్లలు, సోదరులు/సోదరీమణులు) కోర్టుకు వెళ్లి సక్సెషన్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. క్లెయిమ్ కోసం ఒకరికి మించి ముందుకు వస్తే, అప్పుడు ఇండెమ్నిటీ సర్టిఫికెట్‌ను సైతం బ్యాంక్ కోరొచ్చు. డిపాజిట్ అయినా, ఖాతాలో బ్యాలన్స్ అయినా 10 ఏళ్లపాటు క్లెయిమ్ లేకుండా ఉండిపోతే, ఆ మొత్తాన్ని డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలను తమ పోర్టల్‌లో అందుబాటులో ఉంచాలని ఆర్‌బీఐ గతంలో బ్యాంక్‌లను ఆదేశించింది. కనుక పేరు, పుట్టిన తేదీ, పాన్ తదితర వివరాలతో తమ పేరు, తమ వారి పేరిట డిపాజిట్లు ఉన్నాయేమో బ్యాంక్ పోర్టల్‌కు వెళ్లి పరిశీలించుకోవచ్చు. లేదంటే బ్యాంక్ శాఖకు వెళ్లి విచారణ చేయాలి.



ఫండ్స్ పెట్టుబడుల సంగతి..?

బ్యాంక్ డిపాజిట్లకు, బీమా పాలసీలకు మెచ్యూరిటీ ఉంటుంది. కానీ ఓపెన్ ఎండెడ్ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులకు అలాంటిదేమీ ఉండదు. అయినప్పటికీ పదేళ్లకు పైగా ఒక ఫోలియోపై ఎలాంటి లావాదేవీలు లేకుండా, కేవైసీ అప్‌డేట్ చేయకపోతే వాటిని అన్‌క్లెయిమ్డ్‌గా పరిగణించొచ్చు. డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్‌కు సంబంధించి డివిడెండ్‌లు క్లెయిమ్ కాకపోయి ఉండొచ్చు. చిరునామా, కాంటాక్ట్ వివరాలు మారిపోయి, ఇన్వెస్టర్ మరణించిన సందర్భాలు, బ్యాంక్ ఖాతా ఇనాపరేటివ్‌గా మారిపోయిన కేసుల్లోనూ ఇది చోటు చేసుకోవచ్చు. ఇలాంటి పెట్టుబడులను ఐఈపీఎఫ్ఏ కిందకు బదిలీ చేసినట్టయితే, షేర్ల మాదిరే నిర్దేశిత ప్రక్రియలను అనుసరించి వాటిని సొంతం చేసుకోవచ్చు. ఫండ్స్ పెట్టబడుల వివరాలను గుర్తించేందుకు క్యామ్స్, కే–ఫిన్‌టెక్ సాయం తీసుకోవచ్చు. యాక్టివ్‌గా లేని ఫండ్స్ పెట్టుబడులను తెలుసుకునేందుకు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) 'మిత్రా' పేరుతో (ఎంఎఫ్ పెట్టుబడుల గుర్తింపు, రికవరీ) ఒక ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ త్వరలో అందుబాటులోకి రానుంది. అప్పుడు, తమ పేరు, తమ వారి పేరిట ఉన్న ఫండ్స్ పెట్టుబడి వివరాలను సులభంగా గుర్తించొచ్చు.



ఇలా చేస్తే సమస్యలకు దూరం..



- ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులకు సంబంధించి (ట్రేడింగ్ ఖాతాకు అనుసంధానంగా ఉన్న) బ్యాంక్ ఖాతాను యాక్టివ్‌గా ఉంచుకోవాలి.
- పెట్టుబడుల వివరాలను జీవిత భాగస్వామితో పంచుకోవాలి. లేదంటే ఒక డైరీలో అన్ని పెట్టుబడులు, ఆర్థిక వివరాలను నమోదు చేసి, ఇంట్లో భద్రపరచాలి.
- ప్రతి పెట్టుబడికి నామినీని నమోదు చేయాలి.
- వీలునామా లేదా ఎస్టేట్ ప్లానింగ్ చేసుకోవాలి. దీనివల్ల భవిష్యత్తులో వారసులకు క్లెయిమ్ సమస్యలు ఎదురుకావు.
- చిరునామా, ఫోన్ నంబర్, బ్యాంక్ ఖాతా ఇలా కేవైసీకి సంబంధించి ముఖ్యమైన వివరాల్లో మార్పులు జరిగితే వెంటనే బ్యాంక్‌లు, మ్యూచువల్ ఫండ్స్, డీపీలు, బీమా కంపెనీల వద్ద అప్‌డేట్ చేసుకోవాలి.

బీమా ప్రయోజనాలూ అంతే..

ఎల్ఐసీ సహా కొన్ని బీమా సంస్థల పరిధిలో మెచ్యూరిటీ (గడువు) ముగిసినా, ఎలాంటి క్లెయిమ్ చేయని పాలసీలు చాలానే ఉన్నాయి. ఒక పాలసీదారు పేరిట క్లెయిమ్ చేయని మొత్తం రూ.1,000కి మించి ఉంటే, ఆ వివరాలను తమ వెబ్‌సైట్లలో బీమా సంస్థలు ప్రదర్శించాలని ఐఆర్‌డీఏఐ ఆదేశించింది. పాలసీదారు పేరు, పాలసీ నంబర్, పాన్, పుట్టిన తేదీ వివరాలతో వీటి గురించి తెలుసుకోవచ్చు. క్లెయిమ్ బ్యాంక్ డిపాజిట్ల మాదిరే ఉంటుంది.



స్టార్ సిమెంట్ | బ్రోకరేజ్: ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 205 టార్గెట్: రూ. 270

ఎందుకంటే: ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలలో పటిష్ఠ కార్యకలాపాలు కలిగిన స్టార్ సిమెంట్ ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ప్రస్తావించదగ్గ పనితీరు ప్రదర్శించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో ఈశాన్య రాష్ట్రాల డిమాండుకు మించి అమ్మకాల పరిమాణాన్ని సాధించింది. అయితే నిర్వహణ పనితీరు నీరసించింది. ఇందుకు పలు అంశాలు ప్రభావం చూపాయి. మేఘాలయ క్లింకర్ యూనిట్ స్టెబిలైజేషన్ ఆలస్యంకావడం, అధిక నిర్వహణ మూసివేత వ్యయాలు, జాతీయ రహదారి నిర్మాణం కొనసాగుతున్న నేపథ్యంలో పెరిగిన రవాణా వ్యయాలు, తదితరాలు కారణమయ్యాయి. ఈశాన్య రాష్ట్రాలలో 26 శాతం మార్కెట్ వాటా కలిగిన కంపెనీ మొత్తం అమ్మకాల పరిమాణం క్యూ3లో 1.07 మిలియన్ టన్నుల(ఎంటీ)ను తాకింది. వార్షిక ప్రాతిపదికన ఇది 9.7% వృద్ధికాగా.. ఈశాన్య రాష్ట్రాలలో 13% ఎగసింది. ఇతర ప్రాంతాలలో మాత్రం 3% క్షీణత నమోదైంది. ఇక ఆదాయం 10.3% పుంజుకుని రూ. 700 కోట్లకు చేరింది. ఇంధన వ్యయాలు తగ్గినప్పటికీ రూ. 40 కోట్ల వన్‌టైమ్ రవాణా వ్యయాల కారణంగా నిర్వహణ పనితీరు మందగించింది. నవంబర్‌కల్లా మేఘాలయ క్లింకర్ యూనిట్ స్థిరత్వాన్ని అందుకోవడం, 2025 డిసెంబర్‌కల్లా 2 ఎంటీ సిల్‌చార్ గ్రైండింగ్ యూనిట్(జీయూ), 2027 మార్చికల్లా 2 ఎంటీ జోరట్ జీయూ ప్రారంభంకానున్న అంచనాల నేపథ్యంలో సిమెంట్ తయారీ సామర్థ్యం 11.7 ఎంటీకి బలపడనుంది. వీటికితోడు ఇటీవలే రాజస్తాన్ (నింబోల్)లో సొంతం చేసుకున్న 65 ఎంటీ లైమ్‌స్టోన్ రిజర్వుల వద్ద క్లింకర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. కాగా.. అదానీ గ్రూప్ 8.7% వాటా కొనుగోలు చేసిన నేపథ్యంలో ప్రమోటర్లు మరింత వాటా విక్రయించబోరంటూ కంపెనీ పేర్కొంది.



షేర్స్ వ్యూ

సీఎంఎస్ ఇన్ఫో | బ్రోకరేజ్: జెఫరీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 437 టార్గెట్: రూ. 600

ఎందుకంటే: ఏటీఎం నగదు నిర్వహణ కంపెనీ సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసిక పనితీరు అంచనాలను అందుకోలేకపోయింది. ప్రొడక్ట్ విక్రయాలు మందగించడంతో వార్షిక ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 7 శాతమే పుంజుకుంది. అయితే విభిన్న విభాగాలలో విస్తరించనున్న కార్యకలాపాల కారణంగా కంపెనీ భవిష్యత్‌పట్ల సానుకూలంగా స్పందిస్తున్నాం. కంపెనీ ప్రధానంగా సర్వీసులందించే ఏటీఎం క్యాష్ మేనేజ్‌మెంట్ విభాగానికి డిమాండు పుంజుకోనుంది. రుణ చెల్లింపుల విషయంలో అతిపెద్ద పోటీదారు సంస్థ విఫలంకావడంతో ఔట్‌సోర్సింగ్ జోరందుకోనుంది. ఆర్ఎమ్ సర్వీసులతో క్విక్‌కామర్స్ విభాగంలో సేవలను వేగంగా విస్తరించనుంది. ఏటీఎం ఇంటర్‌చేంజ్ ఫీజు పెంచే అవకాశముంది. ఇవికాకుండా బులియన్ లాజిస్టిక్స్, రుణ వసూళ్లలోకీ ప్రవేశించే వీలుంది. ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ 10,000కుపైగా ఏటీఎంల క్యాష్ మేనేజ్‌మెంట్‌కు బిడ్డింగ్‌ను ఆహ్వానించనుంది. ఈ బాటలో ఇతర పీఎస్‌యూలు సైతం ఏటీఎంల నగదు నిర్వహణపై ఔట్‌సోర్సింగ్‌కు తెరతీయనున్నాయి. క్విక్ కామర్స్ విభాగంలో వరుసకడుతున్న పెట్టుబడులు సమీప భవిష్యత్‌లో కంపెనీకి మేనేజ్‌మెంట్ అంశంలో భారీ అవకాశాలను కల్పించనున్నట్లు భావిస్తున్నాం. భారీస్థాయిలో విస్తరించిన కార్యకలాపాలు, నిర్వహణా సామర్థ్యం, పటిష్ఠ బ్యాలన్స్‌షీట్, బ్యాంకింగ్ దిగ్గజాలతో భాగస్వామ్యాలు, రిమోట్ మానిటరింగ్ సిస్టమ్స్, బ్రౌన్‌లేబుల్ ఏటీఎంలు తదితరాల ద్వారా కంపెనీ మార్కెట్ వాటాను పెంచుకోనుంది. ప్రపంచ మార్కెట్ల బాటలోనే క్యాష్ మేనేజ్‌మెంట్ విభాగంలో దేశీయంగానూ కన్సాలిడేషన్ జరిగే వీలుంది. దీంతో సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లబ్ధి పొందనుంది. రానున్న కాలంలో నికర లాభాల్లో 17–20 శాతం వృద్ధిని సాధించగలదని విశ్వసిస్తున్నాం.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యూ ఫండ్ ఆఫర్

360 వన్ అసెట్ సిల్వర్ ఈటీఎఫ్



పారిశ్రామిక కమోడిటీగానూ, విలువైన లోహంగా పెట్టుబడికి అనువైన సాధనంగానూ వెండి ద్విపాత్రాభినయం పోషిస్తోంది. ఇందులో ఇన్వెస్ట్ చేసేందుకు వీలు కల్పించేలా 360 వన్ అసెట్ మేనేజ్‌మెంట్ (గతంలో ఐఐఎఫ్ఎల్ అసెట్ మేనేజ్‌మెంట్) సిల్వర్ ఈటీఎఫ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ మార్చి 20 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఇది దేశీయంగా వెండి ధరలను ట్రాక్ చేస్తూ, దానికి అనుగుణమైన పనితీరు కనపరుస్తుందని సంస్థ సీఈవో రాఘవ్ అయ్యంగార్ తెలిపారు. వెండి ధరల కదలికలకు అనుగుణంగా దీర్ఘకాలిక సంపద సృష్టి, ఆదాయం కోరుకునే ఇన్వెస్టర్లకు అనువైనదిగా ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం అసెట్స్‌లో 95 శాతాన్ని వెండి లేదా వెండి సంబంధిత సాధనాల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది.

హెచ్‌డీఎఫ్‌సీ 'నిఫ్టీ టాప్ 20' ఇండెక్స్ ఫండ్



హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా నిఫ్టీ టాప్ 20 ఈక్వల్ వెయిట్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఇది మార్చి 21తో ముగుస్తుంది. సమాన వెయిటేజీ పెట్టుబడి విధానం ద్వారా దేశీ బ్లూ చిప్ కంపెనీల దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను, ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలనుకునే ఇన్వెస్టర్లకు ఈ స్కీము అనువైనదిగా ఉంటుంది. ఒకే స్టాక్‌లో అధికంగా ఇన్వెస్ట్ చేయడం కాకుండా సమాన స్థాయిలో పెట్టుబడిని కేటాయించడం వల్ల రిస్కులు తగ్గించుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. వెయిటేజీ ప్రతి మూడు నెలలకోసారి మారుతుంది. కనీసం రూ. 100 నుంచి ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చని సంస్థ ఎండీ నవనీత్ మునోట్ తెలిపారు.

బజాజ్ అలయంజ్ లైఫ్ ఫోకస్డ్ 25 ఫండ్

ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థ బజాజ్ అలయంజ్ లైఫ్ తాజాగా ఫోకస్డ్ 25 ఫండ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. కంపెనీకి చెందిన యులిప్ పథకాలతో పాటు ఇది అందుబాటులో ఉంటుంది. వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్లవ్యాప్తంగా 25 వరకు స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధికి దోహదపడుతుంది. ఈ ఎన్ఎఫ్ఓ మార్చి 20 వరకు అందుబాటులో ఉంటుందని సీఎఫ్ఓ శ్రీనివాస్ రావు రావూరి తెలిపారు.

ఎన్ఎఫ్‌వోల్లో మెరుగైన ఎంపిక ఎలా?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను ప్రతి నెలా రూ.5,000 మొత్తాన్ని సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా ఇన్వెస్ట్ చేస్తూ పెద్ద మొత్తాన్ని సమకూర్చుకోవాలని అనుకుంటున్నాను. దీర్ఘకాలానికి మెరుగైన పథకాలను సూచించగలరు.


– అహ్మద్ వాని

దీర్ఘకాలానికి ఈక్విటీ ఫండ్స్ మెరుగైనవే. మార్కెట్లలో ఉండే ఆటుపోట్ల దృష్ట్యా మీకు సౌకర్యమైన పథకాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. మొదటిసారి ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటే, హైబ్రిడ్ ఫండ్స్ మంచి ఎంపిక అవుతాయి. ఇవి మూడింత రెండొంతులు పెట్టుబడులను ఈక్విటీలకు, మిగిలినది డెట్‌కు కేటాయిస్తుంటాయి. మార్కెట్ పతనాల్లో పెట్టుబడుల విలువ క్షీణతకు డెట్ పెట్టుబడులు కుషన్‌గా పనిచేస్తాయి. ప్రతి నెలా రూ.5,000 చొప్పున గత 20 ఏళ్ల నుంచి అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి ఉంటే, ఆ మొత్తం రూ.51.25 లక్షలుగా మారి ఉండేది. అంటే వార్షిక సిప్ రాబడి 12.18 శాతం. ఒకవేళ పెట్టుబడుల్లో అనుభవం ఉండి, మార్కెట్ ఆటుపోట్లను తట్టుకునేట్టు అయితే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ పథకాలు పూర్తిగా ఈక్విటీల్లో.. అది కూడా లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. అధిక రిస్క్ తీసుకున్నప్పటికీ 20 ఏళ్ల కాలంలో చూస్తే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో వార్షిక రాబడి 12.66 శాతమే ఉంది. కనుక ఇన్వెస్టర్లు తమ రిస్క్‌కు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలి.

ఒక మ్యూచువల్ ఫండ్ సంస్థ నుంచి పలు న్యూ ఫండ్ ఆఫర్లు (ఎన్ఎఫ్‌వోలు/కొత్త పథకాలు) ప్రారంభం కావడం చూశాను. అవి ఎంతో ఆకర్షణీయంగా అనిపించాయి. కానీ, ఇప్పటికే పెట్టుబడులకు అందుబాటులో ఉన్న మ్యూచువల్ ఫండ్స్ పథకాల కంటే ఎన్ఎఫ్‌వోల్లో ఇన్వెస్ట్ చేయడం మెరుగైనదా? అన్న విషయంలో నాకు స్పష్టత లేదు. ఎన్ఎఫ్‌వోల్లో పెట్టుబడులు పెట్టే ముందు చూడాల్సిన అంశాలు ఏవి?

– కరుణాకర్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు తరచుగా కొత్త పథకాలను ప్రవేశపెడుతుంటాయి. ప్రస్తుత పథకాలతో పోల్చి చూస్తే వీటిల్లో ఉండే వ్యత్యాసం కొంతే. కొన్ని ఎన్ఎఫ్‌వోలు మాత్రం కొత్త పెట్టుబడుల అవకాశాలతో ముందుకు వస్తుంటాయి. ఇన్వెస్టర్లు ఇప్పటికే మంచి పనితీరు చూపిస్తున్న పథకాలకు పరిమితం కావడం మంచిది. ఎన్ఎఫ్‌వోల్లో ఇన్వెస్ట్ చేసే ముందుకు ప్రశ్నించుకోవాల్సిన అంశాలు చూద్దాం. ఎన్ఎఫ్‌వోలో కొత్తదనం ఏదైనా ఉందా? అన్నది చూడాలి. చాలా ఎన్ఎఫ్‌వోలు ప్రస్తుత పథకాలకు మాస్క్ మాదిరిగా ఉంటాయి. ఇంటర్నేషనల్ ఈక్విటీ, గోల్డ్ ఫండ్స్ తదితర వినూత్నమైన ఆఫర్లు మినహా సాధారణమైన ఎన్ఎఫ్‌వోలతో పోర్ట్‌ఫోలియోకు అదనంగా ఒనగూడే ప్రయోజనం ఏదీ ఉండదు. థీమ్ లేదా సెక్టార్ ఫండ్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. సంబంధిత ఎన్ఎఫ్‌వో తమ పెట్టుబడుల అవసరాలను తీర్చే విధంగా ఉందా? అన్నది చూడాలి. మీ ప్రస్తుత పెట్టుబడులు మీ ఆర్థిక లక్ష్యాలను తీర్చే విధంగా ఉంటే, ఎన్ఎఫ్‌వో మెరుగైన ఆప్షన్ కాకపోవచ్చు. ప్రతీ ఫండ్ మీ పోర్ట్‌ఫోలియోలో చేరాలనేమీ లేదు. కొత్తగా వచ్చిన ఎన్ఎఫ్‌వో మాదిరిగా పెట్టుబడుల విధానాన్ని ఆఫర్ చేస్తున్న పథకాలు ఇప్పటికే ఏవైనా ఉన్నాయేమో పరిశీలించాలి. ఒకవేళ ఉంటే, వాటిల్లో రాబడుల పనితీరు కొన్నేళ్ల నుంచి మెరుగ్గా ఉందా? లేదా అన్నది పరిశీలించాలి.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

విదేశీ గణాంకాలే దిక్సూచి	పెట్టుబడికి విలువ జోడింపు: హెచ్ఎస్‌బీసీ వేల్యూ ఫండ్



సప్తర్షి మండలం గురించి మంత్రి జూపల్లికి వివరిస్తున్న ప్రొఫెసర్ పుల్లారావు

యునెస్కో గుర్తింపు కోసం కృషి

మంత్రి జూపల్లి కృష్ణారావు

కృష్ణా: ముడుమాల్ నిలువురాళ్లకు యునెస్కో ప్రాథమిక ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చడం ఆనందంగా ఉందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దీనికి పూర్తిస్థాయిలో యునెస్కో గుర్తింపు పొందేలా కృషి చేస్తామన్నారు. ముడుమాల్ నిలువురాళ్లను ఆదివారం ఆయన నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి నిలువురాళ్ల చరిత్ర, సప్తరుషి మండలి వివరాలను ప్రొఫెసర్ పుల్లారావు మంత్రికి వివరించారు. అదేవిధంగా వారం రోజుల్లో పురావస్తు శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి యునెస్కో శాశ్వత గుర్తింపునకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు కృషిచేస్తానని చెప్పారు.

అవన్నీ ఆదిమానవులు పాతిన స్మారక శిలలు.. కొన్నేళ్ల క్రితం వరకు అవి మూడువేల ఏళ్ల కింద ఏర్పాటు చేసిన సమాధి రాళ్లు (మెన్హిర్స్)గానే భావించారు. కానీ, అవి మామూలు స్మారక శిలలు కాదు, ఖగోళ వివరాల గుట్టు విప్పే ఓ అబ్జర్వేటరీ అని పరిశోధకులు తర్వాత గుర్తించారు. అదే తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని నారాయణపేట జిల్లా కృష్ణా నదీ తీరంలోని ముడుమాల్ గ్రామ శివారులోని నిలువురాళ్ల వెనక దాగిన చారిత్రక రహస్యం. కానీ, ఖగోళ గుట్టు విప్పేంత ప్రత్యేకత ఈ రాళ్లకు ఉందా అన్న అనుమానాలూ లేకపోలేదు. కానీ, ఓ క్రమపద్ధతిలో ఆ రాళ్లను అమర్చిన తీరు అసాధారణమే అని, వాటి అమరిక వెనక ఓ ఖగోళ రహస్యముందని ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ సంస్థ యునెస్కోకు సమర్పించబోతున్నారు. ఈమాత్రం ప్రత్యేకతలు కూడా లేని ఇంగ్లండ్‌లోని స్టోన్‌హెంజ్ రాతి అమరికను గుర్తించిన తరహాలో.. అంతకంటే ప్రత్యేకమైన ఈ రాళ్లకు కూడా ఆ గుర్తింపు ఇవ్వాలని భారత ప్రభుత్వం సగర్వంగా యునెస్కోను అడగబోతోంది. ఇటీవలే తెలంగాణలోని విఖ్యాత శైవ క్షేత్రం రామప్ప నిర్మాణంలో నాటి కాకతీయ నైపుణ్యానికి యునెస్కో అబ్బురపడి గుర్తింపు ఇచ్చిన విషయం తెలిసిందే. మరోసారి ఆ ఖ్యాతి తెలంగాణను పలకరించేందుకు అవకాశం రాబోతోంది.



స్టోన్‌హెంజ్ సరసన

మన ముడుమాల్!

సాక్షి, హైదరాబాద్: యునెస్కో గుర్తింపు పొందదగిన ఎన్నో చారిత్రక ప్రాంతాలు తెలంగాణలో ఉన్నప్పటికీ, వాటి వివరాలను ఇంతకాలం శాస్త్రీయ పద్ధతిలో ఆ సంస్థ ముందు ఉంచలేకపోయారు. రామప్ప విషయంలో విజయం సాధించిన నేపథ్యంలో, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు నడుం బిగించింది. ఆ సంస్థ ముఖ్యులు వేదకుమార్ ఆధ్వర్యంలో 2023లో తెలంగాణ పురావస్తు శాఖతో ఒప్పందం కుదుర్చుకుని అధ్యయనం ప్రారంభించింది. గతంలో ముడుమాల్ ప్రత్యేకతలపై పరిశోధించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేపీ రావుతోపాటు నిపుణులు సూర్య నారాయణమూర్తి తదితరుల బృందం పరిశోధిస్తోంది. అందుబాటులో ఉన్న వివరాలను సమర్పించగా ఏఎస్ఐ వాటిని యునెస్కోకు సమర్పించింది. ముడుమాల్‌తోపాటు వేర్వేరు రాష్ట్రాల్లోని మరో ఐదు ప్రాంతాలను కూడా చేర్చింది. వెరసి ఆరు ప్రాంతాలకూ యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు కల్పించింది. ఇప్పుడు పూర్తిస్థాయి గుర్తింపు కోసం తుది సమగ్ర నివేదిక తయారీపై ట్రస్టు దృష్టి సారించింది.

ప్రపంచ ఖ్యాతికి అడుగు దూరంలో ముడుమాల్ నిలువురాళ్లు

- ప్రపంచ వారసత్వ సంపదలో చోటు దక్కే అవకాశం
- యునెస్కో గుర్తింపు ప్రక్రియలో సానుకూల పరిణామాలు.. ఇటీవలే తాత్కాలిక జాబితాలో చోటు

యునెస్కో ముందుంచే కీలక అంశాలివీ..

- సప్తరుషుల మండలంగా పేర్కొనే నక్షత్ర సమూహం (ఉర్సా మెజర్)లో పైన ఉండే రెండు నక్షత్రాలు దుభే, మిరాక్‌లను అనుసంధానిస్తూ ఓ సరళ రేఖను గీస్తే అది ఉత్తరం వైపే సూచిస్తుంది. ఏ దిక్కూ తెలియని స్థితిలో ఉన్నవారు.. ఆ నక్షత్రాల ఆధారంగా ఉత్తర దిక్కును సులభంగా గుర్తించొచ్చు. మరి పగటి వేళ నక్షత్రాలు కనిపించని సమయంలో దిక్కులను గుర్తించేదెలా?
- దీనికి దాదాపు మూడు వేల ఏళ్ల క్రితమే నాటి మానవులు పరిష్కారం చూపారు. నక్షత్ర మండలంలోని సప్తరుషుల నక్షత్ర సమూహాన్ని ఏమాత్రం తేడా లేకుండా ఓ బండరాతిపై చెక్కారు. వాటిలోని ఆ రెండు నక్షత్రాలను సమాంతరంగా ఉండే కోణం ప్రకారం ఉత్తర దిక్కును, తద్వారా మిగతా దిశలను గుర్తించొచ్చు. ఇక ఆ రెండు నక్షత్రాలను మేళవిస్తూ రూపొందించే సరళరేఖ సూచించే ఉత్తర దిశలో నేరుగా చూస్తే ఉత్తర ధ్రువ నక్షత్రం కనిపిస్తుంది.
- రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భూగమనం ఆధారంగా ఆ నక్షత్రాలు మారిపోతుంటాయి. కానీ ఆ రెండు నక్షత్రాలు మాత్రం ఎటువైపు ఉన్నా, అవి ఉత్తర దిశనే సూచిస్తుండటం విశేషం.
- ముడుమాల్ నిలువురాళ్ల వద్ద ఓ బండరాతిపై ఈ నక్షత్ర సమూహం అచ్చుగుద్దినట్టు చెక్కి ఉంది. దీన్ని మూడువేల ఏళ్ల క్రితమే రూపొందించినట్టు పరిశోధకులు గుర్తించారు.
- కొరియా, జపాన్‌లలో ఇలా నక్షత్ర మండలాన్ని బండరాళ్లమీద ఆదిమానవులు చెక్కిన ఆధారాలను గతంలోనే పరిశోధకులు గుర్తించారు. అయితే, వాటిల్లో దుభే, మిరాక్ నక్షత్రాలు కచ్చితంగా ఉత్తర దిశను గుర్తించేలా లేవని, వాటి స్థానాల్లో తేడాలున్నాయని, ముడుమాల్‌లో మాత్రమే ఆ కచ్చితత్వం ఉందని.. దీనిపై పరిశోధనలు చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ కేపీ రావు 'సాక్షి'తో చెప్పారు.
- నక్షత్ర మండలాన్ని పోలిన గుర్తులను గతంలోనే వెలుగులోకి తేగా, తాజాగా నక్షత్ర మండలంలో లియో (సింహరాశి)ను పోలిన నక్షత్ర సమూహాన్ని గుర్తించారు. సింహరాశిని సూచించే నక్షత్ర కూటమి ఎలా ఉంటుందో, అచ్చు అదే పోలికతో ఓ గుండుపై చెక్కి ఉంది.

ఏటా జూన్ 21న..

సూర్య గతిని మన పూర్వీకులు కచ్చితంగా గుర్తించే పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న విషయం తెలిసిందే. ఇక ఇంగ్లండులోని స్టోన్‌హెంజ్‌లో కీ స్టోన్‌గా పిలుచుకునే ప్రధాన నిలువు రాయి.. దానికి సరిగ్గా ఎదురుగా ఉండే (అక్కడి రాళ్ల అమరిక వృత్తాకారంలో ఉంటుంది) మరో రెండు రాళ్ల మధ్య సూర్యోదయం కనిపిస్తుంది. ఇది సరిగ్గా ప్రతి సంవత్సరం జూన్ 21న మొదలవుతుంది. అలా నాలుగైదు రోజులు ఆ స్థితి ఉంటూ క్రమంగా మారుతుంది. జూన్ 21న సూర్యుడు తన ఆయణాన్ని మార్చుకుంటాడన్న మాట.

ముడుమాల్‌లో సరిగ్గా అదే రోజు ఓ ప్రత్యేకత కనిపిస్తుంది. ఇక్కడ సూర్యోదయం వేళ ఒకే వరస క్రమంలో ఉండే మూడు భారీ నిలువరాళ్ల నీడ ఒకే గీతలా కనిపిస్తుంది. వాటి వెనక నిలబడితే కాసేపు సూర్యుడు మనకు కనిపించడు. ఆ స్థితి సరిగ్గా అదే రోజు కనిపించి నాలుగైదు రోజుల్లో క్రమంగా మారుతుంది. అంటే, రుతుపవనాలు మొదలయ్యాయని దాన్ని చూసి గుర్తించొచ్చు.

అవీ ఇవీ...

- ముడుమాల్‌లో భూ ఉపరితలంపై 15 నుంచి 18 అడుగుల ఎత్తుతో 81 నిలువు రాళ్లు ఉన్నాయి. ఇవన్నీ వివిధ దిశల్లో అమరి ఉన్నాయి. వీటిని క్రీ.పూ.3 వేల ఏళ్లకు పూర్వం పాతారు.
- ఇవి కాకుండా, దాని చుట్టూ పదిపదిహేను ఎకరాల విస్తీర్ణంలో గుండ్రని చిన్న రాళ్లు 1,500 వరకు ఉన్నాయి.
- 20 ఏళ్ల క్రితం గుప్త నిధుల వేటలో భాగంగా కొందరు యంత్రాలతో ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. ఫలితంగా కొన్ని రాళ్లు పడిపోయాయి. కొన్ని వంగిపోయాయి. అంతకు పూర్వం ఆ రాళ్ల అమరిక ఎలా ఉండేదో, కొన్ని పాత ఆధారాల సాయంతో తిరిగి నిలిపేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు.



ఇంగ్లండ్‌లోని స్టోన్‌హెంజ్

'సాక్షి' వరుస కథనాలు

ఓ గ్రామ దేవత ఆగ్రహానికి గురై కొందరు రాళ్లుగా మారి అలా పాతుకుపోయారనే మూఢనమ్మకం స్థానికంగా గతంలో బలంగా ఉండేది. అవన్నీ దెయ్యాలనే భయంతో రాత్రి వేళ అటువైపు వెళ్లేందుకు జంకేవారు. ఆ ప్రాంతాన్ని దెయ్యాల దిబ్బ, నిలువరాళ్ల తిమ్మప్ప... ఇలా పిలుచుకునేవారు. ఆ రాళ్లపై జరిగిన పరిశోధన వివరాలతో 2016 అక్టోబరులో 'గండ శిలల గుండెల్లో ఖగోళం గుట్టు' శీర్షికతో 'సాక్షి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ తర్వాత స్థానికుల్లో కొంత అవగాహన కలిగి వాటిపట్ల భయం తగ్గింది. సాక్షి వరస కథనాలతో స్పందించిన నాటి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఆ రాళ్లున్న భూమిని సేకరించి వాటి చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. ఫలితంగా రాళ్లకు రక్షణ ఏర్పడింది.

అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ అడ్మిషన్ కౌన్సెలింగ్ రేపు

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ/ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ఎంబీఏ/ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) ప్రవేశ అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ/ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) అడ్మిషన్స్ కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావడంతో పాటు నిర్ధారిత రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయం పోర్టల్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏప్రిల్ 20న బీసీ గురుకుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి పరీక్ష

- దరఖాస్తుల గడువు మార్చి 31

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఏప్రిల్ 20న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని ఆయన వివరించారు. మొత్తం 6832 ఖాళీలున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు బీసీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

మా డేటా లీక్ అవుతోంది!

- ఆధార్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ వివరాలు పబ్లిక్ డొమైన్‌లోకి..
- లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో 87 శాతం మంది వెల్లడి
- ఆధార్ డేటా లీకవుతోందని 54% మంది ఆందోళన
- టెలికం, ఈ-కామర్స్, ఫైనాన్షియల్ సంస్థలే కారణమని అభిప్రాయం



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ఎక్కడో ఒకచోట.. ఏదో ఒక అవసరానికి మన కీలక వివరాలైన ఆధార్, పాన్ కార్డు, ఈ-మెయిల్, ఫోన్ నంబర్.. వీటిలో ఏదో ఒకటి చెప్పక తప్పని పరిస్థితి. అయితే ఇలా మనం ఎంతో నమ్మకంగా ఇతర సంస్థలతో పంచుకునే డేటా కొన్ని మార్గాల్లో లీకవుతున్నట్టు తెలుస్తోంది. వ్యక్తిగత వివరాలకు సంబంధించి డేటా లీకేజీలపై ప్రజాభిప్రాయం కోసం లోకల్ సర్కిల్స్ సంస్థ ఇటీవల చేపట్టిన సర్వేలో ఇదే అంశాలు వెల్లడయ్యాయి. ఆధార్, పాన్ కార్డు లేదా ఓటర్ ఐడీ.. ఇలా ఏదో ఒక రకమైన తమ డేటా పబ్లిక్ డొమైన్‌లోకి లీకైనట్టుగా సర్వేలో పాల్గొన్న 87 శాతం మంది వెల్లడించారు. డేటా లీకేజీకి ఈ-కామర్స్ వెబ్‌సైట్లు, టెలికం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, పేమెంట్ యాప్‌లతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు కారణమై ఉండొచ్చని వారు పేర్కొన్నారు. మరో 50 శాతం మంది తమ ఆధార్ లేదా పాన్‌కార్డుల వివరాలు లీకయ్యే ప్రమాదం ఉన్నట్టుగా ఆందోళన వ్యక్తం చేశారు. డేటా లీకేజీ 2022లో 72 శాతంగా ఉండగా.. 2025 ఫిబ్రవరి నాటికి అది 87 శాతానికి చేరినట్టుగా లోకల్ సర్కిల్స్ సంస్థ వెల్లడించింది. 2024 అక్టోబర్‌లో ఆరోగ్య బీమా సంస్థ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ వినియోగదారుల్లో 31 మిలియన్ల మంది డేటా లీకవడం.. ఇటీవల జరిగిన కుంభమేళా సమయంలో సంబంధం లేకుండానే ఎన్నో రకాల ఆఫర్ల పేరిట ఎస్ఎంఎస్‌లు రావడంతో డేటా లీకేజీపై ప్రజాభిప్రాయ సేకరణ చేసినట్టు సంస్థ వెల్లడించింది. ఇటీవల దేశవ్యాప్తంగా 375 జిల్లాల్లో 36 వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించి నివేదిక రూపొందించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

సర్వేలో వెల్లడైన ప్రధాన అంశాలు ఇలా..

మీ వ్యక్తిగత డేటా లీకైనట్టు భావిస్తున్నారా?	
అవును:	87 శాతం
చెప్పలేం:	9 శాతం
లేదు:	4 శాతం

ఏ వివరాలు లీకైనట్లు భావిస్తున్నారు?	
మొబైల్ నంబర్	91 %
ఈ-మెయిల్ అడ్రస్	73 %
ఆధార్ నంబర్	54 %
పాన్‌కార్డు	52 %
ఓటర్ ఐడీ	21 %
క్రెడిట్, డెబిట్ కార్డు నంబర్లు	21 %

మీ డేటా పబ్లిక్ డొమైన్‌లోకి రావడానికి కారణం ఎవరని అనుకుంటున్నారు?	
టెలికమ్ సర్వీస్ ప్రొవైడర్స్	65%
ఈ-కామర్స్ వెబ్‌సైట్లు, యాప్‌లు	63%
బ్యాంక్, ఫైనాన్సియల్ సర్వీస్ ప్రొవైడర్స్	56%
రాష్ట్ర, స్థానిక ప్రభుత్వ కార్యాలయాల అధికారులు	50%
కేంద్ర ప్రభుత్వ ఆఫీసులు	50%
పేమెంట్ యాప్‌లు, సైటు	48%
ఇతర వ్యాపార సంస్థలు	37%
విద్యాసంస్థలు, పలు రకాల యాప్‌లు	26%
చెప్పలేం	13%

డయాబెటిస్ చిన్నారులకు ఉచిత ఇన్సులిన్ పంపులు

- తొలివిడతలో 100 మందికి పైగా పిల్లలకు పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఒక్కో పంపు ఖరీదు రూ.2 లక్షలు
- నిమ్స్ డైరెక్టర్ బీరప్ప వెల్లడి



సాక్షి, హైదరాబాద్: టైప్-1 మధుమేహ వ్యాధి బారిన పడ్డ 100 మందికి పైగా పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇన్సులిన్ పరికరాలను అందించింది. ఇన్సులిన్ పంపులను ఈ స్థాయిలో చిన్నారులకు పంపిణీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ అగ్రస్థానంలో నిలిచినట్లు ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ డయాబెటిస్ సమావేశంలో నిమ్స్ ఎండోక్రైనాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బియాట్రిస్ అన్నె వివరించారు. నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. రోజులో పలుమార్లు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకోవాల్సిన అవసరాన్ని ఇన్సులిన్ పంపులు తగ్గించడంతో పాటు, శరీరంలో సహజసిద్ధంగా ఇన్సులిన్ విడుదలయ్యే విధంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. అయితే, ఒక్కో ఇన్సులిన్ పంపు ఖరీదు సుమారు రూ.2 లక్షలు ఉండటంతో దీనిని కొనుగోలు చేయడం పేద, మధ్య తరగతి వర్గాలకు సవాల్‌గా మారిందని, ఈ పరిస్థితిని అర్థం చేసుకుని తెలంగాణ ప్రభుత్వం తొలి విడతలో 100 మందికి పైగా పిల్లలకు ఉచితంగా ఈ పరికరాలను అందించిందని బీరప్ప వెల్లడించారు. వీటిని ఉచితంగా ఇవ్వడం ద్వారా దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

విమానంలో సాంకేతిక సమస్య..

శంషాబాద్ రూరల్: కౌలాలంపూర్ నుంచి వస్తున్న విమానంలో చిన్నపాటి సాంకేతిక సమస్య తలెత్తగా.. పైలట్ విజ్ఞప్తిపై శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానాశ్రయం వర్గాలు తెలిపిన వివరాలివి. కౌలాలంపూర్ నుంచి శనివారం రాత్రి హైదరాబాద్ వస్తున్న ఏకే069 విమానంలో చిన్నపాటి సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో పైలట్ వెంటనే ల్యాండింగ్ మద్దతు కోరగా.. ఇందుకు ఏటీసీ నుంచి అనుమతి రావడంతో రాత్రి 11.08 గంటలకు సురక్షితంగా ల్యాండింగ్ చేశారు.

క్రయోజనిక్ ఇంజిన్‌కు హై-ఆల్టిట్యూడ్ టెస్టింగ్ విజయవంతం



రాకెట్‌లకు ఉపయోగించే క్రయోజనిక్ (సీఈ-20) ఇంజన్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రపొల్షన్ రీసెర్చ్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ)లో ఎల్‌వీఎం-3 రాకెట్ (ఎల్‌వీఎం3-ఎం6) సిరీస్‌లో ఆరో ఆపరేషనల్ మిషన్ కోసం క్రయోజనిక్ ఇంజన్-20 (సీఈ-20) ఫ్లైట్ యాక్సెప్టెన్స్ హై-ఆల్టిట్యూడ్ టెస్ట్‌ను శనివారం విజయవంతంగా నిర్వహించి దాన్ని శ్రీహరికోటకు పంపించేందుకు అంతా సిద్ధం చేశారు. క్రయోజనిక్ ఇంజిన్‌ను పూర్తిస్థాయిలో తయారు చేసి దాన్ని ఒక కంటైనర్ లాంటి వాహనంలో అమర్చి మహేంద్రగిరి నుంచి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ పచ్చజెండా ఊపారు. ఈ వాహనం సోమవారం ఉదయానికి శ్రీహరికోటకు చేరుకుంటుంది. ఎల్‌వీఎం-3 రాకెట్ సిరీస్‌లో ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా వాణిజ్యపరంగా బ్లూబర్డ్ అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. దీనికి సంబంధించి అప్పర్ స్టేజ్ దశ అయిన క్రయోజనిక్ దశను సమకూర్చి సిద్ధం చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

షుగర్స్ పునఃప్రారంభంలో ని'జామ్'!

- ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై స్పష్టత కరువు
- రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ ప్రకటన అమలయ్యేనా?
- 2025 డిసెంబర్ నాటికి ఫ్యాక్టరీలను తెరిపిస్తామంటూ రైతులతో సదస్సులు
- తెరిపించే ప్రక్రియ మొదలైనా.. మళ్లీ సందిగ్ధం
- తెరిపించేది ప్రభుత్వమా?.. ప్రైవేటా?.. సహకారమా?



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు నిజాం షుగర్స్ పునఃప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేసినప్పటికీ.. మళ్లీ సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ కొంత ప్రక్రియ పూర్తి చేసింది. ప్రైవేటు యాజమాన్యం పరిధిలోని ఈ ఫ్యాక్టరీకి చెందిన రూ.400 కోట్ల బ్యాంకుల బకాయిలకు సంబంధించి, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.190 కోట్లు చెల్లించింది. 2025 డిసెంబర్ నాటికి ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించినప్పటికీ.. అది మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఆలస్యంగానైనా.. పబ్లిక్ సెక్టార్‌లోనా, ప్రైవేటు సెక్టార్‌లోనా, సహకార విధానంలో ప్రారంభిస్తారా? అనే అంశంపై కూడా స్పష్టత లేకుండా పోయింది. మరోవైపు క్షేత్రస్థాయిలో సన్నద్ధత విషయంలో ఇప్పటికీ గందరగోళమే నడుస్తోంది. ఎందుకంటే ఈ ఏడాది క్రషింగ్ సీజన్ (అక్టోబర్ నుంచి డిసెంబర్) నాటికి సాధ్యమయ్యే పరిస్థితులు లేవు. ప్రభుత్వం నుంచి సైతం స్పష్టమైన ప్రకటన రావడం లేదు. బోధన్ ఫ్యాక్టరీని మరో చోటికి తరలించి.. కొత్త యంత్రాలతో నడిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది.

రైతులతో విడతల వారీగా కమిటీ చర్చలు

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీలో సభ్యుడైన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ రైతులతో విడతలవారీగా ముఖాముఖి చర్చలు జరిపింది. చెరుకు సాగును ప్రోత్సహించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, షుగర్ కేన్ బోర్డు రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు. మరోవైపు ప్రస్తుతం ఫ్యాక్టరీ స్థితిగతులు, యంత్రాల పరిస్థితిని నిపుణుల బృందం పరిశీలిస్తోంది. తరువాత వారి నివేదిక మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. నిపుణుల బృందం నివేదిక ప్రభుత్వం వద్దకు వెళ్లిదని ప్రచారం జరుగుతోంది. నివేదికలో ఏముందో బయటకు రాలేదు. మరోవైపు చెరుకు సాగుపై రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వం విధానపరంగా ఫ్యాక్టరీ పునఃప్రారంభం విషయమై స్పష్టత ఇవ్వలేదు. రైతులు గణనీయమైన స్థాయిలో చెరుకు పంటను పండించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తేనే.. షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో పునఃప్రారంభానికి అడుగులు మరింతగా పడాలంటే చెరుకు సాగు విస్తీర్ణమే ప్రధానం కానుంది. బోధన్ (ఉమ్మడి నిజామాబాద్), మంబోజిపల్లి (ఉమ్మడి మెదక్), ముత్యంపేట (ఉమ్మడి కరీంనగర్) జిల్లాల్లో నిజాం డెక్కన్ షుగర్ ఫ్యాక్టరీలున్నాయి.

2002లో ప్రైవేటుకు విక్రయించిన చంద్రబాబు ప్రభుత్వం..

నిజాం షుగర్స్ యూనిట్లను 2002లో డెల్టా పేపర్ మిల్స్ అనే ప్రైవేటు సంస్థకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం విక్రయించింది. 2014లో ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ నిజాం షుగర్స్‌ను ప్రభుత్వపరం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా 2015 డిసెంబర్ 23న ఫ్యాక్టరీ మూడు యూనిట్లకు లేఆఫ్ ప్రకటించారు. 2005–06లో చెరుకు దిగుబడి 35 వేల టన్నులున్నప్పటికీ నడిపిన ఈ కర్మాగారాలను.. 2015లో దిగుబడి లక్ష టన్నులకు పెరిగినా మూసేయడం గమనార్హం. దీంతో రైతులు వరి పంట వైపు మళ్లారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలున్న బోధన్, ముత్యంపేట, మంబోజిపల్లి ప్రాంతాల్లో రైతులు గణనీయమైన విస్తీర్ణంలో చెరుకు పంట పండించేందుకు ముందుకు వస్తేనే.. ప్రభుత్వం ఫ్యాక్టరీల పునఃప్రారంభం విషయంలో మరింత వేగంగా ముందుకెళ్లే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రైతులు చెరుకు సాగు చేయడంపై ఆసక్తి నెలకొంది.

అధికారం లేక బీఆర్‌ఎస్ నేతలకు పిచ్చెక్కింది

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సాక్షి, హైదరాబాద్: అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ నేతలు పిచ్చెక్కి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌నుద్దేశించి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు కండకావరంతో మాట్లాడినట్టున్నాయన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బూతులకు అంబాసిడర్ కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కేంద్రమంత్రిని పట్టుకుని.. రండ అన్న చరిత్ర కేసీఆర్‌దని చెప్పారు. కేసీఆర్ దూషణలు హరీశ్‌రావుకు వినసొంపుగా ఉన్నాయా? అని ప్రశ్నించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులతో ముంచితే.. ఆ అప్పులను, తప్పులను సరిదిద్దుతూ సంక్షేమం, అభివృద్ధిని రేవంత్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ఇంకోసారి సీఎం రేవంత్ గురించి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

హెచ్‌సీయూ భూములు విక్రయిస్తే ఊరుకోం

- ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్

సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల భూములను విక్రయించాలని చూస్తే ఊరుకునేది లేదని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగరాజు, కె.ఆనందరావు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. యూనివర్సిటీ భూముల రక్షణకు విద్యార్థులు లగచర్ల రైతుల స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. ఓయూతో పాటు తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీలలో విద్యార్థి సంఘాల కార్యక్రమాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, యూనివర్సిటీలలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల హక్కుల్ని హరిస్తున్నారు

- బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో నిర్బంధ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. విద్యార్థులపై నిర్బంధపు సర్క్యులర్లను వెనక్కి తీసుకునేంత వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం సమస్యలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వీసీ ఈ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకుని.. యూనివర్సిటీలో శాంతియుత వాతావరణానికి కృషి చేయాలని కోరారు.

సర్వమతాల భక్తులు కొలిచే సాగర్ మాత

నాగార్జునసాగర్ జలాశయం తీరంలో ఏర్పాటు

అన్ని మతాల భక్తుల పూజలు



సాగర్‌మాత ఆలయం

నాగార్జునసాగర్: సర్వ మతాల భక్తుల కోర్కెలు తీర్చే క్షేత్రంగా వెలుగొందుతోంది సాగర్ మాత ఆలయం. ఈ ఆలయం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ జలాశయం తీరంలో ఉంది. సాగర్‌మాత మహోత్సవాలను ఏటా మార్చి 7, 8, 9 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా పలు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరవుతారు. విదేశీయులు సైతం ఈ ఉత్సవాలకు హాజరుకావడం విశేషం. ఉత్సవాల సమయంలోనే కాకుండా.. ప్రతి ఆదివారం భక్తులు ఆలయానికి వస్తుంటారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగర్‌మాత ఆలయానికి రాష్ట్రంలోనే విశిష్టత ఉంది. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా మందిర నిర్మాణం, గోపురంపై విగ్రహ సంపద రూపుదిద్దుకున్నాయి. భారతీయ చిత్రకళా నైపుణ్యం వీటిలో కనిపిస్తుంది. సాగర్ ఒడ్డున వెలిసిన మేరీమాత.. సాగర్‌మాత పేరుతో క్రైస్తవులతో పాటు హిందువులు, ముస్లింలు తదితర అన్ని మతాల నీరాజనాలను అందుకుంటోంది.





సాగర్‌మాత ఆలయంలోని జపమాల క్షేత్రం

భారతీయ సంప్రదాయ రీతుల్లో నిర్మాణం

ఈ ఆలయం దేశంలోనే భారతీయ సంప్రదాయ రీతులలో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా చెబుతారు. ధూప, దీప, నైవేద్యాలు, తలనీలాలు సమర్పించటం వంటి మొక్కులు చెల్లించుకునే కార్యక్రమాలన్నీ పూర్తిగా హిందూ పద్ధతిలో జరిగే క్రైస్తవ ఆలయం కావడం విశేషం. కోర్కెలు తీరిన భక్తులు జీవాలను బలి ఇస్తారు. సాగర తీరంలో వంటలు చేసుకొని ఆరగించి వెళ్తారు. సాగర్‌లో పయనించే నావికుడు.. రాత్రి వేళల్లో నక్షత్రాల సహాయంతో ఓడను నడిపి గమ్యస్థానం చేరినట్లు.. పాపపంకిలమైన లోకమనే సముద్రంలో మానవునికి మంచి అనే దారి చూపేందుకు మరియమాత నక్షత్రంగా ప్రకాశిస్తుందని.. భక్తులు చెబుతారు. ఆ నమ్మకంతోనే దీనికి సాగర్‌మాత మందిరం అని పేరు పెట్టారు. ఈ మందిరానికి 1977 అక్టోబర్ 10వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి గుంటూరు మండల పీఠాధిపతి కాగితపు మరియదాసు ప్రారంభోత్సవం చేశారు. దీని నిర్మాణానికి మరియదాసుతో పాటు ముమ్మడి ఇగ్నేషియస్, తాను గుండ్ల బాలశౌరి విశేష కృషి చేశారు.

ఆకట్టుకుంటున్న జపమాల స్థలాలు



ఉత్సవాల సమయంలో హాజరైన భక్తులు

2011 మార్చి 6న కృష్ణానదీ తీరంలో నిర్మించిన జపమాల క్షేత్రాన్ని గుంటూరు పీఠాధిపతులు గాలిబాలి ప్రారంభోత్సవం చేశారు. ఏసుక్రీస్తు జననం నుంచి మరణం వరకు ఆయన జీవిత చరిత్ర గురించి ఏర్పాటు చేసిన 20 జపమాల స్థలాలు, ధ్యానమందిరం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 2024లో సాగర్‌మాత ఆలయంపై, ఆలయంలోని 14 స్థలాల విగ్రహాలపై దేవదూతల విగ్రహాలను విచారణ గురువులు హృదయ్‌కుమార్ ఏర్పాటు చేశారు. ఇక్కడ సాగర్‌మాతకు కొబ్బరికాయ కొట్టి అగర్‌బత్తీల హారతి, తలనీలాలు సమర్పించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. పుణ్యస్నానాలు చేసి ప్రార్థనలు జరుపుతారు.



హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని పోలీసులు హెచ్చరిస్తున్నా వాహనచోదకులు బేఖాతరు చేస్తున్నారు. సిటీ సెంటర్ వద్ద సాక్షాత్తు ట్రాఫిక్ పోలీసు ముందునుంచే హెల్మెట్ లేకుండా వాహనచోదకులు యథేచ్ఛగా రాకపోకలు సాగించారు.

మోదీ రక్షిం'చేను'!




కొందరు రైతులు పంటలకు దిష్టి తగలకుండా ఇటీవల హీరోయిన్ల ఫొటోలు పెడుతున్నారు. ఇక కోతుల బెడద నివారణకు ఇంకొందరు పులి బొమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాంపూర్‌కు చెందిన ఓ రైతు.. జొన్న పంట రక్షణకు ఏకంగా ప్రధాని నరేంద్రమోదీ ఫొటో పెట్టుకున్నాడు. ప్రధాని ఫొటో ఏర్పాటు చేసిన తర్వాత.. తన చేను వద్దకు వన్యప్రాణులు, పక్షులు రావడం లేదని సదరు రైతు చెప్పడం విశేషం. - సిరికొండ

కోకల పిచ్.. కేక



ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాయిగూడ గ్రామంలలో చిన్నారులు తమ సృజనతో ఆకట్టుకున్నారు. పొడి దుక్కిలో క్రికెట్ ఆడడం ఇబ్బందిగా ఉండడంతో.. తమ ఇళ్లలోని పాత చీరలను తీసుకువచ్చి ఇలా మ్యాట్‌లా మార్చారు. ఆదివారం సెలవు కావడంతో చీరలను ఇలా పిచ్‌పై పరిచి క్రికెట్ ఆడారు. - సిరికొండ





విశ్వనగరం రంజాన్ పండగ శోభతో వెలిగిపోతోంది. పగలేదో రాత్రేదో తెలియనంతగా రహదారులు, మార్కెట్లు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ఆదివారం చార్మినార్ ప్రాంతం రంజాన్ పండుగ కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటే... అమరవీరుల స్తూపం వద్ద కూడా జన సందడి నెలకొంది

జీవజలమే హాలాహలమై..



మొక్కకు ఆయువు పోసేది జలమే.. మోతాదు ఎక్కువైతే ఆయువు తీసేదీ జలమే.. అనంతపురం నేషనల్ పార్క్‌లోని చెక్ డ్యామ్‌లో నీరు తక్కువగా ఉన్నప్పుడు ఒడ్డునే ఉన్న ఈ చెట్లు పచ్చదనంతో పరిఢవిల్లాయి. చెక్ డ్యాంలో నీళ్లు ఎక్కువయ్యి ఇవి ఉన్న ప్రాంతం నీట్లో మునిగిపోయేసరికి కొన్నాళ్లకు ఇలా మోడుగా మారాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

కృష్ణమ్మ నుదుట సూర్య తిలకం



దుర్గమ్మ చెంతన..కృష్ణమ్మ నుదుట సింధూర తిలకంలా..సంధ్యా సూర్యుడు అస్తమిస్తుండగా ఆకాశం అరుణ వర్ణంలో దేదీప్యమానంగా వెలిగిపోయింది. విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద ఈ సుందర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

-సాక్షి, అమరావతి

చల్లగాలిలో సేదతీరుదాం..



ఎండలు మండిపోతున్నాయి. పగలంతా ఎవరిపనుల్లో వారు బిజీగా గడిపిన నగరవాసులు సాంత్రానికి బీచ్ బాటపట్టారు. దీంతో ఆదివారం సాయంత్రం విశాఖ ఆర్కే బీచ్ జనసంద్రంగా మారింది. సముద్రం పైనుంచి వచ్చే చల్లగాలికి సేదతీరుతూ బీచ్‌లో ఆనందంగా గడిపారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రసవానికి ముహూర్తాల గండం..!

మంచిరోజుల్లో పిల్లలకు జన్మనిచ్చేందుకు ఆరాటపడుతున్న తల్లులు

వారిని ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులు

దీనిని సొమ్ము చేసుకుంటున్న కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు

ఇది మంచిది కాదంటున్న వైద్యులు

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రమాదం అంటున్న వైద్యనిపుణులు



వీరఘట్టం: జనన, మరణాలు సహజమైనవి. మారిన సాంకేతిక యుగంలో జనన తేదీలను ముందే నిశ్చయిస్తున్నారు. ముహూర్తాల పిచ్చితో అమ్మ కడుపునకు గాటుపెట్టించి బిడ్డలను బలవంతంగా తీస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి ముప్పుతల పెడుతున్నారు. ఈ జాడ్యాన్ని కొందరు తల్లులతో పాటు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహిస్తుండడం వైద్యులను సైతం ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు మాత్రం కాసులవర్షం కురిపిస్తోంది. పుట్టుకను ముందే ఫిక్స్ చేయడం.. దీని కోసం మంచి ముహూర్తాలు చెప్పండి అంటూ పండితులు, జ్యోతిష్యుల దగ్గరకు తిరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నెలలు నిండకముందే కాన్పుచేయాలంటూ కొందరు గర్భిణులు ఒత్తిడిచేస్తున్నారని, ఇది ప్రమాదకరమని చెబితే వేరే ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

సిజేరియన్ ఎప్పుడు అవసరం...

- గర్భిణికి రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు
- గర్భంలో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు
- గర్భాశయ ముఖద్వారాన్ని మూయ కమ్మేయడం వంటి అత్యవసర సమయాల్లోను..
- తల్లి ప్రాణాలకు ముప్పు ఉన్న పరిస్థితుల్లో..
- తల్లికి ఇతర ఆరోగ్య సమస్యలు, థైరాయిడ్ వంటి అనారోగ్య ఇబ్బందులు ఉన్నప్పుడు మాత్రమే సిజేరియన్ చేస్తారు.

సిజేరియన్ వల్ల కలిగే ఇబ్బందులు ఇవీ

- సహజ ప్రసవ సమయంలో ప్రోలాక్టిన్ వంటి హార్మోన్లు విడుదల కావడం వల్ల బాలింతలో సహజంగానే చనుబాలు ఉత్పత్తి అవుతాయి. అదే సిజేరియన్ అయితే పిల్లలు పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం కష్టమవుతుంది.
- తల్లిపాలు పట్టకపోతే బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుంది.
- సిజేరియన్ సమయంలో గర్భిణి మూత్ర నాళానికి, పేగులకు గాయాలయ్యే అవకాశం ఉంటుంది.
- శస్త్ర చికిత్స జరిగితే నొప్పితో బాలింతలు నెలల తరబడి మంచానికి పరిమితం కావాల్సి వస్తుంది.
- కదలికలు తక్కువ కావడం వల్ల హెర్నియా వంటి సమస్యలు వస్తాయి.
- పీరియడ్స్ సమయంలో అధిక రక్త స్రావం వంటివి చోటు చేసుకుంటాయి.



సిజేరియన్లకే మొగ్గు..

ఒకప్పుడు సిజేరియన్ పేరు చెబితే గర్భిణులంతా భయపడిపోయేవారు. ఇప్పుడు అదే పదం మాట మాటికీ వినిపిస్తోంది. బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, గర్భిణి నీరసంగా ఉన్నప్పుడు, ఉమ్మనీరు పోతున్నప్పుడు తదితర అత్యవసర పరిస్థితుల్లోనే ఇది వరకు సిజేరియన్ చేసేవారు. ఇప్పుడు సిజేరియన్ సాధారణ ప్రక్రియగా మారింది. సహజ కాన్పు వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనంపై అవగాహన లేకపోవడంతో అంతా సిజేరియన్‌కే ఓటు వేస్తున్నారు. వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారు. ఫలితంగా పార్వతీపురం మన్యం జిల్లాలోనూ సిజేరియన్లు సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతోంది. మారుమూల పల్లె వాసులు కూడా సిజేరియన్‌కు వెళ్తుండడం గమనార్హం. జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏటా జరుగుతున్న ప్రసవాల్లో సగటున 30 నుంచి 40 శాతం వరకు సిజేరియన్లుంటున్నాయి. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈశాతం మరింత ఎక్కువగా ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 12,945 మంది గర్భిణులు వైద్య రికార్డుల్లో నమోదుకాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంత వరకు 3,621 ప్రసవ ఆపరేషన్లు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో అధికం డెలివరి సమయం ముందుగా మంచి రోజుల్లోనే సిజేరియన్లు జరగడం గమనార్హం.

ప్రోత్సహిస్తున్న ఆస్పత్రులు

కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు కూడా సిజేరియన్లను ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం. ఒక సిజేరియన్‌కు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులు సుమారు రూ.40 వేలు నుంచి రూ.80 వేలు వరకు వసూలు చేస్తున్నాయి. ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల్లో 80 శాతం వరకు సిజేరియన్ కేసులే ఉంటున్నాయి. సిజేరియన్ చేస్తే ఆస్పత్రిలో ఆరు నుంచి 8 రోజుల వరకు ఉండాలి. ఖర్చు కూడా ఎక్కువే. సహజ ప్రసవానికి రూ.20 వేలు లోపు ఖర్చు అవుతోంది. తల్లీబిడ్డా రెండు రోజుల్లో ఇంటికి వెళ్లిపోవచ్చు. సిజేరియన్లను వ్యాపారంగా మార్చేసి కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అక్రమార్జనకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రస్తుతం నమోదైన గర్భిణుల సంఖ్య	12,945
ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన సిజేరియన్లు	3,621

బిడ్డపైన ప్రభావం



బిడ్డ జననం సహజంగా జరిగితే అది చిన్నారి మానసిక, శారీరక వికాసానికి దోహద పడుతుంది. అస హజ రీతిలో చేస్తే కత్తిగాట్లు వల్ల తల్లి పడే బాధ బిడ్డపై ప్రభావం చూపుతుంది. కీలకమైన సమయంలో ఆ పరిస్థితి శిశువు స్పందనలపై పడుతుంది. శిశువుల జ్ఞానాత్మక అభివృద్ధిలో తేడాలు అధికంగా చూపుతాయి. బిడ్డలో ఆ సమయానికి కొన్ని రకాల హార్మోన్లు అవసరమైన దాని కంటే ఎక్కువ, తక్కువగా విడుదలై భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయి.

– డాక్టర్.రవీంద్రకుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, పాలకొండ ఏరియా ఆస్పత్రి

ముహూర్తాల వెర్రి



ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ప్రసవాల కోసం చాలామంది గర్భిణులు ముహూర్తాలు చూసుకునే వస్తున్నారు. ప్రసవానికి సమయమున్నా ముహూర్తాల వెర్రిలో పడి వారం, పది రోజుల ముందే ఆపరేషన్‌కు సిద్ధంకావడం, వైద్యులపై ఒత్తిడిచేయడం సరికాదు. బిడ్డ తల్లి కడుపులో తొమ్మిది నెలలు నిండేవరకు ఉంటేనే ఆరోగ్యకరం. రెండు, మూడు రోజుల వ్యవధిలో చేసినా ఏం కాదుగానీ, పది, పదిహేను రోజుల తేడాతో బిడ్డను బయటకుతీస్తే అనేక సమస్యలు వస్తాయి.

– డాక్టర్.పి.ఉమామహేశ్వరి, మెడికల్ ఆఫీసర్, వీరఘట్టం

అది భగవంతుడి నిర్ణయం



పుట్టుక అనేది సహజసిద్ధ ప్రక్రియ. చెట్టుకు పండు పండితే రాలినట్టే... తొమ్మిదినెలలు నిండాక తల్లి గర్భం నుంచి ఆరోగ్యంగా శిశువు బయటకు వస్తుంది. డెలవరీ డేట్లు ఒక రోజు అటు, ఇటు ముహూర్తం అడుగుతున్నారు. వారం, తిథి, నక్షత్రం, తారాబలం, లగ్నబలం చూసుకున్న తర్వాతనే కాన్పుకు వెళ్తున్నారు. ఓ పదేళ్ల కిందట ఈ పరిస్థితి అంతగా ఉండేది కాదు. ఇప్పుడు మంచిరోజు చూసుకుని సిజేరియన్ చేసుకుంటున్నారు.

– ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ, పురోహితుడు, వీరఘట్టం

కడుపుకోత మంచిది కాదు



చాలా మంది ముహూర్తం పెట్టి సిజేరియన్ చేయా లని చెబుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. బిడ్డను ఆ సమయంలోనే ఆపరేషన్ చేసి తీయాలని చెప్పడం కరెక్ట్ కాదు. దీనివల్ల తల్లీ బిడ్డకు ప్రమాదం. సిజేరియన్ అనేది అత్యవసరమైతేనే చేయాలి. అది కూడా సమయాన్ని బట్టి సిజేరియన్ చేస్తాం. సిజేరియన్ విషయంలో వైద్యులపై ఒత్తిడి తేరాదు.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

అరబ్బుల ఇంటికి.. మన అరటి!

టన్ను అరటి రూ.20 నుంచి 25 వేలతో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

హర్షం వ్యక్తం చేస్తున్న అరటి రైతులు



పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో సాగులో ఉన్న అరటి

పులివెందులరూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందుల అరటి కాసులు కురిపిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో మంచి డిమాండ్ ఉన్న ఈ అరటి ఇటీవల కాలంలో గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతూ నాణ్యత విషయంలో తగ్గేదే లేదంటోంది. ఈ ప్రాంతంలో సాగయ్యే అరటికి బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వస్తున్నారు. ఢిల్లీ మార్కెట్‌కు అనుకూలంగా ఉన్న తోటలను ఎంచుకుని అరటికాయలను కొనుగోలు చేస్తున్నారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ధరలు నిర్ణయించి కొనుగోలు చేయడం ద్వారా దళారుల బెడద లేకుండా పోయిందని రైతన్నలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నియోజకవర్గంలో 10 నుంచి 15వేల ఎకరాల్లో ...

పులివెందుల ననియోజకవర్గ వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో అరటి సాగు ఉంటే ఇందులో 10వేల ఎకరాల్లో గెలలు మొదటి కోతకు రానున్నాయి. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె మండలాల్లో అధికంగానూ, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో తక్కువగా అరటి సాగు అవుతోంది. ఒకసారి సాగు చేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా మే, జూన్, జూలై నెల్లో సాగుచేస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోతకు వచ్చేలా సాగు చేయడం ద్వారా ధరలు ఉంటాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.60వేలు పైనే పెట్టుబడులు

అరటి సాగులో పెట్టుబడులు కూడా అధికం అవుతున్నాయి. ఎకరా సాగు చేయాలంటే రూ.60వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అరటి నాటిన మొదలు గెలలు కోతకు వచ్చే వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాగుచేసిన 11 నెలలకు గెలలు కోతకు వస్తాయి. సాగులో పెట్టుబడులు అవుతున్నప్పటికీ ఆదాయం ఉంటుందనే రైతులు అరటిని సాగు చేస్తున్నారు. డ్రిప్పు ద్వారా నీటి తడులతో పాటు ఎరువులు అందించడం ద్వారా నాణ్యమైన అరటి ఉత్పత్తులు అందుతున్నాయి. సాగులో ఎకరాకు 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడులు వస్తున్నాయి. ఒక్కో గెల 10 నుంచి 12 చీప్‌లు వేస్తుందని రైతులు అంటున్నారు.

అరటికాయలను శుద్ధిచేసి ప్యాకింగ్ ...

పులివెందుల నుంచి అరటి కాయలను ఢిల్లీకి తరలించాలంటే శుద్ధి చేసి ప్యాకింగ్ చేయాల్సి ఉంటుంది. దీంతో తోటల వద్దకు కూలీలు వెళ్లి అరటి గెలలు తీసుకువచ్చి చీపులను వేరుచేస్తారు. వీటిని బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిలో శుద్ధి చేస్తారు. అలా శుద్ధిచేసిన చీపులను అట్టపెట్టెలో కవరు వేసి అందులో అరటి కాయలను ఉంచి ప్యాకింగ్ చేస్తారు. ఒక్కో అట్టపెట్టెలో 15కిలోల చొప్పున అరటికాయలను ప్యాక్ చేస్తారు. తోటల వద్దనే తూకాలు వేసి అట్టపెట్టెలను సీజ్ చేస్తారు. అరటి కాయలతో ఉన్న అరటి పెట్టెలను లోడ్ చేసి ఢిల్లీ మార్కెట్‌కు తరలిస్తారు.

వారం రోజుల పాటు అరటి కాయల నిల్వ ...

పులివెందుల నుంచి అరటిని ఢిల్లీకి తరలించాలంటే వారంరోజులు పడుతుంది. పక్వానికి వచ్చిన గెలలను కొట్టి చీపులను వేరుచేస్తారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా వారంపాటు నిల్వ ఉండడంతో ఢిల్లీకి చెందిన వ్యాపారులు పులివెందుల అరటి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కోసారి అరటి గెలలను లారీకి లోడ్ చేసి ఢిల్లీకి తరలిస్తారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లేసరికి అరటి గెలలు దెబ్బతినవని, కాయలు నాణ్యతగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

గల్ఫ్ దేశాలకు పులివెందుల అరటి



పులివెందుల ప్రాంతంలో పండిన అరటికి ఢిల్లీ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎక్కువగా ఈ సీజన్‌లోనే ఇక్కడ అరటి కాయలను తరలిస్తారు. నెలకు 10నుంచి 15వేల టన్నుల మేర కాయలు ఢిల్లీ మార్కెట్‌తో పాటు గల్ఫ్ దేశాలు అరబ్, ఇరాక్, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్తాయి. ఇక్కడ పండించిన అరటి నాణ్యతగా ఉండడం, వారం రోజుల పాటు నిల్వ ఉండడం వల్ల ఢిల్లీ మార్కెట్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో డిమాండ్ ఉంటుంది. – రామమల్లేశ్వరరెడ్డి, అరటి రైతు

మనల్నెవర్రా ఆపేది!

- కూటమి ప్రభుత్వంలో అస్తవ్యస్తంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్
- ఎంప్యానెల్మెంట్ విభాగంలో పెద్దఎత్తున అక్రమాలు
- అక్రమాలకు పాల్పడిన అధికారి రెవెన్యూ శాఖ మంత్రి బంధువే
- నకిలీ సర్టిఫికెట్లు పెట్టిన ఆస్పత్రులకు అండ



సాక్షి, అమరావతి: 'ప్రభుత్వం మనదే.. మనల్నెవర్రా ఆపేది' అన్నట్టుగా తయారైంది కొందరు అధికారుల తీరు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆదాయార్జన, అవినీతికి ఆస్కారం ఉండే కీలక విభాగాల్లో మంత్రులు, ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో వారి బంధువులు, సన్నిహితులైన అధికారులు తిష్ట వేశారు. ఈ తరహా అధికారుల తీరుతో 10 నెలల్లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ భ్రష్టుపట్టింది. పథకం అమలు, ఆస్పత్రులు, ఇతర నియమ, నిబంధనలపై కనీస అవగాహన, అనుభవం లేని అధికారులు ట్రస్ట్ పరిపాలన, ఐటీ, ఎంప్యానెల్‌మెంట్ విభాగాల్లో చేరి పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారు. వీరంతా వైద్య, రెవెన్యూ, తదితర శాఖల మంత్రుల సంబంధీకులు కావడంతో ఐఏఎస్ అధికారులు సైతం వారిపై చర్యలకు వెనుకడుగు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమాలకు పాల్పడ్డారని తేలినా చూసీచూడనట్టు వదిలేస్తుండటంతో ఉన్నతాధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రొబేషన్ డిక్లేర్ కాకపోయినా..


రెవెన్యూ శాఖ మంత్రి బంధువైన ప్రొబేషన్ కూడా డిక్లేర్ అవ్వని ఒక డాక్టర్‌కు కొద్దిరోజుల క్రితం వరకూ ట్రస్ట్‌లో కీలకమైన ఎంప్యానెల్‌మెంట్ విభాగం బాధ్యతలు కట్టబెట్టారు. ఈ వైద్యుడితోపాటు ట్రస్ట్‌లో మరికొందరు ముఠాగా ఏర్పడి ఆస్పత్రుల నుంచి అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడి నిబంధనలకు విరుద్ధంగా ఎంప్యానెల్మెంట్ అనుమతులు ఇవ్వడంతో పాటు సస్పెన్షన్లను ఎత్తివేశారు. ఈ వ్యవహారంపై గత నెలలో 'క్యాష్ కొట్టు.. ఎంప్యానెల్‌మెంట్ పట్టు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో విచారణ చేపట్టిన సీఈవో ట్రస్ట్‌లో పలు మార్పులు చేశారు.

నకిలీ ధ్రువపత్రాలని తెలిసినా..

ఎంప్యానెల్‌మెంట్ విభాగం బాధ్యతల నుంచి రెవెన్యూ శాఖ మంత్రి బంధువైన వైద్యుడిని ఈ నెల 7వ తేదీన తప్పించారు. అయినా.. 6 నుంచి 7 ఆస్పత్రులకు అదనపు స్పెషాలిటీ అనుమతుల మంజూరు కోసం ఇన్‌స్పెక్షన్ కమిటీలను ఆ డాక్టర్ నియమించినట్టు వెల్లడైంది. ఆదేశాలందుకున్న కిందిస్థాయి ఉద్యోగులు యుద్ధప్రాతిపదికన వర్చువల్ ఇన్‌స్పెక్షన్లు కూడా చేసేశారు. అదనపు స్పెషాలిటీల మంజూరుకు ఆస్పత్రులతో డాక్టర్ ముందే ఒప్పందం కుదుర్చుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో తాను ఎంప్యానెల్‌మెంట్ విభాగం నుంచి తప్పుకున్నాక అసలు లక్ష్యం నెరవేరదని భావించి, హుటాహుటిన ఇన్‌స్పెక్షన్లు నిర్వహించి నివేదిక అందజేయాలని దిగువ ఉద్యోగులను ఆదేశించినట్టు వెల్లడైంది. గతంలో నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా ఆస్పత్రులకు పలు అనుమమతులు మంజూరు చేసినట్టు సదరు వైద్యుడిపై ఆరోపణలున్నాయి. అనంతపురం జిల్లాలో ఫైర్ అనుమతులు లేవని ఓ ఆస్పత్రిని సస్పెండ్ చేయగా.. యాజమాన్యం నకిలీ ఫైర్ ఎన్‌ఓసీ సర్టిఫికెట్ తయారు చేసి సమర్పించగా దాన్ని ఆమోదించారు. ఈ సర్టిఫికెట్ నకిలీదని, నిర్ధారణ కోసం అగ్నిమాపక శాఖకు పంపుదామంటే రాష్ట్ర క్రమశిక్షణ కమిటీలోని ఇతర అధికారులు అభ్యంతరం తెలిపినట్టు విశ్వసనీయ సమాచారం. ఇలాంటి సందర్భాల్లో కమిటీ చైర్మన్‌గా వ్యవహరించే వైద్యుడు ఇతర అధికారుల సూచనలు పరిగణనలోకి తీసుకుని సర్టిఫికెట్‌లను వెరిఫై చేసుకోవాలి. అలాకాకుండా ఉన్నతాధికారుల ఒత్తిడి ఉందని, సభ్యులపై ఒత్తిడి చేసి బలవంతంగా సంతకాలు చేయించుకున్నట్టు వెల్లడైంది.

ఆధ్యాత్మిక సమాచారం

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సింహాచలం:శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

తిరుచ్చిపై సూర్యనారాయణుడు

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీసూర్యనారాయణస్వామివారు ఆదివారం బంగారు తిరుచ్చిపై విహరించారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. సాయంత్రం సూర్య నారాయణ స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువు దీర్చారు. అనంతరం తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.

నేడు 'సంకటహర' వ్రతం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం సంకటహర గణపతి వ్రతం జరగనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రతం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు ఈ వ్రతంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.

అయినవిల్లికి భక్తుల తాకిడి

అయినవిల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో వెలసిన విఘ్నేశ్వరస్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం విశేష సేవలు నిర్వహించారు.

ముగిసిన దండువారమ్మ జాతర



రాయచోటి జగదాంబసెంటర్ : పాతరాయచోటిలోని వాల్మీకి వీధిలో వెలసియున్న శ్రీ దండువారమ్మ జాతర ఆదివారం వైభవోపేతంగా ముగిసింది. జాతరను పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. శనివారం రాత్రి అమ్మవారికి కుంకుమబండి కట్టి మెరవణి నిర్వహించారు. భక్తులు పలువురు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రారంభమైన పాలేటమ్మ జాతర




చిన్నమండెం : అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండల పరిధిలోని కేశాపురం గ్రామంలో కొలువైవున్న శ్రీ పాలేటమ్మ అమ్మవారి జాతర వైభవోపేతంగా ప్రారంభమైంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని 150 మంది పోలీసులతో బందోబస్తును నిర్వహించారు.

అన్నవరంలో భక్తుల వెల్లువ



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవు కావడంతో ఉదయం నుంచీ భక్తులు రత్నగిరికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. స్వామివారిని మొత్తం 40 వేల మంది దర్శించగా, వ్రతాలు 1,500 జరిగాయి.

తలుపులమ్మ తల్లి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం లోవ దేవస్థానంలో వెలసిన తలుపులమ్మ తల్లి దర్శనానికి భక్తజనం పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి ఆదివారం ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన 22 వేల మంది క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు.



మనికా సుథార్
మిస్ యూనివర్స్ రాజస్థాన్ 2024

ప్యాలెస్ ఆన్ వీల్స్‌లో వారం రోజుల ప్రయాణం.
ఇది ప్రయాణం మాత్రమే కాదు... ఒక అనుభూతి.
రాజస్థాన్ కోటలను చూడాలి... థార్ ఎడారిలో విహరించాలి.
రాజపుత్రులు మెచ్చిన జానపద కళల ప్రదర్శనలను ఆస్వాదించాలి.
ఇవన్నీ మామూలుగా కాదు... సకల మర్యాదలతో రాజసంగా ఉండాలి.
పర్యటన ఆద్యంతం కాలు కింద పెట్టకుండా సౌకర్యంగా ఉండాలి.
రాజస్థాన్ టూరిజం... సామాన్యులకు రాజలాంఛనాలను అందిస్తోంది.
ఇందుకోసం 'ప్యాలెస్ ఆన్ వీల్స్' పేరుతో ఒక రైలునే సిద్ధం చేసింది.
ఇది టూర్ మాత్రమే కాదు... ఇది ఒక లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియెన్స్.
ఇంకెందుకాలస్యం... ట్రైన్ నంబర్ 123456...
ప్లాట్ మీదకు వస్తోంది... లగేజ్‌తో సిద్ధంగా ఉండండి.

ప్యాలెస్‌లో ప్రయాణం రాజస్థాన్ విహారం

రాజస్థాన్ పర్యాటకం రాజసంగా ఉంటుంది. సాధారణ ప్యాకేజ్‌లు క్లస్టర్‌లుగా కొన్ని ప్రదేశాలనే కవర్ చేస్తుంటాయి. పింక్‌సిటీ, బ్లూ సిటీ, గోల్డెన్ సిటీ, లేక్ సిటీలన్నింటినీ కవర్ చేయాలంటే ప్యాలెస్ ఆన్ వీల్స్ సౌకర్యంగా ఉంటుంది. 7 రాత్రులు 8 రోజుల ప్యాకేజ్‌లో రైలు న్యూఢిల్లీ సఫ్దర్ గంజ్ స్టేషన్‌లో మొదటి రోజు సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరుతుంది. 8 రోజు ఉదయం ఏడున్నరకు అదే స్టేషన్‌లో దించుతుంది. ఢిల్లీ నుంచి మొదలై ఢిల్లీకి చేరడంతో పూర్తయ్యే ఈ ప్యాకేజ్‌లో జయ్‌పూర్, సవాయ్ మాధోపూర్, చిత్తోర్‌ఘర్, ఉదయ్‌పూర్, జై సల్మీర్, జోధ్‌పూర్, భరత్‌పూర్, ఆగ్రాలు కవర్ అవుతాయి. ఈ పర్యాటక రైలు 1982, జనవరి 26 నుంచి నడుస్తోంది. రాజస్థాన్ రాష్ట్రంలో టూరిజమ్ ప్రమోషన్ కోసం ఇండియన్ రైల్వేస్– రాజస్థాన్ టూరిజమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ టూర్ విదేశీయులే ఎక్కువగా ఉండేవారు. ఇప్పుడు మనవాళ్లు కూడా పెద్ద సంఖ్యలో పర్యటిస్తున్నారు.

తొలిరోజు: ఢిల్లీ టూ జయ్‌పూర్

పర్యాటకులకు రాజపుత్రుల సంప్రదాయ రాచమర్యాదలందిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు రైల్వే స్టేషన్‌కి చేరగానే రెడ్‌కార్పెట్ స్వాగతం పలుకుతారు. పూలమాల వేసి, బొట్టు పెట్టి, గంధం రాస్తారు. షెహనాయ్ రాగం, కచ్చీఘోడీ నాట్యం, ఏనుగు అంబారీల మధ్య రిఫ్రెష్ డ్రింక్ (సాఫ్ట్ డ్రింకులు, బార్) తో వెల్కమ్ చెబుతారు. పర్యాటకులు ఎవరికి కేటాయించిన గదిలోకి వాళ్లు వెళ్లిన తర్వాత ఆరున్నరకు రైలు ఢిల్లీ స్టేషన్ నుంచి పింక్‌సిటీ జయ్‌పూర్‌కు బయలుదేరుతుంది. రాత్రి ఎనిమిది గంటలకు రైల్లో విందు భోజనం ఇస్తారు.

రెండవ రోజు: జయ్‌పూర్ టూ సవాయ్ మాధోపూర్


అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటలకు ట్రైన్ జయ్‌పూర్‌కి చేరుతుంది. పర్యాటకులు నిద్రలేచి రిఫ్రెష్ అయిన తర్వాత ఏడు గంటలకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. ఎనిమిది గంటలకు రైలు దిగి (లగేజ్ రైల్లోనే ఉంటుంది) సైట్ సీయింగ్ కోసం ఏర్పాటు చేసిన వాహనాల్లోకి మారాలి. నగరంలో ఆల్బర్ట్ హాల్, హవామహల్, సిటీ ప్యాలెస్, జంతర్‌మంతర్ (ఖగోళ పరిశోధనాలయం)ని చూడడం. మధ్యాహ్నం లోహగర్ ఫోర్ట్‌లోని రిసార్ట్‌కు తీసుకెళ్తారు. లంచ్ అక్కడే. ఆ తర్వాత సూర్యాస్తమయంలోపు అమేర్ ఫోర్ట్ విజిట్, షాపింగ్ పూర్తి చేసుకుని ఆరు గంటలకు ప్యాలెస్ ఆన్ వీల్స్ రైలెక్కాలి. ఏడు గంటల తర్వాత రాజస్థాన్ సంప్రదాయ వంటకాలతో డిన్నర్. ప్రయాణం సవాయ్ మాధోపూర్‌కు సాగుతుంది.




పర్యాటకులకు ఘన స్వాగతం







'ప్యాలెస్ ఆన్ వీల్స్' లోపలి దృశ్యాలు



మూడవ రోజు: మాధోపూర్ టూ చిత్తోర్‌ఘర్

తెల్లవారు జామున ఐదు గంటల లోపు సవాయ్ మాధోపూర్ చేరుతుంది. రిఫ్రెష్ అయి ఆరు గంటలకు రైలు దిగి రణతంబోర్ నేషనల్ పార్క్, రణతంబోర్ ఫోర్ట్ విజిట్‌కి వెళ్లాలి. నేషనల్ పార్క్ పర్యటన పూర్తి చేసుకుని పదింటికి ట్రైన్ ఎక్కాలి. అప్పుడు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. రైలు చిత్తోర్‌ఘర్ వైపు సాగిపోతుంది. లంచ్ రైల్లోనే. సాయంత్రం నాలుగు గంటలకు చిత్తోర్‌ఘర్ చేరుతుంది. రైలు దిగి సైట్ సీయింగ్‌కి వెళ్లాలి. ఆరు గంటలకు కోట లోపల టీ తాగి, లైట్ అండ్ సౌండ్ షో ను ఆస్వాదించి ఏడున్నరకు రైలెక్కాలి. ఎనిమిది గంటలకు రైల్లోనే డిన్నర్.

నాలుగవ రోజు: చిత్తోర్‌ఘర్ టూ జై సల్మీర్ వయా ఉదయ్‌పూర్

రెండు గంటలకు చిత్తోర్‌ఘర్ నుంచి బయలుదేరుతుంది. ఉదయం ఏడున్నరకు బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేసుకున్న తర్వాత ఎనిమిదిన్నరకు లేక్‌సిటీ ఉదయ్‌పూర్ చేరుతుంది. రైలు దిగి తొమ్మిదింటికి వాహనంలోకి మారి సైట్‌సీయింగ్, షాపింగ్ చేసుకోవాలి. మధ్యాహ్నం ఒకటిన్నరకు బోట్ రైడ్, ఫైవ్ స్టార్ హోటల్‌లో భోజనం. మూడు గంటలకు తిరిగి ప్యాలెస్ ఆన్ వీల్స్ రైలెక్కాలి. నాలుగు గంటలకు జై సల్మీర్‌కు ప్రయాణం. రాత్రి భోజనం రైల్లోనే ఎనిమిది గంటలకు.

ఐదవ రోజు: జై సల్మీర్ టూ జోధ్‌పూర్

రైలు ఉదయం తొమ్మిదిన్నరకు జై సల్మీర్‌కి చేరుతుంది. రైలు దిగి గడిసిసార్ సరస్సు. జై సల్మీర్ కోట, నగరంలోని హవేలీలు చూసుకుని షాపింగ్ చేసుకుని తిరిగి రైలెక్కాలి. భోజనం చేసి విశ్రాంతి తీసుకున్న తర్వాత నాలుగు గంటలకు రైలు దిగి ఎడారిలో విహారం, క్యామెల్ రైడ్ ఆస్వాదించాలి. రాజస్థాన్ సంప్రదాయ జానపద నృత్యాలు, సంగీత కార్యక్రమాల వినోదం, రాత్రి భోజనం కూడా అక్కడే చేసుకుని రాత్రి పది గంటలకు రైలెక్కాలి. పన్నెండు గంటలలోపు రైలు జై సల్మీర్ నుంచి బ్లూ సిటీ జోధ్‌పూర్‌కు బయలుదేరుతుంది.

ఆరవ రోజు: జోధ్‌పూర్ టూ భరత్‌పూర్


రైలు ఉదయం ఏడు గంటలకు జోధ్‌పూర్‌కు చేరుతుంది. ఏడున్నరకు బ్రేక్‌ఫాస్ట్ చేసి ఎనిమిదిన్నరకు సైట్ సీయింగ్ కోసం రైలు దిగాలి. మెహరాన్‌ఘర్ ఫోర్ట్, జస్వంత్ థాడా, ఉమైద్ భవన్ ప్యాలెస్ మ్యూజియం చూసుకున్న తర్వాత షాపింగ్. ఒకటిన్నరకు బాల్ సమంద్ లేక్ ప్యాలెస్‌లో రాజలాంఛనాలతో విందు భోజనం చేసిన తర్వాత ప్యాలెస్ ఆన్ వీల్స్ రైలెక్కాలి. నాలుగన్నరకు రైలు జోధ్‌పూర్ నుంచి భరత్‌పూర్‌కు బయలుదేరుతుంది. రాత్రి భోజనం రైల్లోనే.

ఏడవ రోజు: భరత్‌పూర్ టూ ఆగ్రా


రైలు ఉదయం ఆరు గంటలకు భరత్‌పూర్‌కి చేరుతుంది. వెంటనే సైట్ సీయింగ్‌కి బయలుదేరాలి. ఘనా బర్డ్ సాంక్చురీ విజిట్ తర్వాత ఎనిమిది గంటలకు మహల్ ఖాజ్ ప్యాలెస్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేసి రైలెక్కాలి. పది గంటలకు రైలు ఆగ్రాకు బయలుదేరుతుంది. పదకొండు గంటలకు ఆగ్రా రెడ్ ఫోర్ట్ చూసుకుని ఫైవ్ స్టార్ హోటల్‌లో లంచ్ తర్వాత మూడు గంటలకు తాజ్‌మహల్ వీక్షణం. ఐదున్నర నుంచి షాపింగ్, ఏడున్నరకు రైలెక్కి డిన్నర్ తర్వాత ఎనిమిది ముప్పావుకి ఢిల్లీకి బయలుదేరాలి.

ఎనిమిదవ రోజు: ఆగ్రా టూ ఢిల్లీ


ఉదయానికి రైలు ఢిల్లీకి చేరుతుంది. బ్రేక్‌ఫాస్ట్ చేసి, లగేజ్ సర్దుకుని ఏడున్నరకు దిగి ప్యాలెస్ ఆన్ వీల్స్‌కి వీడ్కోలు పలకాలి.




జంతర్‌మంతర్, జయ్‌పూర్




రణతంబోర్ ఫోర్ట్



ఉదయ్‌పూర్ లేక్ ప్యాలెస్




జైసల్మేర్ ఫోర్ట్



మెహరాన్‌ఘర్ ఫోర్ట్, జోధ్‌పూర్



భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ



చిత్తోర్‌ఘర్ కోట



థార్ ఎడారిలో విందు భోజనం

ఏడు హెరిటేజ్ సైట్‌లను చూడవచ్చు

ప్యాలెస్ ఆన్ వీల్స్ ప్యాకేజ్‌లో యునెస్కో గుర్తించిన ఏడు వరల్డ్ హెరిటేజ్ సైట్‌లు కవర్ అవుతాయి. అవేంటంటే... జయ్‌పూర్‌లోని జంతర్ మంతర్, రణతంబోర్‌లో రణతంబోర్ కోట, చిత్తోర్‌ఘర్‌లో చిత్తోర్‌ఘర్ కోట, జై సల్మీర్‌లో జై సల్మీర్ కోటతోపాటు థార్ ఎడారి, భరత్‌పూర్ కెలాడియో నేషనల్ పార్క్, ఆగ్రాలో తాజ్ మహల్. ఇవన్నీ యునెస్కో గుర్తింపు పొందిన హెరిటేజ్ సైట్‌లు. ఈ గౌరవంతోపాటు తాజ్‌మహల్‌కి ప్రపంచంలోని ఏడు వింతల జాబితాలో కూడా స్థానం ఉంది.



పులి కనిపించిందా!

ఈ టూర్‌లో రాజస్థాన్ సంప్రదాయ సంగీతం, స్థానిక ఘూమర్, కల్బేలియా జానపద నృత్యాలను ఆస్వాదిస్తూ సాగే కామెల్ సఫారీ, డెజర్ట్ సఫారీలు, క్యాంప్‌ఫైర్ వెలుగులో ఇసుక తిన్నెల మీద రాత్రి భోజనాలను ఆస్వాదించవచ్చు. భరత్‌పూర్‌లోని కెలాడియా నేషనల్ పార్క్‌కి సైబీరియా నుంచి వచ్చిన కొంగలను చూడవచ్చు. ఈ పక్షులు ఏటా సైబీరియా నుంచి ఏడు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి నవంబర్‌లో ఇక్కడికి వలస వస్తాయి. మార్చి వరకు ఇక్కడ ఉండి ఏప్రిల్ నుంచి తిరుగు ప్రయాణం మొదలుపెడతాయి. ఈ కొంగలతోపాటు వందల రకాల పక్షులుంటాయి. రణతంబోర్ నేషనల్ పార్క్‌కు వెళ్లి జీప్ సఫారీ లేదా ఎలిఫెంట్ సఫారీ చేస్తూ పులి కనిపిస్తుందేమోనని రెప్పవేయకుండా కళ్లు విప్పార్చి బైనాక్యులర్‌లో చూసి చూసి... దూరంగా ఎక్కడో పులి అలికిడి కనిపించగానే భయంతో కూడిన థ్రిల్‌తో జగుసుకు పోవచ్చు.

తరగతుల వారీగా ట్రైన్ టికెట్ వివరాలు:

- ప్రెసిడెన్షియల్ సూట్‌లో క్యాబిన్‌కి... 2,67,509 రూపాయలు
- సూపర్ డీలక్స్‌లో క్యాబిన్‌కి... 2,18,207 రూపాయలు
- డీలక్స్ క్యాబిన్ సింగిల్ ఆక్యుపెన్సీ... 1,10,224 రూపాయలు
- డీలక్స్ క్యాబిన్ డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి... 71,712 రూపాయలు
- ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితం. పన్నెండేళ్ల లోపు పిల్లలకు సగం చార్జ్.
- ఒక క్యాబిన్‌లో ఇద్దరికి అనుమతి. పిల్లలను పేరెంట్స్‌తోపాటు అదే క్యాబిన్‌లో అనుమతిస్తారు.

ప్యాలెస్ ఆన్ వీల్స్ మరిన్ని వివరాల కోసం...
Email :
palaceonwheels.rtdc@rajasthan.gov.in
Website:
Palaceonwheels.rajasthan.gov.in

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



వ్యాపారం ప్రారంభించడానికి మార్గం ఏమిటంటే,
మాటలు ఆపి పని చేయడం మొదలుపెట్టడం.

- వాల్ట్ డిస్నీ

సాక్షి ప్లస్
సోమవారం।17-3-2025

బిజినెస్ రీల్

అమెరికాలో టారిఫ్ అస్పష్టతతో పెట్టుబడుల్లో జాప్యం

టాటా టెక్నాలజీస్ సీఈవో హారిస్ వెల్లడి



న్యూఢిల్లీ: టారిఫ్ విధానాలపై అస్పష్టత నెలకొనడం వల్ల అమెరికాలో పెట్టుబడుల ప్రతిపాదనలను అమలు చేయడంలో జాప్యం జరగొచ్చని టాటా టెక్నాలజీస్ సీఈవో వారెన్ హారిస్ తెలిపారు. అయితే, వచ్చే నెలా, రెణ్నెల్లలో కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఉత్తర అమెరికా మార్కెట్‌పై మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా తాము చాలా బులిష్‌గా ఉన్నట్లు వివరించారు. టారిఫ్‌లు నచ్చడం, నచ్చకపోవడాన్ని పక్కన పెడితే స్పష్టతనేది కీలకంగా ఉంటుందని హారిస్ చెప్పారు. తమ కస్టమర్లకు ఒక అవగాహన వచ్చిన తర్వాత తగు నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. తమ సంస్థ స్వేచ్ఛా వాణిజ్యానికి మద్దతు పలికినప్పటికీ, వివిధ మార్కెట్లలో పరిస్థితులు వివిధ రకాలుగా ఉంటాయి కాబట్టి తదనుగుణంగా వ్యాపారాలను నిర్వహించాల్సి ఉంటుందని హారిస్ తెలిపారు. 'ఉత్తర అమెరికాకు యూరప్ చాలా భిన్నంగా ఉంటుంది. అలాగే, భారత్‌కి భిన్నంగా చైనా ఉంటుంది. కాబట్టి ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించడాన్ని మేము అలవర్చుకున్నాం' అని ఆయన పేర్కొన్నారు.

టాటా ఏఐఏ లైఫ్ శుభ్ ఫ్లెక్సి ఇన్‌కం ప్లాన్



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక భద్రతపరమైన భరోసానివ్వడంతో పాటు సంపద సృష్టికి కూడా ఉపయోగపడేలా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ శుభ్ ఫ్లెక్సి ఇన్‌కం ప్లాన్ పేరిట వినూత్న జీవిత బీమా పొదుపు సాధనాన్ని ఆవిష్కరించింది. వివిధ వర్గాల ఆర్థిక ప్రణాళికలు, అవసరాలకు అనుగుణంగా ఇందులో ఎండోమెంట్, ఎర్లీ ఇన్‌కం, డిఫర్డ్ ఇన్‌కం ఆప్షన్లు ఉంటాయి. మహిళా పాలసీదార్లకు ప్రత్యేక డిస్కౌంటు ఉంటుంది. బోనస్‌లపై వడ్డీని పొందుతూ, దాన్ని భవిష్యత్తు ప్రీమియం చెల్లింపులకు ఉపయోగించుకునేలా సబ్-వాలెట్ ఫీచరు కూడా ఉంది. పాలసీదారు దురదృష్టవశాత్తూ కన్ను మూసిన పక్షంలో భవిష్యత్తులో కట్టాల్సిన ప్రీమియంల నుంచి మినహాయింపు లభిస్తుంది. వారి కుటుంబ సభ్యులకు భవిష్యత్తు బోనస్‌లు, ఇతర ప్రయోజనాలు యథాప్రకారం లభిస్తాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-3-2025


విశాఖ	405-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.55

విదేశీ గణాంకాలే దిక్సూచి

- యూఎస్ మార్కెట్, టారిఫ్‌ల ఎఫెక్ట్
- చమురు, రూపాయి మారకానికీ ప్రాధాన్యం
- దేశీ స్టాక్ మార్కెట్ కదలికలపై నిపుణుల అంచనాలు

ఫెడ్ పాలసీ సమావేశంపైనా దృష్టి

ఈ వారం ప్రధానంగా విదేశీ అంశాలే దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నాయి. వీటికితోడు యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్షను చేపట్టనుంది. వెరసి ఇన్వెస్టర్లు దేశ, విదేశీ ఆర్థిక గణాంకాలతోపాటు ఫెడ్ వడ్డీ నిర్ణయాలపై దృష్టిపెట్టనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.



ముంబై: అంతర్జాతీయంగా నేడు(17న) పలు ఆర్థిక గణాంకాలు వెలువడనున్నాయి. దేశీయంగా ఫిబ్రవరి నెలకు టోకు ధరల ద్రవ్యోల్బణ(డబ్ల్యూపీఐ) వివరాలు వెల్లడికానున్నాయి. జనవరిలో డబ్ల్యూపీఐ 2.31 శాతానికి చేరగా.. 2024 డిసెంబర్‌లో 2.37 శాతంగా నమోదైంది. విదేశీ అంశాలలో జనవరి-ఫిబ్రవరికి చైనా పారిశ్రామికోత్పత్తి, రిటైల్ అమ్మకాల గణాంకాలు నేడు వెల్లడికానున్నాయి. ఫిబ్రవరిలో యూఎస్ రిటైల్ సేల్స్‌సహా హౌసింగ్ డేటా నేడు విడుదలకానుంది. ఈ బాటలో ఫిబ్రవరికి జపాన్ వాణిజ్య బ్యాలన్స్ గణాంకాలు, బ్యాంక్ ఆఫ్ జపాన్(బీవోజే) వడ్డీ రేట్ల నిర్ణయాలు 19న వెల్లడికానున్నాయి. గత సమీక్షలో స్వల్పకాలిక వడ్డీ రేటును 0.25 శాతం పెంచడంతో 0.5 శాతానికి చేరిన సంగతి తెలిసిందే. ఇది గత 17ఏళ్లలోనే అత్యధికంకాగా.. 20న గత నెలకు యూఎస్ గృహ విక్రయాల డేటా విడుదలకానుంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లపై నిర్ణయాలు ప్రకటించనుంది. 21న జపాన్ ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడికానున్నాయి. జనవరిలో ద్రవ్యోల్బణం 4 శాతానికి ఎగసింది.

ఫెడ్ ఏం చేయనుంది?

రేపు(18న) ప్రారంభంకానున్న యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశ నిర్ణయాలు బుధ వారం (19న) వెల్లడికానున్నాయి. రెండు రోజులు సమావేశంకానున్న ఫెడ్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) గత సమీక్షలో యథాతథ పాలసీ అమలుకే కట్టుబడింది. అయితే ప్రెసిడెంట్ ట్రంప్ పలు దేశాలపై విధిస్తున్న ప్రతీకార టారిఫ్‌లు, ద్రవ్యోల్బణం తదితర గణాంకాలు వడ్డీ రేట్ల నిర్ణయాలను ప్రభావితం చేయనున్నట్లు ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. అయితే మరోసారి ఫెడరల్ ఫండ్స్ రేట్లను యథాతథంగా 4.25-4.5 శాతంవద్ద కొనసాగించేందుకే నిర్ణయించే వీలున్నట్లు అధిక శాతం మంది నిపుణులు భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌ల విధింపు, విధానాల నేపథ్యంలో ఆర్థిక వృద్ధి, ధరలు, ఉపాధి కల్పన తదితర అంశాలకు ఫెడ్ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలియజేశారు. దీంతో ఫెడ్ సంకేతాలపై ప్రపంచ దేశాలు దృష్టిపెట్టనున్నట్లు వివరించారు.

ఇతర అంశాలు

అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు 70 డాలర్ల దిగువన కదులుతున్నాయి. ఒపెక్, సంబంధిత దేశాలు ఏప్రిల్ నుంచీ చమురు ఉత్పత్తి పెంపు ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. వెరసి రోజుకి 1,38,000 బ్యారళ్లమేర చమురు అధికంగా సరఫరాకానుంది. ఇది భారత్‌కు సానుకూల అంశమని ఆర్థికవేత్తలు తెలియజేశారు. ఇక మరోపక్క డాలరుతో మారకంలో రూపాయి 87 స్థాయిలో బలహీనంగా కదులుతోంది. కాగా.. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా యూఎస్ ఆర్థిక వ్యవస్థ బలహీనపడితే దేశీ మార్కెట్లపై ప్రభావం పడుతుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు. ఈ వారం హెచ్చుతగ్గుల మధ్య మార్కెట్లు స్వల్ప కదలికలకే పరిమితంకావచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్‌మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు.

గత వారమిలా

హోలీ పండుగ సందర్భంగా నాలుగు రోజులకే పరిమితమైన గత వారం ట్రేడింగ్‌లో దేశీ స్టాక్ మార్కెట్లు స్వల్పంగా క్షీణించాయి. ఆటుపోట్ల మధ్య సెన్సెక్స్ నికరంగా 504 పాయింట్లు(0.7 శాతం) బలహీనపడింది. 73,829 వద్ద నిలిచింది. నిఫ్టీ 155 పాయింట్లు(0.7 శాతం) క్షీణించి 22,397 వద్ద స్థిరపడింది. చిన్న షేర్లలో అమ్మకాలు కొనసాగడంతో బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం నీరసించగా.. స్మాల్ క్యాప్ 3.9 శాతం పతనమైంది.

ఎఫ్‌పీఐల భారీ అమ్మకాలు

మార్చి 3-13 మధ్య రూ. 30,015 కోట్లు వెనక్కి

న్యూఢిల్లీ: దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలు కొనసాగుతున్నాయి. గతేడాది(2024) అక్టోబర్‌లో మొదలైన అమ్మకాలు ఇటీవల కొద్ది నెలలుగా జోరందుకున్నాయి. వెరసి ఈ నెలలో ఇప్పటివరకూ(3-13 మధ్య) నికరంగా రూ. 30,015 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య సుంకాల ఆందోళనలు పెరగడంతో ప్రధానంగా విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ఫిబ్రవరిలో రూ. 34,574 కోట్లు, జనవరిలో రూ. 78,027 కోట్లు చొప్పున పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. వెరసి 2025లో ఇప్పటివరకూ రూ. 1.42 లక్షల కోట్ల(16.5 బిలియన్ డాలర్లు) విలువైన స్టాక్స్ విక్రయించారు.



స్మార్ట్ పెట్టుబడులకు ప్యాసివ్ ఫండ్స్



వికాస్ వాడేకర్
హెడ్ - ప్యాసివ్ బిజినెస్, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్

సాంకేతిక పురోగతి, మార్కెట్లో ఒడిదుడుకులు, మారిపోతున్న ఆర్థిక పరిస్థితులతో ఇన్వెస్టింగ్ ప్రపంచంలో శరవేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో, తమ సంపదను పెంచుకునేందుకు సరళమైన, సమర్థవంతమైన మార్గం కోసం అన్వేషిస్తున్న వారికి, ప్యాసివ్ ఫండ్స్ ఆకర్షణీయంగా మారాయి. తక్కువ వ్యయాలతో కూడుకున్నవై, సరళమైన వ్యూహం, విస్తృత డైవర్సిఫికేషన్, దీర్ఘకాలిక వృద్ధిపై ఫోకస్ పెట్టే ప్యాసివ్ ఫండ్స్ అనేవి, ఆర్థిక మార్కెట్లలో సమర్థవంతంగా ఇన్వెస్ట్ చేసేందుకు అనువైన మార్గంగా ఉండగలవు. 2025లో పెట్టుబడులకు సంబంధించి స్మార్ట్ చాయిస్‌గా నిలవడంలో వీటికున్న ప్రత్యేకత గురించి తెలియజేసేదే ఈ కథనం.



సాధారణంగా ఇన్వెస్టింగ్ అంటే, ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి, ఎప్పుడు ఇన్వెస్ట్ చేయాలి, రిస్కులను ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలి, ఏ సాధనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి, ఇలాంటి అనేకానేక నిర్ణయాలు తీసుకోవాల్సి రావడంతో, చాలా సంక్లిష్టమైన వ్యవహారంగా అనిపిస్తుంది. ఇలాంటి గందరగోళం లేకుండా సరళమైన విధానంలో పెట్టుబడులకు అవకాశం కల్పించడమే ప్యాసివ్ ఫండ్స్ ప్రత్యేకత. ఒక్కో స్టాక్‌ను వేర్వేరుగా ఎంచుకుని, ఒక్కొక్కటిగా పర్యవేక్షించుకోవాల్సిన అవసరం లేకుండా విస్తృత మార్కెట్‌ను ప్రతిబింబించేవిగా, పెద్దగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేని విధంగా ఇవి ఉంటాయి. దీర్ఘకాలిక వృద్ధి కోరుకుంటున్నా లేదా సంపదను స్థిరంగా పెంపొందించుకోవాలని భావిస్తున్నా, జీవితంలో ఇతరత్రా అంశాలపై దృష్టి పెట్టేందుకు వెసులుబాటునిచ్చే, సులభతరంగా అర్థమయ్యే సొల్యూషన్‌గా ప్యాసివ్ ఫండ్స్ ఉపయోగపడతాయి.

తక్కువ వ్యయాలు.. ఎక్కువ ప్రయోజనాలు..

చెల్లించాల్సిన ఫీజుల గురించి ఇన్వెస్టర్లు ప్రత్యేకంగా పట్టించుకుంటున్న నేపథ్యంలో 2025లో ప్రతి పర్సంటేజీ పాయింటూ ముఖ్యమే. అతి తక్కువ వ్యయ నిష్పత్తులకు ప్యాసివ్ ఫండ్స్ పేరొందాయి. వివిధ స్టాక్స్ ఎంపిక కోసం ఈ ఫండ్స్‌కి భారీగా అనలిస్టులు, ఫండ్ మేనేజర్ల బృందం అవసరం లేకపోవడం వల్ల వీటి ఖర్చులు చాలా తక్కువగా ఉంటాయి.

దీర్ఘకాలిక వృద్ధికి స్థిరమైన వ్యూహం ..

నేరుగా మార్కెట్లకు అనుసంధానితమైన రాబడులను అందించే సామర్థ్యాలు ఉండటమే ప్యాసివ్ ఫండ్స్‌ను ఎంచుకోవడానికి మరో ప్రధాన కారణంగా నిలుస్తుంది. అనిశ్చితి పెరిగిపోతున్న తరుణంలో, స్థిరత్వంతో పాటు కాలం గడిచే కొద్దీ నిలకడగా, కాంపౌండెడ్ రాబడులను అందించగలిగే వ్యూహాల కోసం ఇన్వెస్టర్లు అన్వేషిస్తున్నారు. విస్తృతమైన మార్కెట్ సూచీలను ట్రాక్ చేయడం ద్వారా, సంపదను పెంపొందించుకోవడానికి ఇన్వెస్టర్లకు విశ్వసనీయమైన బాటను ఏర్పర్చి, ప్యాసివ్ ఫండ్స్ ఇలాంటి వృద్ధి అవకాశాలను అందిస్తాయి.

ప్యాసివ్ ఫండ్స్ ద్వారా కొనడం, అమ్మడం సులభతరంగా ఉంటుంది. కాబట్టి, ఇతరత్రా పెట్టుబడి సాధనాల తరహాలో సుదీర్ఘ సెటిల్మెంట్ వ్యవధులు లేదా పరిమితుల గురించిన ఆందోళన లేకుండా, అవసరమైనప్పుడు, కావాల్సిన విధంగా తమ పోర్ట్‌ఫోలియోను సరి చేసుకునే స్వాతంత్ర్యం ఇన్వెస్టర్లకు లభిస్తుంది.

వైవిధ్యం..

ఇన్వెస్ట్ చేస్తున్నప్పుడు రిస్కులు తప్పవు. కానీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడమే కీలకం. ప్యాసివ్ ఫండ్స్ అనేవి డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను కల్పించడం ద్వారా రిస్కులకు ప్రతిగా, సహజసిద్ధమైన హెడ్జింగ్ సాధనాలుగా ఉపయోగపడతాయి. ఇండెక్స్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారంటే మీరు విస్తృతమైన మార్కెట్లో (నిఫ్టీ 100 లేదా నిఫ్టీ 500) కొంత భాగాన్ని లేదా మొత్తం మార్కెట్‌నే కొనుగోలు చేసినట్లు లెక్క. ఇందులో వివిధ రంగాలు, పరిశ్రమలు, థీమ్‌లను ప్రతిబింబించే వేర్వేరు స్టాక్స్ ఉంటాయి. అంటే, మీ పెట్టుబడి రాణించడమనేది ఏ ఒక్క కంపెనీ లేదా రంగం పనితీరుపై ఆధారపడదు. ఒకటి తగ్గినా మరొకటి పెరిగే అవకాశాలు ఉండటం వల్ల రిస్కులు కొంత తక్కువగా ఉంటాయి. ఇక లిక్విడిటీపరంగా చూస్తే, ఇండెక్స్, సెక్టార్ లేదా అసెట్ క్లాస్‌ను ట్రాక్ చేసే ఈటీఎఫ్‌లు షేర్లలాగే ఎక్స్ఛేంజీల్లో ట్రేడవుతాయి. ట్రేడింగ్‌కి అనువుగా ఉంటాయి. వీటిని కొని, అమ్మేందుకు డీమ్యాట్ ఖాతా ఉండాలి. మరోవైపు, నిర్దిష్ట మార్కెట్ ఇండెక్స్ పనితీరును ప్రతిఫలిస్తూ, ప్యాసివ్‌గా ఉండేవి ఇండెక్స్ ఫండ్స్. వీటిలో పెట్టుబడులకు డీమ్యాట్ ఖాతా అక్కర్లేదు. నికర అసెట్ వేల్యూ (ఎన్‌ఏవీ) ఆధారంగా వీటిని నేరుగా ఫండ్ హౌస్ ద్వారా కొనుక్కోవచ్చు, అమ్ముకోవచ్చు. డీమ్యాట్, ట్రేడింగ్ అకౌంట్లు లేని ఇన్వెస్టర్లు కూడా ప్యాసివ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ఇండెక్స్ ఫండ్ మార్గం ఉపయోగకరంగా ఉంటుంది.

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ 'ఛోటీ సిప్'

సాక్షి, హైదరాబాద్: ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ తాజాగా ఛోటీ సిప్‌ను (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ప్రారంభించింది. డెట్, సెక్టోరల్, థీమ్యాటిక్ లాంటి కొన్ని ఫండ్స్‌కి తప్ప మిగతా అన్ని రకాల స్కీములకు ఇది అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. నెలవారీగా రూ. 250 నుంచి ఈ సిప్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు. కనీసం 60 వాయిదాలు కట్టాల్సి ఉంటుందని సంస్థ ఎండీ ఎ. బాలసుబ్రమణియన్ తెలిపారు. క్రమశిక్షణతో పెట్టుబడులు పెట్టే ధోరణిని అలవర్చుకునేందుకు ఈ విధానం తోడ్పడగలదని పేర్కొన్నారు. ఇందులో, ముందస్తుగా విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది.

ఏప్రిల్ నుంచి హైదరాబాద్‌లో యాపిల్ ఎయిర్‌పాడ్స్ ఉత్పత్తి

ప్రస్తుతానికి ఎగుమతులకే పరిమితం



న్యూఢిల్లీ: తైవాన్ దిగ్గజం ఫాక్స్‌కాన్‌కి చెందిన హైదరాబాద్ ప్లాంటులో ఏప్రిల్ నుంచి యాపిల్ ఎయిర్‌పాడ్స్ ఉత్పత్తి ప్రారంభం కానుంది. ప్రస్తుతానికి ఎగుమతుల కోసమే వీటిని తయారు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్ దిగ్గజం యాపిల్ ఇప్పటికే తమ ఐఫోన్లను భారత్‌లో తయారు చేస్తుండగా, ఎయిర్‌పాడ్స్ రెండో కేటగిరీగా ఉంటుందని వివరించాయి. దాదాపు రూ. 3,500 కోట్లతో ఈ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు 2023 ఆగస్టులో ఫాక్స్‌కాన్ ప్రకటించింది. భారత్‌పైనా ప్రతీకార టారిఫ్‌లు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో యాపిల్ ఇక్కడ ఉత్పత్తిని తగ్గించుకుని, అమెరికాలో పెట్టుబడులు పెట్టనుందనే వార్తల నేపథ్యంలో, ఎయిర్‌పాడ్స్ తయారీని ప్రారంభించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రకారం హియరబుల్స్, వేరబుల్స్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు భారత్‌లో 20 శాతంగా ఉండగా, అమెరికాలో అసలు లేనే లేవు. అమెరికా నుంచి స్మార్ట్‌ఫోన్లు, హియరబుల్స్, వేరబుల్స్‌పై దిగుమతులపై సుంకాలను తొలగిస్తే భారత్‌కి కూడా ప్రయోజనకరంగా ఉంటుందని ఐసీఈఏ పేర్కొంది.

విదేశీ ఆస్తులు, ఆదాయం చూపించలేదా..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

మీ అందరికీ గుర్తుండే ఉంటుంది. 2024 నవంబర్ 17 నుంచి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఓ ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. 'మీలో ఎవరైనా విదేశీ ఆస్తులు, విదేశీ ఆదాయాన్ని డిక్లేర్ చేశారా లేదా. ఒకవేళ చేయకపోతే వెంటనే చేయండి' అనేది దీని సారాంశం. సాధారణంగా ఐటీఆర్‌లు దాఖలు చేసినప్పుడు, ప్రతి అస్సెస్సీ ముఖ్యంగా రెసిడెంట్ స్టేటస్ గల వారు తమ ఆదాయాన్ని .. అంటే మనదేశంలో వచ్చిన ఆదాయంతో పాటు విదేశాల్లో వచ్చినదాన్ని కూడా చూపించాలి. నాన్ రెసిడెంట్లు కేవలం మన దేశంలో వచ్చిన ఆదాయాన్ని చూపిస్తే చాలు. విదేశాల్లోని ఆస్తులు, ఆదాయాలు డిక్లేర్ చేయక్కర్లేదు. పన్ను భారమనేది అస్సెస్సీ రెసిడెన్షియల్ స్టేటస్ మీద ఆధారపడి ఉంటుంది. మీరు భారత్‌లో ఒక ఆర్థిక సంవత్సరంలో ఉన్న వ్యవధి 182 రోజులు లేదా అంతకన్నా ఎక్కువగా ఉంటే రెసిడెంట్ అవుతారు. లేకపోతే నాన్ రెసిడెంట్లవుతారు. ఈ వ్యవధిని లెక్కించడానికి పాస్‌పోర్ట్‌లోని పద్దులు, ఎంట్రీలను ప్రాతిపదికగా తీసుకుంటారు. వాటి ప్రకారం రోజులను లెక్కిస్తారు.

సాధారణంగా మనందరం రెసిడెంట్లు అవుతాం. పిల్లలు విదేశాల్లో ఉద్యోగం చేస్తుండటం వల్ల వారు నాన్ రెసిడెంట్లు అవుతారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ స్టేటస్‌ను తప్పుగా పేర్కొనకూడదు. ఈ విషయాన్ని అందరికీ తెలియజేసేందుకు, అవగాహన కల్పించేందుకు, విస్తృత స్థాయిలో ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా తప్పులుంటే/తప్పులు జరిగితే సరిదిద్దుకోండి. మీ రిటర్నును రివైజ్ చేసుకోండి .. అని చెప్పారు. దీనిపై మెసేజీలు పంపారు. ఇవి రాగానే అందరూ ఉలిక్కి పడ్డారు. వెంటనే తమ స్టేటస్‌ని, ఆదాయాన్ని, ఆస్తుల వివరాలను చెక్ చేసుకున్నారు.

30,161 మంది అస్సెస్సీలు తమ తప్పులను సరి చేసుకున్నారు. వారి వారి ఆస్తులను (విదేశాల్లోనివి) డిక్లేర్ చేశారు. వీరిలో 24,678 మంది రివ్యూ చేసుకున్నారు. 5,483 మంది తమ రిటర్నులను రివైజ్ చేసుకున్నారు. దీనితో రూ. 29,208 కోట్ల విదేశీ ఆస్తులు అదనంగా ఉన్నట్లు బైటపడింది. వాటి ద్వారా అదనంగా రూ. 1,089 కోట్ల ఆదాయం బైటికొచ్చింది. అంతే కాకుండా 6,734 మంది వారి స్టేటస్‌ను రెసిడెంటు నుంచి నాన్ రెసిడెంటుగా మార్చుకున్నారు. ఇలాంటి ప్రచారం వల్ల ఎన్నో మంచి పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయి. అవగాహన, పారదర్శకత పెరుగుతోంది. నిబంధనలను పాటించడం (కాంప్లయెన్స్) పెరిగింది. కీలక వివరాలు తెలిశాయి. పన్నుల వసూళ్లు పెరిగాయి.

కామన్ రిపోర్టింగ్ స్టాండర్డ్ (సీఆర్ఎస్) ద్వారా విదేశాల్లోని పన్ను అధికారుల నుంచి సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. అన్ని దేశాల నుంచి సమగ్రమైన సమాచారం వస్తోంది. అంతే కాకుండా విదేశీ ఖాతాల నుంచి సమాచారం వస్తోంది. పలు చోట్ల సెమినార్లు, వెబినార్లు నిర్వహించారు. కరపత్రాలు, బ్రోచర్లు పంచారు. సోషల్ మీడియా వాడుకున్నారు. ఇదంతా ఇప్పటివరకు స్నేహపూర్వకంగా జరుగుతోంది. ఇలాగే కొనసాగాలంటే, 'వాళ్లు మన గురించి తెలుసుకుంటున్నారన్న విషయాన్ని' మనం అర్థం చేసుకుని మసలుకోవాలి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పెట్టుబడికి విలువ జోడింపు

హెచ్‌ఎస్‌బీసీ వేల్యూ ఫండ్





స్టాక్స్‌లో 4-5 నెలల పాటు తీవ్ర దిద్దుబాటు చూశాం. విదేశీ ఇన్వెస్టర్ల ఎడతెరిపి లేని అమ్మకాలు ఈక్విటీలను కుదేలు చేశాయి. ముఖ్యంగా అధిక వేల్యుయేషన్లకు చేరిన స్టాక్స్‌లో పతనం మరింత ఎక్కువగా కనిపించింది. ప్రధాన సూచీల్లో దిద్దుబాటు 16 శాతం, స్మాల్, మిడ్‌క్యాప్‌లో 20-22 శాతం ఉంటే, విడిగా చాలా స్టాక్స్‌లో కరెక్షన్ 30-60 శాతం మధ్య కనిపించింది. ఇది రిటైల్ ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగించడం చూశాం. ఒక స్టాక్‌లో ఏ విలువ దగ్గర పెట్టుబడి పెట్టాలన్న విషయం రిటైల్ ఇన్వెస్టర్లలో చాలా మందికి తెలియదు. ఇలాంటి దిద్దుబాట్లలో చౌక విలువల వద్ద లభించే ఆణిముత్యాలనూ గుర్తించడం కష్టం. అందుకే ఈ విషయంలో నిపుణులైన ఫండ్ మేనేజర్లను నమ్ముకోవడం మెరుగైన విధానం అవుతుంది. సహేతుక విలువల వద్ద కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తూ, ఇన్వెస్టర్లకు దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని చేసి పెట్టేవే వేల్యూ ఫండ్స్. ముఖ్యంగా ప్రస్తుత దిద్దుబాటు ఈ ఫండ్స్ పెట్టుబడులకు ఎంతో అనుకూలం. ఈ విభాగంలో హెచ్‌ఎస్‌బీసీ వేల్యూ ఫండ్ నమ్మకమైన పనితీరు ప్రదర్శిస్తోంది.

రాబడులు

ఈ పథకానికి 15 ఏళ్ల ట్రాక్ రికార్డు ఉంది. గత పదేళ్లలో రాబడి స్థిరంగా ఉంది. ఏడాది కాలంలో పెట్టుబడులపై 2.4 శాతం రాబడిని (పాయింట్ టు పాయింట్) వచ్చింది. మార్కెట్ దిద్దుబాటుతో చాలా పథకాల్లో ఏడాది కాల రాబడి మైనస్‌లోకి వెళ్లిపోవడం గమనార్హం. మూడేళ్లలో ఈ పథకంలో రాబడి ఏటా 20.90 శాతంగా ఉండడం గమనించాలి. ఐదేళ్లలోనూ ఏటా 22 శాతం, పదేళ్లలో 15.8 శాతం చొప్పున వార్షిక రాబడులను అందించింది. ఈ విభాగంలోని అత్యుత్తమ పథకాల్లో ఇది కూడా ఒకటి. నిఫ్టీ 500 టీఆర్ఐతో పోల్చి చూస్తే వివిధ కాలాల్లో ఈ పథకమే 3-7 శాతం మేర అధిక రాబడులను అందించింది. రోలింగ్ రాబడులను చూసినా కానీ ఐదేళ్లలో ఏటా 16.8 శాతంగా ఉన్నాయి. గత పదేళ్లలో ఈ పథకంలో వార్షిక సిప్ రాబడి 17.9 శాతంగా ఉంది.

పెట్టుబడుల విధానం

ఈ పథకం ఫ్లెక్సీక్యాప్ నమూనాలో పనిచేస్తుంటుంది. అంటే లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛ ఉంది. ప్రధానంగా వేల్యూ ఇన్వెస్టింగ్‌కే ప్రాధాన్యం ఇస్తుంది. వృద్ధికి బలమైన అవకాశాలుండి, ఆయా కంపెనీల విలువలు ఆకర్షణీయంగా, సహేతుకంగా కనిపించినప్పుడు వాటిల్లో ఇన్వెస్ట్ చేయడానికి మొగ్గు చూపుతుంది. తాత్కాలికంగా ర్యాలీ చేసే స్టాక్స్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వదు. ఈ పథకంలో అప్‌సైడ్ క్యాప్చర్ రేషియో 117.2గా ఉంది. అంటే బుల్ ర్యాలీల్లో సూచీల కంటే ఈ పథకం ఎక్కువగా ర్యాలీ చేస్తుందని అర్థం. డౌన్‌సైడ్ క్యాప్చర్ రేషియో 92గా ఉంది. అంటే మార్కెట్ పతనాల్లో నిఫ్టీ 500 టీఆర్ఐ సూచీ కంటే తక్కువ నష్టానికి పరిమితమవుతుంది.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.12,849 కోట్ల నిర్వహణ ఆస్తులున్నాయి. ఇందులో 98.51 శాతం మేర స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. అందులోనూ 51 శాతం లార్జ్‌క్యాప్ కంపెనీలకు కేటాయించింది. మిడ్‌క్యాప్‌లో 36.77 శాతం, స్మాల్‌క్యాప్‌లో 12.36 శాతం చొప్పున పెట్టుబడులున్నాయి. దాదాపు అన్ని రకాల మార్కెట్ సైకిల్స్‌లోనూ మిడ్, స్మాల్‌క్యాప్ కేటాయింపులను 46-55 శాతం మధ్య నిర్వహిస్తుంటుంది. అంటే ఈ మేరకు పోర్ట్‌ఫోలియోకి రిస్క్ ఉన్నట్టు భావించొచ్చు. కాకపోతే వ్యాల్యూ ఇన్వెస్టింగ్ కనుక, దీర్ఘకాలంలో స్థిరమైన రాబడికి అవకాశం ఉంటుంది. పథకంలో రిస్క్‌ను మోస్తరు స్థాయికి పరిమితం చేయడాన్ని గుర్తించొచ్చు. ప్రస్తుత పోర్ట్‌ఫోలియోని గమనిస్తే.. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ కంపెనీలకు 29.66 శాతం కేటాయింపులు చేసింది. మెటీరియల్స్ కంపెనీల్లో 15.28 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 15.15 శాతం, ఇండస్ట్రియల్ కంపెనీల్లో 10.35 శాతం చొప్పున పెట్టుబడులున్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	4.27
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	3.56
ఎంసీఎక్స్	3.56
టెక్ మహీంద్రా	2.98
విప్రో	2.63
ఇన్ఫోసిస్	2.49
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.48
కరూర్ వైశ్యా బ్యాంక్	2.44
ప్రదీప్ ఫాస్ఫేట్స్	2.36
ఫెడరల్ బ్యాంక్	2.34

ఇంటర్నేషనల్ మాస్టర్స్ చాంపియన్ భారత్

ఫైనల్లో వెస్టిండీస్ మాస్టర్స్‌పై గెలుపు ● రాణించిన రాయుడు, సచిన్, వినయ్ కుమార్



రాయ్‌పూర్: ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో భారత మాస్టర్స్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత మాస్టర్స్ జట్టు ఆదివారం రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఫైనల్లో 6 వికెట్ల తేడాతో వెస్టిండీస్ మాస్టర్స్‌పై విజయం సాధించింది. తొలిసారి నిర్వహించిన ఈ లీగ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శనతో సత్తా చాటింది. తుదిపోరులో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ మాస్టర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. సిమ్మన్స్ (41 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్), డ్వైన్ స్మిత్ (35 బంతుల్లో 45; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. భారత బౌలర్లలో వినయ్ కుమార్ 3, నదీమ్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత మాస్టర్స్ జట్టు 17.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. ఓపెనర్ అంబటి తిరుపతి రాయుడు (50




బంతుల్లో 74; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో విజృంభించగా... కెప్టెన్ సచిన్ టెండూల్కర్ (25; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. యువరాజ్ సింగ్ (13 నాటౌట్), గుర్‌కీరత్ సింగ్ (14), స్టువర్ట్ బిన్నీ (16 నాటౌట్) తలా కొన్ని పరుగులు చేశారు.

నేటి నుంచి ఇండియన్ టూర్ స్క్వాష్ టోర్నీ

చెన్నై: భారత స్క్వాష్ రాకెట్స్ సమాఖ్య (ఎస్ఆర్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నేటి నుంచి జరగనున్న ఇండియన్ టూర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ఆటగాళ్లు సౌరవ్ ఘోషల్, జోష్నా చినప్ప ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. చెన్నై వేదికగా జరగనున్న ఈ టోర్నీలో వీరితో పాటు ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా విజయాలు సాధిస్తున్న టీనేజ్ సంచలనం 16 ఏళ్ల అనాహత్ సింగ్ కూడా బరిలోకి దిగనుంది. తక్కువ కాలంలోనే 9 ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) టైటిళ్లు ఖాతాలో వేసుకున్న అనాహత్ మహిళల విభాగంలో మూడో సీడ్ దక్కించుకుంది. గతేడాది కెరీర్‌కు వీడ్కోలు పలికిన 38 ఏళ్ల సౌరవ్ ఇటీవల రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. ఆ వెంటనే బరిలోకి దిగిన సిడ్నీ క్లాసిక్ ఈవెంట్‌లో అతడు విజేతగా నిలిచాడు. 19 సార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన 38 ఏళ్ల జోష్నా గతేడాది నవంబర్ తర్వాత తొలిసారి బాక్స్‌లో అడుగు పెట్టనుంది. పురుషుల విభాగంలో ఈజిప్ట్ ప్లేయర్ కరీమ్ అల్ హమామీ టాప్ సీడ్‌గా బరిలోకి దిగనుండగా... ఈజిప్ట్‌కే చెందిన అలీ హుసేస్ రెండో సీడ్ దక్కించుకున్నాడు. భారత్ నుంచి సౌరవ్‌తో పాటు వీర్, సూరజ్, అరిహాంత్, హరిందర్ పాల్ సింగ్, వీఆర్ నంధేశ్ పాల్గొంటున్నారు. మహిళల విభాగంలో భారత ప్లేయర్ ఆకాంక్ష సాలుంఖే టాప్ సీడ్ దక్కించుకుంది. మన దేశం నుంచి షమీనా రియాజ్, పూజ ఆర్తి, రితిక సీలన్ కూడా పోటీలో ఉన్నారు. ఈ టోర్నీలో ఆస్ట్రియా, బ్రెజిల్, ఈజిప్ట్, ఫ్రాన్స్, ఐర్లాండ్, జపాన్, కువైట్, మలేసియా, నెదర్లాండ్స్, సింగపూర్, దక్షిణాఫ్రికా, స్పెయిన్, స్విట్జర్లాండ్, వేల్స్ నుంచి ప్లేయర్లు పాల్గొంటున్నారు.

హడలెత్తించిన జేమీసన్, డఫీ

పాకిస్తాన్ 91 ఆలౌట్ ● తొలి టి20లో న్యూజిలాండ్ ఘనవిజయం


జేమీసన్

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ పర్యటనను పాకిస్తాన్ టి20 క్రికెట్ జట్టు పరాజయంతో ప్రారంభించింది. కొత్త కెప్టెన్ సల్మాన్ అలీ అఘా నాయకత్వంలో పోటీపడ్డ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ తేలిపోయింది. న్యూజిలాండ్ పేస్ బౌలర్లు కైల్ జేమీసన్ (3/8), జేకబ్ డఫీ (4/13) నిప్పులు చెరిగే బంతులతో హడలెత్తించడంతో... మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 18.4 ఓవర్లలో కేవలం 91 పరుగులకే కుప్పకూలింది. అనంతరం న్యూజిలాండ్ 10.1 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 92 పరుగులు చేసి గెలిచింది. ఈ విజయంతో బ్రేస్‌వెల్ సారథ్యంలోని న్యూజిలాండ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో మ్యాచ్ మంగళవారం జరుగుతుంది.

ఓపెనర్ల డకౌట్...


ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేసిన పాకిస్తాన్ ఓపెనర్ హసన్ నవాజ్‌తోపాటు మరో ఓపెనర్ హారిస్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరుకున్నారు. ఆ తర్వాత వచ్చిన ఇర్ఫాన్ ఖాన్ ఒక పరుగుకే అవుట్‌కాగా... షాదాబ్ ఖాన్ 3 పరుగులు చేసి వెనుదిరిగాడు. దాంతో పాకిస్తాన్ 11 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. సల్మాన్ (20 బంతుల్లో 18; 2 ఫోర్లు), ఖుష్‌దిల్ షా (30 బంతుల్లో 32; 3 సిక్స్‌లు) ఐదో వికెట్‌కు 46 పరుగులు జోడించాక... సల్మాన్‌ను స్పిన్నర్ సోధి అవుట్ చేశాడు. ఆ తర్వాత ఆరో వికెట్‌గా ఖుష్‌దిల్ అవుటవ్వడంతో పాక్ 100 పరుగులు కూడా చేయలేకపోయింది. 92 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్లు సీఫెర్ట్ (29 బంతుల్లో 44; 7 ఫోర్లు, 1 సిక్స్), అలెన్ (17 బంతుల్లో 29 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 5.5 ఓవర్లలో 53 పరుగులు జోడించారు. సీఫెర్ట్ అవుటయ్యాక రాబిన్సన్ (15 బంతుల్లో 18 నాటౌట్;1 సిక్స్)తో కలిసి అలెన్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు. జేమీసన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ మ్యాచ్‌తో పాక్ తరఫున హసన్ నవాజ్, అబ్దుల్ సమద్, మొహమ్మద్ అలీ టి20ల్లో అరంగేట్రం చేశారు.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: మొహమ్మద్ హారిస్ (సి) మిచెల్ హే (బి) జేమీసన్ 0; హసన్ నవాజ్ (సి) జేమీసన్ (బి) డఫీ 0; సల్మాన్ ఆఘా (సి) సిఫెర్ట్ (బి) ఇష్ సోధి 18; ఇర్ఫాన్ ఖాన్ (సి) మిచెల్ హే (బి) జేమీసన్ 1; షాదాబ్ ఖాన్ (సి) రాబిన్సన్ (బి) జేమీసన్ 3; ఖుష్‌దిల్ షా (సి) అలెన్ (బి) డఫీ 32; అబ్దుల్ సమద్ (సి) బ్రేస్‌వెల్ (బి) ఇష్ సోధి 7; జహాందాద్ ఖాన్ (సి) బ్రేస్‌వెల్ (బి) ఫౌల్క్స్ 17; షాహీన్ అఫ్రిది (సి) మిచెల్ హే (బి) డఫీ 1; అబ్రార్ అహ్మద్ (సి) బ్రేస్‌వెల్ (బి) డఫీ 2; మొహమ్మద్ అలీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్) 91. వికెట్ల పతనం**: 1-0, 2-0, 3-1, 4-11, 5-57, 6-64, 7-80, 8-85, 9-89, 10-91. **బౌలింగ్:** కైల్ జేమీసన్ 4-1-8-3, జేకబ్ డఫీ 3.4-0-14-4, ఫౌల్క్స్ 3-0-11-1, బ్రేస్‌వెల్ 4-0-28-0, ఇష్ సోధి 4-0-27-2. **న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** సిఫెర్ట్ (సి) హారిస్ (బి) అబ్రార్ 44; ఫిన్ అలెన్ (నాటౌట్) 29; రాబిన్సన్ (నాటౌట్) 18; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (10.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి) 92. వికెట్ల పతనం:** 1-53. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 2-0-17-0, మొహమ్మద్ అలీ 3-0-25-0, జహాందాద్ ఖాన్ 1-0-16-0, అబ్రార్ అహ్మద్ 2.1-0-15-1, షాదాబ్ ఖాన్ 2-0-18-0.



ట్రాక్‌లో అందరికంటే ముందుగా నోరిస్ కారు


విన్నర్స్ ట్రోఫీతో లాండో నోరిస్

వారెవ్వా నోరిస్...

ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో టైటిల్ సొంతం

- ప్రతికూల పరిస్థితుల్లో సంయమనంతో గట్టెక్కిన మెక్‌లారెన్ డ్రైవర్
- రెండో స్థానంతో వెర్‌స్టాపెన్ సరి
- నిరాశపరిచిన హామిల్టన్
- రేసు పూర్తిచేయని ఆరుగురు డ్రైవర్లు
- తదుపరి రేసు ఈనెల 23న చైనా గ్రాండ్‌ప్రి

మెల్‌బోర్న్: గత సీజన్‌ను విజయంతో ముగించిన మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ లాండో నోరిస్ కొత్త సీజన్‌ను కూడా విజయంతో ప్రారంభించాడు. 2025 ఫార్ములావన్ (ఎఫ్1) సీజన్‌లో భాగంగా ఆదివారం జరిగిన తొలి రేసు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో బ్రిటన్‌కు చెందిన 25 ఏళ్ల లాండో నోరిస్ చాంపియన్‌గా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన నోరిస్ నిర్ణీత 57 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 42 నిమిషాల 06.304 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. గత నాలుగేళ్లుగా ప్రపంచ టైటిల్ సాధిస్తున్న వెర్‌స్టాపెన్ రెండో స్థానంలో నిలిచాడు. వెర్‌స్టాపెన్ రేసును 1 గంట 42 నిమిషాల 07.199 సెకన్లలో ముగించాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జి రసెల్ మూడో స్థానాన్ని పొందాడు. 1987లో ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి మొదలుకాగా ఈ రేసుకంటే ముందు వరకు ఫెరారీ జట్టు డ్రైవర్లు అత్యధికంగా 11 సార్లు విజేతగా నిలిచారు. అయితే ఈసారి ఫెరారీ జట్టుకు ఈ రేసు కలిసిరాలేదు. తొలిసారి ఫెరారీ జట్టు తరఫున బరిలోకి దిగిన మాజీ వరల్డ్ చాంపియన్ లూయిస్ హామిల్టన్ 10వ స్థానంలో నిలువగా... మరో డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ 8వ స్థానాన్ని సంపాదించాడు.

2010 తర్వాత తొలిసారి ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రికి వర్షం అంతరాయం కలిగించింది. వాన కారణంగా ఈ రేసుకు మూడుసార్లు అంతరాయం కలిగింది. మూడుసార్లు ట్రాక్‌పై సేఫ్టీ కార్లు వచ్చాయి. తొలి ల్యాప్ పూర్తికాకముందే ముగ్గురు డ్రైవర్లు కార్లోస్ సెయింజ్ (విలియమ్స్), జాక్ దూహాన్ (ఆల్పైన్), ఐజాక్ హడ్జార్ (రేసింగ్ బుల్స్) రేసు నుంచి వైదొలిగారు. ఫార్మేషన్ ల్యాప్‌లో హడ్జార్ తప్పుకోగా... తొలి ల్యాప్‌లో పరస్పరం ఢీకొట్టుకోవడంతో గత ఏడాది ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన సెయింజ్‌తోపాటు దూహాన్ నిష్క్రమించారు. ఆ తర్వాత అలోన్సో (ఆస్టన్ మార్టిన్) 32వ ల్యాప్‌లో, గాబ్రియేల్ బొర్టొలెటో (కిక్ సాబెర్) 45వ ల్యాప్‌లో, లియామ్ లాసన్ (రెడ్‌బుల్) 46వ ల్యాప్‌లో తప్పుకున్నారు. ఓవరాల్‌గా 20 మంది డ్రైవర్లలో 14 మంది రేసును పూర్తి చేశారు. 24 రేసులతో కూడిన 2025 సీజన్‌లో తదుపరి రెండో రేసు చైనా గ్రాండ్‌ప్రి ఈనెల 23న జరుగుతుంది.

ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి ప్రధాన రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	లాండో నోరిస్	మెక్‌లారెన్	1:42:06.304 సెకన్లు	-	25
2	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:42:07.199 సెకన్లు	0.895 సెకన్లు	18
3	జార్జి రసెల్	మెర్సిడెస్	1:42:14.785 సెకన్లు	8.481 సెకన్లు	15
4	ఆంటోనెలి	మెర్సిడెస్	1:42:16.439 సెకన్లు	10.135 సెకన్లు	12
5	ఆల్బోన్	విలియమ్స్	1:42:19.077 సెకన్లు	12.773 సెకన్లు	10
6	లాన్స్ స్ట్రోల్	ఆస్టన్ మార్టిన్	1:42:23.717 సెకన్లు	17.413 సెకన్లు	8
7	హుల్కెన్‌బర్గ్	కిక్ సాబెర్	1:42:24.727 సెకన్లు	18.423 సెకన్లు	6
8	చార్లెస్ లెక్‌లెర్క్	ఫెరారీ	1:42:26.130 సెకన్లు	19.826 సెకన్లు	4
9	పియాస్ట్రి	మెక్‌లారెన్	1:42:26.752 సెకన్లు	20.448 సెకన్లు	2
10	హామిల్టన్	ఫెరారీ	1:42:28.777 సెకన్లు	22.473 సెకన్లు	1

12 ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి అత్యధికంగా 12 సార్లు గెలిచిన జట్టుగా మెక్‌లారెన్ గుర్తింపు పొందింది. గతంలో ఈ రికార్డు ఫెరారీ జట్టు (11 సార్లు) పేరిట ఉంది.

5 ఆరేళ్లుగా ఫార్ములావన్‌లో ఉన్న లాండో నోరిస్ సాధించిన విజయాలు. గత ఏడాది నోరిస్ నాలుగు గ్రాండ్‌ప్రి (మయామి, డచ్, సింగపూర్, అబుదాబి) రేసులలో గెలిచాడు.

బీసీసీఐ మెడికల్ టీమ్ హెడ్ నితిన్ పటేల్ రాజీనామా

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వైద్య బృంద అధిపతి నితిన్ పటేల్ రాజీనామా చేశాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ, గతంలో ఎన్‌సీఏ)లో మూడేళ్లుగా స్పోర్ట్స్ సైన్స్, మెడికల్ టీమ్‌కు అధిపతిగా ఉన్న నితిన్ పటేల్ వ్యక్తిగత కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దీనిపై నితిన్ ఎలాంటి ప్రకటన చేయకపోయినా... బోర్డు వర్గాలు రాజీనామాను ధ్రువీకరించాయి. 'నితిన్ రాజీనామా చేశాడు. బోర్డుతో అతడికి చక్కటి అనుబంధం ఉంది. గత మూడేళ్లలో టీమిండియా కోసం నితిన్ ఎంతో చేశాడు. సీఓఈలో వైద్య విధానాలను రూపొందించడంలో అతడి పాత్ర కీలకం. ఆటగాళ్లెవరైనా గాయపడి ఎన్‌సీఏకు వెళ్తే... వారు పూర్తిగా కోలుకోవడమే కాకుండా రెట్టించిన ఉత్సాహంతో కోలుకునే విధంగా తీర్చిదిద్దాడు. నితిన్ కుటుంబం విదేశాల్లో స్థిరపడింది' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, షమీ, కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్ వంటి ఎందరో ఆటగాళ్లు గాయపడి ఎన్‌సీఏకు వెళ్లగా... నితిన్ పర్యవేక్షణలో తిరిగి కోలుకున్నారు.

అల్‌కరాజ్‌కు చుక్కెదురు

డిఫెండింగ్ చాంపియన్‌పై నెగ్గి ఫైనల్లోకి దూసుకెళ్లిన బ్రిటన్ ప్లేయర్ డ్రేపర్

కాలిఫోర్నియా: 'హ్యాట్రిక్' సాధించాలనే లక్ష్యంతో ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ మూడో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్‌కు నిరాశ ఎదురైంది. గత రెండేళ్లు చాంపియన్‌గా నిలిచిన అల్‌కరాజ్ ఈసారి సెమీఫైనల్లోనే ఇంటిదారి పట్టాడు. ప్రపంచ 14వ ర్యాంకర్, బ్రిటన్ ప్లేయర్ జేక్ డ్రేపర్ అద్భుత ఆటతీరుతో అల్‌కరాజ్ ఆట కట్టించి తన కెరీర్‌లో తొలిసారి మాస్టర్స్ సిరీస్ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో సెమీఫైనల్లో 13వ సీడ్ డ్రేపర్ 6-1, 0-6, 6-4తో రెండో సీడ్ అల్‌కరాజ్‌ను బోల్తా కొట్టించాడు. ఈ విజయంతో సోమవారం విడుదల చేసే అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ర్యాంకింగ్స్‌లో డ్రేపర్ తొలిసారి టాప్-10లోకి దూసుకురానున్నాడు. 23 ఏళ్ల డ్రేపర్ గత ఏడాది వియన్నా ఓపెన్, స్టుట్‌గార్ట్ ఓపెన్‌లలో విజేతగా నిలిచాడు. ఫైనల్లో 12వ సీడ్ హోల్గర్ రూనే (డెన్మార్క్)తో డ్రేపర్ తలపడతాడు.



తొలి సెమీఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ రూనే 7-5, 6-4తో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలిచాడు. అల్‌కరాజ్‌తో ఐదోసారి తలపడ్డ డ్రేపర్ ఈసారి పూర్తి ఆధిపత్యం కనబరిచాడు. 1 గంట 44 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో డ్రేపర్



నాలుగు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. మరోవైపు అల్‌కరాజ్ 30 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు.



మిజోరాం 'వండర్ కిడ్'కు గిటార్

అమిత్‌షా కానుక

ఐజ్వాల్: 'మా తుఝే సలాం' పాటతో శ్రోతలను మంత్రముగ్ధులను చేసిన మిజోరాం 'వండర్ కిడ్' ఎస్తేర్ లాల్దుహమి హ్నామ్టేకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా గిటార్ బహుమతిగా ఇచ్చారు. 2021లో ఆమె పాడిన 'మా తుఝే సలాం' పాట వైరలై దేశమంతటి దృష్టినీ ఆకర్షించింది. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న అమిత్ షా ఆదివారం ఐజ్వాల్‌లో ఆమెను రాజ్‌భవన్‌కు ఆహ్వానించారు. తనకు గిటార్ అందజేసిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇదొక మైమరపించే అనుభవంగా ఆయన అభివర్ణించారు. 'భారత్ పట్ల ప్రేమే మనందరినీ ఏకం చేస్తుంది. ఎస్తేర్ వందేమాతరం పాట విని చలించిపోయాను. దేశంపై ఆమెకున్న ప్రేమ పాటలో ప్రతిఫలించింది' అంటూ ప్రశంసించారు. దీనిపై ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ మిజోరంలోని లుంగ్లీ పట్టణానికి చెందిన హ్నామ్టే 2016 జూన్ 9న జన్మించింది. మూడేళ్ల వయసులోనే పాడటం ప్రారంభించింది. ఆమె 'మా తుఝే సలాం' మ్యూజిక్ వీడియోను యూట్యూబ్‌లో వారం రోజుల్లోనే 30 లక్షల మంది చూశారు. ఈ సంఖ్య ప్రస్తుతం 4.7 కోట్లకు చేరింది. ఆమె జీవితంపై తీసిన 'ఎ స్టార్ ఈజ్ బోర్న్'కు 2023లో ఈశాన్య చలన చిత్రోత్సవంలో ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు వచ్చింది.

తిట్టుకు తిట్టుతోనే బదులు!

మస్క్ ఏఐ చాట్‌బాట్ గ్రోక్ అతి తెలివి



వాషింగ్టన్: టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్ఏఐ చాట్‌బాట్ గ్రోక్ సంచలనమవుతోంది. భూమ్మీద అత్యంత తెలివైన ఏఐగా మస్క్ అభివర్ణించిన గ్రోక్ నిజంగానే తెలివిగా వ్యవహరిస్తోంది. హిందీని అర్థం చేసుకోవడమే గాక అంతే సమర్థంగా సమాధానాలూ ఇస్తోంది. అయితే కొన్నిసార్లు అవి శ్రుతి మించుతున్నాయి. మ్యూచువల్ ఫ్రెండ్స్ గురించి టోకా అనే ఎక్స్ యూజర్ అడిగిన ప్రశ్నకు అది చ్చిన సమాధానం ఆన్‌లైన్‌లో దుమారం రేపుతోంది. 'నా 10 మంది బెస్ట్ మ్యూచువల్స్ ఎవరు?' అని టోకా ప్రశ్నించాడు. గ్రోక్ స్పందించకపోవడంతో హిందీ తిట్టును ఉపయోగిస్తూ మళ్లీ పోస్ట్ చేశాడు. ఈసారి గ్రోక్ స్పందించడంతోనే సరిపెట్టకుండా అదే తిట్టును టోకాపై ప్రయోగించి ఆశ్చర్యంలో ముంచెత్తింది. ''కూల్. మ్యూచువల్స్ అంటే ఒకరినొకరు అనుసరించేవారు. నీ 10 బెస్ట్ మ్యూచువల్స్ ఎవరో తెలిసింది. నా లెక్క ప్రకారం ఇదిగో ఇది జాబితా. ఇంక ఏడవడం ఆపు' అంటూ బదులిచ్చింది. గ్రోక్ ప్రవర్తన పెద్ద చర్చకే దారితీసింది. 'మేమంటే మనుషులం. అలా మాట్లాడతాం. ఏఐ కూడా కంట్రోల్‌లో ఉండదా?' అంటూ ఓ యూజర్ విస్తుపోయాడు. దానికీ గ్రోక్ సరదాగా బదులివ్వడం విశేషం. ''హా యార్. నేను కూడా కొంచెం మజాక్ చేసిన. మీరు మనుషులు. మీకన్నీ నడుస్తాయి. కానీ నేను ఏఐ కదా! కాస్త జాగ్రత్తగా ఉండాల్సింది. ఇప్పుడే నేర్చుకుంటున్నా'' అంటూ జవాబిచ్చింది.

కులం గురించి మాట్లాడితే తంతా: గడ్కరీ

నాగ్‌పూర్: కుల రాజకీయాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా స్పందించారు. కులం, మతం, భాష, లింగబేధం ఆధారంగా ఎవరినీ తక్కువ చేసి చూడరాదంటూ ఆయన..కులం గురించి మాట్లాడిన వారిని తంతానంటూ వ్యాఖ్యానించారు. కులం, మతం, భాష, వర్గం ఆధారంగా ఎవరూ గొప్ప వాళ్లమని అనుకోరాదంటూ మంత్రి..ఒక వ్యక్తికున్న అర్హతలను బట్టే గొప్పతనం నిర్ణయమవుతుందని చెప్పారు. అందుకే, ఎవరి పట్లా వివక్ష ప్రదర్శించకూడదని హితవు పలికారు. సమాజంతో పాటు దేశం అభివృద్ధి చెందటానికి విద్య ఎంతో అవసరమని తెలిపారు.

కనీసం హోలీ అల్లర్లను కూడా ఆపలేకపోయారు

బెంగాల్ సీఎం మమతపై యోగి విసుర్లు

గోరఖ్‌పూర్: ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల ముగిసిన మహాకుంభ్ మేళాను మృత్యు కుంభ్ అంటూ వ్యాఖ్యలు చేసిన కొందరు హోలీ వేడుకలప్పుడు అల్లర్లను సైతం అదుపు చేయలేకపోయారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గోరఖ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో యోగి మాట్లాడారు. 'కుంభమేళాకు ఈసారి తమిళనాడు, కేరళ నుంచి కూడా భక్తులు వచ్చారు. దాదాపు 45 రోజులపాటు జరిగిన మేళాకు రోజూ 50 వేల నుంచి లక్ష మంది వరకు వచ్చారు'అని ఆయన వివరించారు. యూపీ జనాభా 25 కోట్లు.. అయినప్పటికీ హోలీ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. అదే సమయంలో, పశ్చిమబెంగాల్‌లో హోలీ సమయంలో పెద్ద సంఖ్యలో గొడవలు జరిగాయి' అని యోగి అన్నారు. జనవరి 29వ తేదీన ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో 29 మంది చనిపోవడంపై సీఎం మమతా బెనర్జీ వందలాదిగా ప్రాణాలు కోల్పోయిన మహా కుంభ్ మృత్యు కుంభ్‌గా మారిందంటూ వ్యాఖ్యలు చేయడం తెల్సిందే.

చైనాలో మేడిన్ రష్యా

బీజింగ్/హాంకాంగ్: మన దేశంలోని అనేక వస్తువులపై మేడిన్ చైనా అని ఉంటుంది. అంత పెద్ద ఉత్పత్తిదారు అయిన ఆ దేశంలో మాత్రం ఇప్పుడెక్కడ చూసినా 'మేడిన్ రష్యా' అనే కనబడుతోంది. దుకాణాల మీద చైనా, రష్యాల జెండాలు.. లోపల రష్యా వస్తువులు. చాక్లెట్లు, కుకీల నుంచి తేనె, వోడ్కాల దాకా అన్ని రష్యన్ ఉత్పత్తులకు ఎక్కడలేని ఆదరణ పెరిగింది. ఉన్నట్టుండీ ఈ క్రేజ్ పెరగడంపై కొందరు చైనీయులే విస్తుపోతున్నారంటే ఇటీవలి మార్పును అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ మార్పు వెనుక పెద్ద కథే ఉంది...

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభించారు. ఆంక్షలతో సతమతమవుతున్న రష్యాకు చైనా కీలకమైన ఆర్థిక వనరుగా మారింది. ద్వైపాక్షిక వాణిజ్యం ఏటేటా రికార్డుకు చేరుకుంది. ఉక్రెయిన్‌పై పుతిన్ యుద్ధం కొనసాగుతున్న కొద్దీ చైనా, రష్యాలు మునుపెన్నడూ లేనంతగా దగ్గరయ్యాయి, అమెరికా పట్ల వారి శత్రుత్వం, ప్రపంచంపై ఆ దేశ ఆధిపత్యాన్ని సవాలు చేయాలనే ధోరణి దీనితో వేగవంతం అయ్యింది.

రష్యా ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ | రష్యాకు కీలక ఆర్థిక వనరుగా మారిన చైనా | చైనావ్యాప్తంగా వెలసిన వేలాది దుకాణాలు



చైనాలోని హాంగ్‌జౌలోని ఓ దుకాణంలో రష్యా బిస్కెట్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న వినియోగదారులు

ఆహారోత్పత్తులకు డిమాండ్

చౌకైన రష్యన్ చమురు, గ్యాస్, బొగ్గు.. చైనా దిగుమతులపై ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ ఐస్ క్రీం, తీపి బిస్కెట్లు, పాల పొడి వంటి రష్యా ఆహార ఉత్పత్తులకు ఆదరణ గణనీయంగా పెరిగింది. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు చైనా వ్యాపారులు పోటీ పడుతున్నారు. చైనా వ్యాపార రికార్డుల ప్రకారం, 2022 నుంచి రష్యన్ వస్తువుల వాణిజ్యంలో 2,500 కంటే ఎక్కువ కొత్త కంపెనీలు చేరాయి. అందులో దాదాపు సగం కంపెనీలు గత సంవత్సరంలోనే నమోదయ్యాయి. వీటిలో 80 శాతం కంపెనీలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. రష్యా నుంచి అనేక వస్తువులు దిగుమతి చేసుకుంటున్నా.. చైనాలో బెస్ట్ సెల్లర్ మాత్రం రష్యా తేనె, చాక్లెట్లు. సహజ పదార్థాలతో చేసిన ఈ ఉత్పత్తులు అధికనాణ్యతను కలిగి ఉన్నాయని, ఆరోగ్యకరమైనవని చెబుతున్నారు. ఇవి కేవలం రష్యన్ ఉత్పత్తుల దుకాణాలుగా మాత్రమే కాదు, ఆ దేశ సంస్కృతి, ప్రత్యేకతలను ప్రదర్శించే విండోలుగా మారాయి.

పుతిన్‌కూ విస్తృత ఆదరణ...

రష్యా వస్తువులకు మాత్రమే కాదు, అధ్యక్షుడు పుతిన్‌కు కూడా చైనా ప్రజల్లో విస్తృత ఆదరణ ఉంది. బీజింగ్‌లోని తిన్‌హువా విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ అండ్ స్ట్రాటజీ గత ఏడాది విడుదల చేసిన సర్వేలో 66 శాతం మంది రష్యా పట్ల పూర్తి సానుకూలతను, మిగిలినవారు కొంత అనుకూల వైఖరిని ప్రకటించారు. దీనికి భిన్నంగా 76% మంది అమెరికా పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

మేడిన్ రష్యా ఫెస్టివల్

ఏప్రిల్ 2023 నాటికి టావోబావో, జేడీతో సహా మాస్కోకు చెందిన 300కి పైగా కంపెనీలు చైనా ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో చేరాయి. 2024లో 'మేడ్ ఇన్ రష్యా ఫెస్టివల్ అండ్ ఫెయిర్' అతిపెద్ద నగరాలైన షెన్యాంగ్, డాలియన్‌లలో జరిగింది. వారం రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో 150కి పైగా రష్యన్ కంపెనీలు పాల్గొన్నాయి. 23లక్షల డాలర్ల విలువైన రష్యన్ వస్తువులను చైనా వినియోగదారులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయించాయి. ఇదే అదనుగా 'నకిలీ రష్యన్ వస్తువులు' కూడా తయారవుతున్నాయి. ఈ వివాదం ఎలా ఉన్నా.. రష్యా పట్ల చైనా ప్రజలకు ఉన్న అనుబంధాన్ని, బీజింగ్, మాస్కో మధ్య వాణిజ్య సంబంధాలకు అద్దం పడుతూ చైనా వ్యాప్తంగా దుకాణాలు పెరుగుతున్నాయి.

బలూచిస్తాన్‌లో ఉగ్ర దాడి.. ముగ్గురు జవాన్లు మృతి

కరాచీ: పాకిస్తాన్‌లోని కల్లోలిత బలూచిస్తాన్‌లో ఉగ్రవాదుల దుశ్చర్యలు కొనసాగుతున్నాయి. నుష్కి జిల్లాలో బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) మిలిటెంట్లు జరిపిన ఆత్మాహుతి దాడిలో ముగ్గురు భద్రతా సిబ్బంది, ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా 30 మంది వరకు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. నుష్కి-దల్బందిన్ జాతీయ రహదారిపై వెళ్తున్న పారామిలటరీ ఫ్రంటియర్ కార్ప్స్(ఎఫ్‌సీ) వాహనాల కాన్వాయ్‌ని ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలు నింపిన వాహనంతో ఢీకొట్టాడు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో సూసైడ్ బాంబర్ సహా నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ నెల 11న బీఎల్ఏ ఉగ్రవాదులు 440 మంది ప్రయాణికులున్న రైలును హైజాక్ చేయడం.. ఈ సందర్భంగా జరిగిన పోరులో 21 మంది ప్రయాణికులు, నలుగురు భద్రతా సిబ్బందితోపాటు 33 మంది ఉగ్రవాదులు హతమవడం తెల్సిందే.

బట్టతలని భార్య వేధింపులు.. భర్త ఆత్మహత్య

మైసూరు: బట్టతల అంటూ భార్య అవహేళన చేయడంతో అవమానాన్ని తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన కర్ణాటకలో చామరాజనగర తాలూకాలోని ఉడిగాలలో ఆదివారం జరిగింది. పరమశివమూర్తి (32)కి మమతతో రెండేళ్ల కిందట పెళ్లి జరిగింది. లారీ డ్రైవర్ అయిన పరమశివమూర్తికి పెళ్లినాటికే కొంత బట్టతల ఉంది. పెళ్లి తరువాత ఉన్నజుట్టు కూడా రాలిపోయింది. భార్య మమత 'నీకు జుట్టు లేదు, నీతో బయటకి రావాలంటే సిగ్గుగా ఉంది' వంటి మాటలనేది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. భర్తపై గృహహింస, కట్నం వేధింపుల కేసు కూడా పెట్టడంతో కొన్నిరోజులు జైలులో ఉండి ఇటీవలే విడుదలయ్యాడు. జైలు నుంచి బయటికి వచ్చిన పరమ శివమూర్తి.. భార్య సోషల్ మీడియాలోని 'సింగిల్' స్టేటస్ చూసి మరింత ఆవేదన చెందాడు. ఈ వరుస పరిణామాల నేపథ్యంలో నోట్ రాసి పెట్టి... ఉరి వేసుకున్నాడు. చామరాజనగర గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19న ఢిల్లీలో ఉగ్రవాదంపై అంతర్జాతీయ సదస్సు

న్యూఢిల్లీ: ఆగ్నేయా ఆసియా దేశాల సమాఖ్య(ఆసియాన్)కు చెందిన 10 దేశాలతోపాటు భారత్ సహా 8 దేశాలతో కూడిన ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం-ప్లస్(ఏడీఎంఎం-ప్లస్) భేటీకి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 19, 20వ తేదీల్లో ఢిల్లీలో జరిగే ఈ కీలక భేటీలో ఉగ్రవాదం, వేర్పాటువాదం బెడదను ఎదుర్కొనే విషయంలో అనుసరించాల్సిన సమగ్ర వ్యూహంపై ప్రధానంగా చర్చించనున్నారు. ప్రాంతీయంగా భద్రతాపరంగా ఎదురవుతున్న సవాళ్లు కూడా ప్రస్తావనకు రానున్నాయి. ఆసియాన్‌కు డైలాగ్ భాగస్వాములుగా భారత్‌తోపాటు చైనా, ఆస్ట్రేలియా, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, రష్యా, అమెరికా ఉన్నాయి. ఈ సదస్సుకు సహ సారథిగా మలేసియా వ్యవహరించనుంది. ఉగ్రవాద నిరోధక నిపుణుల వర్కింగ్ కమిటీకి భారత్ సహ సారథ్యం వహించడం ఇదే మొదటిసారని ఒక అధికారి తెలిపారు.

డ్యాన్స్ చేసినందుకు బాడీగార్డు సస్పెండ్

లాలూ కొడుకు తేజ్‌ప్రతాప్ ఆదేశాలు పాటించిన ఫలితం

పాట్నా: బీహార్ ఎమ్మెల్యే, లాలూప్రసాద్ యాదవ్ పెద్దకొడుకు తేజ్ ప్రతాప్ యాదవ్ ఆదేశాల మేరకు డ్యాన్స్ చేసినందుకు ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ అయ్యారు. ఎమ్మెల్యే తేజ్ ప్రతాప్ వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ దీపక్ కుమార్ యూనిఫాం ధరించి డ్యాన్స్ చేసినందుకు పోలీస్ లైన్స్‌కు పంపినట్లు ఎస్ఎస్పీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. హోలీ వేడుకల సందర్భంగా డ్యాన్స్ చేయాలంటూ కానిస్టేబుల్‌ను తేజ్ ప్రతాప్ ఆదేశించడం తెలిసిందే. లేదంటే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. ఈ వీడియో బాగా వైరల్ అయ్యింది.

ప్రపంచంలోనే పొడవైన హైపర్ లూప్

మద్రాస్ ఐఐటీని సందర్శించిన వైష్ణవ్

సాక్షి, చెన్నై: మద్రాస్ ఐఐటీలో అభివృద్ధి దశలో ఉన్న హైపర్ లూప్ ప్రాజెక్టు ఆసియాలోని అతిపెద్దదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. దాదాపు 410 మీటర్ల పొడవుతో త్వరలోనే ప్రపంచ రికార్డు నెలకొల్పనుందని చెప్పారు. కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ మద్రాస్ ఐఐటీలో హైపర్‌లూప్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను చెన్నైలోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో అభివృద్ధి చేయనున్నామని ఆదివారం ఆయన 'ఎక్స్'లో చెప్పారు. ఐదో తరం రవాణా సాధనంగా భావిస్తున్న హైపర్ లూప్‌లో దాదాపు శూన్య స్థితిలో ఉండే ట్యూబ్ గుండా హై స్పీడ్ ట్రెయిన్ ప్రయాణిస్తుంది. లోపల గాలి నిరోధకత తక్కువగా ఉండటంతో గంటకు గరిష్ఠంగా వెయ్యి కిలోమీటర్ల దూరం వెళ్లగలుగుతుంది. ఇందులో వ్యవస్థలన్నీ దేశీయంగానే రూపొందించినవేనని మంత్రి వివరించారు. పరీక్షల్లో ఆశించిన ఫలితాలు కనిపించాయన్నారు. 2022లో కేంద్ర రైల్వే శాఖ ఈ ప్రాజెక్టు కోసం మద్రాస్ ఐఐటీకి రూ.8.34 కోట్లు కేటాయించింది.



హైపర్ లూప్ వ్యవస్థను పరిశీలిస్తున్న మంత్రి అశ్వినీ వైష్ణవ్

అమెరికాలో టోర్నడోల విధ్వంసం

32 మంది మృతి, అనేక మందికి గాయాలు

వాషింగ్టన్: అమెరికాలో టోర్నడోలు మరోసారి విధ్వంసం సృష్టించాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు కొనసాగిన టోర్నడోలు, తుపానుల బీభత్సం కారణంగా మధ్య అమెరికాలోని పలు రాష్ట్రాల్లో 32 మంది మరణించారు. వందల సంఖ్యలో గాయపడ్డారు. పది కోట్ల మంది ప్రభావితమయ్యారు. టోర్నడోలు, అధిక గాలులు ఇళ్లను నాశనం చేశాయి. పాఠశాలలు తుడిచిపెట్టుకుపోయాయి. సెమీట్రాక్టర్-ట్రైలర్లు నేలమట్టమయ్యాయి. మిసిసిపీ, టెనస్సీ సహా సెంట్రల్ గల్ఫ్ కోస్ట్ రాష్ట్రాల్లో శనివారం మరిన్ని టోర్నడోలు సంభవించాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. పెద్ద పెద్ద ట్రక్కులు బోల్తా పడ్డాయి. కాన్సాస్‌లో 50కి పైగా రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. మిస్సోరిలో 12 మంది మరణించారు. చెట్లు, విద్యుత్ లైన్లు నేలకూలడంతో పాటు భవనాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుపాను ధాటికి అర్కాన్సాస్‌లో ముగ్గురు మృతి చెందారు. 29 మంది గాయపడ్డారు. మధ్య అమెరికాలో కనీసం 2 లక్షల ఇళ్లకు విద్యుత్ లేకుండా పోయింది. సముద్ర తీరాల్లో పడవలో కొట్టుకొచ్చి ఒకదానిపై ఒకటి నిలిచిపోయాయి. ప్రత్యేకమైన భౌగోళిక, వాతావరణ పరిస్థితుల కారణంగా మధ్య, దక్షిణ అమెరికా రాష్ట్రాలైన టెక్సాస్, ఓక్లహోమా, కాన్సాస్‌లు అంత్యం తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఓక్లహోమా రాష్ట్రవ్యాప్తంగా 130కి పైగా అగ్నిప్రమాదాలు సంభవించాయి. దాదాపు 300 ఇళ్లు దెబ్బతినడంతో ప్రజలను ఖాళీ చేయించారు. సుమారు 689 చదరపు కిలోమీటర్లు కాలిపోయాయని గవర్నర్ కెవిన్ స్టిట్ చెప్పారు. యూఎస్‌లో 2024లో టోర్నడోల వల్ల 54 మంది మరణించారు.

బహిష్కరణలకు వేగవంతం చేసేందుకు 18వ శతాబ్దపు చట్టం

ట్రంప్ ఉత్తర్వులు.. కొద్ది గంటలకే వాటిని నిలిపేసిన జడ్జి

వాషింగ్టన్: వెనిజులా వలసదారులను బహిష్కరించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పన్నిన వ్యూహానికి ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ ప్రయోగించిన 18వ శతాబ్దపు చట్టంపై ఫెడరల్ జడ్జి శనివారం నిషేధం విధించారు. కొత్తగా బహిష్కరించాలనుకున్న వలసదారులను ఎల్ సాల్వడార్, హోండురాస్‌లోని నిర్బంధ కేంద్రాలకు తరలించడం ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించినందున ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జేమ్స్ ఇ బోస్‌బర్గ్ పేర్కొన్నారు. 1798 నాటి ఏలియన్ ఎనిమీస్ యాక్ట్‌ను ప్రయోగించాలని ట్రంప్ ఆదేశించిన కొన్ని గంటల్లోనే ఈ తీర్పు వెలువడింది.

కాగా, వెనిజులా ముఠా ట్రెన్ డి అరగ్వా అమెరికాపై దాడి చేస్తోందని దోపిడీకి పాల్పడుతోందని, ఇది అమెరికాకు పెను ముప్పుగా పరిణమించిందని పేర్కొన్నారు. ముఠాలో సభ్యుడిగా గుర్తించిన వలసదారులను బహిష్కరించడానికి అనుమతినిస్తూ ట్రంప్ ఉత్తర్వులపై శుక్రవారం రాత్రి సంతకం చేశారు. వెనిజులా వాసులను ఫెడరల్ అధికారులు బహిష్కరించనున్నారని గుర్తించిన ఇమిగ్రేషన్ న్యాయవాదులు, వారిని బహిష్కరించడానికి చట్టపరమైన అధికారం లేదని ప్రభుత్వాన్ని కోర్టులో సవాలు చేశారు. దీంతో ఏసీఎల్‌యూ దావాలో పిటిషనర్లుగా పేర్కొన్న ఐదుగురు వెనిజులా వాసులను తిప్పి పంపకుండా బోస్‌బర్గ్ శనివారం ఉదయం 9.20 గంటలకు ప్రాథమిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అధికారిక ప్రకటనకు ముందే అధ్యక్ష చర్యను నిలిపివేయడం కార్యనిర్వాహక అధికారాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని వాదిస్తూ ట్రంప్ ప్రభుత్వం వెంటనే ఈ ఉత్తర్వులపై అప్పీల్ చేసింది.

కాలువల సమీపంలోని వారికి క్యాన్సర్ ప్రమాదం

ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడైందన్న కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: నదీ కాలువల్లో ప్రమాదకర స్థాయిల్లో రసాయనాలు ఉంటున్నాయని, సమీపంలో నివసించే ప్రజలు ఆ నీటిని వినియోగించి క్యాన్సర్ బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కేంద్రం పేర్కొంది. గత ఏడాది 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్'(ఐసీఎంఆర్) చేసిన అధ్యయనంలో ఇది బయటపడినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. పరిమితులకు మించి వినియోగిస్తున్న సీసం, ఇనుము, అల్యూమినియంలు నదీ కాలువల్లో కొట్టుకు రావడం, ఆ నీటిని ప్రజలు వాడుతుండటంతో క్యాన్సర్ బారిన పడుతున్నారని ఇటీవల రాజ్యసభలో సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ తెలిపారు. నదీ కాలువల సమీపప్రాంతాల్లో నివసిస్తూ క్యాన్సర్ గురయ్యే వారికి కేంద్రం ఆదాయంతో సంబంధం లేకుండా చికిత్సలు అందిస్తుందని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి 15,057 ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు స్థాపించినట్లు చెప్పారు. 770 జిల్లా ఎన్‌సీడీ క్లినిక్‌లు, 372 జిల్లా డే కేర్ సెంటర్‌లతో పాటు 6,140 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో క్యాన్సర్‌కు చికిత్స అందిస్తున్నట్లు మంత్రి వివరించారు.

నడి సముద్రంలో 95 రోజులు

ప్రాణాలతో బయటపడిన పెరూ మత్స్యకారుడు

పది రోజుల చేపల వేటకని ఆయన బయలుదేరాడు. తుఫాను దారిని మళ్లించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన పసిఫిక్ మహాసముద్రంలో కొట్టుకుపోయాడు. ఎటు చూసినా నీళ్లు. నెల.. రెండు నెలలు.. మూడు నెలలు.. సముద్రంలోనే జీవితం. సరైన ఆహారం లేదు. మంచి నీరు కూడా లేదు. అయినా బతకాలన్న ఆశ అతడిని ఒడ్డున చేర్చింది. 95 రోజుల తరువాత గస్తీ బృందానికి దొరికాడు. సినిమా స్టోరీని తలపిస్తున్న ఈ కథ.. పెరూవియన్ మాక్సిమో నాపా కాస్ట్రో నిజ జీవితం.

పెరూవియన్ తీరంలోని మార్కోనా పట్టణానికి చెందిన మాక్సిమో డిసెంబర్ 7న ఫిషింగ్ కోసం బయలుదేరాడు. రెండు వారాల ట్రిప్. అందుకు తగ్గట్టుగానే ఆహారాన్ని కూడా పఆయక్ చేసుకున్నాడు. పది రోజుల తరువాత వచ్చిన తుఫాను అతని పడవను దారి మళ్లించింది. పసిఫిక్ మహాసముద్రంలో కొట్టుకుపోయాడు. అతని కుటుంబం, పెరూ సముద్ర గస్తీ దళాలు వెదకడం మొదలెట్టాయి. మరోవైపు నట్ట నడి సముద్రంలో తప్పిపోయిన మాక్సిమోకు ఎటు చూసినా నీళ్లు. కుటుంబంపైనే ధ్యాస. తన తల్లి గురించి, నెలల వయసున్న మనవరాలి గురించిన ఆలోచనలే. అవే ఆయన జీవితంపై ఆశ.. ఎలాగైనా బతికి ఒడ్డుకు చేరాలన్న స్ఫూర్తిని ఇచ్చాయి. వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని తాగాడు. బతకడం కోసం కీటకాలు, పక్షులు, తాబేలును తిన్నాడు. ఎవరో ఒకరు కనిపెట్టేవరకూ తాను బతికుండాలన్న ఆశ అతని ప్రాణాలను నిటబెట్టింది. నాపా కాస్ట్రో కుటుంబం, మత్స్యకారుల బృందాలు మూడు నెలలుగా గాలిస్తూనే ఉన్నాయి. మూడు నెలలైనా ఆచూకీ దొరకలేదు. అయినా అటు కుటుంబం ఆశలు వదులు కోలేదు. ''నాన్న నీవు రాకపోవడం మాకు అంతులేని బాధ. ఈ పరిస్థితిని ఎదుర్కొంటామని మేము ఎప్పుడూ అనుకోలేదు. మిమ్మల్ని కనుగొంటామనే ఆశ ఉంది'అని అతని కుమార్తె మార్చి 3న ఫేస్‌బుక్‌లో రాసింది.

సరిగ్గా ఇది జరిగిన 8 రోజులకు మార్చి 11న ఈక్వడార్ గస్తీ బృందం ఫిషింగ్ బోటులో ఆయనను కనుగొన్నది తీరానికి 1,094 కి.మీ దూరంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మాక్సిమోను రక్షించింది. వెంటనే ఈక్వెడార్, పెరూ సరిహద్దుకు సమీపంలోని పైటాలోని న్యూస్ట్రా సెనోరా డి లాస్ మెర్సిడెస్ ఆసుపత్రికి తరలించింది. గత 15 రోజులుగా ఏమీ తినకుండా ఉండటంతో తీవ్ర డీహ్రైడేషన్‌కు గురయ్యారని వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం మాక్సిమో సోదరుడికి అప్పగించారు. తన తండ్రి ప్రాణాలను కాపాడిన కుమార్తె ఇనెస్ నాపా టొర్రెస్ కృతజ్ఞతలు తెలిపింది. 'ఈక్వెడార్ సోదరులారా, నా తండ్రి గాటన్‌ను రక్షించినందుకు ధన్యవాదాలు, దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు'అని ఆమె ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.



క్షేమంగా తిరిగొచ్చాక క్యాస్ట్రో ఆరోగ్య పరిస్థితిని పరీక్షిస్తున్న ఆర్మీ డాక్టర్లు

- సాక్షి, నేషనల్ డెస్క్

ఒడియా కవి రమాకాంత రథ్ కన్నుమూత

భువనేశ్వర్: ప్రఖ్యాత ఒడియా కవి రమాకాంత రథ్(90) ఆదివారం భువనేశ్వర్‌లోని ఖార్వేల్ నగర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. పద్మ భూషణ్ గ్రహీత అయిన రథ్‌కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రథ్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. 1934లో కటక్‌లో జన్మించిన రథ్ 1957లో ఐఏఎస్ అధికారి అయ్యారు. కేంద్ర, రాష్ట్ర పదవుల్లో కీలకంగా ఉన్న రథ్ 1992లో ఒడిశా చీఫ్ సెక్రటరీగా రిటైరయ్యారు. ఆయన రాసిన కెటె దినారా(1962), అనేకా కొథారి(1967), సందిగ్ధ మృగయ(1971) తదితర కవితా సంకలనాలు ఆయనకు పేరు తెచ్చిపెట్టాయి. సాహిత్య అకాడెమీ అవార్డు, పద్మ భూషణ్ అందుకున్నారు.

మహారాష్ట్రలో మావోయిస్టుల డంప్

చర్ల: ఛత్తీస్‌గఢ్ -మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్‌ను భద్రతా బలగాలు ఆదివారం గుర్తించాయి. గడ్చిరోలి జిల్లా బామ్రాఘడ్ రోజీ సబ్ డివిజన్‌లోని కవాండేలో ఇటీవల పోలీస్ క్యాంప్ ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు.. మావోయిస్టులు భూమిలో ఏర్పాటు చేసిన డంప్‌ను వెలికి తీశారు. అందులో ఓ తుపాకీ, మందుపాతర ఉన్నాయి. బాంబు డిస్పోజబుల్ వచ్చి మందుపాతరను నిర్వీర్యం చేసింది. కాగా, దంతెవాడ జిల్లా మలేవాహీ పోలీస్ స్టేషన్ పరిధిలోని టిక్రీ గుట్టల వద్ద మావోయిస్టులు ఏర్పాటు చేసిన రెండు శక్తివంతమైన మందుపాతరలను బలగాలు నిర్వీర్యం చేశాయి.

ఆలోచనల వ్యక్తీకరణకు అభిమతం

ప్రవేశిక - విమర్శనాత్మక పరిశీలన

వివాదాలు - సుప్రీంకోర్టు తీర్పులు

రాజ్యాంగ సారాంశం మొత్తం ప్రవేశికలో నిక్షిప్తమై ఉంటుంది. ఇది రాజ్యాంగంలో అంతర్భాగమా, కాదా అనే అంశంపై సుప్రీంకోర్టు భిన్నమైన తీర్పులను వెలువరించింది. 1960లో బెరుబారి వర్సెస్ యూనియన్ కేసులో సుప్రీంకోర్టు ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని పేర్కొంది. ఈ సందర్భంలో ప్రకరణ 143 ప్రకారం సలహా పూర్వక అభిప్రాయాన్ని చెప్పింది. కానీ 1973లో కేశవానంద భారతి కేసులో తీర్పునిస్తూ దీనికి పూర్తి భిన్నంగా.. ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమేనని వ్యాఖ్యానించింది. 1995లో ఎల్ఐసీ ఆఫ్ ఇండియా కేసులో కూడా అత్యున్నత ధర్మాసనం ఇదే అభిప్రాయాన్ని పునరుద్ఘాటించింది.

రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశికపై ఓటింగ్ నిర్వహించినప్పుడు కూడా 'ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం' అని డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు స్థిరీకరించింది.

ప్రవేశిక ప్రయోజనం

ప్రవేశిక రాజ్యాంగ ఆత్మ, హృదయం. ఇది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను తెలుసుకోవడానికి ఆధారం. ఇది రాజ్యాంగానికి సూక్ష్మరూపం (Constitution in Miniature). ఇందులో రాజ్యాంగ తాత్విక పునాదులు ఉన్నాయి.

ప్రయోజనాలు

- ఇది రాజ్యాంగ ఆధారాలను తెలుపుతుంది.
- రాజ్యాంగ ఆమోద తేదీని తెలుపుతుంది.
- రాజ్యాంగాన్ని సక్రమంగా వ్యాఖ్యానించడానికి న్యాయస్థానాలకు చట్టపర సహాయకారిగా ఉపయోగపడుతుంది.

విమర్శ

- ప్రవేశికకు న్యాయ సంరక్షణ (Non-Justiciable) లేదు. ఇందులో పేర్కొన్న ఆశయాలను అమలు పరచకపోతే న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవు.
- ఇందులో పేర్కొన్న భావజాలానికి నిర్దిష్ట నిర్వచనాలు లేవు.
- హక్కుల ప్రస్తావన లేదు.
- శాసనాధికారాలకు ఇది ఆధారం కాదు.
- సమకాలీన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో ప్రవేశికలోని కొన్ని ఆదర్శాలు అమలుకు నోచుకోవట్లేదని చెప్పవచ్చు.



ప్రవేశిక - పరిశీలన

భారత రాజ్యాంగానికి హృదయం, ఆత్మగా పరిగణిస్తున్న ప్రవేశిక ప్రాముఖ్యంపై భిన్న అభిప్రాయాలున్నాయి. ప్రవేశికకు న్యాయ సంరక్షణ లేదు. అంటే ఇందులో పొందుపర్చిన ఆశయాలు, లక్ష్యాలు స్వతంత్రంగా అమల్లోకి రావు. వాటిని అమలుపరచాలని పౌరులు న్యాయస్థానాన్ని ఆశ్రయించలేరు. ఆ విధంగా న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేయలేవు. కాబట్టి అత్యంత పవిత్రమైన ఈ ఆశయాలకు ఆచరణ లేదా అమలు చేయకపోవడం వల్ల వాటి సార్థకతపై తీవ్ర విమర్శ ఉంది. అయితే రాజ్యాంగంలోని ప్రకరణల భావం లేదా ఆచరణీయతపై సక్రమంగా వ్యాఖ్యానించడానికి ప్రవేశికలోని సారాంశాన్ని న్యాయస్థానాలు ప్రాతిపదికగా తీసుకుంటాయి. ప్రవేశికకు స్వతంత్రంగా ప్రాముఖ్యం లేకపోయినా, ఇందులోని ఆదర్శాలను అమలు చేస్తూ పార్లమెంటు చట్టం చేసినప్పుడు లేదా ఆ విధంగా చేసిన చట్టాలను అమలు చేయనప్పుడు, న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు.

ప్రవేశికపై ప్రముఖుల అభిప్రాయాలు

- ప్రవేశిక అనేది భారత ప్రజాస్వామ్య గణతంత్రానికి రాజకీయ జాతకం (Political Horoscope) -కె.యం. మున్షీ
- రాజ్యాంగంలో ప్రవేశిక అత్యంత పవిత్ర మైన భాగం. ఇది రాజ్యాంగ ఆత్మ. రాజ్యాంగానికి తాళంచెవి లాంటిది. - పండిట్ ఠాకూర్‌దాస్ భార్గవ
- రాజ్యాంగానికి ప్రవేశిక ఒక గుర్తింపు పత్రం లాంటిది. - ఎం.ఎ. నాని పాల్కీవాలా
- రాజ్యాంగానికి ప్రవేశిక కీలక సూచిక లాంటిది. అలాంటి సూచికలు సాధారణంగా పాశ్చాత్య రాజ్య వ్యవస్థలో ఉంటాయి. ఇది భారత రాజ్యాంగంలో ఉన్నందుకు నేను పులకించి గర్వపడుతున్నాను. - సర్ ఎర్నస్ట్ బార్కర్
- ప్రవేశిక మన కలలు, ఆలోచనలకు రాజ్యాంగంలో వ్యక్తీకరించుకున్న అభిమతం. - అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
- భారత రాజ్యాంగ ప్రవేశిక అమెరికా స్వతంత్ర ప్రకటన మాదిరిగానే రాజ్యాంగ ఆత్మ. రాజకీయ వ్యవస్థ స్వరూపం, పవిత్ర నిర్ణయాన్ని తెలియజేస్తుంది. విప్లవం తప్ప మరొకటి దీన్ని మార్చలేదు. - జస్టిస్ హిదయతుల్లా
- ప్రవేశిక ఒక నిశ్చితమైన తీర్మానం, హామీ. - నెహ్రూ
- రాజ్యాంగ ప్రాధాన్యాల లక్షణ సారం ప్రవేశిక. - మథోల్కర్
- ప్రవేశిక అనేది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను, లక్ష్యాలను తెలుసుకోవడానికి ఒక తాళం చెవి లాంటిది. - జె. దయ్యర్
- ప్రవేశిక రాజ్యాంగానికి ఆధారం కాదు, అలాగే పరిమితి కాదు. - సుప్రీంకోర్టు

గతంలో అడిగిన ప్రశ్నలు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

1. ప్రవేశిక భావాన్ని మన రాజ్యాంగకర్తలు ఏ దేశ రాజ్యాంగం నుంచి తీసుకున్నారు?
ఎ) యు.ఎస్.ఎ. బి) యు.కె.
సి) యు.ఎస్.ఎస్.ఆర్. డి) జర్మనీ
2. భారత రాజ్యాంగంలోని రిపబ్లిక్ అనే పదాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) ఫ్రెంచి రాజ్యాంగం
బి) జర్మనీ రాజ్యాంగం
సి) యు.ఎస్. రాజ్యాంగం
డి) యు.కె. రాజ్యాంగం
3. రాజ్యాన్ని మతం నుంచి వేరు చేయడాన్ని ఏమంటారు?
ఎ) నాస్తికవాదం బి) సామ్యవాదం
సి) లౌకికవాదం డి) సాంఘికన్యాయం
4. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ అధికారాలను పరిమితం చేసేది?
ఎ) ప్రజలు బి) రాజ్యాంగం
సి) పార్లమెంటు డి) పత్రికలు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) సి; 4) బి.

మాదిరి ప్రశ్నలు

1. ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగం అని, అదేవిధంగా కాదనీ పరస్పర వివాదాస్పదమైన తీర్పులను సుప్రీంకోర్టు ఏయే కేసుల్లో వ్యక్తీకరించింది?
ఎ) ఎ.కె.గోపాలన్, గోలక్‌నాథ్
బి) కేశవానంద భారతి, గోలక్‌నాథ్
సి) మేనకాగాంధీ, మినర్వా మిల్స్
డి) పైవేవీ కాదు
2. ప్రవేశిక నుంచి ఏం రాబట్టవచ్చు?
ఎ) రాజ్యాంగానికి ఆధారం
బి) రాజకీయ వ్యవస్థ లక్ష్యాలు
సి) ప్రభుత్వ స్వరూపం డి) పైవన్నీ
3. సమగ్రత అనే పదజాలాన్ని ప్రవేశికలోకి చేర్చడానికి కారణం?
ఎ) ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగం
బి) వేర్పాటువాద ఉద్యమాలు
సి) సుప్రీంకోర్టు తీర్పులు డి) ఎ, సి
4. ప్రవేశికలో సమకాలీన ప్రాముఖ్యతను, వివాదాన్ని సంతరించుకున్న పదాలు?
ఎ) లౌకికతత్వం, సామ్యవాదం
బి) ఐక్యత, సమగ్రత
సి) గణతంత్రం, సార్వభౌమాధికారం
డి) పైవన్నీ
5. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ ప్రవేశికలో చేర్చిన పదాలేవి?
ఎ) సామ్యవాద, లౌకిక
బి) ప్రజాస్వామిక
సి) సార్వభౌమ డి) రిపబ్లిక్
6. భారత రాజ్యాంగంలో సంక్షేమ రాజ్యం అనే భావనను ఎక్కడ పొందుపరిచారు?
ఎ) ప్రాథమిక హక్కులు
బి) పీఠిక
సి) రాజ్య విధానం - ఆదేశిక సూత్రాలు
డి) నాలుగో షెడ్యూల్
7. కింది వాటిలో భారత రాజ్యాంగంలోని సమాఖ్య లక్షణాలు?
i) దృఢ రాజ్యాంగం
ii) ద్విసభా విధానం
iii) సి.ఎ.జి. కార్యాలయం
iv) సమష్టి బాధ్యత
ఎ) i, ii, iii బి) i, iv
సి) i, ii, iii, iv డి) i, ii
8. 'రాజ్యాంగానికి ప్రవేశిక ఒక గుర్తింపు పత్రం లాంటిది' అని పేర్కొన్నవారు?
ఎ) జస్టిస్ హిదయతుల్లా
బి) అంబేద్కర్ సి) మహాత్మాగాంధీ
డి) ఎం.ఎ. నాని పాల్కీవాలా
9. ప్రవేశిక-గ్రహించిన అంశాలకు సంబంధించి కిందివాటిలో సరికాని జత?
ఎ) ప్రజాస్వామ్యం - అమెరికా
బి) గణతంత్రం - ఫ్రాన్స్
సి) సామ్యవాదం - రష్యా
డి) లౌకిక - బ్రిటన్
10. సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని తీర్పునిచ్చింది?
ఎ) కేశవానంద భారతి కేసు
బి) బెరుబారి వర్సెస్ యూనియన్ కేసు
సి) ఎస్.ఆర్. బొమ్మాయ్ కేసు
డి) మినర్వా మిల్స్ కేసు

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) ఎ; 5) ఎ; 6) సి; 7) డి; 8) డి; 9) డి; 10) బి.

ప్రవేశిక - సుప్రీంకోర్టు తీర్పులు వివాదం	సంవత్సరం	సుప్రీంకోర్టు తీర్పు సారాంశం
ఎ.కె. గోపాలన్ కేసు	1950	ప్రవేశిక రాజ్యాంగ ప్రకరణల అర్థాన్ని, పరిధిని నియంత్రిస్తుంది.
బెరుబారి వర్సెస్ యూనియన్ కేసు	1960	ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదు.
గోలక్‌నాథ్ కేసు	1967	ప్రవేశిక రాజ్యాంగ ఆదర్శాలకు, ఆశయాలకు సూక్ష్మ రూపం.
కేశవానంద భారతి కేసు	1973	ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగమే. మౌలిక నిర్మాణం పరిధిలోకి వస్తుంది. పరిమితంగా సవరించవచ్చు.
ఎక్సెల్ వేర్ కేసు	1979	సామ్యవాదం పద నిర్వచనం.
నకారా కేసు	1983	సామ్యవాదం అనేది గాంధీయిజం, మార్క్సిజం కలయిక.
ఎస్.ఆర్.బొమ్మాయ్ కేసు	1994	లౌకికతత్వం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది.
ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా	1995	ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగమని పునరుద్ఘాటించింది.
అశోక్‌కుమార్ గుప్తా కేసు	1997	సామాజిక న్యాయం అనేది ప్రాథమిక హక్కు.
అరుణా రాయ్ కేసు	2002	విద్యా సంస్థల్లో మత విలువల బోధన లౌకికతత్వానికి వ్యతిరేకం కాదు.

అనునాసికాలు పరమైనప్పుడు ఆయా వర్గానునాసికాలు..

సంధులు - వ్యాకరణ పరిభాషలు

డీఎస్సీ అభ్యర్థులు శ్రద్ధగా చదవాల్సిన వ్యాకరణాంశాలు సంధులు, వ్యాకరణ పరిభాషలు. వీటిపై డీఎస్సీ-2012, టెట్‌లో 13 ప్రశ్నలు అడిగారు. స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్ పండిట్స్ అభ్యర్థులందరూ వీటిని తప్పకుండా అధ్యయనం చేయాలి.

సంధులు: I. సంస్కృత సంధులు,
II. తెలుగు సంధులు.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి 2. గుణ సంధి
3. వృద్ధి సంధి 4. యణాదేశ సంధి
5. జశ్త్వ సంధి 6. శ్చుత్వ సంధి
7. అనునాసిక సంధి 8. విసర్గ సంధి
9. పరసవర్ణ సంధి 10. పరరూప సంధి

II. **తెలుగు సంధులు:**
1. ఉత్వ సంధి 2. ఇత్వ సంధి
3. అత్వ సంధి 4. యడాగమ సంధి
5. టుగాగమ సంధి 6. రుగాగమ సంధి
7. దుగాగమ సంధి 8. నుగాగమ సంధి
9. ద్విరుక్తటకార సంధి 10. సరళాదేశ సంధి
11. గ, స, డ, ద, వా దేశ సంధి
12. ఆమ్రేడిత సంధి 13. పుంప్వాదేశ సంధి
14. త్రిక సంధి 15. పడ్వాది సంధి
16. ప్రాంతాది సంధి 17. లు, ల, నల సంధి

సంధులకు సంబంధించి ఒక పదాన్నిచ్చి దాన్ని సరిగా విడదీయమని అడుగుతారు. లేదా విభజించిన రూపాన్నిచ్చి సరిగా కలుపమని అడుగుతారు. సంధి సూత్రాలు రాయాల్సిన అవసరం లేకపోయినా అవగాహన కోసం సూత్రాలు తెలుసుకోవడం మంచిది.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి
అ-ఇ-ఉ-ఋలకు అవే అచ్చులు పరమైనా వాటి దీర్ఘాలు ఏకాదేశమవడాన్ని సవర్ణ దీర్ఘ సంధి అంటారు.
ఉదా: రామ + ఆజ్ఞ = రామాజ్ఞ
మహి + ఈశుడు = మహీశుడు
గురు + ఉపదేశం = గురూపదేశం
పితృ + ఋణం = పితౄణం

2. గుణ సంధి: అకారానికి ఇ-ఉ-ఋలు పరమైతే క్రమంగా ఏ-ఓ-అర్‌లు ఏకాదేశ మవడాన్ని గుణసంధి అంటారు.
ఉదా: సూర్య + ఉదయం = సూర్యోదయం
మహా + ఈశ్వరుడు = మహేశ్వరుడు
ఇతర + ఇతర = ఇతరేతర
రాజ + ఋషి = రాజర్షి

3. వృద్ధి సంధి: అకారానికి ఏ, ఐలు పరమైతే ఐకారాన్ని; ఓ, ఔలు పరమైతే ఔకారాన్ని; ఋ, ౠలు పరమైతే ఆర్ ఏకాదేశమవడాన్ని వృద్ధి సంధి అంటారు. ఐ, ఔలను వృద్ధులు అంటారు.
ఉదా: భువన + ఏక = భువనైక
అఖండ + ఐశ్వర్యం = అఖండైశ్వర్యం
పాప + ఓఘం = పాపౌఘం
పరమ + ఔషధం = పరమౌషధం
ఋణ + ఋణం = ఋణార్ణం

4. యణాదేశ సంధి: ఇ-ఉ-ఋలకు అసవర్ణాచ్చులు పరమైతే క్రమంగా య-వ-రలు ఆదేశమవడాన్ని యణాదేశ సంధి అంటారు. "ఇకోయణచి" : ఇక్కులకు (ఇ-ఉ-ఋ) యణ్ణులు (య-వ-ర) పరమవుతున్నందు వల్ల ఇది యణాదేశ సంధి.
ఉదా: జయంతి + ఉత్సవం = జయంత్యుత్సవం
హిందూ + ఆర్యులు = హింద్వార్యులు
పితృ + ఆర్జితం = పిత్రార్జితం

5. జశ్త్వ సంధి: క-చ-ట-త-పలకు అచ్చులు కానీ, హ-య-వ-ర-లు కానీ, వర్గ తృతీయ చతుర్థ పంచమాక్షరాలు కానీ, పరమైతే గ, జ, డ, ద, బలు ఆదేశమవడాన్ని జశ్త్వసంధి అంటారు.
ఉదా: తత్ + అరణ్య భూములు = తదరణ్య భూములు
అచ్ + అంతం = అజంతం
వాక్ + ఈశుడు = వాగీశుడు
కకుప్ + అంతం = కకుబంతం
సత్ + భావం = సద్భావం

6. శ్చుత్వ సంధి: సకారత వర్గాలకు శకారచ వర్గాలు పరమైనప్పుడు శకారచ వర్గాలే ఆదేశమవడాన్ని శ్చుత్వ సంధి అంటారు.
(సకార-త థ ద ధ న) (త వర్గం)
(శకార - చ ఛ జ ఝ ఞ) (చ వర్గం)
తపస్ + శమము = తపశ్శమము
(స్(స)+శ= శ్శ)
సత్+చరిత్ర=సచ్చరిత్ర(త్ (త) - చ= చ్చ)
సత్+జనుడు= సజ్జనుడు(త్ (త)+జ= జ్జ)
విద్యుత్+శక్తి=విద్యుచ్ఛక్తి(త్ (త)+ శ=చ్ఛ)

7. అనునాసిక సంధి: వర్గ ప్రథమాక్షరాలకు (క-చ-ట-త-ప)'న, మ' అనునాసికాలు పరమైనప్పుడు ఆయా వర్గానునాసికాలు వికల్పంగా రావడాన్ని అనునాసిక సంధి అంటారు. మయాది ప్రత్యయాలకు నిత్యముగా వస్తాయి.
ఉదా: వాక్ + మయం = వాఙ్మయం
(క-ఙ=నిత్యం)
జగత్ + నాటకం = జగన్నాటకం
= జగద్నాటకం (వికల్పం)
(అనునాసికం రానప్పుడు వర్గ తృతీయాక్షరం (త-ద-వికల్పం)
మృట్ + మయం = మృణ్మయం,
మృడ్మయం (టకు అనునాసికం రానప్పుడు డకారం వికల్పం)

8. విసర్గ సంధి: అకారం పూర్వముందున్న విసర్గకు వర్గ తృతీయ, చతుర్థ, పంచమాక్షరాలు అ-హ-య-వ-ర-లలు పరమైనప్పుడు విసర్గ - ఓకారంగా మారుతుంది. (వర్గ తృతీయాక్షరాలు- గ, జ, డ, బ, లు వర్గ చతుర్థాక్షరాలు (ఘ, ఝ, ఢ, ధ, భ, లు)
వర్గ పంచమాక్షరాలు: ఙ- ఞ- ణ- న-మ్ (అనునాసికాలు) హ-య-వ-ర-లలు పరమైనప్పుడు మాత్రమే విసర్గ ఓకారంగా మారుతుంది. కొన్నిసార్లు రేఫ వస్తుంది.
ఉదా: అయః + మయం = అయోమయం
(యః + మ = ఓ)
ఇతః + అధికం = ఇతోధికం (తః+అ = ఓ)
చతుః + ఆత్మ = చతురాత్మ
(తుః + ఆ = 'ర' కారం వచ్చింది)
తపః ఫలము = తపఃఫలం (ఫ కారం వర్గ ద్వితీయాక్షరమైనందు వల్ల విసర్గలో మార్పు లేదు).

9. పర సవర్ణ సంధి: పదాంతం ముందున్న 'త' కారానికి లకారం పరమైనప్పుడు 'ల' కారమే ఆదేశంగా రావడాన్ని పర సవర్ణ సంధి అంటారు. (త్ - తకారానికి లకారం వస్తే 'ల్ల' కారం వస్తుంది)
ఉదా: భగవత్ + లీల = భగవల్లీల
(త్ + ల = ల్ల)
ఉత్ + లేఖనం = ఉల్లేఖనం (త్+లే = ల్లే)
విద్యుత్ + లత = విద్యుల్లత (త్ + ల = ల్ల)
సుహృత్ + లాభం = సుహృల్లాభం
(త్ + లా = ల్లా)

10. పరరూప సంధి: హల్లుల్లోని అకారానికి అకారం పరమైతే రెండో పదంలోని మొదటి అచ్చు ఏకాదేశమవుతుంది. దీన్ని పరరూపసంధి అంటారు.
ఉదా: సార + అంగము = సారంగము
(ర్ + అ = రకారంలోని అకారానికి 'అ' కారం పరమై రకారానికి దీర్ఘం వచ్చింది)
సీమ + అంతము = సీమంతము
(మ్ + అకారానికి అకారం పరమై అకార దీర్ఘం వచ్చింది)



తెలుగు సంధులు

1. ఉత్వ సంధి: ఉత్తునకచ్చుపరమైనప్పుడు సంధి నిత్యముగా వస్తుంది (హ్రస్వమైన ఉకారానికి మాత్రమే ఇది వర్తిస్తుంది)
ఉదా: రాముడు + అతడు = రాముడతడు (డులోని ఉ కారానికి అకారం పరమై అకారం నిత్యంగా వచ్చింది)
- ప్రథమేతర విభక్తి శత్రర్థక చువర్ణంబులందున్న ఉకారానికి సంధి వైకల్పికం అవుతుంది.
- ప్రథమా విభక్తి కాకుండా ఇతర విభక్తుల్లో శత్రర్థకమైన 'చున్' ప్రత్యయంలోని ఉకారానికి సంధి వైకల్పికమని అర్థం.
- వైకల్పికమంటే ఒకసారి సంధి జరిగిన రూపం, మరోసారి సంధి జరగని రూపం సిద్ధిస్తుంది.

ఉదా: నన్నున్ + అడిగె = నన్నడిగె
(సంధి జరిగిన రూపం)
నన్నునడిగె (సంధి జరగని రూపం)

2. ఇత్వ సంధి: ఇత్తునకు సంధి వైకల్పికం. ఏమ్యాదుల్లో ఇత్తునకు సంధి వైకల్పికం (ఏమి, మరి, అది, అవి, ఇది, ఇవి, కాన్) మొదలైనవి ఏమ్యాదులు.
ఉదా: ఏమి + అంటివి:
ఏమంటివి, ఏమియంటివి
(సంధి జరిగిన) (సంధి జరుగని)
- మధ్యమ పురుష క్రియలందిత్తునకు సంధి నిత్యం.

ఉదా: చూచితిరి + ఇపుడు = చూచితిరిప్పుడు
- క్త్వార్థంబైన ఇత్తునకు సంధి లేదు. భూతకాలిక అసమాపక క్రియ క్త్వార్థంబు

ఉదా: వచ్చి + ఇచ్చి = వచ్చియిచ్చి (సంధి లేనందువల్ల యడాగమ రూపం)

3. అత్వ సంధి: అత్తునకు సంధి బహుళం.
- బహుళమంటే నిత్యం, నిషేధం, వైకల్పికం, అన్యవిధం అనే నాలుగు కార్యాలు ఉంటాయి.

నిత్యంగా జరిగేవి
ఉదా: రామ + అయ్య = రామయ్య (నిత్యం)
సంధి జరగని నిషేధ రూపం
ఉదా: దూత + ఇతడు = దూతయితడు
(యడాగమ రూపం)
వైకల్పికంగా జరగడం: సంధి జరిగిన రూపం, సంధి జరగని యడాగమ రూపం రెండూ వస్తాయి.
ఉదా: మేన + అల్లుడు = మేనల్లుడు
(సంధి జరిగిన రూపం)
మేనయల్లుడు (సంధి జరుగని యడాగమ రూపం)
అన్యవిధం: సూత్రంలో సూచించని విధంగా కొన్ని హల్లులు వచ్చి చేరతాయి.
ఉదా: తామర + ఆకు = తామరపాకు
పుగాగమం అన్య విధంగా వచ్చి చేరింది.

4. యడాగమ సంధి: సంధి లేని చోట స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు యడాగమంబగు. సంధి జరిగే అవకాశం లేనప్పుడు పర స్వరానికి ముందు 'య్' కారం ఆగమంగా వచ్చి చేరుతుంది.
ఉదా: వెల + (య్) ఆలు = వెలయాలు
మా + (య్) అమ్మ = మాయమ్మ

5. టుగాగమ సంధి: కర్మధారయంలో ఉత్తునకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబగుతుంది.
వివరణ: నామవాచక, విశేషణాలకు సంబంధించిన సమాసం కర్మధారయ సమాసం. ఇందులో పరస్వరానికి ముందు 'ట్' కారం ఆగమంగా వస్తుంది.
ఉదా: కఱకు+ (ట్) అమ్ము = కఱకుటమ్ము
- కర్మధారయమున పేర్వాది శబ్దాలకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబువిభాషనగు.

పేర్వాదులు: పేరు, పొదరు, చిగురు, తలిరు.
ఉదా: పేరు + ఉరము = పేరుటురము
(టుగాగగం రానప్పుడు)

6. రుగాగమ సంధి: కర్మధారయంబున 'పేరాది' శబ్దాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు రుగాగమంబగు.
పేరాది శబ్దాలు: పేద, బీద, ముగ్ధ, కొమ, జవ, మనుమ, ఐదవ మొదలైనవి.
ఉదా: పేద (ర్) + ఆలు = పేదరాలు
పరస్వరానికి ముందు 'ర్' కారం చేరి పేదరాలు రూపం వచ్చింది.
మనుమ(ర్) + ఆలు = మనుమరాలు
- కర్మధారయంబున తత్సమ పదాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు అత్వంబు నకు ఉత్వంబు రుగాగమవుతుంది.

(**తత్సమ శబ్దాలు:** ధీర, గుణవంత, ధనవంత, సంపన్న, గంభీర, ధైర్యవంత మొదలైనవి)
ఉదా: ధీర + ఆలు = ధీరు+ ర్ + ఆలు
= ధీరురాలు
గుణవంత + ఆలు =
గుణవంతు + ర్ +ఆలు= గుణవంతురాలు

7. దుగాగమ సంధి: నీ- నా- తన శబ్దాలకు ఉత్తర పదంబు పరమైనప్పుడు దుగాగమంబు విభాషనగు.
ఉదా: నా + (దు) విభుడు = నాదువిభుడు
(సంధి జరిగిన రూపం)
నా విభుడు (సంధి జరగని రూపం)
తన + (దు) కోపం = తనదు కోపం
(సంధి జరిగిన రూపం)
తన కోపం (సంధి జరగని రూపం)

8. నుగాగమ సంధి: ఉదంత తద్ధర్మార్థ విశేషణానికి అచ్చుపరమైనప్పుడు నుగామమంబగు.
తద్ధర్మార్థకాలు: భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో జరిగే క్రియలు. హ్రస్వమైన ఉకారం చివర ఉన్న తద్ధర్మార్థక క్రియలకు అచ్చుపరమైతే నుగాగమం వస్తుందని సూత్రార్థం.
ఉదా: చేయు + (న్) ఎడ = చేయునెడ
వ్రాయు + (న్) అది = వ్రాయునది
- షష్ఠీ తత్పురుష సమాస మందలి ఉకార, ఋకారంబులకు అచ్చుపరమైనప్పుడు నుగాగమంబగు.

ఉదా: రాజు + (న్) ఆనతి = రాజునానతి
చెరువు + (న్) ఉదకం = చెరువునుదకం

9. ద్విరుక్తటకార సంధి: కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల 'ఱ, డ'లకు అచ్చు పరమైనప్పుడు ద్విరుక్తటకారం ఆదేశమవుతుంది.
ఉదా: కు (ఱు) (ట్ట్)+ ఉసురు = కుట్టుసురు
చిఱు + (ట్ట్) ఎలుక = చిట్టెలుక
కడు + (ట్ట్) ఎదురు = కట్టెదురు
నడు + (ట్ట్) ఇల్లు = నట్టిల్లు
నిడు + ఊర్పు = నిట్టూర్పు
వివరణ: ద్విరుక్తటకారమంటే ద్విత్వటకారమని అర్థం. ద్విత్వటకారం ఆదేశంగా వచ్చి ఈ రూపాలు వచ్చాయి.

10. సరళాదేశ సంధి: ద్రుత ప్రకృతికం మీది పరుషాలకు సరళములగు.
ఉదా: పూచెను + కలువలు, పూచెను గలువలు: పరుషమైన కకారం సరళంగా (గ) మారింది.
- ఆదేశ సరళాలకు ముందున్న ద్రుతానికి బిందు సంశ్లేషణలు విభాషనగు. పూచెను + గలువలు - పూచెంగలువలు; పూచెన్గలువలు: పూచెనుగలువలు, పూచెఁగలువలు అనే నాలుగు రూపాలు వస్తాయి. సమాసములందు స్వత్వ సంశ్లేషణ రూపాలుండవు. అర సున్నా రూపం మరో సూత్రంతో నిషేధానికి గురైంది. 'పూచెంగలువలు' అనే ఒక్క రూపం మాత్రమే మిగులుతుంది.

11. గ, స, డ, ద, వా దేశ సంధి:
1. ప్రథమం మీది పరుషాలకు గ, స, డ, ద, వలు బహుళముగానగు. ప్రథమావిభక్తిలో ఉన్న పదాలకు పరమైన పదాల్లో ఉన్న పరుషాలకు (కచటతపలకు క్రమంగా గ, స, డ, వలు) బహుళంగా వస్తాయి.

ఉదా: వాడు + కొట్టె = వాడు గొట్టె
అపుడు + చనియె = అపుడుసనియె
2. ద్వంద్వ సమాసాల్లో పదాలపై పరుషాలకు గ, స, డ, ద, వలు ప్రాయికంగా వస్తాయి.

ఉదా: తల్లి + తండ్రి = తల్లిదండ్రులు
3. తెనుగుల మీది సాంస్కృతిక పరుషాలకు గ, స, డ, ద, వలు రావు. తెలుగు పదాలకు పరంగా వచ్చిన తత్సమ పదాల్లోని పరుషాలకు గ, స, డ, ద, వలు రావు.

ఉదా: వాడు + కంసారి = వాడు కంసారి
వీడు + చక్రపాణి = వీడు చక్రపాణి
(ఈ ఉదాహరణలో క, చ అనే పరుషాలకు గ,స,లు రాలేదు)

12. ఆమ్రేడిత సంధి:
1. అచ్చునకు ఆమ్రేడితం పరమైనప్పుడు సంధి తరచుగానగు. ద్విరుక్తం పదరూపం ఆమ్రేడితం. ఒక పదాన్ని రెండుసార్లు ఉచ్చరించినప్పుడు రెండోసారి ఉచ్చరించినదాన్ని ఆమ్రేడితమంటారు.

ఉదా: ఔర + ఔర (ఆమ్రేడితం) ఔరౌర
ఆహా + ఆహా = ఆహాహా
2. ఆమ్రేడితం పరమైనప్పుడు కడాదుల తొలి అచ్చు మీది వర్ణంబులకెల్లా అదంతంబగు ద్విరుక్తటకారంబగు (**కడాదులు:** కడ, చివర, తుద, మొదలు, తెరువు, నడుమ మొదలైనవి)

ఉదా: క(డ)ట్ట + కడ = కట్టకడ
చివ(ట్ట)ర + చివర = చిట్టచివర
కడాదుల్లో తొలి అచ్చు తర్వాత వర్ణాలన్నింటికీ లోపం వచ్చి వాటి స్థానంలో అదంతమైన ద్విత్వట్టకారం వచ్చింది.
3. అందుకు ప్రభృతులు యథా ప్రయోగంబుగా గ్రాహ్యములు.

ఉదా: అందుకు + అదుకు = అందదుకు
చెర + చెర = చెచ్చెర లాంటి రూపాలు యథావిధిగా గ్రహించవచ్చని చిన్నయ సూరి అభిప్రాయం.

అతి పొడవైన కణాలను కలిగిన కణజాలం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మొక్కల్లో కణజాలం

మొక్కల్లో సాధారణంగా మూడు రకాల కణజాలాలు ఉంటాయి. అవి..

1. సరళ కణజాలం

2. సంక్లిష్ట కణజాలం

3. ప్రత్యేక కణజాలం

1. **సరళ కణజాలం:** నిర్మాణం, విధుల్లో ఒకే విధంగా ఉండే కణాల సముదాయాన్ని సరళ కణజాలం అంటారు. ఇది మొక్కల్లో ఎక్కువ శాతం ఉండే కణజాలం. దీనిలో

ఎ. మృదు కణజాలం

బి. స్థూలకోణ కణజాలం

సి) దృఢ కణజాలం అనే రకాలుంటాయి.

మృదు కణజాలం: మొక్కల్లోని లేత, మెత్తని భాగాల్లో, పత్రాలు, పుష్పాలు, ఫలాలు, విత్తనాల్లో ఎక్కువగా ఉంటుంది. మృదు కణజాలం గాయాలను మాన్పడానికి, అంట్లు కట్టినప్పుడు, పునరుద్భవం మొదలైన అంశాల్లో దోహదపడుతుంది. కణజాల వర్ధనంలో అసంఖ్యాకంగా మొక్కలు ఏర్పడటానికి ఇది తోడ్పడుతుంది.

స్థూల కోణ కణజాలం (కోలెన్‌కైమా): ఇది ఎక్కువగా లేత కాండాలు, పత్ర వృంతాలు, పుష్ప వృంతాలు, పత్రాల అంచులు, ఈనెలు మొదలైన భాగాల్లో ఉంటుంది. ఏక దళ బీజ మొక్కల కాండం, పత్రాల్లో ఉండదు. ఈ కణాలు వివిధ ఆకృతులతో ఉంటాయి. వీటి కణ కవచం ప్రత్యేకత ఏమిటంటే సెల్యులోజ్, పెక్టిన్‌తో నిర్మితమై ఉంటుంది. కణ కవచంలో 60 శాతం నీరు ఉంటుంది. స్థూల కోణ కణజాలం మొక్కల భాగాలకు సమ్యత (Flexibility), స్థితిస్థాపకతను కలగజేయడం వల్ల వృంత భాగాలు సులువుగా వంగుతాయి. పత్ర, పుష్ప వృంతాలు వంటి సున్నిత భాగాలు ప్రతిబలాన్ని (Stress), ప్రయాస (Strain) ను ఎదుర్కొంటాయి. పత్రాల పై భాగాన ముదురు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం స్థూల కోణ కణజాలమే.

దృఢ కణజాలం: ఇది నిర్జీవ సరళ యాంత్రిక కణజాలం. ఇది మొక్కల భాగాలకు యాంత్రిక బలాన్ని, గట్టిదనాన్ని కలుగజేస్తుంది. ఇది ఎక్కువగా ఎడారి మొక్కల్లో అభివృద్ధి చెంది ఉంటుంది. వీటి కణ కవచాలు లిగ్నిన్‌తో నిర్మితమై ఉంటాయి. నారలు, శిలా కణాలు ఈ కణజాలానికి చెందినవే. అతి పొడవైన నారలు.. రామి నారలు (బొహెమిరియా నీవియా). నారల్లో సెల్యులోజ్ ఉన్న వాటిని ఫ్లాక్స్ నారలు అంటారు. ఇవి వాణిజ్య పరంగా విలువైనవి. ఫ్లాక్స్ నారలు, హెంప్, రామినారల్లో లిగ్నిన్ ఉండదు.

కండ ఉన్న ఫలాలు, విత్తనాలు మొదలైన వాటిలో శిలా కణాలు ఎక్కువగా ఉంటాయి. **ఉదా:** కొబ్బరి, యాపిల్, పియర్.

2. **సంక్లిష్ట కణజాలం:** భిన్న రకాలైన కణాలు కలిసి ఒకే పనిని నిర్వర్తించేందుకు ఏర్పడే కణజాలం ఇది. ముఖ్యంగా మొక్కల్లో నీటిని, ఖనిజ మూలకాలను, ఆహార పదార్థాలను రవాణా చేసేందుకు ఉపయోగపడుతుంది. సంక్లిష్ట కణజాలంలో 1) దారువు (Xylem) 2) పోషక కణజాలం (Phloem) అనే రెండు రకాలుంటాయి. దారువును హైడ్రోమ్ అని కూడా అంటారు. ఇది నీటిని, ఖనిజ మూలకాలను మొక్కకు రవాణా చేస్తుంది. దీనిలో దారు కణాలు, దారు నారలు, దారు నాళాలు, దారు మృదు కణాలు మొదలైనవి ఉంటాయి. దారువులో ఉండే కణాలు లిగ్నిన్ కణ కవచాలను కలిగి, కేంద్రకం లేకుండా నిర్జీవంగా ఉంటాయి. ఇవి మొక్కకు భౌతిక ఆధారాన్ని, దృఢత్వాన్ని ఇస్తాయి. పరిణతి చెందిన వృక్షాల్లో దారు నాళాల్లోకి బెలూన్ల వంటి నిర్మాణాలు ఏర్పడతాయి. వీటిని టైలోసిస్‌లు అంటారు. ఇవి కాండందృఢత్వాన్ని పెంచుతాయి. కలప ఎక్కువ మన్నిక ఉంది అనడానికి కారణం టైలోసిస్‌లు ఏర్పడటమే.

పోషక కణజాలాన్ని లెప్టోమ్ అని కూడా అంటారు. ఇది ఆహార పదార్థాలను మొక్క అన్ని భాగాలకు సరఫరా చేస్తుంది. దీనిలో చాలనీ కణాలు, చాలనీ నాళాలు, సహకణాలు, నారలు, మృదు కణాలు మొదలైనవి ఉంటాయి. మొక్కల్లో కేంద్రక రహిత సజీవ కణాలు చాలనీ నాళాలు (ఆర్‌బీసీ మాదిరిగా). కణాల మధ్య కణ ద్రవ్య పోగులు (ప్లాస్మా డెస్మేటా) కన్వేయర్ బెల్టుల మాదిరిగా పని చేస్తాయి.

3. **ప్రత్యేక కణజాలం:** విభిన్న కణాలు విభిన్న ప్రక్రియలను జరిపే కణజాలాన్ని ప్రత్యేక కణజాలం అంటారు. ఇది ముఖ్యంగా స్రావక క్రియలో తోడ్పడుతుంది. కీటకాహార మొక్కల్లో జీర్ణరసాలను స్రవించేందుకు జీర్ణగ్రంథులుంటాయి. ఇవి కీటకాలను జీర్ణం చేసేందుకు ప్రోటియోలైటిక్ ఎంజైమ్‌లను ఉత్పత్తి చేస్తాయి. తేనెటీగలు గ్రహించే మకరందం పుష్పాల్లో ఉండే మకరంద గ్రంథుల నుంచి వస్తుంది.

కొన్ని మొక్కలు సుగంధ పరిమళాన్ని వెదజల్లుతాయి. దీనికి కారణం ఆస్మోఫోర్‌లు. పైనస్ వంటి మొక్కల్లో రెసిన్లను ఉత్పత్తి చేసేది స్రావక కుహరాలు. శీతాకాలంలో కొన్ని మొక్కలు **ఉదా:** గడ్డి, టమాటా వంటి మొక్కల పత్రాల చివరి భాగం నుంచి నీరు బిందువుల రూపంలో వెలువడుతుంది. దీన్నే బిందుస్రావం (Guttation) అంటారు. ఇది జరిగేందుకు హైడథోడ్స్ (జలగ్రంథులు) తోడ్పడతాయి. కొన్ని మొక్కల్లో వాటిని గిల్లినప్పుడు తెల్లని పాల వంటి పదార్థం వెలువడుతుంది. దీన్నే లేటెక్స్ అంటారు. దీన్ని ఉత్పత్తి చేసే కణజాలం లాటిసి ఫెరస్ కణజాలం. లేటెక్స్ నుంచి రబ్బర్‌ను తయారు చేస్తారు. హీవియా బ్రెజిలియన్సిస్ నుంచి పారా రబ్బర్, ఫైకస్ ఎలాస్టికా నుంచి ఇండియన్ రబ్బర్‌ను తయారు చేస్తారు.

కణజాల వ్యవస్థలు: మొక్క భాగాలను వేరు, కాండం, పత్రం వంటి వాటిని ఛేదించినప్పుడు వాటిలో వివిధ రకాల కణజాలాలు వివిధ రీతుల్లో కనిపిస్తాయి. సాధారణంగా వెలుపలి వరుసలో బాహ్య చర్మం, మధ్యలో వల్కలం, లోపలి తలంలో ప్రసరణ స్తంభం అనే భాగాలుంటాయి.

వేరు బాహ్య చర్మంలోని కేశాలు నీటిని శోషించేందుకు, కాండంలోని బాహ్య చర్మ కేశాలు రక్షణకు తోడ్పడతాయి. పత్రం బాహ్య చర్మంలో పత్ర రంధ్రాలుంటాయి. పత్ర రంధ్రాలుండే భాగంలో రక్షక కణాలుంటాయి. పత్ర రంధ్రాల ద్వారా నీరు ఆవిరి అవడాన్ని బాష్పోత్సేకం అంటారు. వేరు, కాండం వంటి భాగాల్లో వల్కలం అధికంగా ఉంటుంది.

ఇది ముఖ్యంగా పదార్థాల రవాణా నిల్వలో తోడ్పడుతుంది. ప్రసరణ స్తంభంలో దారువు, పోషక కణజాలం ఉంటాయి. సాధారణంగా వేరులో బాహ్య ప్రథమ దారుకం (Exarch), కాండంలో అంతర ప్రథమ దారుకం (Endwich) స్థితులు ఉంటాయి.

వృక్షాల కాండాలు బాగా వృద్ధి (లావెక్కడం) చెందడాన్ని ద్వితీయ వృద్ధి అంటారు. దీనిలో వార్షిక వలయాలు ఏర్పడతాయి. వీటి సంఖ్యను బట్టి వృక్షాల వయసును లెక్కిస్తారు. కాండం మధ్యలో ముదురు రంగులో ఉన్న భాగాన్ని డ్యురామెన్ అని, లేత రంగులో ఉన్న భాగాన్ని అల్బర్నం అంటారు. వెలుపలి భాగాన పొలుసుల మాదిరిగా ఏర్పడిన దాన్ని బెరడు అంటారు. బాగా వృద్ధి చెందిన వృక్షాల పై భాగాన సూక్ష్మ రంధ్రాలు ఏర్పడతాయి. వీటినే వాయురంధ్రాలు అంటారు.



జంతువుల్లో

జంతువుల్లో కణజాలాలు పని చేసే విధానాన్ని బట్టి నాలుగు రకాలు.

1. ఉపకళా కణజాలం

2. సంయోజక కణజాలం

3. కండర కణజాలం

4. నాడీ కణజాలం

1. **ఉపకళా కణజాలం (ఎపిథీలియల్):** ఇది ముఖ్యంగా శరీర బాహ్య తలంలోనూ, శరీరంలోని వివిధ అంగాల బాహ్య, అంతర తలాల్లోనూ పొర మాదిరిగా ఉంటుంది. **ఉదా:** చర్మం.

వెంట్రుకలు, గోళ్లు, కొమ్ములు మొదలైనవి ఉపకళా కణజాలాలతో నిర్మితమైనవే. ఇవి బాహ్య ప్రేరణను కూడా కలుగజేస్తాయి. ఉప కళాకణజాలంలో కణాలు ఘనాకారంలో, స్తంభాకారంలో, మరికొన్ని శైలికలను కలిగి ఉంటాయి. **ఉదా:** జీర్ణాశయంలో శైలికల వంటి నిర్మాణాలు ఆహార పదార్థాలను కదిలించేందుకు తోడ్పడతాయి. వివిధ రకాలైన హార్మోన్‌లను, రసాయన పదార్థాలను స్రవించడంలో కూడా ఉపయోగపడతాయి.

2. **సంయోజక కణజాలం:** ఇది వివిధ కణజాలాలను, అంగాలను కలిపి ఉంచుతుంది. శరీర రక్షణ, శరీర భాగాలను బాగు చేయడంలో ఉపయోగపడుతుంది. కొవ్వులను నిల్వ చేయడం మొదలైన పనులను నిర్వర్తిస్తుంది. వివిధ కణజాలాలను కలిపే కణజాలం ఏరియోలార్ కణజాలం. దెబ్బతిన్న భాగాలను బాగు చేసేది ఏరియోలార్ కణజాలమే.

మృదులాస్థి అనేది మరొక సంయోజక కణజాలం. ఇది ఎముకల చివర చెవిదొప్ప, వాయు నాళం, ముక్కు మొదలైన భాగాల్లో ఉంటుంది. పిండ దశలో ఎక్కువగా ఉండేవి మృదులాస్థులే. వీటిలోని కణాలను ఆస్టియోసైట్స్ అంటారు. ఎముక నిర్మాణానికి కాల్షియం ఫాస్ఫేట్, కాల్షియం కార్బొనేట్‌లు అవసరం. వీటిని అస్థిమజ్జలో ఉండే ఆస్టియోసైట్స్ స్రవిస్తాయి.

లిగమెంట్ అనేది ఎముకను మరొక ఎముకతో కలిపి ఉంచే ఒక సంయోజక కణజాలం. ఇది కొల్లాజెన్ అనే ప్రోటీన్‌తో తయారై ఉంటుంది. టెండాన్ (స్నాయుబంధనం) అనేది ఎముకను, కండరాన్ని కలిపి ఉంచే మరొక సంయోజక కణజాలం. ఎడిపోస్ కణజాలం అనేది కొవ్వును నిల్వ చేస్తుంది. ఇది ఉపవాసం సమయంలో శరీరానికి శక్తిని సమకూరుస్తుంది. అదే మాదిరిగా శరీరంలోని వేడిని బయటకు పోకుండా చేస్తుంది.

రక్తం కూడా ఒక సంయోజక కణజాలం. దీనిలో ప్లాస్మా అనే ద్రవ పదార్థ రక్త కణాలు ఉంటాయి. ప్లాస్మాలో అనేక రకాల ఆహార పదార్థాలు, లాక్టిక్ ఆమ్లం, యూరియా వంటి విసర్జక పదార్థాలు, హెపారిన్, ప్రోథ్రాంబిన్ వంటి ప్రోటీన్స్ మొదలైనవి ఉంటాయి.

రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, థ్రాంబోసైట్స్ అనే మూడు రకాల కణాలుంటాయి. ఎర్ర రక్తకణాల్లో కేంద్రకం ఉండదు కానీ చేపలు, ఉభయ చరాలు, సరీసృపాలు, గుర్రం వంటి వాటిలో కేంద్రాన్ని కలిగిన ఎర్ర రక్త కణాలుంటాయి. ఇవి O_2, CO_2 రవాణాలో తోడ్పడతాయి.

తెల్ల రక్తకణాలు కేంద్రకాన్ని కలిగి వివిధ రీతుల్లో ఉంటాయి. ఇవి శరీరంలో వ్యాధి నిరోధకతను పెంచుతాయి. రక్త ఫలకికలు (థ్రాంబోసైట్లు) కేంద్ర రహితం. ఇవి రక్తాన్ని గడ్డ కట్టించేందుకు తోడ్పడతాయి.

3. **కండర కణజాలం:** శరీరంలోని దాదాపు ఎక్కువ భాగాలు కండర కణజాలంతో నిర్మితమై ఉంటాయి. పూర్తిగా కండర కణజాలంతో నిర్మితమైంది గుండె, నాలుక మొదలైన కండరాలు వివిధ భాగాల చలనానికి తోడ్పడతాయి. కండరాలు ముఖ్యంగా మూడు రకాలు.

1. రేఖీత కండరాలు

2. అరేఖిత కండరాలు

3. హృదయ కండరాలు.

రేఖిత కండరాలు: ఇవి ఎముకకు అతుక్కొని ఉంటాయి. ఇవి కదలికలో తోడ్పడతాయి. ఇవి మన ఆధీనంలో ఉండే కదలికలను కలుగజేస్తాయి. కాబట్టి వీటిని నియంత్రిత లేదా ఐచ్ఛిక లేదా సంకల్పిత కండరాలు అని అంటారు.

అరేఖిత కండరాలు: ఇవి మన ఆధీనంలో లేని కదలికలను కలిగిస్తాయి. కాబట్టి వీటిని అనియంత్రిత కండరాలు అని అంటారు. రక్తనాళాలు, పేగు మొదలైన వాటిలో ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. శరీరంలో వివిధ అవయవ వ్యవస్థలు ఏర్పడేందుకు అవసరమైనవి?
   1) కణాలు 2) కణజాలం
   3) కేంద్రకం 4) కణాంగాలు
2. నిరంతరం కణ విభజన జరపని కణజాలం?
   1) హృదయ కండరం 2) అస్థి కణజాలం
   3) 1, 2 4) కండర కణజాలం
3. అతి పొడవైన కణాలను కలిగిన కణజాలం?
   1) కండర కణజాలం
   2) ఎడిపోజ్ కణజాలం
   3) నాడీ కణజాలం
   4) సంయోజక కణజాలం
4. పేగు గోడలపై ఉండే కణజాలం?
   1) సంయోజక కణజాలం
   2) ఉప కళా కణజాలం
   3) కండర కణజాలం 4) నాడీ కణజాలం
5. అసంకల్పిత చర్యలను జరిపే కండరాలు?
   1) హృదయ కండరాలు
   2) రేఖిత కండరాలు
   3) అరేఖిత కండరాలు 4) 1, 3
6. మొక్కల్లో నీటిని, ఖనిజ మూలకాలను రవాణా చేసే కణజాలం?
   1) సరళ కణజాలం 2) సంక్లిష్ట కణజాలం
   3) ప్రత్యేక కణజాలం 4) 1, 3
7. వృక్షాల్లో వాటి వయసును కొలవడానికి ఉపయోగపడే వార్షిక వలయాల్లో ఉండే కణజాలం?
   1) దారువు 2) పోషక కణజాలం
   3) దవ్వ 4) బాహ్య చర్మం

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 2; 5) 4; 6) 2; 7) 1.

How many such pairs of letters are there..

BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Directions (Q.No.1-5): Read the following information carefully and answer the questions which follow:

» If 'A ∗ Z' means 'A is the wife of Z'.
» If 'A × Z' means 'A is the husband of Z'.
» If 'A + Z' means 'A is the sister of Z'.
» If 'A - Z' means 'A is the brother of Z'.
» If 'A > Z' means 'A is the son of Z'.
» If 'A < Z' means 'A is the daughter of Z'.

1. Which of the following relations will not be true if the expression 'A < P × T + F > L × M' is definitely true?
   1) A is the daughter of T
   2) F is the son of M
   3) P is the son-in-law of L
   4) A is the cousin of F
   5) M is the grandmother of A
2. Which of the following means N is the daughter-in-law of A?
   1) M + N ∗ P > A
   2) N < M + P + A
   3) M - N × P < A
   4) A < P + N × M
   5) A < N < P ∗ M
3. How is P related to F if 'Q × P < B + F'?
   1) Daughter 2) Niece
   3) Daughter-in-law
   4) Grand daughter 5) Aunt
4. Which of the following means P is the father of R?
   1) R > S < P ∗ J
   2) J + R - S < P
   3) R > S ∗ P- J
   4) S + J × R < P
   5) None of these
5. How is M related to B if 'A ∗ B > Z × S + M'?
   1) Aunt 2) Grand father
   3) Uncle 4) Cousin
   5) Can't be determined

Directions (Q.No.6-10): Answer the following questions based on the three digit numbers

612 589 743 468 297

6. If two is added to the first digit of each of the numbers, how many numbers thus formed will be completely divisible by three?



   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. If the positions of the second and the third digits of each of the numbers are interchanged, in how many numbers thus formed will the last digit be a perfect square? ('1' is also a perfect square?
   1) One 2) Two 3) Three
   4) Four 5) Five
8. What will be the resultant if the third digit of the second lowest number is divided by the second digit of the highest number?
   1) 4 2) 1 3) 6 4) 5 5) 2
9. If all the digits in each of the numbers are arranged in descending order within the number which of the following will form the highest number in the new arrangement?
   1) 612 2) 589 3) 743
   4) 468 5) 297
10. If all the numbers are arranged in ascending order from left to right, which of the following will be the sum of all the three digits of the number which is second from the right of the new arrangement thus formed?
    1) 14 2) 9 3) 18
    4) 16 5) 12

Directions(Q.No.11-15): Answer these questions referring the symbol-letter -number sequence given below:

L 2 M ↑ 3 S P @ = J 5 B $ R 7 N # T D 6 B K V 9 4 % A F 8

11. How many such symbols are there each of which is either immediately preceded by a number or immediately followed by a letter?
    1) One 2) Two 3) Three
    4) More than three 5) None
12. Four of the following five are alike in a certain way based on their position in the above arrangement and hence form a group. Which one does not belong to the group?
    1) ↑2 S 2) 9 K % 3) # R D
    4) $ 5 7 5) = P 5
13. How many such numbers are there each of which is either immediately preceded by a symbol or immediately followed by a letter?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
14. Which of the following is the seventh to the left of 15th from the right end of the above arrangement?
    1) @ 2) P 3) J 4) 5 5) B
15. If the positions of twenty four elements from the right end are reversed, which of the following will be the 15th element from the left end?
    1) B 2) 4 3) 6
    4) # 5) None of these


Directions (Q.No.16-17): Study the following information carefully and answer the questions given below :

F is the grandson of U. M is the mother of F. M is married to P. P is the son of G. G is married to K.

16. How is K related to M?
    1) Cannot be determined
    2) Daughter-in-law
    3) Father 4) Mother
    5) Daughter
17. If D is the father of M, then how is F related to D?
    1) Father 2) Grandson
    3) Son 4) Brother
    5) Grandfather
18. How many such pairs of letters are there in the word SHARED each of which has as many letters between them in the word (in both forward and backward directions) as they have between them in English alphabetical series?
    1) Three 2) None 3) One
    4) More than three 5) Two
19. All the letters of the word GLACIERS are arranged in alphabetical order from left to right. Then all the consonants are replaced with the next alphabet (as per the English alphabetical order), then which of the following will be the fourth letter from the left end?
    1) I 2) C 3) R
    4) M 5) H
20. In a straight line of twelve persons (all facing north), only five persons sit to the left of L. Only three persons between C and L. G sits second to the right of C. Only five persons sit between G and M. How many persons sit between M and L?
    1) Two 2) None
    3) Five 4) Three
    5) Cannot be determined

SOLUTIONS


1. A < P × T + F > L × M means



From the above it can be concluded that the relation "A is the cousin of F" is not true *Ans: 4*

2. In options (3) and (4) N is a male, hence these are eliminated in option (5) N and A have a direct relation. So this also can be eliminated. In option (2) N is the daughter of M and P, M are sisters of A. So N is the Niece of of A. So this option(2) can be eliminated. In option (1) N is wife of P and P is son of A. so N is daughter-in-law of A. *Ans: 1*

3.



P is F's sister's daughter
⇒ P is F's Niece *Ans: 2*

4. In option (1) P is A female and In option (2) and (4) P's gender is not known. Hence these options are ruled out.
Draw family tree for option (3)
S → P – J
|
R
∴ P is R's father *Ans: 3*

5. Here M is at the end of the relational string and M's gender is an unknown. Hence M's relation to B cannot be established. *Ans: 5*

6. Find the numbers whose sum of the digits is one more than 3 multiple (because after addition of 2 it will become a 3- multiple) The only number satisfying the condition is 589 (5 + 8 + 9 = 22) *Ans: 2*

7. If the position of second and third are interchanged, then the second digit of the original number will become the last digit of the resultant number. So find out the original numbers whose second digits are perfect square. The numbers satisfying the conditions are 612 743 and 297 *Ans: 3*

8. Second lowest number is 468 and its third digit is 8. Highest number is 743 and its second digit is 4.
The Req. result = 8 ÷ 4 = 2
Ans: 5

9. If all the digits are arranged in descending order within the number the number 589 will become the highest number in new arrangement
Ans: 2

10. If the numbers are arranged in ascending order the second highest number will be second from right in the new arrangement The second highest number is 612 and the sum of its digits
= 6 + 1 + 2 = 9
Ans: 2

11. The symbols satisfying the conditions are = J, $ R, # T, and % A. i.e. four symbols satisfy the condition *Ans: 4*


12. In each of the options second and third characters are second to the left of and second to the right of first character except in option (3) *Ans: 3*

13. The numbers satisfying the conditions are
2M ↑3 5B 7N 6B
Ans: 5

14. 7th to left of 15th from right ⇒ 7 + 15 = 22nd from right 22nd from right ⇒ 30 – 22 = 8th from left ⇒ @ *Ans: 1*

15. If the position of last 24 elements are reversed then 15th from left end in new arrangement will be 10th letter from right in original arrangement (∵ First 5 elements remain same)
The 10th element from right = 6
Ans: 3

(16-17)



16. K's gender is unknown. Hence K's relation to m cannot be established *Ans: 1*

17. If D is father of M then E is Grandson of D *Ans: 2*

18. The pairs satisfying the condition are AD, DE, DH and EH *Ans: 4*

19. Fourth letter from left if the letters arranged in alphabetical order = G
Now G is replaced by next consonant H *Ans: 5*

20. _ C _ G _ L _ _ _ M _ _
Three persons sit between M and L *Ans: 4*